# మిసిమి

చింతనాత్మక సారస్వతం




మాసపత్రిక, ఫిబ్రవరి, 2020 ₹ 30/-

ISSN 2454–4329



ఆనందనాట్యం

# మిసిమి

మాసపత్రిక

సంపుటి 31 సంచిక 2

ఫిబ్రవరి 2020

సంస్థాపకులు : రవీంద్రనాథ్ ఆలపాటి

*సంపాదకుడు : **వల్లభనేని అశ్వినీకుమార్***

*సహకార సంపాదకుడు : వోలేటి పార్వతీశం*

KALA JYOTHI
Since 1946

Printed & Published by

BAPANNA ALAPATI

at **Kala Jyothi Process Pvt. Ltd.,**

1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad,

**Hyderabad - 500 020.**

Ph: 040 - 27612436, 27645538.

పత్రిక ప్రతి నెలా ఒకటవ తేది మీ ముంగిట వాలుతుంది...

ప్రతి : ₹ 30/- సంవత్సరానికి : ₹ 360/-

విదేశాలకు ప్రతి : $ 3.00 సంవత్సరానికి : $ 36.00 (by Air Mail)

కార్యదర్శి : వి. ఆశారాణి

ఫోన్ : 040 - 27645538. సెల్ : 994 951 6567.

LIBRARY OF CONGRESS

ISSN INTERNATIONAL STANDARD SERIAL NUMBER INTERNATIONAL CENTRE

**LCCN 91-903060** **ISSN 2454-4329**

E-mail : misimi90monthly@gmail.com,

www.misimimonthly.com

e-magazine : www.kinige.com/misimi

facebook.com/misimimaasapathrika

https://twitter.com/MISIMIMONTHLY

YouTube **Silver jubilee celebrations of MISIMI Telugu Monthly**

అట్టతో కలిపి 84 పేజీలు

# మిసిమి

## ఫిబ్రవరి నెల సూచికలు...


బాల సరస్వతి


కమ్మ తెమ్మెరలు : ... 5

బాల సరస్వతి : డా. పప్పు వేణుగోపాల రావు... 7

సరోజినీ నాయుడు, అమ్ము స్వామినాథన్ : ముత్తంగి వేంకట భారతలక్ష్మి... 12

నైతిక విలువలు : కిల్లాడ సత్యనారాయణ... 21

మోక్షగుండం విశ్వేశ్వరయ్య : మోటూరు శివరాంప్రసాద్... 25

అనంత శాస్త్రి గారు : ఘట్టమరాజు అశ్వత్థ నారాయణ... 31

మొదలి నాగభూషణ శర్మ : ప్రొ. రావినూతల సత్యనారాయణ... 34

పురాణాలు - చరిత్ర : డా. కాళిదాసు పురుషోత్తం... 40

వ్యంగ్య చిత్రకారులు : బాలి... 43

అమర సంజీవిని... మైత్రి : వై.హెచ్.కె. మోహన్‌రావు... 48

శ్రీశైల చెంచులు : పూషడపు సుబ్బారావు... 50

గాజులోయమ్మ గాజులు... : శిరంశెట్టి కాంతారావు... 54

తెలుగు-కన్నడ కథలలో - బహుజనవాదం : బి. నాగశేషు... 69

వేదిక : ... 76

చదవండి... : మిసిమి... 80




సరోజినీ నాయుడు


మోక్షగుండం విశ్వేశ్వరయ్య



ఆలపాటి రవీంద్రనాథ్ 24వ వర్ధంతికి నివాళులు.. – *సంపాదకులు*

### అట్టమీద బొమ్మలు


పెళ్ళి కూతురు
(చిత్రకారుడు: వోల్గా సురోవా)


ఆనందనాట్యం


నయనానందం


నాట్యానందం
(చిత్రకారుడు: ఎల్. కావ్లెరి)

# కమ్మతెమ్మెరలు

"..... ***మిసిమి*** డిసెంబర్ - 2019 సంచికలోని వ్యాసాలు విషయాత్మకంగా ఉన్నాయి. వేలాయుధన్‌గారి గురించి రాసిన "రాజ్యాంగ పరిషత్తులో మహిళలు" వ్యాసంలో 20వ శతాబ్ది ఆరంభంలో భారతదేశంలో కులవ్యవస్థ తీరు జుగుప్సాకరం అనిపించింది. నీటిపై మీటింగ్ పెట్టుకోవటం నిరసనకారుల చైతన్య నిబద్ధతకు నిదర్శనం... *మాట - మౌనం* వ్యాసమంతా మాట యొక్క గొప్పతనాన్ని, మౌనం యొక్క విలువను తెలియజేశారు వ్యాసకర్త కిల్లాడ సత్యనారాయణగారు. వారికి అభినందనలు. చెళ్ళపిళ్ళ సన్యాసిరావుగారు కాలస్వరూపం గురించి ఎన్నెన్నో గ్రంథాలలో నుంచి సేకరించి ఒక్కచోట చేర్చి పాఠకుల హృదయాలను పరవశింపజేశారు. వారి కృషి అభినందనీయం... "తెలుగు కవిత్వానికి చక్కదనాన్ని, చిక్కదనాన్ని చేకూర్చిన ఈ ఉభయ కవుల్ని యావదాంధ్రదేశం అభిమానించింది, ఆరాధించింది.." అంటూ దాశరథి సినారె కవిత్వం గురించి చెబుతూనే "కోస్తాంధ్ర కవులు" అంటూ దీర్ఘాలు తీయటం సుధాకర్‌గారికి తగదు. అసలు ఎప్పుడు దాశరథి, సినారే, కాళోజీ, రంగాచార్యులు అంతెందుకు ఈ వ్యాసకర్తను కూడా అభిమానించేవాళ్ళు ఆంధ్ర ప్రాంతంలో ఉన్నారు. ఇన్నాళ్లైనా వీరి కొలమానం ఇంకా ప్రాంతీయ కొలతబద్దేనా..."

*- డి. రాములు, ఏలూరు*

"..... ***మిసిమి*** జనవరి - 2020 సంచికలో కృష్ణశాస్త్రి కవిత గురించి చదువుతున్నప్పుడు వారిని మా కాలేజ్ డే ఫంక్షన్‌కు అతిథిగా విద్యార్థి సంఘ అధ్యక్షుని హోదాలో ఆహ్వానించిన రోజు గుర్తొచ్చింది. అప్పటికే వారి గొంతు మూగపోయిన సంగతి మాకు తెలియదు. కాగితం మీద తన అ శక్తతను తెలిపి, ఆహ్వానానికి కృతజ్ఞతలు తెలిపారు. మమ్మల్ని ఆశీర్వదించారు. వారి సాహిత్య కృషి గురించి చాలా విషయాలు తెలుసుకున్న తృప్తి కలిగింది. పల్లెకును తల్లితో, పట్టణాన్ని ప్రియురాలితో పోల్చిన తీరు అనితర సాధ్యం. నీకేంగావాలి? అంటుంది పల్లె. నాకే మిస్తావు? అంటుంది పట్టణం అన్న వారి పోలిక గురించి ఏమని చెప్పను? సరస్వతి ప్రియపుత్రుల కోవకు చెందుతారు వారు. లక్ష్యాలు - మార్గాల .. గురించి కిల్లాడవారు ఆలోచింపచేసే వ్యాసం అందించారు. దానిని ఆచరణలో పెడితే విజయ పరంపర తథ్యం. గొల్లపూడిగారికి సమర్పించిన శ్రద్ధాంజలి వారి ప్రతిభకు అద్దం పట్టింది. తనలాంటి వారికి డాక్టరేట్ ఎందుకు ఇవ్వరని వారు అడగడం సమంజసమే. ఆత్రేయకు గౌరవ డాక్టరేట్ ఇచ్చి అంబేడ్కర్ ఓపెన్ వర్శిటీ తనను తాను గౌరవించుకున్న సంగతి ఇక్కడ ప్రస్తావించడం అసంగతం కాదు. డాక్టరేట్ ఇవ్వడానికి నియమ నిబంధనలు అడ్డుపడుతాయి. గౌరవ డాక్టరేట్‌కు ఆ అడ్డు లేదు. కందుకూరి గురించిన వ్యాసం చదివి వారు సంఘ సంస్కరణకు తన దేహాన్ని, గేహాన్ని, ధనాన్ని, విద్యను, సర్వం త్యాగం చేశారు అని తెలిసి మనసులోనే వారికి అభినందనలు తెలిపాను. సమాజంలోని లొసుగులను ప్రక్షాళన చేయడానికి సమాజమే సంస్కర్తలను సృష్టిస్తుంది కాబోలు. సమస్యలను సృష్టించేవారు, వాటిని ప్రశ్నించేవారు.. ఇద్దరు కూడా ఈ సమాజానికి రెండు కళ్ళు. బాల సరస్వతిగారు జాతీయ స్థాయిలో ఎదగకపోవడానికి లతామంగేష్కర్ ప్రొఫెషనల్ జెలసి అని తెలిసి అవాక్కయ్యాము. ఇటీవల గుర్తింపు పొందిన ఒక స్ట్రీట్ సింగర్ గురించి కూడా ఆమె నోరు పారేసుకున్న వార్త చదివాము. సరస్వతి గారికి ఎటువంటి ఆర్థిక సహాయం ఆంధ్రప్రదేశ్ ప్రభుతం అందించకపోవడం

విచారకరం. ఈ విషయంలో ప్రజాప్రభుత్వాలు తగిన విధానాన్ని రూపొందించే దిశలో ఆలోచించడం అవసరం. ***మిసిమి*** అక్టోబర్ - 2019లో *మార్పుకు ముఖద్వారం వినడం..* అనే వ్యాసంపై ***మిసిమి*** చదివే తోటి చదువరులు తెలుగు భాషలో స్పందిస్తే బాగుండేదేమో! వినడానికి కొనసాగింపుగా సత్యనారాయణగారు "మాట్లాడడం" గురించి ఈ నెల ***మిసిమి***లో రాసిన వ్యాసం చదివి మైమరిచాను. భాష, భావం ఆకట్టుకున్నవి. కవిత్వం చదువుతున్న భావన కలిగింది. "మాటను ఒడిసి పట్టుకో. ఇతరులకిచ్చేప్పుడు తూకం వేసి ఇవ్వు. ఇవ్వకున్నా ఫర్వాలేదు. అక్కరలేని వాళ్లకు అసలివ్వకు. అవసరానికి మించి అస్సలు ధార పొయ్యకు..." అని గొప్ప మాట సెలవిచ్చారు 'కిల్లాడ'వారు. ఇది చదివిన చదువరి తన మాట గురించి ఆలోచనలో పడటం తథ్యం. *సాహిత్య కావ్యాలలో కాలవాహిని* వ్యాసంలో కాలం మహిమ, విలువల గురించి రచయిత చాలా విషయాలు తెలియపరిచారు. ".... ప్రతి క్షణాన్ని పట్టుకొని ఉపయోగించుకుందాం..." అన్న ముక్తాయింపు ఆలోచింప చేసింది. జాతీయ విద్యా విధానం గురించి ఆలోచింప చేసే వ్యాసం ప్రచురించారు. చాలా విషయాలు తెలియవచ్చినవి. *బడి భాషగా తెలుగు భాష* అనే వ్యాసం నేడు మాతృ భాషలో బోధన అవసరం గురించి జరుగుతున్న చర్చకు కొనసాగింపుగా ఉన్నది...."

*- పంజాల నరసయ్య, హైదరాబాద్*

"..... ***మిసిమి*** డిసెంబర్ - 2019 సంచిక అర్థనిమీలత నేత్రాలతో - అందమైన కేశ సంపదతో సౌందర్య పిపాస లియోనార్డో చిత్రం, డావిన్సీ చిత్రం చూసి దివ్యానుభూతి చెందాను. *రాజ్యాంగ పరిషత్తులో మహిళలు* శీర్షికలో *దాక్షాయనీ వేలాయుధన్* గురించి చదువుతుంటే ఆనాటికే రాజ్యాంగ పరిషత్తు సభ్యురాలై చరిత్ర సృష్టించిన అసమాన ధీర వనిత.. *చీరాల నుండి కరాచీ వరకు* కోటంరాజు పున్నయ్య గురించిన వ్యాసాలు పాఠకులలో జాతీయ భావ పరంపరను కలిగిస్తాయనడంలో సందేహం లేదు. *మాట - మౌనం* రచన నన్ను మంత్రముగ్ధుణ్ణి చేసింది. వృత్తిరీత్యా పోలీసు శాఖలో పనిచేసే ఓ ఉన్నతోద్యోగి *మాట - మౌనం* వ్రాయడం నాకు ఆశ్చర్యాన్ని - ఆనందాన్ని కలిగించింది. పోలీసు శాఖలో ఎంతటివారయినా ఆ శాఖాపరమైన మాటలు మాట్లాడేవారు *మాట - మౌనం* గురించి వ్రాయడం! అక్కడక్కడ రత్నాలు - వజ్రాలు ఉంటాయి. అలాగే ఖాకీ వనంలో కూడా.. ఓమండూరి రామస్వామిరెడ్డిగారు సంయుక్త మద్రాసు రాష్ట్ర ముఖ్యమంత్రి గురించి చదివాను. బాగా వ్రాశారు. మరచిపోతున్న మహనీయుణ్ణి ఈ తరం వారికి జ్ఞాపకం చేసి స్ఫూర్తిని కలిగిస్తున్నది ***మిసిమి*** దాశరథి - సినారేల ఉర్దూ గజళ్ళ సాంప్రదాయ వైభవాన్ని ముచ్చటగా వివరించారు సుధాకర్...."

*- చెరుకువాడ వెంకటరామయ్య, విస్సాకోడేరు*

"..... ***మిసిమి*** డిసెంబర్ - 2019లో కిల్లాడ సత్యనారాయణ గారి రచన *మాట - మౌనం* చాలా బాగుంది. పలుకు సరైన మాట అదే ప్రగతికి చక్కని బాట అన్న భావంతో మాట తీరు మనిషి మనుగడకు ఎంత ముఖ్యమో చక్కగా వివరించారు. ఎవరు ఎప్పుడు ఎక్కడ ఎలా మాట్లాడాలి ఎక్కడ మౌనం వహించాలో తెలుసుకుంటే ఆలుమగలు మధ్యే కాదు అసెంబ్లీలో కూడా గొడవలు ఉండవు. 'కొన్నిసార్లు మనసును చంపి మాటలు బయటకొస్తాయి లేదా మనసును చంపడానికే బయటకొస్తాయి' అని మనుషుల భావాలను "ఇతరుల్ని తీపి చేయడం కోసం మన లోపలి పంజరంలో ఉన్న చిలుక గొంతు ఎందుకు నొక్కాలి?" అని మనిషి గౌరవానికి విలువనిస్తూ చక్కని పద ప్రయోగం చేశారు. మాటకు మాట కలిస్తే బంధం, మాటకు మాట ఎదురైతే రణం, మాటకూ మాటకూ మధ్య నిలుచున్న సుగంధమే మౌనం. ఆ సుగంధాన్ని ఆస్వాదిస్తే బ్రతుకు స్వర్గం అన్న సూచన మాటలే కరువవుతున్న సాంకేతిక ప్రపంచానికి చక్కని మేలుకొలుపు. పఠించదగిన మరియు పాటించదగిన చక్కని అంశం మాట - మౌనం.. రచయితకు ధన్యవాదాలు...."

*- ఆచంటి శ్రీనివాసరావు, తెనాలి*

## అభినయ సరస్వతి

# బాల సరస్వతి

*– పప్పు వేణుగోపాల రావు*

భారత దేశంలో శాస్త్రీయ నృత్యాల పేర్లు చెపితే ముందు వినిపించేది భరతనాట్యం. ఆ నాట్య ఆవిర్భావ వికాసాలలో దేవదాసీల పాత్ర అతి ప్రాచీనమైనది, ప్రముఖమైనది, విస్మరింపరానిది. భరతనాట్యానికి ఈ పేరు 1932లో ఇవి కృష్ణయ్యర్ అనే ఆయన పెట్టారు. అంతవరకు దీని పేరు సదిర్. దాసిఆట్టం అని తంజావూర్ అట్టం అని ఏవేవో పేరులు ఉండేవి. ప్రముఖంగా దేవదాసీలు ఈ సంప్రదాయానికి పట్టుగొమ్మలైన స్త్రీలు!

దక్షిణ భారతదేశంలో ముఖ్యంగా తమిళనాట ఎన్నో దేవాలయాలు, విశాలంగా విస్తృతంగా చక్కని శిల్ప సంపదతో పరిపాలకులు నిర్మించారు. ఒక్కొక్క శిల్పంగాని ఆ దేవాలయాల చరిత్రలు చెప్పదలిస్తే మనకు మన సాంస్కృతిక సంపద అర్థం అవుతుంది. దేవాలయాలు కేవలం భగవంతుడి ఆరాధన కోసమే కాదు. అవి సంస్కృతిక సాంఘిక జీవన విధానానికి కేంద్రాలు. సంగీతం, సాహిత్యం, నృత్యం, శిల్పం, చిత్రలేఖనం ఇలా ఎన్నో కళలకు ఆలయాలు దేవాలయాలు. దేవునికి చేసే ఉపచారాలు, అందించే సేవలు, అంటే దూపం, దీపం, నైవేద్యంలాగే, నృత్యం దర్శయామి, సంగీతం శ్రావయామి అని ఉపచారాలలో ఆగమ శాస్త్రం పేర్కొంది. అదిగో ఆ రకంగా దేవాలయాలలో దేవునికి సమర్పణగా నృత్యం, సంగీతం ప్రదర్శించేవారు. ఆ నృత్యం ప్రదర్శించే వారే దేవదాసీలు.

**ఎవరు దేవదాసీలు:**

ఇది ఒక మహోన్నతమైన సంస్కారం. ఏ వర్ణం వారయినా వారి అమ్మాయిని దేవునికిచ్చి వివాహం చేసి ఆమెను ఆ దేవుని దాసిగా నిర్ధారణ చేస్తారు. ఒక వేద పండితుడు దేవాలయానికి ఎంత పవిత్రమైనవాడో, అంతే పవిత్రము, అంతకన్నా ఒక రెండు ఆకులు ఎక్కువే అయినది దేవదాసి సంప్రదాయం. ఎందుకంటే ఆమె జీవితం ఆ దేవునికి ఆ దేవాలయానికి అంకితమైనది గనుక. ఈ దేవదాసి సంప్రదాయం బహు పురాతనమైనది. దీనికి ఎన్నో పురాణాలు, శాసనాలు ఆధారం. దేవదాసి ఒకనాడు సాంఘిక వ్యవస్థ కాదు, అది ముందు మత పరమైన ఒక సంస్కారం. కాలక్రమంలో ఈ వ్యవస్థ దిగాజారినది నిజమే అయినా వారు దేశానికి అందించిన అతి ముఖ్యమైన సంప్రదాయం, కళలు సంగీతం, నృత్యం. మార్కండేయుడు స్కాందపురాణంలో ఏడుగురు కన్యలను శివునికి ఆరాధనకి సేవకురాళ్ళుగా సంపర్పించినట్టు పేర్కొన్నాడు. పద్మ పురాణం ఒక అందమైన కన్యను దేవునికి సమర్పించినవానికి ఒక కల్పం అంతా స్వర్గవాసం ఫలంగా లభిస్తుందని చెప్తోంది. అయితే ఇవన్నీ దేవదాసీలను ఏర్పరచిన వారికొచ్చే ఫలం చెప్తున్నాయిగాని దేవదాసికి ఏమిటి ఫలం అన్నది పేర్కొనలేదు! పురుషాధిక్యమైన ఉదంతాలు. దేవదాసి అంటే తనను తాను దేవునికి తన్, మన్, ధన్, మనో వాక్కుకాయ కర్మలా సంపర్పించుకునే ఒక పవిత్ర స్త్రీ. అదీ తొలుదొల్త ఏర్పడిన సంప్రదాయం. మనం దిగజారిన వ్యవస్థ గురుంచి కాకుండా ఆ నిస్వార్థమైన దేవదాసీలు చేసిన సేవను మాత్రమే పరిగణనలోకి తెసుకుందాం. రంధ్రాన్వేషణకన్నా గుణగ్రహణం గొప్పది కదా!


తమిళనాట నృత్యం, నాట్యం వీటిని తమిళంలో కూత్తు అంటారు. తమిళ సాహిత్యంలో అతి ప్రాచీనమైన గ్రంథాలు సిలప్పాదికారం, మణిమేఖలైలలో అనేక రకాల కూత్తులు వివరించారు. వీటిలోనే దేవదాసీలను

పేర్కొన్నారు. కూత్తనూర్ ముఖ్యంగా నృత్యం గురించి వివరించే గ్రంథం. ప్రాచీన కాలం నుంచి రాజులు దేవాలయాలు కట్టించి ఆయా శాసనాలలో ఎందరెందరు దేవదాసీలను ఏఏ దేవాలయాలలో ఏర్పరచారో వివరించారు. తంజావూరు బృహదీశ్వరాలయానికి వెయ్యిమంది దేవదాసీలు ఉన్నట్టు వారి పేర్లతో సహ శాసనం ఉంది.

ఇదంతా ఎందుకు చెప్తున్నానంటే అటువంటి సంప్రదాయంలోంచి జన్మించిన ఒక అభినయ సరస్వతి బాలసరస్వతి (1918-1984). వీణ ధనవమ్మాళ్ మనవరాలు. తంజావూరు సంస్థానంలో ఎన్నో తరాలుగా దేవదాసిలుగా సేవలందించిన కుటుంబంలో పుట్టింది బాలసరస్వతి. తమిళంవాళ్ళందరూ బాలమ్మ అనే పిలుస్తారు. నేనూ అలాగే పిలిచేవాడిని. ఒకటి రెండు సార్లే ఆవిడని కలిసే అవకాశం కలిగింది. ఎంతో నిరాడంబరమైన స్త్రీ, కాని అంతే తన సంప్రదాయం మీద మక్కువ కలిగి విమర్శకులను నోరెత్తనివ్వని అభినయ మూర్తి. నృత్యం రావాలి అంటే సంగీతం తెలిసి తీరాలి అనే అభిప్రాయం ఉంది ఆవిడకి. సంగీతం వచ్చినవాళ్ళకి నృత్యం తెలియక్కరలేదు, కాని నృత్యం సరిగా తెలియాలంటే సంగీతం జ్ఞానం తప్పనిసరిగా ఉండాలనేది ఆమె దృఢమైన అభిప్రాయం.

బాలమ్మ అమ్మమ్మ వీణ ధనమ్మాళ్. ఆమె అమ్మమ్మ కామాక్షి 19వ శతాబ్దంలో తంజావూరు ఆస్థానంలో నర్తకి. ఆమె ప్రసిద్ధ వాగ్గేయకారుడు పట్నం సుబ్రహ్మణ్యం అయ్యరు మేనమామ గణపతిశాస్త్రి వద్ద సదిర్ నేర్చుకుందట. ఇలాంటి విషయాలు సాంఘిక శాస్త్రవేత్తలు గమనించాలి. ఆమె దేవదాసి. సదిర్ దేవదాసి నృత్యం, నేర్చుకున్నది ఒక గణపతి శాస్త్రి వద్ద! ఆమె అమ్మమ్మ పాపమ్మ కూడా నృత్య సంగీతాలలో విద్వాంసురాలు. అలా ఈ కుటుంబం వాళ్ళు తరతరాలుగా నృత్య సామ గీతాలను పరిరక్షించి పోషించి ప్రదర్శించి తరువాతి తరాలకు అందించారు. బాలమ్మ గురువు కందప్ప పిళ్ళై, ఆయన పూర్వీకులే తంజావూర్ నలువర్ అని పిలవబడే పొన్నయ్య, చిన్నయ్య, వడివేలు, శివానందం. భరతనాట్యానికి పురుడుదీర్చి ఊపిరిపోసిన మహనీయులు. బాలమ్మ వంశవృక్షం ఒకసారి చూస్తే ఎందరెందరు మహా విద్వాంసులకు ఆ కుటుంబం నిలయమో బోధపడుతుంది.

## బాలమ్మ వంశ వృక్షం



బాలమ్మ సోదరులు, తంజావూర్ విశ్వనాథన్, రంగనాథన్‌ను విశ్వ, రంగ అని పిలిచేవాళ్ళం. వీళ్ళిద్దరిలో విశ్వనాథన్ సంగీత కళానిధి, అమోఘమైన వేణువు విద్వాంసుడు. రంగానాథన్ మృదంగం, పోలియో వలన wheelchairలో వస్తూండేవారు. కాలక్రమంలో ఇద్దరూ అమెరుకాలోని weselyan విశ్వవిద్యాలయంలో చేరారు. అమెరికా పౌరసత్త్వం తీసుకున్నారు. ప్రపంచ ప్రసిద్ధినొందిన జాన్ హిగ్గిన్స్ వీరి శిష్యుడు, అదే విశ్వవిద్యాలయంలో వీరివద్ద మృదంగం నేర్చుకుంటున్న డగ్లస్ నైట్ అనే ఆయన్ను బాలమ్మ కూతురు లక్ష్మి పెండ్లాడింది, వారి కుమారుడు అనిరుధ్, బాలమ్మ వారసుడుగా భరతనాట్యం చేస్తున్న యువకళాకారుడు.



బాలసరస్వతి - అభినయం

దాదాపు ఒక 50 సంవత్సరాలు 1940-2000 వరకు బాలమ్మ వంశీయులు సంగీతానికి నృత్యానికి అందించిన సేవ ఒక శకం. ఒక వంక బాలమ్మ, విశ్వ, రంగ, లక్ష్మి, ఇంకో వంక బాలమ్మ పిన్ని కూతుళ్ళు, ముక్త, బృంద పదములు, జావళీలతో సంగీత నృత్య ప్రపంచాన్ని సుసంపన్నం చేశారు. ఆ రోజుల్లో వానకి తడవనివారు, బృంద - ముక్తల దగ్గిర పదం జావళీలు నేర్చుకొనని వారు లేరు. సంగీత పితామహుడు శెమ్మంగుడి శ్రీనివాస అయ్యరు కూడా వీరి వద్ద పదాలు జావళీలు నేర్చుకున్నారు. 'అయ్యరు గారూ మేం చెప్పినట్టే పాడాలి, మీ మనోధర్మం ఇందులో కలపవద్దు' అని ఆయన్ను హెచ్చరించేరు ఈ సోదరీమణులు. ఆ కుటుంబంలో అందరికీ వారు వారి కళ మీద అంత మమకారం.

వీణధనమ్మాళ్ ఇంట్లోనే ఉండి ధర్మపురి సుబ్బరాయర్ జావళీలు రచించారు. వారు చెంజురుటి రాగంలో రాసిన 'సఖి ప్రాణసఖుడిటు జేసెనే' అనేది, పరజులో 'స్మర సుందరాంగుని సరి ఎవ్వరే', ఆవిడ కోసం రాసినవని అంటారు. వారి కాపీరాగంలో రాసిన 'పరులన్నమాట నమ్మవద్దు' చాల ప్రాచుర్యం పొందిన జావళీ. ఇవన్నీ బాలసరస్వతి అభినయించేది. బాలసరస్వతి ఎంత నిరాడంబరంగా సామాన్యంగా ఉంటుందో, ఎంత ఆహార్యానికి ప్రాధాన్యం ఇవ్వదో, చూసినవాళ్ళకి తెలుసు. ఆవిడది విశిష్టత సాత్త్వికాభినయం. అభినయాలు నాలుగు, ఆంగికం, వాచికం, ఆహార్యం, సాత్త్వికం. వీటిలో ఉత్తమోత్తమం సాత్త్వికాభినయం. ఆంగికాభినయం అంటే హస్తముద్రలు, పాద భేదాలు, ఇతరమైన ఆంగికమైన కదలికలు ఆయా ముద్రలు. పాటలు, మాటలు, ఇవి వాచికాభినయం. మేకప్ ఆహార్యాభినయం, దుస్తులు, ఆభరణాలు, పాత్రోచితమైన వేషధారణ.

సాత్త్వికాభినయం అంటే మనస్సు, హావ భావాలు, రసనిష్ఠమైన అభినయం. అభినయాలలో ఇది సంగీతంలో మనోధర్మంలాంటిది. నాట్యశాస్త్రంలో భరతుడు, సత్త్వంని నిర్వచించాడు.

*సత్త్వంనామ మనః ప్రభవం - నా.శా. 7-93*

సత్త్వం మనసులోంచి పుడుతుంది, ఏకాగ్రతతో కూడిన సమాధి స్థితిలాంటి మనసుకే ఇది సాధ్యం.

***అవ్యక్త రూపం హి సత్త్వం - సత్త్వాతిరిక్తో అభినాయో జ్యేష్టః.. సత్త్వహీనో అధమః*** *- నా.శా.22-11*

సత్త్వం ఫలానా అని రూపం కలిగి ఉండదు. కనిపించదు, కాని అనిపిస్తుంది. ఎందులో సత్త్వం ఎక్కువగా ఉంటుందో ఆ అభినయం, ఉత్తమం, సత్త్వం లేని అభినయం అధమం. సాత్త్వికాభినయం చెయ్యాలంటే నర్తకికి పరిణతి, వయస్సు, అనుభవం ఉండాలి. ఇది రసప్రధానమైన అభినయం. ఒక క్షేత్రయ్య పదమో, జావళీయో చేస్తే, అలాంటివాటిలో విరహమో, బాధో వ్యక్తమవుతుంది. బాలమ్మ ఇటివంటి సాత్త్వికాభినయంలో అగ్రగణ్యురాలు. ఇప్పటికీ వ్యాసతీర్థుల (1460-1539) 'కృష్ణా నీ బెగనే బారో'కి ఆవిడ అభినయం రసజ్ఞులు, పండితులు, విమర్శకులు, కథలు కథలుగా చెప్పుకుంటూ ఉంటారు. రాగం యమన్ కల్యాణి, మిశ్రచాపు. ఆ పాట చూడండి -

*పల్లవి: కృష్ణ నీ బెగనె బారొ*

*అనుపల్లవి: బెగనె బారొ ముఖవన్ను తోరొ (కృష్ణ నీ బెగనె బారొ) చరణ 1*

***కాలలందిగె గేజ్జే నీలదబావులి***

***నీలవర్ణనే నాట్యవాడుత బారొ (కృష్ణ నీ బెగనె బారొ) చరణ 4***

***తాయిగే బాయల్లి జగవన్నె తోరిద / జగదొద్ధారక నమ్మ ఉడుపి శ్రీ కృష్ణ (కృష్ణ నీ బెగనె బారొ)***

ఈ దాసర పదం ఆ దాసి అభినయం లోకోత్తరమైనవి.

*కృష్ణా నువ్వు తొందరగా రా, ముఖాన్ని చూపించు.* ఇదీ పల్లవిలో అనుపల్లవిలో భావం

*కాలిగజ్జెలతో నీలమేఘశ్యాముడా నాట్యం చేస్తూ రా,* ఇది ఒక చరణం -

తల్లికి నోట్లో 14 లోకాలు చూపిన జగదోద్ధారకా ఉడుపి కృష్ణా రా ఇది ఆఖరి చరణం. మధ్యలో ఇంకో రెండు చరణాలున్నాయి. అసలు ఈ పాటే ఒక వర్ణచిత్రం. ఒక భక్తుని ఆవేదన. నివేదన.

వ్యాసతీర్థులు ఎంత భక్తితో ఆర్తితో పాడేరో అంత భక్తితో ఆర్తితో బాలమ్మ నృత్యం చేస్తూ ఉంటే న్యూయార్క్ టౌన్ హాల్లో భాష తెలియని వారికి భావం అర్థమయింది. నృత్యానికి భాష అభినయం. ఆమె టోక్యోలో చేసినా, ఎలిజబెత్ మహారాణి ముందు ఎడింబరో హాల్‌లో చేసినా ప్రేక్షకులు ముగ్ధులయ్యేవారు. అన్నిచోట్లా ఆవిడకి కార్యక్రమం తరువాత నుంచుని కరతాళ ధ్వనులతో జోహార్లు సమర్పించేరు.

ఏమిటి ఆవిడ విశిష్టత. ఎందుకింత యశస్సు. ఒకటి సాత్త్వికాభినయం. రెండు ఆవిడ నేర్చుకున్న అనేకమైన పదాలు, జావళీలు, తిల్లానాలు... బాలమ్మ నేర్చుకుని అభినయం చేసే పదాలు 91. జావళీలు 57. ఇవికాక ఆవిడకి తంజావూరు శరభేంద్ర భూపాల కొరవంజి, లేక్కలేనన్ని తెలుగు పద్యాలు, సంస్కృత శ్లోకాలు. ఇంట్లో తమిళం లేదా తెలుగు మాట్లాడుకునేవారు. తంజావూరు పరిపాలించిన నాయక రాజుల తరువాత కూడా తంజావూరులో అధికార భాష తెలుగు. సంగీతానికి నృత్యానికి కూడా తెలుగే మమకార భాష.



ఇద్దరు సంగీత కలానిధులు - ఇద్దరు దేవాసీలు - ఇద్దరు యౌవనంలో - చేతిలో సిగరెట్‌తో - అపురూపమైన ఫోటో

బాలమ్మ చేసే కొన్ని అద్భుతమైన మరపురానివాటిలో కొన్ని ఉదాహరిస్తాను.

***శివదీక్షాపరురాలనురా - కురుంజి - ఆది***

***ఎన్ పళ్ళి కొండీరయ్యా శ్రీ రంగనాథనే - మధ్యమావతి - ఏక***

***కాలై తూక్కి నిన్రాడుం దైవమే -యదుకుల కాంభోజి - ఆది***

***సభాపతికి - ఆభోగి - రూపకం***

ఎన్నో క్షేత్రయ్య పదాలు, భాకలాపం ప్రవేశ దరువు. ఇవన్నే ఒక ఎత్తు,'కృష్ణా నీ బెగనే బారో' ఒకటి ఒక ఎత్తు. వేదాంతం లక్ష్మీనారాయణ శాస్త్రి గారు, వెంపటి చిన్న సత్యం గారి గురువు. కూచిపూడి ఇప్పటి రూపు దాల్చడానికి ప్రధానమైన గురువులలో ఒకరు. ఆయన వద్ద అభినయంలో మెళకువలు నేర్చుకున్నది బాల సరస్వతి.

బాలమ్మ ఎన్నో పదాలు, అమ్మమ్మ ధనమ్మాళ్ వద్ద నేర్చుకుంది. చిన్న వయసులోనే మైలాపూర్ గౌరీ అమ్మ దగ్గిర ఎన్నో తమిళం పదాలకు అభినయం నేర్చుకుంది. మైలాపూరు గౌరీ అమ్మ ఒక ప్రసిద్ధమైన దేవదాసి. కపాలీశ్వరస్వామి గుడికి అంకితమైన నర్తకి. అభినయం అంటే ఆవిడ దగ్గిరే నేర్చుకోవాలి అనేది బాలమ్మ. బాలమ్మ నాట్యానికి ఆమె తల్లి జయమ్మాల్ పాడేవారు. జ్ఞానసుందరం అనే ఒక ఆయన కూడా బాలమ్మ కచేరీలకి పాడేవారు. పదాలే అభినయానికి పనికొస్తాయనిగాని లేదా శృంగారమే అభినయానికి బాగుంటుందని ఆవిడ అభిప్రాయం కాదు. ఎన్నో భక్తి పాటలు, అరుణాచల గిరినాథ మొదలైనవాళ్ళ పాటలు అభినయానికి బాగుంటాయి. 'కృష్ణా నీ బెగనే బారో' కూడా శృంగారం కాదు కదా. దేవదాసీ నృత్యాలు దేవాలయాలలో

నిషేధించడం బాలమ్మకు చాలా బాధ కలిగించింది. ఆవిడే తిరుత్తణిలో ఆడాలనుకుంది కానీ కుదరలేదు. జీవితంలో ఇలా ఎన్నో సాంఘికమైన, నృత్యపరమైన ఒడిదుడుకులు ఎదురుకుంది. ఇదే సమయంలో ఇంకొకవంక మదరాసులో 1936లో రుక్మిణీదేవి కళాక్షేత్ర స్థాపన జరిగింది. భరతనాట్యం వంక సాంఘిక దృష్టి మారింది. ఎందరో స్త్రీలు భరత నాట్యం నేర్చుకోడం ప్రారంభించారు. నేర్పే విధానంలోను, నేర్చుకునే విధానంలోనే కాకుండా, గురువులు నేర్పే పద్ధతి నుంచి భరత నాట్యం పాఠశాలలో నేర్పడం, దానికో పాఠ్య క్రమం ఏర్పడ్డాయి. బాలసరస్వతికి ఎన్నో పురస్కారాలు, బిరుదులూ లభించేయి, పద్మవిభూషణ్, రబీంద్రభారతి యూనివర్సిటీ గౌరవ డాక్టర్ పట్టం 1973లో వచ్చాయి. ఇంతవరకు మ్యూజిక్ అకాడమీలో సంగీత కళానిధి బిరుదు పొందిన ఒకే ఒక నర్తకి బాలసరస్వతి. తరువాత బాలమ్మ తమ్ముడు విశ్వనాథన్‌కి కూడా సంగీత కళానిధి లభించింది. ఒక కుటుంబంలో ఇద్దరు సంగీత కళానిధులు. బాలమ్మ మ్యూజిక్



తల్లి - కూతురు - బాలమ్మ - లక్ష్మి

అకాడమీలో భరతనాట్యం పాఠాలు చెప్పారు. డాక్టర్ వి. రాఘవన్ గారు అప్పటి మ్యూజిక్ అకాడమీ కార్యదర్శి వలననే ఇది జరిగింది. రాఘవన్ గారి కుమార్తె నందిని రమణి బాలమ్మ శిష్యులలో ప్రముఖమైన వారిలో ఒకరు. బాలమ్మ శిష్యులలో హేమమాలిని కూడా ఉన్నారు. అరణి ఇటీవల కాలం చేశారు. ఈమె హైదరాబాదులో ఎందరికో బాలమ్మ శైలి నేర్పిన ఉత్తమమైన గురువు.

బాలసరస్వతి ఒక కారణ జన్మురాలు. ఆ కుటుంబం వాళ్ళు సంగీతానికి నృత్యానికి చేసిన సేవ అజరామరమైనది. 1984 ఫెబ్రవరి 9న తుదిశ్వాస విడిచిన బాలమ్మ భరత నాట్యం ఉన్నంత కాలం తరతరాల నర్తకులను ఉత్తేజపరుస్తుంది. ఆమె చిరంజీవి, అభినయ సరస్వతి. నృత్యం తెలిసిన వారికి సంగీతం తెలియాలి అనే ఆవిడ సూక్తి ఇప్పటి తరం నర్తకులు నేర్చుకోవలసినది.

ఆచార్య పప్పు వేణుగోపాలరావు,
చెన్నై. e-mail: pappuvenu@gmail.com



పెళ్లి కూతురు

చిత్రకారుడు:
వోల్గా సురోవా
- రష్యన్ చిత్రకారుడు -
1966లో పుట్టాడు.
1989లో I.E. Repine's Institute for Paintings, Sculptures, Architectureలో గోల్డ్ మెడల్ సాధించాడు. ఇంగ్లాండ్, ఫ్రాన్స్, జర్మనీలలో ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. సురోవా చిత్రాలన్నీ గ్రూప్ విధానంలో ఉంటాయి. పువ్వులు, సంగీత పరికరాలు, పక్షులు తప్పనిసరిగా ఉంటాయి.

*Dear Venugopalarao Garu,*

I have been reading your essays on different Indian dance forms in Misimi .

Despite my poor knowledge of dance and music, I am a lover of both the art forms.

How wonderfully you are explaining the art of dance in simple and beautiful language!

Kudos to your erudition and passion

for the fine arts.

I'm sure your great work in the field receives

Critical acclaim of your tribe.

You are the pride of Telugu land and Bobbili in particular.

With love and respect from an older friend.

*- Damera Venkatarao*



సరోజినీ నాయుడు

## రాజ్యాంగ పరిషత్తులో మహిళలు-3

# సరోజినీ నాయుడు

**(1879-1949)**

*- ముత్తంగి వేంకట భారతలక్ష్మి*

*ఎందరో కృషి ఫలితం - ఎన్నో చర్చల సారం - మరెన్నో అవరోధాల సాధన - భారత రాజ్యాంగ రూపకల్పన. ప్రపంచ దేశాలన్నింటిలో ఇంత భారీ రాజ్యాంగం మరే దేశానికి లేదు - ఇప్పటికీ ఎన్నో సవరణలు జరుగుతున్నాయంటే అంత పెద్ద రాజ్యాంగం కూడా సమగ్రం కాదనుకోవాలా - లేక కాలానుగుణంగా మారిన 'అవసరాల'కు అనుకూలంగా సవరణలు జరుపుకుంటారని అనుకోవాలా? ఏది ఏమైనా ఇప్పుడు లోక్‌సభ - రాజ్యసభ - చట్టసభలు ఎన్ని చేసినా అవన్నీ రాజ్యాంగానికి లోబడే ఉండాలనేది ఎవరూ రాయని చట్టం - అందుకే ప్రతి సవరణ మహోన్నత ధర్మాసనానికి నివేదింపబడుతుంది - వారికీ ప్రమాణం రాజ్యాంగమే! ఈ చర్చలలో పాల్గొన్న - ఆ పదిహేనుమంది మహిళామణుల గురించి సవివరంగా తెలుసుకునే ప్రయత్నం చేద్దాం.*

*- సం॥*

స్వాతంత్రోద్యమంలో ప్రథమశ్రేణి నాయకురాలు శ్రీమతి సరోజినీ నాయుడు సాహిత్యంలోనూ అందెవేసిన చేయి. భారత కోకిల / బుల్‌బుల్ - ఇ - హింద్ / నైటింగేల్ ఆఫ్ ఇండియాగా పేరొందిన సరోజినీదేవి - ఆంగ్ల కవితలు ప్రాక్ పశ్చిమ దేశాల్ని ముగ్ధపరిచాయి. అఖిల భారత కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఎన్నికైన శ్రీమతి సరోజినీ నాయుడుని కలుసుకున్న ప్రముఖ బ్రిటీష్ రచయిత ఆల్డెస్ హక్సలే (Aldous Huxley) ఆమె వ్యక్తిత్వాన్ని తన మాటలలో ఈ విధంగా ఆవిష్కరించారు- "సమ్మోహన శక్తిగల ధీశాలి, ధైర్య శక్తిగల సౌజన్య మూర్తి, సాంస్కృతిక వైవిధ్యంగల సృజనశీలి, చిత్తశుద్ధి, హాస్యచతురత కలబోసిన మహిళామణి.."

రాజకీయ రంగంలో ఎన్నో అగ్ర తాంబూలాలు అందుకొన్న సరోజినీదేవి 13 ఫిబ్రవరి 1879లో హైదరాబాద్‌లో జన్మించారు. తండ్రి అఘోరనాథ్ చటోపాధ్యాయ ఎడింబరో యూనివర్సిటీలో సైన్స్‌లో డాక్టరేట్ పొంది, హైదరాబాద్ నిజాం కాలేజ్‌కి ప్రిన్సిపాల్‌గా నియమించబడ్డారు. వారిది అవిభక్త బెంగాల్ రాష్ట్రానికి చెందిన బ్రాహ్మణ కుటుంబం. తల్లి బరద సుందరీదేవి బెంగాలీ కవయిత్రి, నాట్య కళాకారిణి. 8 మంది పిల్లల్లో సరోజినీదేవి ప్రథమ సంతానం. అఘోరనాథ్ చటోపాధ్యాయ కుమార్తెకు ఇంటివద్దనే సైన్సు, లెక్కలు పాఠ్యాంశాలు బోధించేవారు.

12వ ఏట సరోజినీ మద్రాసు యూనివర్సిటీ మెట్రిక్యులేషన్‌లో ప్రప్రథమురాలిగా ఉత్తీర్ణురాలయింది. అతి పిన్న వయస్సులోనే ఇంగ్లీషు, బెంగాలీ, తెలుగు, ఉర్దూ, పర్షియన్ భాషల్లో ప్రావీణ్యం సంపాదించింది. పదమూడేళ్ల వయసులో ఆమె ఆంగ్ల కవితా సౌధానికి *బంగారు వాకిలి* (ది గోల్డెన్ థ్రెషోల్డ్) తెరిచింది. ఆ కవితా సంకలనం *గోల్డెన్ థ్రెషోల్డ్* పేరునే ఆమె తండ్రి తన గృహానికి పెట్టుకున్నారు. నేటికీ హైదరాబాద్ నడిబొడ్డున *గోల్డెన్ థ్రెషోల్డ్*ను చూడవచ్చును. అందులో స్కూల్ ఫైన్ సెంట్రల్ యూనివర్సిటీ, హైదరాబాద్‌కు అనుబంధంగా చేర్చారు. 13వ యేట సరోజినీదేవి *మెహర్ మునీర్* అనే నాటకాన్ని పర్షియన్ భాషలో రచించింది. ఆమె ప్రతిభకు ముగ్ధుడై నైజాం ఆమెకు ఇంగ్లాండ్‌లో చదవడానికి స్కాలర్‌షిప్ ఏర్పాటు చేశారు. 16వ ఏట ఆమె కింగ్స్ కాలేజ్ లండన్‌లోనూ, గిర్టన్ కాలేజి, కేంబ్రిడ్జి యూనివర్సిటీలోనూ

చదివారు. ఆమె కేంబ్రిడ్జిలో చదువుతుండగా ఆర్థర్ సైమన్, ఎడ్మండ్ గాస్‌వంటి ప్రఖ్యాత కవులతో పరిచయం ఏర్పడింది. వారు ఆమెను భారతీయ సంస్కృతి, కళలకు సంబంధించిన అంశాలపై కవితలు వ్రాయుమని ప్రేరేపించారు. అందుచేతనే ఆమె కవితలలో భారత దేశ సహజ సౌందర్యం, వివిధ మతాల సామరస్య సమ్మేళనం, విభిన్న భారతీయ సంస్కృతుల మేలు కలయికను చిత్రించారు.

ఇంగ్లాండ్‌లో చదువుతుండగా డా. ముత్యాల గోవిందరాజులు నాయుడును ప్రేమించి, 19వ ఏట ఇండియాకు వచ్చి, ఆయనను బ్రహ్మ సమాజ పద్ధతిలో వివాహమాడారు. ఆనాటి హిందూ సమాజంలో వర్ణాంతర, కులాంతర వివాహాలు సమ్మతించేవారు కాదు. అభ్యుదయ భావాలు గల వధూవరుల తలిదండ్రుల ఆశీస్సులతో వారి వివాహం జరిగింది. సరోజినీదేవి, గోవిందరాజులు నాయుడు దంపతులకు ఐదుగురు సంతానం. జయసూర్య, పద్మజా నాయుడు, లీలామణి నాయుడు, రణ ధీర్, ఆదిత్య. పద్మజా నాయుడు 21 ఏళ్ల వయసులో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని అరెస్టయింది. తల్లివలే ఆమె గాంధీజీ అడుగుజాడల్లో నడిచి, స్వతంత్రం వచ్చిన తర్వాత ఆమె కూడా తల్లివలె వెస్ట్ బెంగాల్‌కు గవర్నర్‌గా అత్యంత సమర్థతతో పదవిని నిర్వహించింది. భారత దేశానికి వచ్చాక సరోజినీ నాయుడును రాజకీయంగా సుప్రసిద్ధులైన గోపాలకృష్ణ గోఖలే ఆమెకున్న తెలివితేటలను, ఉన్నత విద్యను దేశం కోసం ఉపయోగించమని ఉద్బోధించారు. మహాత్మా గాంధీ స్వాతంత్రోద్యమంలో పాల్గొన్నమని ఆహ్వానించారు. 1905లో బెంగాల్ విభజన గురించి బాధపడిన సరోజినీదేవి దానికి కవితా వ్యాసంగానికి విరామం ఇచ్చి పూర్తిగా స్వాతంత్ర్యోద్యమానికి అంకితమయ్యారు. మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ మహమ్మద్ అలీ జిన్నాలతో కలిసి సహాయ నిరాకరణోద్యమం, క్విట్ ఇండియా ఉద్యమం, ఉప్పుసత్యాగ్రహం వంటి స్వరాజ్య ఉద్యమాలలో పాల్గొని, 1930, 32, 1942లలో అరెస్టయ్యారు.

1942లో గాంధీజీతోపాటు సరోజినీ నాయుడుని 21 నెలలు జైలులో నిర్బంధించారు. ఆ సమయంలో ఆమెకు గాంధీజీతో సన్నిహిత్యం ఏర్పడింది. సున్నితమైన హాస్యంతో ఆమె గాంధీజిని మిక్కీమౌస్ అనేవారు. గాంధీజిని పేదరికంలో ఉంచడానికి ఎంతో డబ్బు ఖర్చవుతుందని ఆమె మేలమాడేవారు.

1916లో సరోజినీ నాయుడు మహ్మద్ అలీ జిన్నా జీవిత చరిత్రను *ది అంబాసిడర్ ఆఫ్ హిందూ - ముస్లిం యూనిటీ* గా రచించారు. తర్వాత ముస్లిం లీగ్ ఏర్పడి జిన్నా దేశ విభజన కోరినప్పుడు తన సోదరుడు విడిపోయినందుకు ఆమె ఎంతగానో బాధపడుతూ - "నా ముస్లిం సోదరుడు లేని ఈ రాజ్యాంగ పరిషత్తు సభ వెలితిగా ఉంది" అన్నారు. 1916లో ఆమె బీహార్ పశ్చిమ జిల్లాలో ఇండిగో (నీలి మందు) పండించే రైతుల పక్షం వహించి బ్రిటిష్ ప్రభుత్వంతో వారి హక్కుల గురించి పోరాడారు. ఆమె భారతదేశమంతా పర్యటిస్తూ, యువత సంక్షేమం, మహిళల అభ్యున్నతి, జాతీయత, శ్రమైక జీవనం వంటి అంశాలపై ఉపన్యసించి దేశ ప్రజలకు ఉద్బోధ చేశారు. 1917లో అనిబిసెంట్‌తో కలిసి 'ఉమెన్స్ ఇండియా అసోసియేషన్' స్థాపించారు. స్వాతంత్ర పోరాటంలో మహిళలను ఎక్కువగా కలుపుకొమ్మని కాంగ్రెస్ పార్టీని ఆదేశించారు. 1919లో ఆమె హోమ్ రూల్ లీగ్ అంబాసిడర్‌గా ఇంగ్లాండ్ వెళ్లారు. 1924లో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ ప్రతినిధులతో ప్రతినిధులలో ఒకరుగా ఆమె 'ఈస్ట్ ఆఫ్రికా ఇండియన్ కాంగ్రెస్' సభకు వెళ్లారు. లండన్‌లో జరిగిన రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్‌కు ఆమె గాంధీజీతో పాటు వెళ్లారు.

భారతదేశంలో స్వాతంత్రం కోసం జరుగుతున్న శాంతియుత పోరాటాన్ని గురించి ఆమె ప్రపంచమంతా చాటిచెప్పారు. యూరోప్ దేశాలలో, అమెరికాలో ఆమె గాంధీజీ సిద్ధాంతాల గురించి, అహింసా తత్వాన్ని గురించి విశదీకరించి చెప్పడం వలన, ప్రపంచ దేశాలన్నీ గాంధీజిని శాంతిదూతగా కొనియాడారు. స్వతంత్రం కోసం ఆమె చేస్తున్న నిస్వార్థ సేవల ఫలితంగా 1925లో ఆమెను కాంగ్రెస్ పార్టీ అఖిల భారత కాంగ్రెస్ అధ్యక్షురాలిగా

ఎంపిక చేశారు. కాంగ్రెస్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన ప్రథమ భారతీయ మహిళ. ఆమెకు ముందు అనిబిసెంట్ కాంగ్రెస్ ప్రెసిడెంట్‌గా ఎంపికయ్యారు. ప్లేగు అంటువ్యాధి ప్రబలినప్పుడు సరోజినీదేవి చేసిన సేవలు గుర్తించి బ్రిటిషు ప్రభుత్వం ఆమెకు కైజర్-ఇ-హింద్ బంగారు పతకం బహూకరించింది. క్విట్ ఇండియా ఉద్యమంలో బ్రిటిష్ ప్రభుత్వాన్ని నిరసిస్తూ ఆమె ఆ మెడల్ తిరిగి ఇచ్చివేశారు.

బీహార్ నుంచి ఆమెను రాజ్యాంగ పరిషత్తు ఎంపిక చేశారు. శ్రీమతి సరోజినీ నాయుడు ప్రాథమిక హక్కుల కమిటీ, ప్రావిన్షియల్ కమిటీలలో సభ్యురాలు. రెండో ప్రపంచ యుద్ధానంతరం ఆమె శాంతి ఒప్పందాలు జరిగిన దేశాలు ఫ్రాన్స్, అమెరికా, జర్మనీ పర్యటించి అక్కడ సమావేశాలలో పాల్గొనడం వలన రాజ్యాంగ పరిషత్తు సభలలో ఎక్కువగా పాల్గొనలేకపోయారు. మార్చి 1947లో సరోజినీ నాయుడు ఏషియన్ రిలేషన్ కాన్ఫరెన్స్ స్టీరింగ్ కమిటీకి అధ్యక్షత వహించారు. ఆమె *మహాత్మా గాంధీ - ఆయన జీవితం, రచనలు, ఉపన్యాసాలు*, మరో పుస్తకం *వర్డ్స్ ఆఫ్ ఫ్రీడమ్ : ఇండియాస్ ఆఫ్ నేషన్.*

సరోజినీ నాయుడు రెండు సందర్భాల్లో మాత్రమే రాజ్యాంగ పరిషత్తు సభలో మాట్లాడారు. 11 డిసెంబర్ 1946న డా. రాజేంద్రప్రసాద్ కాన్‌స్టిట్యూఎంట్ అసెంబ్లీకి శాశ్వత అధ్యక్షురాలుగా ఎన్నుకోబడ్డారు. ఆ సందర్భంలో తాత్కాలిక అధ్యక్షుడు సచ్చిదానంద సిన్హా సరోజినీ నాయుడును ప్రసంగించమని ఆహ్వానిస్తూ - ''ఇప్పుడు 'బుల్-బుల్-ఇ-హింద్' 'నైటింగేల్ ఆఫ్ ఇండియా' సభనుద్దేశించి వచనంలో కాదు కవిత్వంలో మాట్లాడతారు..'' అనగానే సభ్యులంతా హర్షధ్వానాలు చేశారు. వేదికనెక్కిన సరోజినీ నాయుడు చైర్మన్‌నుద్దేశించి - ''మీరు నన్ను పిలిచిన విధానం రాజ్యాంగబద్ధం కాదు'' అని ఛలోక్తి విసిరారు. చైర్మన్ సిన్హా నవ్వుతూ ''సభాపతిపై దోషారోపణ పనిచేయకూడద''న్నారు. వెంటనే సరోజినీ నాయుడు చక్కని ఉర్దూ కవితతో శుభాకాంక్షలు తెలిపారు.

''మన గొప్ప నాయకుడు, సహచరుడైన రాజేంద్రప్రసాద్ గురించి సభ్యుల ప్రసంగాలు ఇంద్రధనస్సు రంగుల కాంతులు సంతరించుకున్నాయి. నా కవిత్వం ఆ ఇంద్రధనస్సు కాంతులకు మరో కాంతిని తేలేదు. నమ్రతలో రాజేంద్రబాబును అనుసరించాలనుకొంటున్నాను. ఇంతసేపూ మనల్నందరిని తన వాగ్ధాటి రథంలో ఊరేగించిన గొప్ప వేదాంతి సర్ రాధాకృష్ణన్ కనిపించకుండా అదృశ్యమైపోయినట్లున్నారు'' అనగానే ''లేదు - నేను ఇక్కడ ఉన్నాను'' అని రాధాకృష్ణ అనగానే అందరూ మరోసారి నవ్వారు. వివిధ ప్రాంతాలు, తెగలు, మతాలు, జాతులకు చెందిన వక్తలందరూ ఏకగ్రీవంగా రాజేంద్రప్రసాద్‌ను ఒప్పుకొన్నారు. చాలా కాలం క్రితం నన్ను రాజేంద్రప్రసాద్ గురించి ఒక్క మాటలో చెప్పమన్నారు. బంగారు కలాన్ని తేనె భాండంలో ముంచి వ్రాయమంటే రాయగలను కానీ ప్రపంచంలో ఉన్న ఇంకు అంతా సరిపోదు, ఆయన గుణగణాలు కీర్తిస్తూ వ్రాయడానికి. ఒక వక్త అన్నట్లు తాత్కాలిక చైర్మన్ (సిన్హా) పర్మనెంట్ చైర్మన్ రాజేంద్రప్రసాద్ ఇద్దరూ బీహార్‌లో పుట్టారు. ఇద్దరూ బీహార్‌లో పుట్టిన బుద్ధుడి గుణాలను పుణికి పుచ్చుకున్నారు. రాజేంద్రప్రసాద్ ఆధ్యాత్మికంగా బుద్ధుని వారసులే. ఆయన మూర్తీభవించిన క్షమాగుణం, త్యాగం, ప్రేమ చాలా ఏళ్ళ నుండి ఆయనతో కలిసి పనిచేయడం నా అదృష్టం. ఆయనకంటే అయిదేళ్ళు పెద్దదాన్ని గనుక, ఆయనను ఆశీర్వదిస్తున్నాను. బాబు రాజేంద్రప్రసాద్ సభకు శాశ్వత అధ్యక్షుడిగా ఉండాల్సిన యోగ్యతలు, అర్హతలు ఉన్నాయి. ఆయన ఈ సభకు సంరక్షకుడు, తండ్రి. ఆయన స్వచ్ఛమైన లిల్లీ పుష్పం చేత ధరించి, అందరి మనస్సులూ చూరగొనే దేవదూత. ఎందుచేతనంటే ఆయనకు అమృతత్వం, అదే ఆయన బుద్ధిబలంలో భాగం. ఆయనలో అవసరమైన జ్ఞానం ఉంది. అది ఆయన అనుభవంలో భాగం. ఆయన దార్శనికతలో స్పష్టత, సృజనాత్మక భావుకత, సృజనాత్మ విశ్వాసం - ఇవన్నీ ఆయనను బుద్ధ భగవానుని పాదాలచెంత నిలుపుతాయి. సభలో ముస్లిం సోదరులు వెళ్లి పోవడంవలన ఏర్పడిన ఖాళీలను చూసి నా హృదయం వేదన చెందుతోంది. నా పాత స్నేహితుడు మహ్మద్ అలీ జిన్నా నాయకత్వంలో వారంతా తిరిగి రావాలని, ఏదైనా మంచి మంత్రదండం తిప్పి వారిని రప్పించాలంటే సౌజన్యమూర్తి రాజేంద్రప్రసాద్‌కు

సాధ్యమవుతుంది'' అంటూ సరోజినీదేవి రాజేంద్రప్రసాద్‌ను శాశ్వత అధ్యక్షులుగా స్వాగతించారు.

"డా. అంబేద్కర్ ఆయన అనుచరుల ద్వారా ప్రజలు విశేషాధికారాలు ఉన్న కొద్దిమందివలె సురక్షితంగా జీవించగలరని ఆశిస్తున్నాను. ఈ నూతన రాజ్యాంగ పరిషత్‌లో కుల, మత, వర్గ వ్యత్యాసాలు ఉండవని, అందరికీ ఈ రాజ్యాంగ పరిషత్తులో సమాన ప్రతిపత్తి కల్పించబడినదని గ్రహిస్తారని విశ్వసిస్తున్నాను..''

''మిత్రులారా! నేను రాజేంద్రప్రసాద్‌ను కీర్తించడంలేదు. ఆయన భారతదేశ ప్రగతికి ప్రతీకగా గ్రహిస్తున్నాను. మన దేశ మాత ఇంకా దాస్య శృంఖలాలలోనే ఉన్నది. ఆయన మంచి ప్రణాళికలతో మన దేశ మాతకు స్వేచ్ఛ, శాంతి, సౌభ్రాతృత్వం, విశ్వ ప్రేమ వెలుగులు జిమ్మేలా సుస్థిర స్థానం కలగజేస్తారని ఆశిస్తాను. మహోన్నత శిఖరంలో సాగరాలే ఎల్లలుగా గల మన దేశ మాత, మానవాళి చరిత్రలో మరోసారి జ్ఞాన దీపాన్ని వెలిగించి, లోకానికి వెలుగు చూపిస్తూ, స్వాతంత్ర పథంలో ముందుకు సాగుతుంది'' అంటూ ఆమె ఆశావాదం ప్రగతిశీల దృక్పథంగల నాటి నాయకుల గణాలను తన గళం ద్వారా వినిపించారు. ఆమె ప్రసంగంలో సహజ కవితా సుధా రస ధార జాలువారి సభికులందర్నీ రంజింప చేసింది.

జాతీయ పతాకం గురించి తీర్మానం చేయడానికి రాజ్యాంగ పరిషత్తు 22 జూలై, 1947 నాడు సమావేశమైంది. ఉదయం నుండి చర్చలు జరుగుతున్నాయి. సరోజినీనాయుడుని ఎన్నోసార్లు మాట్లాడమని కోరినా ఆమె నిరాకరించారు. ఎట్టకేలకు ఆమె లేచి- "జవహర్ లాల్ నెహ్రూ ఇచ్చిన ఉపన్యాసం మహాకావ్యంలా, సందర్భోచితంగా అందరి ఆశయాలు, మనోభావాలు ప్రతిబింబించేటట్లు ఉంది. సభలో ఉన్న అనేక వర్గాల ప్రతినిధులు లేచి భక్తి విశ్వాసాలతో పతాకంపై ప్రమాణం చేసి ప్రసంగించారు. బీహార్ ప్రావిన్స్ నుండి ప్రతినిధిగా ఈ సభలో ఈ జాతీయ పతాకంలో అశోకుని ధర్మచక్రం గురించి చెప్పడం మర్చిపోతే నేను, బీహార్ నియోజకవర్గంలో నా సీటు సంకటంలో పడతాం. చారిత్రక సత్యం ఏమిటోగాని బీహారీలు అశోకుణ్ణి, ధర్మచక్రాన్ని తమవిగా భావిస్తారు. కానీ ఈ రోజు నేను ఏ వర్గం, మతం, లింగ వివక్షతతో మాట్లాడటం లేదు. సభలోని మహిళా సభ్యులందరూ మహిళల తరపున మాట్లాడమని నన్ను కోరారు. దేశ సేవలో స్త్రీ-పురుష బేధం ఉండకూడదు. దేశాలన్నీ ప్రపంచ నాగరికత దిశగా అడుగులు వేస్తున్న తరుణంలో నేను పునరుజ్జీవించిన మన దేశమాత తరఫున మాట్లాడతాను. అభిన్న హృదయంతో అవిభాజ్య స్ఫూర్తితో తన ప్రేమను పిల్లలందరికీ వారు ఏ మూల నుండి వచ్చినా ఏ మసీదు, ఏ గుడిలో ప్రార్థించినా, ఏ భాష మాట్లాడినా, ఏ సంస్కృతి గురించి గొప్పగా గర్వించినా సమానంగా ఇస్తుంది. ఆ తల్లికి అందరూ సమానులే! నేను నా సుదీర్ఘ జీవితంలో నా వృత్తి, ప్రవృత్తికి తగినట్లు దేశ దిమ్మరిలా విదేశీ యానాలు చేశాను. స్వతంత్ర దేశాలలో పర్యటిస్తున్నప్పుడు మన దేశానికి జెండా లేదని నా హృదయం ఆక్రోశించేది. అటువంటి కొన్ని సంఘటనలు వివరిస్తాను. వెరెసై (పారిస్)లో శాంతి ఒడంబడిక జరిగినపుడు 'ఓపేరా హౌస్'ను అన్ని దేశాల జెండాలతో అలంకరించారు. ఓ ప్రముఖ అందాల ఫ్రెంచి తార జాతీయ పతాకాన్ని తన చుట్టూ కప్పుకొని శ్రావ్యమైన కంఠంతో జాతీయ గీతం ఆలపిస్తూ ప్రవేశించగానే సభలో ప్రొసీడింగ్స్ మధ్యలో ఆపేశారు. ప్రేక్షకులంతా లేచి నిలబడి ముక్త కంఠంతో ఫ్రెంచి జాతీయ గీతాన్ని ఆలపించారు. నా ప్రక్కనున్న భారతీయుడు తన కళ్ళల్లో నీళ్ళు తిరుగుతుండగా, "మనకెప్పుడు మన జాతీయ పతాకం వస్తుంది'' అని గద్గద స్వరంతో అడిగాడు.

మనకు మన స్వంత జాతీయ పతాకం, స్వంత జాతీయ గీతం వచ్చే సమయం త్వరలోనే వస్తుందని చెప్పాను. ప్రపంచ శాంతి ఒడంబడిక జరిగాక, న్యూయార్కులో ప్రపంచ శాంతి ఉత్సవాలలో నన్ను మాట్లాడమన్నారు. 44 దేశాల వారి జాతీయ పతాకాలు విశాల భవనంలో రెపరెపలాడుతుండగా సభ ప్రారంభమయింది. అన్ని దేశాల పతాకాలలో మన స్వాతంత్ర్య పతాకం లేదని దుఃఖంతో మాట్లాడాను. ఇక కొద్ది కాలంలోనే మన జెండా ప్రపంచానికే తలమానికమై

చారిత్రాత్మక జాతీయ పతాకంగా మనకు వస్తుందని అన్నాను. కొన్ని నెలల క్రితం బెర్లిన్‌లో జరిగిన అంతర్జాతీయ సదస్సుకు 42 దేశాలు తమ దేశ మహిళలను ప్రతినిధులుగా పంపారు. వారంతా ఓ రోజు ఉదయం అన్ని దేశాల జాతీయ పతాకాలతో ఊరేగింపు నిర్వహించుదామన్నారు. నా సలహాపై కొంతమంది భారతీయ మహిళా ప్రతినిధులు వారి చీరలు చింపి రాత్రంతా కూర్చొని త్రివర్ణ పతాకాన్ని తయారు చేశారు. మనకు జాతీయ పతాకం లేదన్న న్యూనతా భావానికి లోను కాకుండా. అన్నిటికంటే ఎక్కువ వేదన కలిగించిన విషయం, కొన్ని నెలల క్రితం, జవహర్‌లాల్ ప్రేరణతో ఆసియా ఖండంలో ఉన్న దేశాలన్నీ ఆసియా ఐక్యతా భావాన్ని ప్రకటించడానికి ఢిల్లీలో సమావేశమయ్యారు. వేదిక వెనుక భాగంలో అన్ని దేశాల జెండాలు అలంకరించారు.

ఇరాన్ జెండా, చైనా, ఆఫ్ఘనిస్తాన్ పెద్దా చిన్నా అన్ని దేశాల జెండాలు ప్రతీకలుగా ఉన్నాయి. ఆ కాన్ఫరెన్స్‌లో ఏ విధమైన పార్టీ రాజకీయాలకు తావు ఇవ్వకూడదని నిశ్చయించుకొన్న భారతీయ ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీకి చెందిన మూడు రంగుల జెండాను ఏషియన్ కాన్ఫరెన్స్‌లో జాతీయ పతాకంగా పెట్టలేకపోయినందుకు నేను అనుభవించిన దుర్భర వేదన మీరు అర్థం చేసుకోగలరా? ఈ రోజు మనం మన స్వాతంత్ర్య భారత జాతీయ పతాకాన్ని సాధించాం!

ఈ పతాకం క్రింద వేలాది మంది పెద్దా, చిన్నా, యువత, వృద్ధులు, సిక్కులు, జైనులు, ముస్లిమ్‌లు, జోరాస్ట్రియన్లు, క్రిస్టియన్లు అందరూ పోరాడారు. ఎన్నో త్యాగాలు చేశారు. మన దేశంలో అతి చిన్నదైన పార్శీ కమ్యూనిటీ వృద్ధ నాయకుడు దాదాభాయ్ నౌరోజితో పాటు ఎంతో మంది పార్శీలు స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారు. ఈ సమయంలో నేను మన ముస్లిమ్ సోదరులు మహమ్మద్ అలీ, షౌకత్ అలీ, అన్సారీ, అజ్‌మాల్ ఖాన్‌లను స్మరిస్తున్నాను. వీరంతా జైళ్ళల్లో నిర్బంధించబడ్డారు. దురభిమానంతో ఒక వ్యక్తి నన్ను ఇలా అడిగారు- "ఇండియా జెండా అని ఈ జెండా గురించి ఎలా చెప్తావ్? ఇండియా విభజించబడింది" అని. నేను అతనితో ఈ నైసర్గిక విభజన తాత్కాలిక విభజన. భారతదేశ హృదయంలో వేరు పడే భావం లేదు అన్నాను. ఈ రోజు నేను అందరినీ మన పతాకాన్ని గౌరవించమని కోరుతున్నాను. మధ్యనున్న చక్రం అశోకుని ధర్మచక్రానికి ప్రతీకగా నిలుస్తుంది. అశోక చక్రవర్తి సౌభ్రాతృత్వం, శాంతి సందేశాలను ప్రపంచం నలుదెసల పంపించాడు. ఆయన ఈనాటి ఆదర్శ భావాలైన పరస్పర సహకారం, సౌభ్రాతృత్వం గురించి నాడే ఆలోచించి ఉంటారు. ఈ చక్రం జాతీయ ప్రయోజనాలకు, క్రియాశీలతకు ప్రతీకగా నిలిచింది. ఈ చక్రం నా మనోభావాలకు, మహాత్మాగాంధీ భావలకు ప్రతీక. ఈ కాలచక్రం ఎప్పుడూ ముందుకు సాగిపోతూ ఉంటుంది. ఆగకుండా సాగిపోతుంది. ఈ చక్రం సూర్యకిరణాలకు ప్రతీక. జాతీయ పతాకం గురించి చెప్తూ పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ- "భారతదేశానికి చెందిన ఈ పతాకం, ఈ దేశం వివక్షత చూపించదు" అన్నారు.

ఆయన ఈ మాటలు కూడా చేర్చి ఉంటే బాగుండేదనిపిస్తుంది. 'భారతదేశం మిత్రుల నుండి శత్రువు నుండి ఒకే విధంగా జ్ఞానాన్ని స్వాగతిస్తుంది.' ప్రపంచంలో ఉన్న సంస్కృతులన్నీ భారతదేశ సంస్కృతిలో కలసి సుసంపన్నం చేశాయి. ఇస్లామ్ ధర్మం భారతదేశానికి ప్రజాస్వామిక సోదర సమానత్వం తీసుకు రాలేదా? జొరాస్ట్రియన్ నిశ్చలమైన ధైర్యాన్ని, క్రిస్టియన్లు సేవాభావం తీసుకు రాలేదా? అతి ప్రాచీనమైన హిందూ ధర్మం విశ్వమానవ ప్రేమను బోధించింది.

చాలామంది స్నేహితులు ఈ సభలో జాతీయ పతాకాన్ని గురించి వారి మనస్సుల్లో ఉప్పొంగిన భావావేశాన్ని కవితలలో చెప్పారు. నేను కవయిత్రినైనా వచనంలో చెప్పాను. మహిళలం మేమంతా భారతదేశ ఐక్యతకు పాటుపడతాం అని చెప్తున్నాను. ఈ పతాకం క్రింద రాజైనా, రైతైనా సమానమే. ప్రత్యేకాధికారాలు ఎవ్వరికీ ఉండవు. భారతమాత హృదయంలో భేద భావం ఉండదు" అని నొక్కి వక్కాణిస్తూ సరోజినీదేవి, "పునర్జన్మ

పొందిన దేశమాత బిడ్డలంతా లేచి మన జాతీయ పతాకానికి వందనం చేయండి'' అని ముగించగానే కరతాళ ధ్వనులు, హర్షధ్వానాలు మిన్నుముట్టాయి. ఆమె ఆలపించిన ఐక్యతారాగం ప్రజలను ఉత్తేజపరచింది.

స్వాతంత్ర్యం వచ్చాక సరోజినినాయుడు యునైటెడ్ ప్రావిన్స్ (యు.పి.)కి తొలి మహిళా గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టి, 2 మార్చి, 1949 చివరి శ్వాస వరకు తన విధి నిర్వర్తించారు. పదమూడేళ్ళకే కవయిత్రిగా సుస్థిర స్థానం సంపాదించుకున్న సరోజినీదేవి జీవితాంతం కవితా వ్యాసంగాన్ని కొనసాగించారు. ది గోల్డెన్ త్రెషోల్డ్ (1905), ది బ్రోకెన్ వింగ్, ది బర్డ్ ఆఫ్ టైమ్ (1912), ది స్కెప్టర్డ్ ఫ్లూట్ (1928), ది ఫెదర్ ఆఫ్ డాన్‌ను సరోజినీదేవి మరణానంతరం ఆమె కుమార్తె పద్మజా నాయుడు 1961లో ప్రచురించారు. విలక్షణమైన భారత కోకిల కవితా గానం నేటికీ పాఠకులను అలరిస్తుంది. రాయల్ సొసైటీ ఆఫ్ లిటరేచర్ కు ఆమె ఫెలోగా ఎంపిక అయ్యారు. సరోజినీదేవి జ్ఞాపకార్థం ఎన్నో సంస్థలు నెలకొల్పబడ్డాయి. సరోజినీదేవి నేత్ర వైద్యాలయం, సరోజినీ నాయుడు మెడికల్ కాలేజి, సరోజినీ నాయుడు మహిళా కళాశాల, సరోజినీ నాయుడు స్కూల్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్, సరోజినీ నాయుడు మెమోరియల్ హైస్కూల్, హైదరాబాద్ నగరంలో ఉన్నాయి.

*

### రాజ్యాంగ పరిషత్తులో మహిళలు-4

# అమ్ము స్వామినాథన్

**(ఏప్రిల్ - 28, 1894 - జులై 4, 1978)**

అమ్ముస్వామినాథన్ క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నప్పుడు ఆమెను అరెస్టు చేసి (1943) వెల్లూరు జైలులో ఉన్న ఒకామె అక్కడ జైలు శుభ్రం చేసే స్త్రీను, తక్కువ కులానికి చెందినదని కులం పేరుతో 'ఏయ్, శూద్రాచీ' (శూద్రురాలా) అని పిలిచింది. వెంటనే అక్కడున్న అమ్ము, ఆమె దగ్గరకు వెళ్ళి, ''ఏం కావాలి? అడుగు'' అని గద్దించింది. దానికావిడ తికమకపడి, ''నేను పనిమనిషిని పిలుస్తున్నాను'' అన్నది. నాయర్ కుటుంబంలో పుట్టిన అమ్ము, ''నేనూ శూద్రాచ్చీనే! ఇప్పుడు అడుగు ఏం కావాలో'' అని కోపంగా అరిచిందట అమ్ము అగ్రవర్ణాల వారి అభిజాత్యాన్ని వ్యతిరేకించేది. ''కుల దురహంకారాన్ని ఎదుర్కొని పోరాడేది'' అని సుభాషిణి ఆలీ తన అమ్మమ్మ అమ్ము స్వామినాథన్ గురించి గర్వపడుతూ చెప్పింది. అమ్ము స్వామినాథన్ సమాజ సేవాకర్త, కులవివక్షతకు వ్యతిరేకి. ఆమె జీవితమే అందుకు ఉదాహరణ.

అమ్ము కుట్టి అని ముద్దుగా పిలవబడే అమ్ము కేరళ రాష్ట్రంలో పాల్ఘాట్ జిల్లాలో అనక్కర గ్రామంలో జన్మించింది. తండ్రి గోవింద నాయర్ స్థానికంగా చిన్న ఆఫీసర్‌గా పనిచేసేవారు. ఆమె తల్లిదండ్రులిద్దరూ నాయర్ కులానికి చెందినవారు. వారికి పదముగ్గురు సంతానం. తొమ్మిదిమంది ఆడపిల్లల్లో అమ్ము కడసారి అమ్మాయి. అమ్ము చిన్నతనంలో బడికి వెళ్ళలేదు. ఇంటి వద్దనే మలయాళంలో వ్రాయడం,



అమ్ము స్వామినాథన్

చదవడం నేర్చుకొంది. ఇంటి పనులు ఆడపిల్లకు పెళ్ళి ముందు నేర్పాలని, నేర్పించారు. అమ్ముకు చిన్నతనంలోనే తండ్రి చనిపోవడంతో తల్లి అంతమంది ఆడపిల్లలకు పెళ్ళి చేయడానికి చాలా కష్టపడింది. అమ్ముకు పదమూడవ ఏట తల్లి నాయర్ కులాచారం ప్రకారం 'సంబంధం' ఏర్పరచాలనుకొన్నది. ఆ రోజుల్లో కేరళలో ఆడపిల్లలకు పెళ్ళి చేసి అత్తవారింటికి పంపించే ఆచారం లేదు. పెళ్ళి అయిన ఆడపిల్లలు పుట్టింట్లో ఉంటారు. 'సంబంధి' అయిన భర్త ఆమెను కలవడానికి ఆమె పుట్టింటికి వస్తారు. అతనికి పిల్లల బాధ్యత, భార్య బాధ్యత ఉండదు. కేరళలో మాతృస్వామ్య వ్యవస్థకు

సంబంధించిన ఆచారం ఇది. ఇంగ్లాండులో చదువు పూర్తి చేసుకొని వచ్చిన సుబ్బరామస్వామినాథన్ అమ్ము తండ్రికి చాలా సన్నిహితుడు. గోవింద నాయర్ కుమార్తెలలో ఎవరినైనా పెళ్ళి చేసుకోవాలని అనుకొన్నాడు. అమ్ము తల్లి ఆఖరి పిల్ల అమ్ముకు తప్ప అందరి అమ్మాయిలకు పెళ్ళిళ్ళు అయిపోయాయని చెప్పింది. ముప్పైమూడేళ్ళ సుబ్బరామన్ పదమూడేళ్ళ అమ్మును తనను పెళ్ళి చేసుకోవంటావా అని అడిగినప్పుడు, అమ్ము కుట్టి జంకు గొంకు లేకుండా "నాకేం అభ్యంతరం లేదు. నాకు ఇంగ్లీషు వనిత (బ్రిటీష్ వాళ్ళు పాలిస్తున్న ఆ రోజుల్లో చాలామంది బ్రిటీష్ వనితలు కులీన స్త్రీలకు వాళ్ళ ఇళ్ళకు వెళ్ళి జీతం తీసుకొని ఇంగ్లీషు నేర్పేవారు) దగ్గర "ఇంగ్లీషు చదువుకోవాలని ఉంది. మా అన్నలను ఇంట్లో ఎప్పుడు వస్తావని అడగరు, అలాగే నేను ఎప్పుడు ఇంటికి వస్తానని అడగకూడదు" అని చెప్పింది. అంత చిన్న వయస్సులోనే అమ్ము వ్యక్తి స్వాతంత్ర్యం, సమానత్వం తన హక్కుగా నొక్కి వక్కాణించగలిగింది. ఆ షరతులకు ఒప్పుకొని 1907లో అమ్ముని పెళ్ళి చేసుకొని మద్రాసుకు మకాం మార్చాడు. 'సంబంధి' వ్యవస్థను ఇష్టపడని సుబ్బరాయస్వామినాథన్‌కు అమ్ము కుటుంబ సభ్యులు సరైన పద్ధతిలో వివాహం చేశారు.

స్వామినాథన్ కుటుంబ సభ్యులు ఆ కులాంతర వివాహాన్ని నిరసించారు. సంబంధం కేరళ రాష్ట్రంలో ఆచారంగా వ్యవహరించినా, సరైన వివాహం కాదని తర్వాత ఆయన అమ్మును లండన్‌లో 'రిజిష్టర్ మ్యారేజ్' చేసుకొన్నారు. డా. సుబ్బరాయ స్వామినాథన్ మధ్యతరగతి తమిళ బ్రాహ్మణ కుటుంబానికి చెందినవాడు. చదువు కోసం చాలా కష్టపడి, స్కాలర్‌షిప్‌లు సంపాదించి ఎడింబరో, లండన్ యూనివర్శిటీలలో చదివాడు. ఆయన ఆర్థిక పరిస్థితుల వలన, చదువులు కొనసాగిస్తూ ఇంగ్లాండ్‌లో ఉండిపోవడం వలన ముప్పైమూడు ఏళ్ల వరకు పెళ్ళి చేసుకోలేదు. తనకంటే ఇరవైఏళ్ళు చిన్నదైన అమ్ము ఆయనకు మానసికంగా ఎంతో చేరువైంది. అన్నివిధాల ఆమె అభివృద్ధిని కాంక్షిస్తూ ఆయన తన జీవితంలో ఎక్కువ కాలం ఆమె కోసం వినియోగించాడు. లండన్‌లో ఆయన అమ్ముని రిజిష్టర్ మ్యారేజ్ చేసుకొన్నా, ప్రజల మనస్తత్వం మారలేదు. స్వామినాథన్ కుటుంబ సభ్యులు, చుట్టూ ఉన్న సమాజం. అమ్ము స్వామినాథన్‌ను, పిల్లల్ని స్వామినాథన్ బంధువుల ఇళ్ళల్లో శుభకార్యాలకు రానిచ్చినా, పిల్లలకు భోజనాలు వేరేచోట దూరంగా పెట్టేవారు. రిజిష్టర్ మ్యారేజ్ వలన అమ్ము నాయర్ కులవ్యవస్థ అయిన మాతృస్వామ్య వ్యవస్థ నుండి బయటపడగలిగింది. అమ్ము ఆమె పిల్లలు స్వామినాథన్ పేరుతో వ్యవహరించబడేవారు.

అమ్ము జీవితం పెళ్ళి అయ్యాక పూర్తిగా మారిపోయింది. తనకంటే చాలా చిన్నదైన భార్యలోని ప్రతిభకు మెరుగులు దిద్దాడు సుబ్బరాయ స్వామినాథన్. ఇంట్లోనే (ఆంగ్ల ఉపాధ్యాయినిని) ఇంగ్లీషు టీచరును నియమించాడు. ఇంగ్లీషుతో పాటు మిగతా సబ్జెక్టులు కూడా చెప్పించి ఆమె చదువుకోలేదన్న భావన పోగొట్టాడు. త్వరలోనే ఆమె ఇంగ్లీషు భాషపై మంచి పట్టు సాధించింది. భర్త సహాయ సహకారాలతో అమ్ము వ్యక్తిత్వం చక్కగా వికసించింది. స్వామినాథన్ ప్రభావం వలననే అమ్ము గాంధీజీకి శిష్యురాలయింది. స్వాతంత్ర్యోద్యమంలో భాగస్వామిని అయింది. స్వామినాథన్ దంపతులకు ఇద్దరు మగపిల్లలు, ఇద్దరు ఆడపిల్లలు కలిగారు. పిల్లలకు సమాన అవకాశాలిచ్చి, వారికి నచ్చిన విద్య, ఉద్యోగాలు చేసే అవకాశం ఇచ్చారు. పెద్దకుమారుడు గోవిందస్వామినాథన్. బారిష్టరుగా మద్రాసు హైకోర్టులో పనిచేశారు. ఆయన భార్య లక్ష్మీ ఇన్స్యూరెన్స్ కంపెనీ, లాహోరు అధినేత పండిట్ సంతానం గారి కుమార్తె. రెండో సంతానం లక్ష్మీసెహగల్, ఇండియన్ నేషనల్ ఆర్మీలో రాణీ ఝాన్సీ రెజిమెంట్‌కు నేతృత్వం వహించింది. సుభాష్ చంద్రబోస్ స్థాపించిన ఆజాద్ హింద్ ఫౌజ్‌లో పనిచేస్తూ, ఆమె గైనకాలజిస్టుగా ప్రాక్టీసు చేసింది. నేతాజీ దేశం విడిచిపోతూ లక్ష్మిని ఆజాద్ హింద్ ఫౌజ్‌కు నాయకురాలిగా చేశారు. చిన్న కుమారుడు సుబ్బరామన్

బొంబాయి హైకోర్టులో న్యాయవాది. ఆయన బొంబాయి హైకోర్టు చీఫ్ జస్టిస్ యమ్.సి. చాగ్లా గారి కుమార్తె నూరుహసన్‌ను వివాహం చేసుకొన్నారు. ఆఖరి అమ్మాయి మృణాళిని నాట్య కళాకారిణిగా ఖ్యాతి వహించింది. ఆమె భర్త విక్రమ్ సారభాయ్ ప్రముఖ సైంటిస్టు.

1914 నుండి అమ్ము రాజకీయ రంగంలో చురుకుగా పాల్గొన్నది. 'ఆక్స్‌ఫర్డ్ ఎన్‌సైక్లోపిడియా ఆఫ్ ఉమెన్ ఇన్ వరల్డ్ హిస్టరీ' ప్రకారం అమ్ము "ఉమెన్స్ ఇండియా అసోసియేషన్‌ను 1917లో మద్రాసులో మరికొంతమంది ప్రముఖ స్త్రీలు అనిబిసెంట్, మార్గరేట్ కజిన్స్, మాలతీ పట్వర్ధన్, శ్రీమతి దాదాభాయ్, శ్రీమతి అంబుజమ్మాళ్‌లతో కలిసి స్థాపించారు. ఈ ఉమెన్స్ ఆర్గనైజేషన్ స్త్రీ కార్మికుల ఆర్థిక, సామాజిక సమస్యలను పరిష్కరించే విధానాలు సూచిస్తుంది. స్త్రీలకు ఓటు హక్కు, రాజ్యాంగ హక్కులు కావాలని సాధికారంగా అడిగిన అసోసియేషన్లలో ముఖ్యమైనది. స్వాతంత్ర్యం వచ్చాక, ఆమెను కాన్‌స్టిట్యూఎంట్ అసెంబ్లీకి ఎంపిక చేశారు. ఆమెకు ఇంగ్లీషు భాషలో ప్రావీణ్యం, ధాటీగా, నిష్కపటంగా మాట్లాడే స్వభావం ఉండడంచేత, రాజ్యాంగ పరిషత్తులో సభ్యురాలిగా గౌరవం దక్కింది. స్త్రీలు రాజకీయాలకు చాలా దూరంగా ఉండే రోజులవి. ఆమె 1946లో మద్రాసు శాసన సభ నుండి ఎంపిక అయి రాజ్యాంగ సభలో పాల్గొన్నది. స్త్రీలకు సమాన ప్రతిపత్తి, వయోజన ఓటు హక్కు, అస్పృశ్యతా నివారణలను ఆమె సమర్థించింది. బాల్యవివాహానికి తానే బలి అయినందున, బాల్యవివాహ నిరోధ చట్టం (శారద బిల్లు) గురించి పోరాడింది.

24 నవంబరు, 1949 నాడు 'డ్రాఫ్ట్ కాన్‌స్టిట్యూషన్' డా. బి.ఆర్. అంబేద్కర్ రాజ్యాంగ పరిషత్తు సభలో ప్రవేశపెట్టినప్పుడు, అమ్ము స్వామినాథన్ ఆనందంతో డ్రాఫ్టును స్వాగతిస్తూ ఇలా అన్నారు- "బయట ప్రపంచంలో ప్రజలు భారతదేశంలో స్త్రీలకు సమాన హక్కులు లేవని అనుకొంటున్నారు. భారత ప్రజలే తమ రాజ్యాంగాన్ని రూపొందించుకొని ఆడవారికి సమాన హక్కులు దేశంలో మిగతా పౌరులందరితో సమానంగా ఇచ్చారని మనం ఇప్పుడు సగర్వంగా చెప్పుకోవచ్చును." జవహర్‌లాల్ నెహ్రూ వంటి నాయకులతో కలిసి ఆమె కాంగ్రెస్‌లో పనిచేశారు. పండిట్‌జీ అన్న పదం అగ్రవర్ణాలకే చెందింది. నెహ్రూజీని 'పండిట్ జీ' అని సంబోధించినపుడు ఆయన అభ్యంతరం చెప్పనందుకు అమ్ము ఆయనను తప్పు పట్టింది. అలా పిలవవద్దని ఎందుకు చెప్పలేదు అని అడిగింది. నెహ్రూ 'నేనెవ్వరినీ అలా పిలవమని చెప్పలేదు' అన్నారట. స్వాతంత్ర్య యోధురాలైన అమ్ము ఇల్లు మద్రాసులో జాతీయ నాయకుల రాకపోకలతో సందడిగా ఉండేది. అందరితో కలుపుగోలుగా ఉండే అమ్ము ఇంటికి ముత్తులక్ష్మారెడ్డి, అనిబిసెంట్, కె. కామరాజ్ మొదలైనవాళ్ళు వచ్చి గంటల తరబడి స్వాతంత్ర్య సమరం గురించి చర్చించుకొనేవారు. అమ్ము తండ్రి ఆమె చిన్నతనంలోనే చనిపోవడం వలన, తల్లి తనను, తన తోబుట్టువులను ఎంత శ్రద్ధగా పెంచిందో గమనించింది. స్త్రీలు, భర్త చనిపోయాక, గుండు గీయించుకొని, తెల్ల చీరలు కట్టుకొని, గాజులు బద్దలు కొట్టుకొనే మూఢాచారాలంటే అమ్ముకు అసహ్యం. అమ్ము తన ముప్పై దశకంలో ఉండగా భర్తను కోల్పోయింది. కానీ ఎంతో ధైర్యంగా పిల్లల్ని పెంచింది. అమ్ము అందరితో కలిసిమెలసి ఉండేది.

రాజ్యాంగ పరిషత్తులో సభ్యురాలిగా ఆమె కూడా రాజ్యాంగం డ్రాఫ్టుపై తన వాఖ్యానాలు వినిపించారు. 24 నవంబరు, 1949 నాడు అంబేద్కర్ డ్రాఫ్ట్ కాన్‌స్టిట్యూషన్‌ను సభ ఆమోదం కోసం ప్రవేశపెట్టారు. రాజ్యాంగ చట్ట నిర్మాణంలో పూర్తిగా పాలుపంచుకొన్న అమ్ము ఇలా ప్రశంసించారు- "స్వాతంత్ర్య భారతదేశ రాజ్యాంగ చట్టం, నాలుగు వందల మిలియన్ ప్రజల మహాస్వప్నం. ఈ మహాస్వప్నానికి సాకారం ఇవ్వడానికి ఎన్నో ఏళ్ళుగా పేద ప్రజలు కృషి చేశారు. ఈ రోజు మనమంతా పడిన శ్రమకు ఫలితం దక్కింది.

ఈ మధ్యాహ్నం ఇక్కడ నిలబడగానే నా మదిలో మెదలిన మొదటి చిత్రం మహోన్నత వ్యక్తి మహాత్మాగాంధీ. ఏళ్ళ తరబడి ఆయన చేసిన అవిరామ కృషి వలన మనకు స్వాతంత్ర్య దేశం సాధ్యమైంది. ఈ రాజ్యాంగానికి

అర్హులు కావడానికి మనం దీనిని ఆచరణలో పెట్టగలగాలి. దేశంలో ప్రతి వ్యక్తి రాజ్యాంగంవలన లబ్ధి పొందాలి. మన దేశం ప్రాథమిక హక్కులు, సమానత్వం, వయోజన ఓటు హక్కు, అస్పృశ్యతా నివారణ వీటన్నింటి గురించి పోరాడింది. రాజ్యాంగంలో ఇవన్నీ పేపరు మీద ఉంటే చాలదు. ఈ ఆశయాలు, ఆదర్శాలు దేశంలో ఉన్న ప్రజలంతా ఆచరణలో పెట్టేటట్లు మనం చూడాలి. అంబేద్కర్‌ను అభినందిస్తూ అమ్ము "ఈ సభలోని వారంతా మిమ్మల్ని ఎంతో ప్రేమాభిమానాలతో గుర్తుంచుకొంటారు. సభలో ప్రతి ఒక్కరి పట్ల మీరు చూపిన సౌహార్ద్ర సహకారాలు ఎప్పటికీ గుర్తుంటాయి. మేమంతా డా. అంబేద్కర్‌ను, డ్రాఫ్టింగ్ కమిటీ సభ్యులను, కాన్‌స్టిట్యూఎంట్ సెక్రటేరియట్‌ను అభినందిస్తున్నాం. ఎన్నో వారాలు, నెలలు కష్టపడి రూపొందించిన ఈ మహత్తర కార్యాన్ని ప్రశంసిస్తున్నాం. ఎన్నో కష్టాలు అధిగమించి, కార్య భారాన్ని వహించడం వలన ఘనమైన రాజ్యాంగం ఆమోదయోగ్యమైంది.

"రాజ్యాంగం రెండు స్తంభాలపై ఆధారపడింది. ప్రాథమిక హక్కులు, రాజ్యాంగం నిర్దేశించిన సూత్రాలు, ప్రాథమిక హక్కులలో వాక్‌స్వాతంత్ర్యం, మతస్వాతంత్ర్యం చాలా ముఖ్యమైనవి. హిందువులు ఎప్పుడూ ఇతర మతాల పట్ల సహనం చూపిస్తారు" అని ఎంతో దృఢవిశ్వాసంతో అమ్ము అన్నారు. "డెబ్బైఏళ్ళ తర్వాత ఆమె మనవరాలు సుభాషిణీ ఆలీ ఇలా వ్యాఖ్యానించారు- "ఇప్పుడు అమ్ము (అమ్మమ్మ) ఉన్నట్లయితే దేశ పరిస్థితులు ఇలా మారినందుకు చాలా విచారపడేది.

ప్రతి పౌరుడు హక్కులు అనుభవించటంతో పాటు దేశం పట్ల తన బాధ్యతలు, విధులు తెలుసుకోవాలి. తన స్వాతంత్ర్యం దేశ శ్రేయస్సుకు ఉపయోగపడాలి. స్వాతంత్ర్యం అంటే ఎవరికి నచ్చినట్లు వాళ్ళు ఏదైనా చేసేయడం కాదు. రాజ్యాంగంలో చాలా క్లాజులు తప్పుపట్టేవాళ్ళు చాలామంది ఉన్నారు. మనం రాజ్యాంగం తయారు చేస్తున్నప్పుడు ఎన్నో విపత్తులు సంభవించాయి. చాలా విచారకమైన సంఘటనలు చోటు చేసుకొన్నాయి. మనం చేసే పని కూడా కష్టతరమైనది. ఎన్నో విభిన్న అభిప్రాయాలను కూర్చి, అందరూ సమ్మతించకపోయినా అధికవర్గం అంగీకరించిన రాజ్యాంగం తయారు చేయడం ఒక మహత్తర కార్యం సాధించడం.

రాజ్యాంగాన్ని చాలామంది ప్రశంసించినా, కొంత విమర్శ కూడా ఉంది. నా దృక్పథంలో మన రాజ్యాంగం చాలా నిడివైనది, భారీ సంపుటంగా తయారు అయింది. మన రాజ్యాంగం చిన్నదిగా ప్రతివారు జేబులోగాని పర్సులోగాని పెట్టుకోవడానికి వీలుగా ఉండాలని నేను కోరుకొంటున్నాను. పెద్ద సంపుటంలా ఉండకూడదు. అందులో ఎన్నో వివరాలు ఇవ్వాల్సిన ఆవశ్యకత లేదు. సంక్షిప్తంగా ఉన్నట్లయితే ప్రజలు చదవడానికి, సామాన్య ప్రజానీకానికి అందుబాటులో ఉంటుంది. ప్రస్తుతం కాన్‌స్టిట్యూషనల్ లాయర్లు, లిటిగేషన్‌లో చిక్కుకున్న వాళ్ళు మాత్రమే ఉపయోగించుకోగలుగుతారు". యదార్థవాది అమ్ము సూటిగా రాజ్యాంగం సామాన్య పౌరుడికి అందలేదన్న విషయం చెప్పారు.

1950లో అమ్ము స్వామినాథన్ వైస్‌ప్రెసిడెంట్ ఆఫ్ ఫెడరేషన్ ఆఫ్ ఫిల్మ్ సొసైటీగా నియమించబడ్డారు. సొసైటీకి ప్రముఖ చిత్ర దర్శకుడు సత్యజిత్ రే ప్రెసిడెంట్. ఆమెకు చాలా సాంస్కృతిక, సామాజిక సంస్థలతో సన్నిహిత సంబంధం ఉంది. ఆమెకు సినిమాలంటే చాలా ఇష్టం. 1952లో అమ్ము రాజ్యసభ సభ్యురాలుగా ఎంపిక అయ్యారు. ఆమె భారత స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు ప్రెసిడెంట్‌గా నవంబరు 1960 నుండి మార్చి 1965 యువతకు సామాజిక సేవలో శిక్షణ ఇచ్చారు. ఆమె సౌహార్ద్ర రాయబారిగా ఇథోపియా, చైనా, యు.ఎస్.ఎ., యు.ఎస్.ఎస్.ఆర్. పర్యటించారు. 1975లో ఇంటర్నేషనల్ ఉమెన్స్ ఇయర్ ప్రారంభోత్సవ సభలో (Inauguration of International women's year) ఆమె 'మదర్ ఆఫ్ ది ఇయర్'గా గౌరవించబడ్డారు. సామాజిక, రాజకీయ, సాంస్కృతిక రంగాలకు ఇతోధికంగా సేవ చేసిన అమ్ము స్వామినాథన్ భారతీయ మహిళలకే కాదు ప్రపంచ మహిళలకే ఆదర్శ ప్రాయురాలు.

ముత్తంగి వేంకట భారతలక్ష్మి
కాకినాడ. ఫోన్: 944 021 5330.

# నైతిక విలువలు

– కిల్లాడ సత్యనారాయణ

నైతిక విలువలు నేతిబీరకాయలా? సమస్యల్ని విసనకర్రతో విసిరి పారేద్దామనుకునే యువత అవుననే అంటుంది.

నైతిక విలువలు ఎక్కడున్నాయి? వల్లించేవాళ్ళ నోటిలోనా? వినేవాళ్ళ ఓపికలోనా?

మంచోళ్ళందరికీ కథానాయకుడు హరిశ్చంద్రుడు అంటారు. అదే చెడ్డవాళ్ళకు చెలికాండ్రుగా భోగభాగ్యాలను చూపిస్తారు.

విలువల్ని తుంగలో తొక్కినవారు భవంతుల్లో ఉంటున్నారని, కార్లలో తిరుగుతున్నారని చూపిస్తారు. యోగుల్లా బ్రతుకుతున్నవారి చేతుల్లో బూడిద తప్ప ఏముంటుందని ప్రశ్నిస్తారు.

ఈ జన్మలో చేసిన మంచికి వచ్చే జన్మలో ఫలం లభిస్తుందని కొందరు నమ్మిస్తారు.

నమ్మకండి. ఆ మాటల్లో నిజం లేదు. ఆ భోగాల్లో నిద్ర లేదు. విలువలు తెచ్చే శాంతిలోనే హాయి ఉంది. ఆనందం ఉంది.

తెరవెనుక నేరాలన్నీ బేడీలకు చిక్కకపోవచ్చును. చీకట్లో పాలు తాగుతున్న పిల్లిలా తప్పు చేయవచ్చును. కప్పిపుచ్చుకోవచ్చును. కప్పివేయవచ్చును. కానీ విధికో, విధి రాతకో చిక్కినప్పుడు పశ్చాత్తాప పడతారు.

విలువలు ధనాగ్నిలో బూడిదయితే అశాంతి ఆకాశమంత విస్తరిస్తుంది.

ఆనందాన్ని మించిన ఐశ్వర్యం ఏముంది?

ఆలోచనలన్నీ మనసు నుంచే పుడతాయంటారు.

ఈ మనస్సు కూడా గొరిల్లాయే. ఎప్పుడు ఉరుకుతుందో, ఎప్పుడు ఉరుముతోందో అంతు చిక్కదు. అందుకే దానికి విలువల కళ్ళెం వేయాలి.

మనసు కప్పల తక్కెడ కాకూడదు.

తల వంచుకున్నవాడి మనసులో సూర్యోదయం ఎలా వస్తుంది? అడ్డమైనా గడ్డీ మేసేవాడు అడ్డగాడిద కాక ఏమౌతాడు?

కడుపులో కోరికల్ని దాచుకున్నవాడి దాహాన్ని ఎన్ని మహాసముద్రాలతో తీర్చగలం?

జీవితానికి సరిపడినంత ఆక్సిజన్ ని ఒక్కరోజే పీల్చి జీవించలేం కదా. వెలుగుండాలి. అది జీవితమంతా వెలుగుతూ ఉండాలి.

నైతిక విలువలు కూడలిలో నిలుచున్న ట్రాఫిక్ కానిస్టేబుల్ లాంటివి. ఎటు వెళ్ళాలో, ఎప్పుడు వెళ్ళాలో, ఎంత వేగంతో వెళ్ళాలో చెబుతాయి.

జీవితం అదుపుతప్పి పరుగెడుతున్న వాహనం కాకూడదు. నిదానం లేకపోతే ప్రమాదం తప్పదు. నైతికపుష్పాలు వెదజల్లే పరిమళం నిదానం.

దుకాణంలో వస్తువుల్లా లోకంలో విషయాలన్నీ మనల్ని తమవైపు లాక్కుంటుంటాయి. అవసరాలు వస్తువుల్ని ఎన్నుకున్నట్లు విలువలు విషయాల్ని ఎన్నుకోవాలి.

అందరిలో నువ్వున్నావని, నీలో అందరున్నారని గమనించు. ప్రతి మనిషిలో మనని మనం, మనలో ప్రతి మనిషినీ చూసుకున్నప్పుడు విద్వేషాలు నీటిబుడగలవుతాయి. అసూయ అహంకారాలు ఆవిరైపోతాయి.

గుచ్చుకుంటుందన్న స్పృహ ఉన్నప్పుడు ఎదుటివారి మార్గంలో ముల్లులు వేయం.

ఇచ్చే గుణంలేని చేతులకు తీసుకునే అర్హతా ఉండదు. ఎముక లేకుండా ఇచ్చే చేతుల్ని లోకం తన భుజాలపై కూర్చోబెట్టుకుంటుంది.

జీవనది నుండి ఎంత నీరు తోడినా అది ఎండిపోదు.

సహానుభూతి ఒక మహా విభూతి. ఏడిపించే నోళ్ళు కాదు, పలకరించే కళ్ళు కావాలి. వెక్కిరించే నుదురు కాదు, ధైర్యమిచ్చే చేతులు కావాలి.

సహానుభూతి స్నేహంలో ఎంతటి దుఖ?మైనా కరిగిపోవల్సిందే. ఎంతటి విరోధమైనా ఓడిపోవల్సిందే.

కల్పితం ఒక మెరుపు. ఏకపక్షం ఒక ఉరుము. క్షణ కాలమే ఉంటాయి. కాని విలువలిచ్చే తృప్తి ఆకాశం వంటిది. జీవితమంతా వ్యాపించి ఉంటుంది.

మర్రి చెట్టు గుణాలన్నీ విత్తు నుంచే పుడతాయి. ఆకులు, ఊడలు, కొమ్మలు, రెమ్మలు, పువ్వులు, కాయలు అన్నింటికీ మూలం విత్తే. మన వృత్తి-ప్రవృత్తి, వ్యక్తిగత జీవనం- సమిష్టి జీవనం, కలలు- కళలు అన్నింటా మనమే ఉంటాం. అన్నింట్లో మన విలువల పరిమళమే గుభాళిస్తుంది.

సమస్త జీవరాసుల్నీ నడిపిస్తున్న కోడాన్‌లి ఒక్కటే. మనిషి మానవజాతికి ప్రతీక.

బ్రహ్మాండంలో అణువున్నట్లే, అణువులోనూ బ్రహ్మాండముంది.

మన క్రియలు మన వ్యక్తిత్వానికి ప్రతీకలు. మానవ జీవితానికి చిహ్నాలు.

గమనిస్తే, అన్ని ఆత్మల్లో ప్రవహించే విలువలరక్తం ఒక్కటే. ఎన్నుకున్న విలువలే ఎత్తును నిర్దేశిస్తాయి.

అన్ని కాలాల మహానుభావుల్ని గమనిస్తే... బుద్ధుడు, జీసస్‌బీ సోక్రటీస్, నాగార్జునుడుబీ ఐన్ స్టీన్, టాల్ స్టాయ్, గాంధీజీ, మదర్ థెరీసాబీ గెలీలియో, కొలంబస్ ... వీళ్ళందరి నైతిక ప్రమాణాల్లో భేదం లేదు. వాళ్ళు ఎన్నుకున్న మార్గాలే వేరు. వాళ్ళు చూపించిన సత్యాలు వాళ్ళ వాళ్ళ దుస్తులు తొడుక్కొని వచ్చాయి.

అనుమానం వస్తే ఆత్మనే అడుగు. చందమామలా దారి చూపుతుంది. గుణం కొండ కాదు. అది కొండల్ని దాటుకుంటూ పరుగులు తీసే ప్రవాహం. అది ఒక ఘటనకు పరిమితమైనట్లు ఉంటుంది. కానీ జీవితమంతా పరచుకుంటుంది.

గుణానికి నిరాడంబరత ప్రధానం. అది అలంకారాలను, ఆడంబరాలనూ ప్రోగు చేసుకోదు.

మనిషంటే సంవేదన. మనిషిని మనిషిగా చూడని మనిషిజన్మ ఎందుకని? సంవేదన లోపిస్తే జీవితం చిల్లు పడిన బూరలా మిగిలిపోతుంది.

ఆర్ద్రత లేని జీవితంలో గాఢత ఎక్కడుంటుంది?

లౌకిక విషయాలను విడిచి జీవితం మనలేకపోవచ్చును. కానీ లౌకికతే జీవితమా?

ఇచ్చిపుచ్చుకోవడాలు, కని పెంచడాలు, తెచ్చి తుంచుకోవడాలు, పెట్టి ఆర్పడాలు ... ఇంతేనా జీవితం? పుట్టిన దగ్గర నుంచి పోయేవరకు 'నా' చుట్టూనే తిరుగుతుంది జీవితం. పోయేటప్పుడు 'ఓస్, ఇంతేనా' అని పెదవి విరిచేందుకా బ్రతుకుతున్నది?

కరిగితే వెలుగొస్తుంది. ద్రవీభవిస్తే గుండె నిండుతుంది. అందుకే కరుణ ముఖ్యం. కరుణ మాత్రమే మనిషిని మనిషిగా నిలబెడుతుంది. కానీ కరిగే మనసున్న మనుషులెందరు?

ఇచ్చిపుచ్చుకోవడం ప్రేమవుతుందా? కోరికలతో దహించుకుపోతున్న మనసుకు స్వేచ్ఛ సాధ్యమా? ఎండిన ఎదపై ప్రేమపూలు పూస్తాయా? ప్రేమలేని జీవితం వెన్నెల లేని ఆకాశమే కదా.

ఇన్ని విలువలు పాటించగలమా? సన్యాసమే శరణ్యమా? భయపడకండి. విలువల కోసం జీవితాన్ని త్యజించమనడం లేదు. జీవితాన్ని విలువలతో నింపమంటున్నాను. మనిషికి విలువలు పువ్వుకు పరిమళంలా, తేనెకు మాధుర్యంలా ఉండాలే తప్ప, బట్టకు పూసిన అత్తరులా ఉండకూడదు.

విలువలపై ఆధిపత్యం మతానికెందుకు? శాస్త్రాలకెందుకు? అసలు ఈ నీతి నియమాలకు జన్మస్థానం మతమా? మనిషా? మనిషి ఆలోచనల నుంచి కదా మతం పుట్టింది. అలాంటప్పుడు, మనిషి మతానికో, శాస్త్రానికో బానిస కావడం దేనికి?

నైతిక విలువలు ఎక్కడ నుంచి పుడతాయి? బుద్ధి నుంచా? సమాజం నుంచా? పరిస్థితుల నుంచా?

నైతికతకు ఆధారం హేతుబద్ధత అంటాడు జర్మన్

తత్వవేత్త ఇమ్మాన్యూయెల్ కాంట్. దీనినే ఆయన "కాటగారికల్ ఇంపరేటివ్ (CI)"గా పేర్కొన్నారు. అనైతిక చర్యలన్నీ అహేతుకమైనవంటాడు.

తప్పు చేయని జీవితం ఉంటుందా? అయితే తెలిసి తప్పు చేయడం అనైతికం అవుతుంది. తప్పును దిద్దుకోవడం నైతికత.

పసికందుకు నైతిక విలువలుంటాయా? ఉండవంటారు మనోవైజ్ఞానిక శాస్త్రవేత్త లారెన్స్ కోల్బెర్గ్.

మనలో నైతిక విలువల అభివృద్ధిని మూడు దశల్లో విభజిస్తారు కోల్బెర్గ్.

బాల్యంలో అవి అంకురిస్తాయి. తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను, సహాయాయులను చూసి, విని తెలుసుకొని మొక్కలుగా ఎదుగుతాయి. ఈ దశలో విలువలు పిల్లల ఇష్టాయిష్టాల చుట్టూనే తిరుగుతాయి.

ఇప్పుడు పిల్లల ప్రపంచాన్ని టాబ్ లు, టీవీలు ఆక్రమిస్తున్నాయి. పాటలు పాడే బామ్మలు, నడకలు నేర్పే తాతలూ కనుమరుగయ్యారు. అందుకే చాలా మంది పెద్దయ్యాక కూడా మొదటి దశ విలువల్లోనే ఉంటున్నారు.

రెండవది యౌవ్వన దశ. ఈ దశలో యువకులు సమాజం నుండి, స్వీయ అనుభవాల నుండి నైతిక విలువలు ఎక్కువగా గ్రహిస్తారు. విలువల్ని విధిగా అనుసరించే ప్రయత్నం చేస్తారు. సమాజంపట్ల బాధ్యతగా ఉంటారు. ప్రతిగా ఇతరుల నుండి ప్రశంసను అపేక్షిస్తారు. ఆధునికతలో మునిగిన యువకులు పోలికలో, పోటిల్లో అలసిపోతున్నారు. గుర్తింపు కోసం గుటక కూడా వేసే సమయం లేకుండా పరుగు తీస్తున్నారు. ఫలితంగా రెండవ దశను దాటి మూడవ దశను అతి తక్కువ మంది చేరుకోగలుగుతున్నారు. విధి రూపాన్ని జార విడిచి స్వయం ప్రకాశంగా విలువలు వెలుగొందడంతో మూడవ దశ మొదలవుతుంది. ఈ స్థితికి చేరుకున్న వ్యక్తులు అపఖ్యాతైనా తమ అంతరంగాన్నే పలుకుతారు. వీరికి విలువలు నలుగురూ నడిచిన బాట కాదు. అవి అంధుణ్ణి నడిపించే చేతికర్రవంటివి.

అనుసరిస్తే వారసుడివవుతావు. నీ బాటను నువ్వే వేసుకుంటే వైతాళికుడవవుతావు.

విలువలు పల్లేరులు కాదుబీ నల్ల జెముడు ముల్లులు అంతకన్నా కాదు. అవి నదిని దాటించే నావ కావాలిబీ తీరానికి చేర్చే ఓడ కావాలి. అవి ప్రయోజనాలతో పోరు పడవచ్చును. ఇష్టాయిష్టాలతో గొడవ పడవొచ్చును. కానీ జీవితంతో విలువలు ఘర్షణ పడకూడదు.

విలువలు వాడి పారేసే వస్తువులు కాదు. వాడినకొద్దీ ఇనుమడించే సువర్ణాభరణాలు.

విలువలు విద్యుత్తులా జీవితమంతా ప్రవహిస్తాయి. పరిస్థితులెదురైనప్పుడు ప్రకాశిస్తాయి.


విలువలకు సంఘటనలు సుడిగాలులు. పరిస్థితులు పెనుతుఫానులు. తట్టుకొని నిలువగలిగే ధీరత్వం కావాలి.

నైతిక విలువలు కాపలా కుక్కల్లాంటివి. అరిషడ్వర్గ దొంగలు చొరబడితే అంతరంగం నుండి అరుస్తాయి.

విలువల్లో శక్తి వృధా అవుతుందా? ఆదా అవుతుందా? విలువలు సంకెళ్ళు కాకూడదు. అవి ప్రమిదల్లో తైలం కావాలి. నిరంతరాయంగా మనలోని జ్యోతిని వెలిగిస్తూ ఉంచాలి.

విలువలు చెట్ల వేర్లలా మనసంతా అల్లుకుపోవాలి. అప్పుడే జీవితం ఎంత పెద్ద గాలిదుమారాన్నైనా తట్టుకుని నిలవగలదు.

కొందరి నుదిటపైన లేబిల్ అంటిస్తాం. చెడ్డవాడనీ, మంచివాడనీ. ఆ ముద్రతోనే వారితో మనం



వ్యవహరిస్తాం. మంచివాడంటే ఎవరు? చెడ్డవారెవరు? మంచీచెడులను నిర్ణయించేదెవరు? నైతిక విలువల అర్థం లేకుంటే మంచీచెడులను మనం ఎలా చూసుకోగలం?

మంచికి మూడు జీవనాడులున్నాయి. అవి 1) మంచిగా ఉండాలనే సంకల్పం. 2) నైతిక విలువలకు కట్టుబడి నిర్ణయం తీసుకోగల క్షమత. 3) నైతిక ప్రమాణాలతో ప్రకాశించే ప్రవర్తన.

మంచి అనేది అకాశంలో స్వేచ్ఛగా విహరించే విహంగం. ఆశల మిరుమిట్లకు అది లొంగదు. అవకాశాల పూసలు చూసి గింజలని భ్రమ పడదు.

మంచితనం విధి కాదు. ఏదో ఒక ఉద్దేశ్యంతో చేసే పనిలో మంచి కనబడదు. స్వార్థంతోనో, సానుభూతితోనో, సుఖంకోసమో, మెప్పుకోసమో చేసే పనిలో నైతికత మేడిపండు మాత్రమే.

మంచికి మంచే లక్ష్యం, మరొక్కటి కాదు.

మనల్ని అనైతికతవైపు ప్రేరేపిస్తున్న ఆశలను పసిగట్టాలి. ఎంత నోరూరిస్తున్నా వాటిని ఒదులుకోగల నిబద్ధత కావాలి.

మన లోపలి జీవుడు వెలుపలి ఆశలతో సంఘర్షణ పడినప్పుడు నైతికవిలువల నిగ్గు తేలుతుంది.

ఒక్క క్షణం నీకూ సమాజానికి మధ్యనున్న వారధి కూలిపోయిందనుకో. భయపడకు. అప్పుడు నువ్వు ఒంటరివి కాదు. నీకు తోడుగా నీ విలువలు ఉన్నాయి.

అందకుండా ఆకాశంలో మెరిసే తారలు కాదు నైతిక విలువలు. కాలి క్రింద నలిగిపోతున్న చెప్పులు అంతకన్నా కాదు. మనతో పాటు పెరుగుతూ మన శరీరాన్ని ఎల్లప్పుడూ కప్పి ఉంచే వస్త్రాలు విలువలు.

విలువలు హారంలో లాకెట్ లా మధ్యలో ఉంటాయి. ఒకవైపు పిరికితనం, మరోవైపు దురుసుతనం... మధ్యలో ధైర్యం. అలాగే పిసినారి తనానికీ, దుబారాకీ మధ్యలో ఉదారత. అణకువకూ, గర్వానికీ మధ్యన వినయం. గోప్యతకీ, వాగుడుకీ మధ్యలో నిజాయితీ. పోరుకీ, పొగడ్తకీ మధ్య స్నేహం నిలుచుంటుంది.

దీన్నే గ్రీకు తత్వవేత్త అరిస్టాటిల్ 'గోల్డెన్ మీన్' అన్నారు.

విలువల్ని కాలదన్ని చేతలు చెలరేగినప్పుడు అపరాధ భావన కలుగుతుంది. అదే మన నైతిక విలువల పునాదిపై పనులు నిలిచినప్పుడు మనసులో ప్రశాంతత నెలకొంటుంది. ఆనందం కలుగుతుంది.

అపరాధభావనను మెదడు తట్టుకోగలదా? లేదు. అందుకే ఆత్మహత్యా పోకడలు తలెత్తతలెత్తుతాయి. కానీ మెదడు జీవించాలనుకుంటుంది. అందుకు అది తప్పుకు తర్కాన్ని తెస్తుంది. తర్కం తప్పును సమర్థిస్తుంది. అది మరిన్ని తప్పులకు బాట వేస్తుంది.

సిరా రాత కానట్టే ఏ ఒక్క విలువా జీవితం కాదు. విలువలు సాపేక్షమైనవే తప్ప పరిపూర్ణమైనవి కాదు. దండలో పూవుల్లా అవి జీవితమనే దారంతో కలపబడి ఉంటాయి.

విలువలకు కట్టుబడి ఉన్నంత మాత్రాన, జీవితం పూలరథంపై ప్రయాణం అయిపోదు. జీవితమంటే ఉరుములు, మెరుపులు, వర్షాలు, వరదలు... వసంతాలు, పంటలు, పండుగలు. జీవితమంటే కామాలు, ఫుల్ స్టాప్‌లే కాదు, ప్రశ్నలు, ఆశ్చర్యార్థకాలు కూడా. వీటన్నింటికీ చిరునవ్వుతో సమాధానమిస్తాయి విలువలు. నైతిక విలువలు మనిషిని నడిపించేవిగా ఉండాలిగానీ, మనుషులకు చూపించేవిగా ఉండకూడదు. నైతికత ఒక బాధ్యత కాదు. అధికారం అంతకన్నా కాదు. విలువలు ఆంక్షలు కావు. చట్టాలు అంతకన్నా కాదు.

నైతికత మన జీవన యానానికి మనం వేసుకొనే పూలబాట. సహజీవన సౌందర్యానికి అది ఒక వెలుగు తోట.

(కోడాన్ అంటే DNA లేదా RNA న్యూక్లియోటిడ్స్ జెనిటిక్ కోడ్. ఇది అన్ని జీవరాసుల్లో ఉంటుంది)

కిల్లాడ సత్యనారాయణ
మంగళగిరి. ఫోన్: 833 398 7838.

# మోక్షగుండం విశ్వేశ్వరయ్య

*– మోటూరు శివరాం ప్రసాద్*



మోక్షగుండం విశ్వేశ్వరయ్య

బ్రిటన్ నుండి ఒక తెల్ల దొరసాని ఇండియా వచ్చింది, తన భర్త చార్లెస్ వాటర్ ఆఖరి కోరిక ప్రకారం బంగారంతో చేసిన ఆయన కోటు బటన్లు ఆయన ప్రియ శిష్యుడికి కానుకగా ఇవ్వటానికి. చార్లెస్ వాటర్ గారు బెంగళూర్ సెంట్రల్ కాలేజ్‌లో ప్రిన్సిపాల్‌గా పనిచేసి పదవీ విరమణ తరువాత తిరిగి ఇంగ్లాండ్ వెళ్లిపోయారు. కానీ ఆయన తన శిష్యుడిని మర్చిపోలేదు. ఆ శిష్యునికి కూడా ఆ గురువుపై అంత అభిమానం గౌరవం ఉన్నాయి. శ్రీమతి వాటర్ నుండి ఆ బహుమతిని తీసుకున్నప్పుడు ఆ శిష్యునికి కళ్ళనిండా నీళ్ళు తిరిగాయి బహుశా గురుశిష్యుల మధ్య ఇలాంటి సంబంధాలు చాలా అరుదేమో. గురువు గారికి అంత ఇష్టమైన శిష్యుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య. ఆయన చదువులో ఎప్పుడు ప్రథమ శ్రేణిలోనే ప్రధముడు.

**తెలుగు బిడ్డ:**

సూటు, బూటు, తలపై మైసూరు తలపాగా చూసి ఆయనను ఎవరైనా కన్నడిగుడు అనుకుంటారు.

విశ్వేశ్వరయ్య మోక్షగుండం అనే గ్రామానికి చెందినవారు. ఈ ఊరు ప్రస్తుతం ఉన్న ప్రకాశం జిల్లాలో గిద్దలూరుకు 12 మైళ్ల దూరంలో ఉంది. ఈ ఊరిలో 5 చిన్న చెరువులు, ఈ చెరువులలో స్నానం చేసి అక్కడ ఉన్న ముక్తేశ్వర దేవాలయంలో స్వామిని దర్శించుకుంటే మోక్షం వస్తుందని ఒక నమ్మకం. అందువల్ల ఆ ఊరుకు మోక్షగుండం అనే పేరు వచ్చింది. ములకనాడు బ్రాహ్మణ శాఖకు చెందిన వీరి కుటుంబం మరికొన్ని కుటుంబాలు ఉద్యోగరీత్యా పూర్వపు మైసూరు రాష్ట్రం కోలార్ జిల్లా వెళ్లారు. వీరి తండ్రి శ్రీనివాస శాస్త్రి చిక్కబల్లాపూర్ ప్రాంతంలో ఉపాధ్యాయుడిగా పని చేశారు. తల్లి వెంకచ్చమ్మ. వీరి రెండో సంతానం విశ్వేశ్వరయ్య. ఆయన 12 సంవత్సరాల వయసులో తండ్రి మరణించారు. చాలా పేద స్థితిలో ఆయన చదువుకున్నారు. ఆయన ఉపాధ్యాయుడు నాదముని నాయుడుపై కూడా ఆయనకు ఎనలేని గౌరవం ఎన్నో సందర్భాలలో ఆయన తన ఉపాధ్యాయుని పాత్ర తనచదువుపై ఎంతో ఉంది అని చెప్పారు. చదువులో ఆయన ప్రతిభను చూసిన మేనమామ రామయ్య చిక్కబల్లాపూర్‌లో చదువు పూర్తయిన తరువాత ఆయనను బెంగళూరులో తన ఇంట్లో ఉంచుకుని చదువుకు ఏర్పాటు చేశారు. కానీ ఆయన ట్యూషన్ చెప్పి, ఆ డబ్బునే తన చదువులకు ఖర్చుపెట్టి అందులో కొంత డబ్బు తల్లికి ఖర్చులకై పంపించేవారు. వెస్లీ మిషన్ హైస్కూల్, బెంగళూరు సెంట్రల్ కాలేజ్లో చదువు పూర్తి చేసి ఆయన పూనాలోని ఇంజనీరింగ్ కాలేజీలో ఇంజనీరింగ్ పూర్తి చేశారు. సెంట్రల్ కాలేజ్ ప్రిన్సిపల్ ఇంజనీరింగ్ చదువు కోసం స్కాలర్షిప్ ఇవ్వమని మైసూర్ దివాన్ రంగాచార్యులు గారికి సిఫారసు చేశారు. ఆయన ఇంజనీరింగ్ ప్రథమ శ్రేణిలో పాసయ్యారు. ఆయన అర్హతకు మెచ్చిన బొంబాయి ప్రభుత్వం ఆయనకు అసిస్టెంట్ ఇంజనీర్‌గా ఉద్యోగం ఇచ్చారు. చిక్కబల్లాపూర్‌కు చెందిన రామచంద్ర శాస్త్రి కుమార్తె సరస్వతిని 1882లో వివాహమాడారు. దురదృష్టవశాత్తు ఆమె ప్రసవ సమయంలో బిడ్డతో పాటు మరణించారు.

**జీవన ప్రగతి:**

కృష్ణా గోదావరి నదుల జన్మస్థానమైన నాసిక్‌లో ఆయన కెరీర్ మొదలైంది. ఒక ప్రఖ్యాత ఇంజనీర్‌గా

పేరు తెచ్చుకున్న విశ్వేశ్వరయ్యకు బహుశా ఇది దైవదత్తమేమో. అక్కడ అ ఆయనకు మహాదేవ గోవింద రనడేతో పరిచయం కలిగింది. తర్వాత ఆయనను ఖండేష్ జిల్లాలోని జూలియాకు బదిలీ చేశారు. నీటిపారుదల శాఖలో పనిచేస్తున్న విశ్వేశ్వరయ్యకు ఓ పరీక్ష ఎదురైంది. పంజరా నది నుండి 35 మైళ్ల దూరంలో ఉన్న దత్తారీ అనే గ్రామానికి సొరంగ మార్గం ద్వారా తాగునీటి సరఫరా చేయడం. నిర్మాణం మొదలయ్యాక వచ్చిన వరదలవల్ల నిర్మాణం నిలుపు చేయాల్సి వచ్చింది. పై అధికారి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నిలుపుదలను ఒక ధిక్కారంగాను ప్రజ్ఞ లేకపోవడం వ్యాఖ్య చేస్తూ ఆయనకు మెమో ఇచ్చారు. వెంటనే విశ్వేశ్వరయ్య ఆ పని తిరిగి మొదలు పెట్టడమే కాకుండా పూర్తి అయ్యేవరకు వెనుదిరిగి చూడకుండా నిర్మాణాన్ని పూర్తి చేసి రిపోర్ట్ పంపించారు. అది చూసి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ హెచ్.జి ఫుల్‌కిన్ ఆశ్చర్యపడడమే కాకుండా, ఆయనను అభిమానించడం మొదలు పెట్టారు. డిపార్ట్మెంటల్ పరీక్షలు పాస్ అవ్వమని ప్రోత్సహించారు. విశ్వేశ్వరయ్య మామూలుగానే ఆ పరీక్షల్లో ఉత్తీర్ణులు అవ్వడం క్లాస్ వన్ అసిస్టెంట్ ఇంజనీరుగా ధృవీకరించబడటం ఉద్యోగంలో చేరిన పది నెలల్లోనే జరిగింది. అది ఆయన దృఢ నిశ్చయానికి కార్య దీక్షకు నిదర్శనం. దీని తర్వాత ఆయనను రోడ్లు భవనాల శాఖ పూణేకు బదిలీ చేశారు. ఆయన పై అధికారి E.V.Reynolds ఈయన తెలివితేటలు చూసి ప్రస్తుతం పాకిస్తాన్‌లో ఉన్న సుక్కూర్కు పంపారు. ఈసారి ఆయన పని ఎడింబరో క్యాసిల్ అనే ఒక చిన్న కొండపై నీటి రిజర్వాయర్‌ను నిర్మించడం.

సింధూ నదిలోని నీరు రిజర్వాయర్‌లో నిల్వ ఉంచి మంచినీటిని ప్రజలకు అందించడం అప్పుడు ఆ నీటిని ఫిల్టర్ చేసి శుభ్రం చేయడం చాలా ఖర్చుతో కూడుకున్నది. విశ్వేశ్వరయ్య దీని నిర్మాణం ఖర్చు తగ్గించటమే కాకుండా రక్షిత తాగునీరు అందించడానికి కొత్త ఆలోచనతో దగ్గరలో గొట్టపు బావులు (Collector wells) తవ్వించారు. నదీ తీరంలో ఉండటం వలన నీటి కొరత లేదు పైగా నీరు సహజ సిద్ధమైన భూమి పొరల చేత ఫిల్టర్ చెయ్యడంవలన శుభ్రపడి రిజర్వాయర్‌లోనికి పంపించడానికి సిద్ధంగా ఉంది. తరువాత దానిని మరల శుద్ధిచేసి సుక్కూర్ ప్రజల తాగునీటి అవసరాలు తీర్చారు. ఆ తాగునీటి పథకం ప్రారంభించడానికి వచ్చిన బొంబాయి గవర్నర్ ప్రశంసలతోపాటు, సుక్కూర్ మునిసిపాలిటీ, వారికి పౌర సన్మానం చేశారు. మళ్లీ ఆయనను పుణేకుకు బదిలీ చేశారు ప్రభుత్వం వారు.

**బ్లాక్ సిస్టమ్ ఆఫ్ ఇరిగేషన్:**

పూణే చేరిన విశ్వేశ్వరయ్యకు మరొక చాలెంజ్. పంట సాగు కోసం ఇస్తున్న నీరు వృధా అయిపోవడం గురించి *కేసరి* పత్రికలో సంపాదకుడు గారి విమర్శనాత్మక వ్యాసాలు, రైతులు పడుతున్న బాధలు, విశ్వేశ్వరయ్య దృష్టికి వచ్చాయి. వి.ఎం. వర్తక్ అనే అసిస్టెంట్ ఇంజనీర్ ఒక నీటి పారుదల పథకం తయారు చేశారు. విశ్వేశ్వరయ్య, ఆ పథకాన్ని ఆకళింపు చేసుకుని అప్పటి పథకంలో ఉన్న లోపాలు *కేసరి* పత్రికలో వచ్చిన విమర్శలను, దృష్టిలో పెట్టుకొని ఒక సమగ్రమైన ప్రణాళికను రూపొందించడమే కాకుండా ఆ ప్రాంతంలో ఉన్న రైతులను ఫెర్గూసన్ కళాశాలలో మైదానంలో సమావేశపరిచి అప్పటికి ప్రభుత్వం ఇస్తున్న నీటి వివరాలు, అక్కడ పండుతున్న పంటలు, పంట భూముల రకాలు, వాటి భూసారములు, పంటనుబట్టి నీటి అవసరాలు రైతులకు విశదపరచి వారి సహకారాన్ని కోరారు. వారి అంగీకారంతో ఒక కొత్త స్కీమ్ తయారు చేశారు. ఈసారి *కేసరి* పత్రిక దీనిపై సంతృప్తి తెలిపింది. ఇంతలో ప్రభుత్వం వారు నీటిపారుదలను క్రమబద్ధం చేయడానికి ఇరిగేషన్ కమిషన్ ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ వారు ఈ స్కీమ్‌కు ఆమోద ముద్ర వేయడమే కాదు ప్రశంసలు కూడా తెలిపారు. రైతులకు సకాలంలో నీరు, ఏ కాలువలో, ఎప్పుడు, ఎన్ని రోజులు, నీటిని వదులుతారో ముందే తెలియజేయడం దీని ముఖ్య ఉద్దేశం. Block System of Irrigation అన్నారు. సర్ జాన్ మెకంజీ ప్రభుత్వంలో ఒక సీనియర్ మంత్రిగా చట్టసభలో మాట్లాడుతూ ఇది విశ్వేశ్వరయ్య మానసపుత్రిక ఆయన

మన దగ్గర ఉన్న బ్రిటిష్, భారతీయ ఆఫీసర్లు అందరికంటే ప్రజ్ఞావంతుడు అని మెచ్చుకున్నారు.

**ఆటోమేటిక్ గేట్లు:**

పూణేలోని khadakwasla జలాశయంలోనీరు సరైన స్టోరేజ్ కెపాసిటీ లేక ఎక్కువ నీరు ఉన్నప్పుడు పొంగిపొర్లి పోవడం ఆ విధంగా నీరు వృధా అవడం విశ్వేశ్వరయ్య సహించలేకపోయారు. దీనికి పరిష్కారం కోసం ఆలోచించారు. ఆయన కందకం (Dyke) ఎత్తు 8 అడుగులు పెంచి కెపాసిటీని 25% పెంచడానికి నిర్ణయం చేశారు. దానికి ముందే అప్పుడున్న ఆనకట్ట బలం సరిపోతుందో లేదో పరీక్షించారు. తన సొంత డిజైన్‌తో ఆటోమేటిక్ గేట్లు బొంబాయిలో తయారు చేయించారు.

ఈ గేట్లు నిర్ణీతమైన నీటిమట్టం వద్ద వాటంతట అవే తెరుచుకుంటాయి. నీటి పంపిణీ తర్వాత మళ్లీ మూసుకుంటాయి. వీటిని మోక్షగుండం గేట్లుగా పేటెంట్ కూడా చేశారు. తర్వాత కాలంలో ఇలాంటి గేట్లను మైసూరులోని కృష్ణ రాజ సాగర్ ఆనకట్ట, గ్వాలియర్‌లోని Tigree ఆనకట్టలలో కూడా అమర్చారు. భారత సైన్యం అధ్యక్షుడిగా ఉన్న Lord Kitchener వీటిని చూడడానికి ముచ్చటపడి బొంబాయి గవర్నర్ Lord Sydenhamను తోడు తీసుకుని ఈ ఆనకట్టను పరిశీలించి ఆయన మేధస్సుపై ప్రశంసలు కురిపించారు. తర్వాత Lord Sydenham అహమ్మదాబాదు నగర పౌర సన్మానంలో విశ్వేశ్వరయ్య గురించి ప్రస్తావిస్తూ రాష్ట్ర అభివృద్ధి బాగుంది కానీ మీకు ఒక సలహా ఇస్తున్నాను. మీరు ఎల్లప్పుడూ ఆయనను సంప్రదించి, ఆయన సేవలు తీసుకోండి అన్నారు. విశ్వేశ్వరయ్య సలహాతో నీటిపారుదల, త్రాగునీటి సరఫరా, మురుగు పారుదల పథకాలు కరాచీ, అహ్మదాబాద్, బీజాపూర్, ధార్వాడ్ పట్టణాల్లో అమలు చేశారు. కొల్హాపూర్లో నీటి కరువు వచ్చినప్పుడు ప్రజలు విశ్వేశ్వరయ్యను మా ఊరు పంపమని ప్రభుత్వాన్ని అభ్యర్థించారు. వారి సలహాతో అక్కడి నీటి ఎద్దడి తర్వాత కాలంలో సమసిపోయింది.

**ఎడెన్ ప్రభుత్వ ఆహ్వానం:**

మనకు మింటో మార్లే సంస్కరణలు ప్రవేశపెట్టిన బ్రిటిష్ ప్రభుత్వ సెక్రటరీ ఆఫ్ స్టేట్ లార్డ్మార్లే, విశ్వేశ్వరయ్య గొప్పదనం తెలుసుకొని ఆయనను ఎడెన్ నగర నీటి అవసరాలు తీర్చడానికి నియమించాలని బ్రిటిష్ ప్రభుత్వం తరపున బొంబాయి ప్రభుత్వాన్ని ఆదేశించారు. ఎడెన్ అరేబియా సముద్రానికి మెడిటరేనియన్ సముద్రానికి మధ్య ఉన్న సూయజ్ కాలువలో మొదటి ఓడరేవు. అక్కడి సముద్రపు నీటిలో ఉప్పును వేరు చేసుకుని (Desalination) త్రాగునీరుగా మార్చుకుని తాగుతున్నారు ప్రజలు. అది చాలా ఖర్చుతో కూడుకున్న ప్రయాస. విశ్వేశ్వరయ్య ఎడెన్కు 60 మైళ్ల దూరంలో ఉన్న కొండప్రాంతంలోని మంచి వర్షపాతం వృధాగా ఎడారిలో కలిసిపోవడం గుర్తించారు. అప్పుడు ఆయన కొండల నుండి పోతున్న వాగులో నీరు ఎడారిలో ఇంకిపోకుండా అక్కడ కొన్ని బోరుబావులు తవ్వించి నీటిని ఎత్తైన ప్రదేశానికి పంపించేసి నగరానికి తాగునీటి సరఫరా చేసేందుకు తన సిఫార్సు ఇచ్చారు. దీనితో పాటు నగరంలోని ప్రజల మరణ శాతం లండన్, బొంబాయి నగరాలతో పోలిస్తే చాలా ఎక్కువ. అది సరైన మురుగు పారుదల లేకపోవడంవలన అని గుర్తించి దానికి ఒక సమగ్ర ప్రణాళికను రూపకల్పన చేశారు. ఆయన సేవలకు Aden ప్రభుత్వం ఆయనకు కైసర్-ఐ-హింద్ బిరుదు ఇచ్చి సత్కరించారు.

1884లో అసిస్టెంట్ ఇంజనీరుగా చేరిన విశ్వేశ్వరయ్య 1907 నాటికి సూపరింటెండెంట్ ఇంజనీర్ అయ్యారు 23 ఏళ్ల తర్వాత. అక్కడ చీఫ్ ఇంజనీర్ పదవి బ్రిటిష్ వారికి మాత్రమే ఇచ్చేవారు. అది ఆయనకు కొంత కష్టం కలిగించింది. ఆయన బొంబాయి ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా ఇచ్చారు. ప్రభుత్వం మాట ఎలా ఉన్నా గవర్నర్ లార్డ్ సిడెన్హామ్ ఈ రాజీనామా విషయమై చాలా నొచ్చుకున్నారు. రాజీనామా తర్వాత ఆయన యూరోప్ పర్యటనకు వెళ్లడానికి నిశ్చయించుకున్నారు.

**హైదరాబాద్ నిజాం ఆహ్వానం:**

1908లో హైదరాబాద్‌లో కురిసిన కుండపోత వర్షాలకు మూసీ నది పొంగింది. నగర శివార్లలో ఉన్న చెరువుల కట్టలు తెంచుకున్నాయి, నగరం జలమయం

అయ్యింది. యూరోప్ పర్యటనలో ఇటలీలోని రోమ్ నగరంలో మ్యూజియం చూసి హోటల్కు తిరిగి వచ్చేటప్పటికి ఆయనను ఇండియా తిరిగి రావలసిందిగా లండన్‌లోని ఇండియా ఆఫీస్‌లోని సెక్రటరీ ఆయనను అభ్యర్థించారు. దీనికి కారణం హైదరాబాద్ నిజాం ఆయన సేవలను కోరడమే. విశ్వేశ్వరయ్య దానికి సమాధానంగా ఐదు నెలల తర్వాత మాత్రమే నేను ఈ కార్యక్రమం చేపట్టగలను. అది కూడా మీరు నిర్ణీతమైన కాలంలో దాన్ని పూర్తి చేస్తానంటే అన్నారు. దీనికి నిజాం సర్కార్ అంగీకరించింది. విశ్వేశ్వరయ్య తన యూరోప్ అమెరికా పర్యటనలు ముగించుకుని అనుకున్నట్లే హైదరాబాద్ పునర్నిర్మాణం చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. స్థల నిర్ణయం అయిన తర్వాత మూసీ నదిపై 2.9 TMCల కెపాసిటీ ఈసీ నదికి 3.9 TMCల కెపాసిటీతో రిజర్వాయర్‌లు నిర్మించి, ఆనకట్టలను కట్టడానికి ప్రణాళికలు ఇచ్చారు. ఇవే ఈనాడు కూడా ఉస్మాన్ సాగర్‌గా హిమాయత్ సాగర్‌గా ప్రజలకు ఉపయోగపడుతున్నాయి. హుస్సేన్ సాగర్‌కు ట్యాంక్‌బండ్ కట్టడానికి ప్రతిపాదించారు. అప్పట్లో ఉన్న మురుగు పారుదల వేస్ట్ వాటర్ డ్రైనేజీలను విడదీసి రెండు పెద్ద పైపులైన్ల ద్వారా చాదర్ఘాట్ బ్రిడ్జ్ క్రింది నుండి కాలువ ద్వారా నగరం నుండి బయటకు పంపే ఏర్పాటు చేశారు. 1909లో బ్రిటిష్ రెసిడెంట్ సికింద్రాబాద్‌లో కూడా మంచినీటి, మురుగునీటి, పారుదల పథకాలకు విశ్వేశ్వరయ్య సలహా తీసుకున్నారు. 1922లో నిజాం సర్కార్ మళ్లీ ఒకసారి హైదరాబాదు వచ్చి ఆయన పథకాల పనితీరును పరిశీలించమని ఆహ్వానించారు.

**మైసూర్ దివాన్:**

బొంబాయి ప్రభుత్వ ఆధ్వర్యంలో ఆయన చేసిన అద్భుతమైన ప్రయోగాలు వాటి వలన వచ్చిన అభివృద్ధి చూసి మైసూర్ మహారాజా ఆయనను 1909 నవంబర్ 15 నుండి చీఫ్ ఇంజనీర్‌గాను, మూడేళ్ల తర్వాత 1912లో నవంబర్ పదో తారీకు నుండి, ఆ ప్రభుత్వ దివాన్‌గా పదవీ బాధ్యతలు అప్పగించారు. విశ్వేశ్వరయ్య పదవీ బాధ్యతలు తీసుకున్న ప్రారంభంలో అభివృద్ధి నత్తనడకన ఉంది. అన్నిటికీ కొరత అప్పుడు. ఆయన మొట్టమొదటిసారిగా మైసూర్ ఎకనామిక్ కాన్ఫరెన్స్ ఏర్పాటు చేసి ప్రజలలో వ్యాపారం, పరిశ్రమ, అభివృద్ధి విషయాలపై చర్చించి ఉత్సాహవంతులైన కొత్త వ్యాపారవేత్తలను తయారు చేయడానికి కావలసిన వాతావరణం కల్పించారు. 1912లో తన డెవలప్‌మెంట్ ప్లాన్‌ను అసెంబ్లీలో వివరించారు. కొంతమంది ఉత్సాహవంతులైన వాణిజ్యవేత్తలు ముఖ్యంగా తెలుగు వారిని జపాన్ పంపారు, ప్రభుత్వ ఉద్యోగులతోపాటు అధ్యయన పర్యటన (study tour) కోసం చేనేత, చేతిపనుల అభివృద్ధికై కొత్త డిపార్ట్‌మెంట్‌ను మొదలుపెట్టారు. ప్రాథమిక మాధ్యమిక పాఠశాలలను, బాలికల పాఠశాలలను, ఎక్కువ చేశారు. నిర్బంధ ప్రాథమిక విద్యను ప్రవేశపెట్టారు. వయోజన విద్యకై రాత్రి పాఠశాలలు తెరిచారు. వృత్తి సాంకేతిక విద్యార్థులకు జయచామ రాజేంద్ర టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్ మైసూరులో ప్రారంభించారు. బెంగళూరులో మెకానికల్ ఇంజనీరింగ్ స్కూల్‌ను ప్రారంభించారు. 1917-18లో సంస్థానాధీశుల ఏలుబడిలో దేశంలోనే మొదటి విశ్వవిద్యాలయాన్ని స్థాపించారు. ఆయన దివాన్‌గా 6726 గ్రామాలలో వారానికి ఒక పూట స్వచ్ఛందంగా శ్రమదానం చేసి ప్రజలచేత గ్రామ అభ్యుదయానికి పూనుకున్నారు. ఈ అభివృద్ధికి తోడ్పాటుగా ఉండడానికి ఆయన దృష్టి రైల్వేలు, రవాణా సౌకర్యాలపై మళ్లింది. మైసూర్ స్టేట్‌రైల్వేస్ అనే ఒక ప్రత్యేక డిపార్ట్మెంట్ నెలకొల్పి రైల్వేలు నిడివి 401 మైళ్ళ నుండి 616 మైళ్ల వరకు పొడిగించారు. మౌళిక సాదుపాయాలు (Infrastructure) లేనిదే అభివృద్ధి లేదని ఆయన విద్యుత్ ఉత్పాదనపై దృష్టి సారించారు కృష్ణ రాజ సాగర్ డ్యామ్, జోగ్ జలపాతం వద్ద జలవిద్యుత్ కేంద్రాలు నెలకొల్పారు. 'Industrialize or Perish' అనే నినాదంతో పరిశ్రమల స్థాపనకు పూనుకున్నారు. ఈ స్ఫూర్తితో జపాన్ సాంకేతిక సహకారంతో పట్టు పరిశ్రమ అభివృద్ధి చేశారు. దీనితో వ్యవసాయదారులు, నేతపనివారు, ఎంతో ప్రయోజనం

పొందారు. మైసూర్ సిల్క్ పేరుతో ఇక్కడి పట్టు పరిశ్రమ ఇవాళ్టికీ ప్రపంచ ఖ్యాతి పొందింది. కర్ణాటక రాష్ట్రందేశంలోకెల్లా పట్టు ఉత్పాదనలో ఇప్పటికీ మొదటి స్థానంలో ఉంది. చందనపు చెట్లను అడవులులాగా పెంచి వాటి ద్వారా చందనపు నూనె, తద్వారా ఎన్నో ఉత్పత్తులు (products) తయారు చేయడం చందన చేతి పనుల పరిశ్రమ అభివృద్ధి చేయడంవలన ఇవాళ్టికీ ఆ ప్రాంతం ఎంతో విలువైన విదేశీ మారకం సంపాదిస్తోంది. చందనపు నూనెతో సబ్బులు తయారు చేసే "మైసూర్ శాండల్" ఫ్యాక్టరీని 1916లో స్థాపించారు ఇప్పటికీ ఇది ఎంతో జనాదరణ పొందిన సబ్బు.

1918లో భద్రావతి ఐరన్ అండ్ స్టీల్ వర్క్స్ స్థాపించి దేశంలోనే మొదటి చార్కోల్‌తో తయారు చేసే పిగ్ ఐరన్ ఉత్పాదన చేశారు. ఆ ప్రాంతంలో దొరికే ఇనుప ఖనిజాన్ని వృథా పోకుండా ఉపయోగించడానికి ఈ ప్రయత్నం. తరువాత ఇక్కడ ఫర్నేస్ దేశంలో మొట్టమొదటి ఎలక్ట్రిక్ స్మెల్టింగ్ (Electric Smelting) ఫర్నేస్‌గా మార్పు చేశారు. ఈ కర్మాగారపు పనితీరులో కొన్ని ఒడిదుడుకులు వచ్చినప్పుడు మహారాజా ఆయనకు 1923లో మళ్లీ కర్మాగారం బాధ్యతలు అప్పగించారు. స్వీడన్ దేశపు సాంకేతిక సహకారంతో ఆయన దానిని లాభాల బాటలో పెట్టారు. అక్కడ తయారుచేసే 5000 టన్నుల ఉక్కును అమెరికాకు ఎగుమతి చేసేందుకు 1926లో ఒప్పందం చేశారు. హైదరాబాద్, మైసూర్, జైపూర్, సంస్థానాల దివాన్‌గా పనిచేసిన సర్ మీర్జా ఇస్మాయిల్, విశ్వేశ్వరయ్యగారు తన జీవితాన్ని ఈ కర్మాగారం కోసం ధారపోశారు అన్నారు. భద్రావతి కర్మాగారం పేరు విశ్వేశ్వరయ్య ఐరన్ అండ్ స్టీల్ లిమిటెడ్‌గా పేరు మార్చడం ఆయనకు నిజమైన నివాళి.

ఒకరోజు ఆయన జోగ్ జలపాతం వద్ద నీటిని చూసి ఆహా ఎంత నీరు ఎంత బాగుంది ఈ ప్రదేశం అన్నారట. అందరూ అది చూసి ఆయన అక్కడి ప్రకృతి అందాలను గురించి మాట్లాడుతున్నారు అనుకున్నారట. కానీ ఆయన మనస్సులో ఈ జలపాతాన్ని ఉపయోగించి జల విద్యుత్ ఉత్పాదన చేయడానికి ఎంత అనుకూలంగా ఉంటుంది అని. ఆయన తన ఆలోచనలను అమలు పరచి 1035 మెగావాట్ల విద్యుత్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

Kannambadi వద్ద టిప్పు సుల్తాన్ కడదాం అనుకున్న ఆనకట్టను మహారాజాను ప్రోత్సహించి, మద్రాసు ప్రభుత్వంతో న్యాయ పోరాటం చేసి 1911లో ఆనకట్ట నిర్మాణం మొదలు పెట్టి దాని వలన mandia మైసూరు జిల్లాల ప్రజలను వరద ముంపు లేదంటే, కరువు నుండి రక్షించి ఆ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేశారు. ఇది 124 అడుగుల ఎత్తుతో సిమెంట్ లేని కాలములో సుర్కీతో, రాతితో కట్టిన ఆనకట్ట ఇప్పటికీ ఇది చెక్కుచెదరలేదంటే అది ఆయన ప్రతిభకు ఒక మైలురాయి. అదే కృష్ణ రాజ సాగర్ డ్యామ్. ఆయన జ్ఞాపకార్థం అక్కడి నుండి నీటిని విడుదల చేసే కాలువకు ఆయన పేరు పెట్టారు. ఎన్నో చెక్ డ్యాములు కట్టి నీటిని నిల్వ చేసి వృథా కాకుండా ఆ ప్రాంతపు అభివృద్ధికి కృషిచేశారు. Halikere నుండి మధ్య ఏషియాలోనే అది అతి పెద్ద సొరంగం ద్వారా సాగునీటిని సరఫరా చేయటం hegge దేవరకోటె దగ్గర నూగు డ్యామ్ నిర్మాణం, melinajuganahalli వద్ద దొడ్డ బల్లాపూర్ ప్రాంతంలో కట్టిన డామ్ ఆయన మైసూరు రాష్ట్ర నీటిపారుదల వ్యవస్థకి చేసిన సేవలో కొన్ని ఉదాహరణలు.

ఉప్పొంగి ఉరుకుతున్న గంగను తన సిగలో చుట్టి విశ్వానికి సేవ చేసిన పరమ శివుడు విశ్వేశ్వరుడు అయితే, ప్రతీ నీటి బొట్టును వృథా పోనీకుండా ఆనకట్టలు కట్టి ప్రజాశ్రేయస్సుకు ఉపయోగించిన మోక్షగుండం కూడా తన పేరును సార్థకం చేసుకున్నారు. ఈయనను ఆ ప్రాంత ప్రజలు దేవునికి సమానంగా కొలుస్తున్నారు. ఒక పెద్దాయన రాజమండ్రిలో నాతో, "మేము సహస్ర నామము చదివేటప్పుడు సర్ ఆర్థర్ కాటన్ని కొలుస్తూ 'కాటనాయనమః' అంటా"మని చెప్పారు. ఇంత మహనీయులను దైవసమానంగా తలచుకోవటం భారతీయ సంస్కృతికే ఒక గీటురాయి.

ఆ ప్రాంతపు ఆర్థిక వనరులను ఒక దారిలో తీసుకురావడానికి 1913లో బ్యాంక్ ఆఫ్ మైసూర్


స్థాపించారు. తరువాత అది స్టేట్ బ్యాంక్ ఆఫ్ మైసూర్ అయింది. ఈ దేశంలోనే సంస్థానాధీశులచే స్థాపింపబడిన 6 బ్యాంకులలో ఇది ఒకటి. ఇటీవలే ఇది స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో విలీనమైంది. ఈ రీతిగా మైసూరు రాష్ట్రం నీటి వనరులలోను జల విద్యుదుత్పత్తిలోనూ, రైలు రోడ్డు మార్గాల నిర్మాణంలోనూ వ్యవసాయ రంగంలోనూ వ్యవసాయ సంబంధిత పరిశ్రమలలో, భారీ పరిశ్రమలలోను, బ్యాంకింగ్ వ్యవస్థలోను అన్నింటికంటే ముఖ్యంగా గ్రామ అభ్యుదయం, చేతిపనుల పరిశ్రమ అభివృద్ధిలో, సాధించిన విజయాలు చూసి గాంధీజీ ఇది రామ రాజ్యం అన్నారు. పంచవర్ష ప్రణాళికలు మన దేశంలో ప్రవేశపెట్టక ముందే 1934లో ఆయన *Planned Economy of India*, 1937లో *National Building a five year plan for the provinces, 1943 Prosperity through Industry* అనే పుస్తకాలు వెలువరించారు. 1923లో *Indian Science Congress*, 1924లో *Economic Conference*, 1929 నుండి 1938 వరకు *Indian Institute of Sciences* అధ్యక్షులుగా వ్యవహరించారు.

వ్యక్తిత్వం:

ఎన్ని విజయాలు తన ఘనతను సూచించినా విశ్వేశ్వరయ్య నియమ నిబంధనలకే కట్టుబడిన మనిషి. మహారాజా పక్కన ఉన్న మద్రాస్ రాష్ట్రం కుల ప్రాతిపదికపై ఇస్తున్న ఉద్యోగాల పద్ధతిని మైసూరు రాష్ట్రంలో కూడా అమలు చేయడానికి సంకల్పించారు. అర్హత ఉన్న వారికి ఉద్యోగాలు ఇవ్వాలిగాని కుల ప్రాతిపదికపై కాదు అని మహారాజా నిర్ణయాన్ని వ్యతిరేకించి తన పదవికి రాజీనామా ఇచ్చారు. దివాన్ పదవి స్వీకరించే ముందు తన తల్లికి, బంధువులకు, ఉద్యోగాలుగాని, పనులు చేయమనిగాని సిఫారసు చేయవద్దని విజ్ఞప్తి చేశారు. చీఫ్ఇంజినీర్‌గా మొదటి దసరా ఉత్సవాలలో పాల్గొన్నప్పుడు తెల్లవారికి కుర్చీలు భారతీయులకు నేలపైన కూర్చోవడానికి చేసిన ఏర్పాట్లను ఇష్టపడక ఆయన తరువాత సంవత్సరం దసరా ఆహ్వానాన్ని తిరస్కరించారు. దానికి కారణం తెలిసిన మహారాజా వెంటనే ఆ ఏర్పాట్లను మార్పు చేసి అందరికీ కుర్చీలు ఏర్పాటు చేశారు. తాను ప్రభుత్వ పనులపై బయటకు క్యాంపుకి వెళ్ళినప్పుడు తన చదువుకు ఉపయోగించే కొవ్వొత్తులను తానే కొనుక్కుని వాడుకునేవారు ప్రభుత్వ ఖర్చుతో కాదు. తన పదవికి రాజీనామా చేసినప్పుడు ఇంటికి వెళ్లడానికి తన సొంత కారులో వెళ్లారుగాని ప్రభుత్వ వాహనంలో కాదు. సమయ పాలనలో ఆయనకు ఆయనే సాటి. నెహ్రూగారు ఆయన శతజయంతి సందర్భంగా సభకంటే ముందుగా ఆయనను ఇంటివద్ద కలుస్తానని కబురు పంపించారు. కానీ విశ్వేశ్వరయ్య నేను వారికి సమయం సభ వద్దనే కేటాయించాను. అంతకంటే ముందు కలుసుకోలేను అన్నారు. ఒక ప్రధాని సమయం అడిగితే కూడా ఆయన అంత నిక్కచ్చిగా మాట్లాడడం నెహ్రూగారు దానికి కోపంతెచ్చుకోకపోవడం ఆ కాలపు మనుషుల విలువలకు నిదర్శనం. తన ఆఫీసు వద్ద గుర్రంపై కూర్చుని ఎవరు సమయానికి తమ విధులకు రారో వారిని ఆ రోజుకు ఇంటికి పంపించేవారు. ఆయన ఎప్పుడు ఆకస్మిక తనిఖీ చేస్తారో అని ప్రతివారు భయంతో విధి నిర్వహణ సక్రమంగా చేసేవారు. ఒడ్డు, పొడుగు, సమంగా, మంచి ముఖవర్చస్సుతో కోటేరులాంటి ముక్కుతో, ఉన్న విశ్వేశ్వరయ్య 1860 సెప్టెంబర్ 15న చిక్కబల్లాపూర్ ప్రాంతంలో ముద్దెనహళ్లి గ్రామంలో జన్మించి శతాధిక వృద్ధుడుగా తన 102 నూట రెండవ ఏట 1962 ఏప్రిల్ 12న మరణించారు.

ఆయన జన్మదినాన్ని 'ఇంజనీర్స్ డే'గా జరుపుకుంటున్నాము. కైసర్ ఐ హింద్ బిరుదుతో ఎడెన్ ప్రభుత్వం వారు సత్కరించితే, బ్రిటిష్ ప్రభుత్వం సర్ బిరుదు ఇచ్చింది. భారత ప్రభుత్వం భారతరత్న పురస్కారం ఇచ్చింది. ప్రభుత్వ పురస్కారాలకంటే ఆయన స్థాపించిన సంస్థలు ఆయన కట్టిన కట్టడాలు చిరస్థాయిగా ఆయన గుర్తుగా ఉంటూ ముందు తరాల వారికి ఉత్తేజాన్ని కలిగిస్తాయి.

మోటూరు శివరాంప్రసాద్, C.A.,
హైదరాబాద్. ఫోన్: 986 633 8088.


అనంత శాస్త్రి

# అనంత శాస్త్రిగారు

*– కన్నడ మూలం: డి.వి. గుండప్ప*

*– తెలుగు: ఘట్టమరాజు అశ్వత్థ నారాయణ*

అనంతశాస్త్రి గారు బెంగుళూరులోని అత్యంత ప్రసిద్ధ సంగీత విద్వాంసుల్లో ఒకరు. ఆయనది కంచు కంఠం. నేను ఆయన కచ్చేరిని మొట్టమొదటిసారిగా 1904లో విన్నాను. అప్పట్లో ఆయన పైలాపచ్చీసులో ఉన్నారు. ఆనాటి కచ్చేరీలో చాలామంది పాత కాలం నాటి సంగీత కోవిదులు సమావేశమై ఉన్నారు. శాస్త్రిగారు టిప్‌టాప్‌గా వచ్చారు. తలమీద ఫెల్ట్ హ్యాట్. జరీ కండువా, మంచి కోటు, జలతారు అంచుగల పంచె. పెళ్ళినాటి కచ్చేరీ అది. అనంతశాస్త్రిగారు 'వాతాపి గణపతింభజే' కీర్తనతో కచ్చేరీ ప్రారంభించారు. ప్రారంభమే పకడ్బందీగా ఉండింది. రాగాలాపన, కీర్తన, స్వరసంయోజన అన్నీ చక్కగా కుదిరాయి. అది శాస్త్రిగారి తొట్టతొలి కచ్చేరీగా తోచింది. సభికులందరూ ఆయన కచ్చేరీని మనసారా పొగిడారు. ఆనాటి గానం సంగీత ప్రపంచంలో సరికొత్త, విశిష్టమైన ఘటన అని స్తుతించారు.

అనంత శాస్త్రిగారు పుట్టింది బెంగుళూరులో. ఆయన ములకనాడు బ్రాహ్మణుడు. ఇక తెలుగువారని వేరే చెప్పనవసరం లేదు. ఆయన పూర్వీకుల ఇల్లు బళేపేట నరసింహస్వామి గుడి దగ్గర ఎక్కడో ఉండేది. వారి అన్నగారైన అన్నదాన శాస్త్రి గారు కూడా సంగీత విద్వాంసులే. ఆయన ఏదో పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తూ ఉండేవారు. అనంతశాస్త్రులవారి గురువు గారు సేలం నరసయ్యగారు. ఆయన ఆ కాలం నాటి మేటి సంగీత విద్వాంసుల్లో ఒకరు. అనంత శాస్త్రి గారు కొంత కాలం పాటు పల్లవి శేషయ్య గారి వద్ద కూడా సంగీతం నేర్చుకొన్నారు. నేను ఒక రోజు బౌరింగ్‌పేట నుంచి బెంగుళూరుకు రైల్లో బయలుదేరాను. సుమారు మూడు గంటల ప్రయాణం. ఆ దినం నేను కూర్చున్న భోగీలో మరొక మనిషి మాత్రమే ఉన్నారు. అయితే అతనెవరో నాకు తెలిసింది కాదు. ఆయన రైల్లో కూర్చున్నంతసేపు చేతి వేళ్ళతో తాళం వేస్తూనే ఉన్నారు. అది చూసి నేను ఆశ్చర్యపోయాను. రైలు కట్టకటకటకటకట... ఇలా సద్దు చేస్తున్నంతసేపు ఆయన ఆ శబ్దానికి అనుగుణంగా తాళం వేస్తుండిపోయారు. బెంగుళూరు కంటోన్‌మెంట్ స్టేషన్ రాగానే ఆ పెద్దమనిషి కిందికి దిగారు. అప్పుడు ఆయన్ను చూడటానికి వచ్చిన ఐదారుమంది చేతుల్లో పూలదండలు, నిమ్మపండ్లు. వాళ్లందరూ ఆయన కాళ్లు ముట్టి నమస్కరించారు. వాళ్లలో నాకు పరిచితమైన ఒకరిని 'ఆయన ఎవరు?' అని అడిగాను. అప్పుడు అతను "ఈయన ఎవరో నీకు తెలియదా, అరే! ఈయనే పల్లవి శేషయ్యగారు" అని చెప్పారు. నేను ఆయన కీర్తిప్రతిష్ఠల గురించి విన్నానే కాని, ఆ వారి సంగీతం వినే అవకాశానికి నోచుకోలేకపోయాను.

అనంతశాస్త్రిగారికి 'స్వరసింహ కుట్టి' అనే పేరుండేది. ఆయన తాళగతికి స్వరసంయోజనకూ ఎక్కువగా అనుకూలించే కృతులనే ఎన్నుకొనేవారు. ఆయనకు చాలా ఇష్టమైన కృతుల్లో ఒకటి-

*ఎదుట నిలిచితే నీది సొమ్మలేవి పోవురా*
*తరాన దొరకని పరాకు నా యెడను రామజేసితీ*
*సురాసురలు మెత్తురా ఇపుడు యీ*
*హరామితన మేలరా భక్తత్యాగరాజ నుత*

ఈ కీర్తనలోని ప్రాసాక్షర మైత్రి, బిగువు, లయవిన్యాసం, శంకరాభరణ రాగ వైభవం - ఇవన్నీ

అనంతశాస్త్రి గారికి ఎంతో ఇష్టమైనవి. ఆయన తాళం వేస్తున్నప్పుడు, ఆ తాళం పెట్టు (దెబ్బ) ఈ కాలంనాటి యువకుల తొడ మీద కనుక పడి ఉంటే వాళ్ల చర్మం చీలిపోయి ఉండేదనుకుంటాను. పాట పాడుతున్నపుడు శాస్త్రిగారి ముఖం ఎలా వెలిగిపోతుంటుందో చూస్తే ఆయన ఆనందోత్సాహాల్ని మనం ఊహించుకోవచ్చు.

శాస్త్రిగారు ఎంతో ఉత్సాహంతో పాడే కీర్తన దేవగాంధారీ రాగంలోని 'క్షీరసాగరశయన.' అనంతశాస్త్రిగారి గానంలో ఆయన ఘనవిద్వత్తు ప్రకటితమవుతుండటంవల్ల ఆయనకు 'స్వరకుట్టి' అనే పేరు వచ్చిందని అంటారు. ఆయనకు ఆ బిరుదును శృంగేరీ జగద్గురువు ప్రసాదించారని కొందరంటారు. కాదుకాదు, ఎవరో తమిళ గానకళా కోవిదులిచ్చిన బిరుదని మరికొందరి అభిప్రాయం. అనంతశాస్త్రిగారు భార్య మరణించిన తర్వాత చిక్కపేటలోని ఉడుపి హోటలు మేడ మీది ఓ గదిలో నివసిస్తుండేవారు. కొంత కాలం గడిచిన తర్వాత బసవన గుడి ప్రాంతంలోని ఉత్తరాది మఠంలోని భవనాల్లోని ఓ మేడ మీది గదిలో సంగీత పాఠశాల నడిపేవారు. ఆ కాలంలోనే ఓ రోజు తమకు పాఠాలు నేర్పిన గురువుగారైన కె.ఎ. కృష్ణస్వామి అయ్యర్‌గారి బసవన గుడి నివాసానికి వెళ్ళారు. ఆ సాయం కాలం అయ్యర్‌గారింట్లో నాతోపాటు మరో ఇద్దరు ముగ్గురం ఉన్నాము. కృష్ణస్వామి అయ్యర్ తెలుగులో "ఒరేయ్! అనంతూ! నీ పాట విని ఎంత కాలం అయ్యిందయ్యా! నీ పాట నేను వినేది ఎప్పుడయ్యా?" అన్నారు. అప్పుడు అనంతశాస్త్రిగారు "అయ్యా, నేను మీ శిష్యుణ్ణి. మీరు ఎప్పుడు వింటామంటే అప్పుడే" అన్నారు తలొంచి వినయంగా. ఆ మాట విన్న కృష్ణస్వామి అయ్యర్ "ఈ రోజే కావొచ్చునా?" అన్నారు. శాస్త్రిగారు ఏమీ ఆలోచించకుండానే "ఇప్పుడే కావొచ్చు గురువుగారూ" అన్నారు. ఈ మాటలు వంటింట్లో నుంచి వింటున్న అయ్యర్‌గారి భార్య హాల్లోకి వచ్చి "వంట సిద్ధంగా ఉంది. మీరందరూ భోజనం చేసిన తర్వాత సంగీత కార్యక్రమం జరపవచ్చుకదా?" అన్నారు చిరునవ్వు చిందిస్తూ. అక్కడున్నవాళ్లంతా కాళ్ళూ చేతులూ కడుక్కొని భోజనం ముగించి హాల్లోకి వచ్చి కూర్చొన్నారు.

కృష్ణస్వామి అయ్యర్‌గారు బెంగుళూరు సెంట్రల్ కాలేజీలో ఆంగ్లోపన్యాసకులుగా ఉండేవారు. తర్వాత ఉన్నత పాఠశాలలో ప్రధానధ్యాపకులుగా పని చేశారు. ఆయన సంగీత ప్రియులు. ఫిడేలు వాయించేవారు. అనంతశాస్త్రులవారి గాత్రానికి ఫిడేలు వాయించి సహకారమందించారు కూడా రాత్రి ఎనిమిదిన్నర గంటల సమయంలో. అనంతశాస్త్రిగారు "ఏ రాగంలో పాడమంటారు" అని అయ్యర్‌గారిని అడిగారు. "కేదారగౌళలో ఓ కీర్తన పాడండి" అని అయ్యర్‌గారు బదులిచ్చారు. శాస్త్రిగారు కేదారగౌళ రాగంలో ఓ కీర్తన అందుకొన్నారు. ఆ కీర్తన పాడే నెపంతో అనంతశాస్త్రిగారు స్వరవిన్యాసంలో ప్రదర్శించిన విద్వత్తు, కౌశలం - రాత్రి పదకొండున్నర కాలం అయిందే అనిపించలేదెవరికీ. అప్పుడు కృష్ణస్వామి అయ్యర్ "ఈ దినం సుదినం. నిజమైన సంగీతం విన్నాం. మా అందరికీ మృష్టాన్న భోజనం ఆరగించినంత ఆనందం కలిగింది" అని అపార సంతోషాన్ని ప్రకటించారు. అనంతశాస్త్రిగారు వినోదప్రియులు. స్వభావతః ఆయన కోపిష్టి. పైగా మాట పెళుసు కూడా. అందువల్ల ఆయన మాటలు చాలా తమాషాగా, నవ్వు పుట్టిస్తుంటాయి. ఆయన మీసాల పులి. "మీ మీసాలు కడగాలంటే రెండు బిందెల నీళ్ళు ఖర్చవుతుంటాయి" అని మేము లేవిడీ చేసేవాళ్లం.

ఓ సాయం కాలం సుమారు నాలుగున్నర - ఐదు గంటలు. నేను ఆయన సంగీత పాఠశాలకు వెళ్ళాను. అప్పుడక్కడ ఓ ప్రఖ్యాత వయొలిన్ విద్వాంసులున్నారు. ఆయనకూ, శాస్త్రిగారికి తాళాల లెక్కింపులో వివాదం వచ్చింది. వాళ్లిద్దరూ వాదులాడుతుండగా, అక్కడికి మరొక మిత్రులొచ్చారు. ఆయన అనంతశాస్త్రుల శిష్యులు. ఆయన సెంట్రల్ కాలేజీలో ఫిజిక్సు లెక్చరర్. ఆయన గణితంలోనూ దిట్ట. మాటవరసకు ఆయన్ను 'రావుగారూ' అని పిలుద్దాం. రావుగారు గడప దాటి ఇంట్లోకి రాగానే "18 1/2 ను 7 1/2తో భాగిస్తే ఓ ఆవర్తానికి ఎంత వస్తుంది?" (ఈ సంఖ్య వేరేదేదో

అనుకోండి) అని అతన్ని శాస్త్రిగారు అడిగారు. గణిత శాస్త్ర పండితులైన ఆయన వెంటనే బదులిచ్చారు- “రావుగారూ, మీరు అలాగే నిలుచొండి. కానీ కాళ్ళు కాస్త ఎడం చేయండి” అన్నారు. అప్పుడు శాస్త్రిగారు ఫిడేలు విద్వాంసులతో ఇలా అన్నారు- “నీవు పైకి లేచి రావుగారి కాళ్ల క్రింద మూడుసార్లు దూరు. అప్పుడు కాని నీకు బుద్ధి రాదు.” అనంతశాస్త్రిగారి వినోదం ఇలా ఉండేది.

శాస్త్రిగారు సజ్జన శిరోమణి. ఆయన మనస్సు వెన్నలాంటిది. ఆయన స్నేహశీలి. ప్రసిద్ధ సంగీత విద్వాంసులైన దక్షిణామూర్తి శాస్త్రిగారి ఇంట్లో పెళ్లి సందడి. ఆ కాలంలో పెళ్లంటే ఐదు రోజుల పండుగ. పెళ్లి రెండవ రోజు మధ్యాహ్నం - మూడు - నాలుగు గంటలప్పుడు అనంతశాస్త్రిగారు పెళ్లి మంటపంలోకి వచ్చారు. అక్కడ ఉన్న దక్షిణామూర్తి అనంత శాస్త్రిగారితో - “ఈ రోజు సాయంకాలం కచేరీ ఎవరిదీ” అని అడిగారు. “నేను ఆ విషయం ఆలోచించలేదప్పా! విద్వాంసులకు సంభావన ఇచ్చేంతటి స్థోమత నాకు లేదు. ఉచితంగా కచేరీ చేయించుకోవడానికి నా మనస్సు అంగీకరించదు. అందుకే ఊరుకున్నాను” అని అన్నారు. వెంటనే అనంత శాస్త్రి గారు దక్షిణామూర్తులవారి రెండు కాళ్ళూ పట్టుకొని, “నేను బ్రతికి ఉన్నంతవరకు మీరు ఇలాంటి మాటలు మాట్లాడకూడదు. మీ ఇంటి పెళ్లి పందిట్లో కచేరీ చేయడమంటే మహాభాగ్యం. ఈ సాయంకాలం నా కచేరీ ఉంటుంది. మిగతా ఏర్పాట్లన్నీ నాకు వదిలివేయండి. అని వినయంగా అన్నారు. అనంత శాస్త్రి గారు తమ స్నేహితులైన ఫిడేలు, మృదంగ విద్వాంసుల్ని పిలిపించి, ఆ పెళ్లి పందిట్లో ఘనమైన కచేరీ జరిపించారు. అనంత శాస్త్రులవారి మనస్సు అంత దొడ్డది.

**ఘట్టమరాజు అశ్వత్థ నారాయణ**
**బెంగుళూరు. ఫోన్: 996 408 2076.**

---

## త్రిపథ

*- తల్లావజ్ఝల శివాజీ*


*అయోధ్య నగరం 12 యోజనాల పొడవు, 3 యోజనాల వెడల్పుగలది. రాచ మార్గాలలో నిత్యం నీళ్ళు జల్లడం, పూలు జల్లడం చేసేవారు. నగరంలో అనేకచోట్ల దారు యంత్రాలు, శతఘ్నులు ఉండేవి. నలువైపలా శాఖా నగరాలుండేవి. ఎన్నో నటీనట సంఘాలు, నగరంలో నిత్యమూ కార్యక్రమాలు జరిపేవి. విదేశీ వర్తకులు నగరాన్ని చేరుతుంటారు. నగరంలో జూదం ఆడే పీఠం ఆకారంలో ఉండేది. ఇక్కడ వరి బియ్యం ఎక్కువగా లభిస్తుండేవి. జనాభా వేల సంఖ్యలో ఉండేది. వాల్మీకి అశ్వమేధం బదులు హయమేధం అని వాడారు. అశ్వమేధానికి ముఖ్యమైనవారిలో సత్కాలక్షేపం కోసం చిత్రలేఖకులను, నర్తకులను, నటులను పిలిపించారు. గ్రామాల నుంచి యజ్ఞ సందర్శనానికి ప్రజలను పిలిపించి, అన్ని వృత్తుల వారినీ బాగా సత్కరించాలని దశరథుడు ఆజ్ఞాపించాడు.*

*యజ్ఞంలోని యూప స్తంభాలకు మారేడు, చంద్ర, మోదుగ, దేవదారు కర్రలు వాడారు. ఆ స్తంభాలు 21 మూరల ఎత్తుగలవి. ఒక్కోదానికి విడిగా వస్త్రాలు చుట్టారు. స్తంభానికి 8 అంచులుండేట్లు చెక్కారు. ఋత్విక్కులు శాస్త్రానుసారం యూపాలకు కొన్ని జలచరాలతో బలి కోసం అశ్వంతో పాటు మొత్తం 300 పశువులను కట్టారు. వీటిలో గ్రామ్య మృగాలను చంపుతారు. అడవి జంతువులను మాత్రం అగ్నిప్రదక్షిణం చేయించి, వదిలివేస్తారు.*

*కౌశల్య గుఱ్ఱానికి ప్రదక్షిణ చేసి, మూడు కత్తులతో చంపినది. ఇక్కడ కృపాణం అంటే సూది అని కూడా అర్థం ఉంది. చంపిన అశ్వాన్ని సుమిత్ర, కైకేయులు కూడా బంగారు సూదులతో గుచ్చారు. ఒక రాత్రి కౌశల్య స్థిరచిత్తంతో శాస్త్రోక్తంగా అశ్వసమీపంలో సమయం గడిపింది.*

*రుత్విక్కు 'అశ్వం యొక్క వపను తీసి యథాశాస్త్రం పక్వం చేసెను.' దశరథుడు వపాధూమ గంధం వాసన చూశాడు. 16 మంది రుత్విక్కులు 'గుఱ్ఱం యొక్క వివిధాంగములు సమంత్రంగా అగ్నిలో హోమం చేశారు.'*

*(ఇప్పుడు కూడా అశ్వమేధ యాగం చేస్తున్న మహానుభావులు ఈ పై విషయాలు గమనించండి..)*


మొదలి నాగభూషణ శర్మ

ఆధునిక తెలుగు నాటక వైతాళికుడు -

# మొదలి నాగభూషణ శర్మ

*- రావినూతల సత్యనారాయణ*

కొందరు మహనీయుల జీవితాలను లోతుగా పరిశీలిస్తే, వారి జీవితానికి ఒక పరమార్థం ఉందని పిస్తుంది. అంతేకాదు, వారి జీవితం సమస్తం, ఆ పరమార్థం చుట్టూ పరిభ్రమిస్తూ ఉంటుందేమో ననిపిస్తుంది! అటువంటి ప్రముఖులలో ఒకరు ఆచార్య మొదలి నాగభూషణ శర్మ గారు. ఆయన బాల్యంలోని మొదటి యేడేండ్లు మినహాయిస్తే, జీవిత సమస్తం, కళామతల్లి సేవకే అంకితం చేశారు. నటన, రచన, ప్రదర్శన, పరిశోధన, ప్రచురణ, అధ్యయనం, అధ్యాపకత్వం, దర్శకత్వం, మార్గదర్శనం. ఇలా కళారంగంలో బహుముఖీనంగా విస్తరించిన ప్రజ్ఞ ఆయనది. ఒక్క మాటలో చెప్పాలంటే బహుముఖ ప్రజ్ఞావంతుడాయన. తెలుగు నాటకరంగ చరిత్రను ముందు తరాల కోసం అక్షరీకరించిన మహానుభావుడు. తెలుగు నాటక రంగస్థల కళలో తొలి ఆచార్యుడిగా పలువురు కళాకారులను తెలుగు నాటక రంగానికి ప్రసాదించిన ద్రోణాచార్యుడాయన!

**నాగభూషణ శర్మగారి జీవిత విశేషాలు:**

ఆచార్య మొదలి నాగభూషణ శర్మ గారి పెద్దలది గుంటూరు జిల్లాలో పేరు మోసిన బ్రాహ్మణకోడూరు. శర్మగారి తాతగారు ఆ ఊరికి కరణం. ఆయన గొప్ప సంస్కృత పండితుడు. అయినా లౌక్యం నేర్చుకొని, ఆ ఊరి కరిణీకం చేశారు. ఆ ఊర్లో సంస్కృత పాఠశాల స్థాపించి, ఆ గ్రామానికి సేవ చేశారని చెప్పుకుంటారు. ఆచార్య శర్మగారిది మాత్రం, రేపల్లె తాలుకాలోని దూళిపూడి. ఆ ఊర్లో నాగభూషణ శర్మ గారు 1935 జూలై 24వ తేదిన జన్మించారు. ఆయన తల్లి దండ్రులు కామేశ్వరమ్మ, సుబ్రహ్మణ్య శర్మ గారలు. శ్రీ సుబ్రహ్మణ్య శర్మగారు B.A., B.Ed. పాసయి, ఆ ఊర్లో ఉన్న తటవర్తి బాపయ్యా మిడిల్ స్కూలుకు వారి ఆహ్వానం మేరకు హెడ్మాస్టరుగా వచ్చారు. ఆ స్కూలును సర్వాంగ సుందరంగా తీర్చి దిద్ది, 50 మంది విద్యార్థులున్న మిడిల్ స్కూలును 600 మంది విద్యార్థులతో ఉన్న హైస్కూలుగా రూపొందించారు! మొదలి సుబ్రహ్మణ్య శర్మగారు ఒక సృజనాత్మక రచయిత. కథలు, కవితలు, నాటికలు, వ్రాసేవారు. అంతేకాదు, మంచి నటులు కూడా! ఆ రోజుల్లో ప్రతి యేటా జనవరి నెలలో శర్మగారి అధ్యక్షతన ఆంధ్రోత్సవాలు జరిగేవట! ఆ ఉత్సవాలలో పెద్దల ప్రసంగాలు, స్కూలు పిల్లల నాటికలు, లలిత సంగీతం మొదలైన కార్యక్రమాలు జరిగేవని తెలియుచున్నది. ఆ కార్యక్రమానికి కావలసిన సరంజామ అంటే నాటికలు వగైరా శ్రీ సుబ్రహ్మణ్య శర్మగారే తయారు చేయుటయేగాక వాటి ప్రదర్శన మొదలైన విషయాలు శర్మగారే నిర్వహించే వారని ప్రసిద్ధి. నాగభూషణ శర్మగారి పై చిన్ననాటి నుండే తండ్రిగారి ప్రభావం హెచ్చుగా ఉండేదని నాగభూషణ శర్మగారే స్వయంగా చెప్పుకొన్నారు. నాగభూషణ శర్మగారు 8వ తరగతి చదువుతున్న పిన్న వయసులోనే, నాటక రచనానుభవమునేగాక, నటనానుభూతిని సహితం అవగతం చేసుకున్నారు.

శరత్ నవలిక వేలూరి శివరామశాస్త్రి అనువాదం చేసిన రాముని బుద్ధిమంత తనం అనే దానిని

సంభాషణలు వగైరా వ్రాసి, నాటకీయంగా మార్చడం నాగభూషణ శర్మగారి నాటక ప్రవేశంగా మనం భావించవచ్చు. "పూవు పుట్టగానే పరిమళిస్తుంది" అని కదా నానుడి! అందు కనుగుణ్యంగా ఉంది నాగభూషణ శర్మగారి బాల్య ప్రయత్నం! అంతేకాదు, శ్రీయుతులు సుబ్రహ్మణ్య శర్మగారు, నాగభూషణ శర్మగారిలో ఉత్తమ లక్షణాలను చొప్పించుటలో అతి శ్రద్ధ వహించేవారని తెలుస్తున్నది. శ్రీ సుబ్రహ్మణ్య శర్మగారికి ప్రాచీన గ్రంథ పఠన ప్రావీణ్యత పరిపుష్టంగా ఉండేది. ఆ కారణాన నాగభూషణ శర్మగారిని ఒక ప్రక్క స్కూలులో చదివిస్తూనే, ఇంటి వద్ద భారత, భాగవత పద్యాలను చదివిస్తూ అర్థం తెలియని పద్యాలకు వివరంగా అర్థం చెబుతూ ఆ చిన్న వయసులోనే నాగభూషణ శర్మగారిలో తెలుగు సాహిత్యాభిమానాన్ని పెంపొందించారు. నాగభూషణ శర్మగారు హైస్కూల్లో తన పదవ తరగతి పూర్తి కాకముందే పుస్తకాలపై ఉన్న మక్కువతో ఎన్నో పుస్తకాలను చదివారు. స్కూల్లో చదువుతున్న కాలంలోనే "రాముని బుద్ధిమంత తనం అనే నాటికలో రామునిపాత్ర ధరించటం జరిగింది.

నాగభూషణ శర్మగారు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఎస్.ఆర్.ఆర్. అండ్ సి.వి.ఆర్. కాలేజిలో చదివారు. అక్కడ విశ్వనాథవారు, జటావల్లభుల పురుషోత్తమ శాస్త్రి, పాటిబండ్ల మాధవ శర్మ, పొట్లపల్లి సీతారామారావు వంటి ఉద్దండుల వద్ద విద్యనభ్యసించే అదృష్టం లభించింది శర్మగారికి. ఆ సంవత్సంలోనే గ్రంథాలయ పితామహ అయ్యంకి వెంకట రమణయ్య గారి కుమారుడు తాండవకృష్ణ రచన సుజాత అనే నాటికలో నాగభూషణ శర్మగారు బుద్ధుని పాత్ర ధరించుట జరిగింది! అంతేకాదు, ఆ సంవత్సరములోనే శ్రీ ఏడిద కామేశ్వరరావు గారి నేతృత్వంలో దాదాపు 40 రేడియో నాటికలలో శర్మగారు పాల్గొనడం ఒక గొప్ప విశేషం. ఆ సంవత్సరములోనే శ్రీ ఏడిద కామేశ్వరరావు గారు నిర్వహించిన బాలల దినోత్సవంలో శర్మగారు నిర్వాహక విభాగంలో ట్రెజరర్‌గా ఉండి సమర్థవంతంగా బాలల దినోత్సవాలు నిర్వహించారు. ఆ ఉత్సవాలకు జవహర‌లాల్ నెహ్రూగారు విచ్చేసి పిల్లలనందరినీ ఆశీర్వదించుట చెప్పుకోదగిన విషయం.

శర్మగారు ఇంటర్ మీడియట్ రెండవ సంవత్సరం బందరు హిందూ కాలేజిలో చదివారు. ఆ సంవత్సరంలో మునిమాణిక్యం నరసింహారావు రచించిన గృహప్రవేశం అనే నాటికకు శ్రీ నాగభూషణ శర్మగారు దర్శకత్వం వహించి, స్వయంగా కథానాయకుని పాత్రను పోషించారు. ఆ నాటక ప్రదర్శన పెద్దల ప్రశంసలనందుకొంది! అదే సమయంలో బందరులో ప్రఖ్యాతులైన డా. కుప్పా వెంకటరామ శాస్త్రి, విన్నకోట మాధవరావుగార్ల ప్రోద్బలంతో కన్యాశుల్కం నాటక ప్రదర్శనకు ప్రయత్నించి కృతకృత్యులయ్యారు! నాగభూషణ శర్మగారు స్వయంగా మధురవాణి పాత్ర నిర్వహించారు! కన్యాశుల్కం నాటకాన్ని బందరు బుట్టాయిపేట థియేటర్‌లో ప్రదర్శించారు. ప్రదర్శించిన సన్నివేశాలన్నీ చక్కగా రక్తి కట్టడంతో ఆ నాటకాన్ని అనేకసార్లు ప్రదర్శించారుట! అన్నిసార్లూ, మధురవాణి పాత్రను నాగభూషణ శర్మగారే అభినయించి అందరి మన్ననలను అందుకొన్నారని నాటకం చూచిన ప్రేక్షకు లందరూ చెప్పుకొన్నారుట! ఒక కాలేజి విద్యార్థి మధురవాణి వంటి పాత్ర ధరించి, నటనా వైవిధ్యంతో ప్రేక్షకులనాకర్షించుట సామాన్య విషయం కాదు. ఇది శర్మగారి నటనా కౌశలాన్ని చాటుతుంది.

నాగభూషణ శర్మగారు బి.ఎ. గుడివాడ కాలేజిలో చదివారు. ఆ సమయంలోనే ఆయన నాటక రచనకు శ్రీకారం చుట్టారు. ఆ తర్వాత ఆ రచనా స్రవంతి నిరంతరంగా ప్రవహించింది! నాగభూషణ శర్మగారి తొలి రచన *అన్వేషణ* 1954లో *భారతి* లో ప్రచురితమైంది. తర్వాత *పిల్లలు పెద్దలు*, *విషాదాంతం* రచించి ప్రదర్శించారు. ఆ రోజుల్లోనే కావ్యశ్రీ రచించిన *మానవుడు* అనే నాటికను నాగభూషణ శర్మగారు దర్శకత్వం వహించి ప్రదర్శించారు. గుడివాడలో బి.ఎ. డిగ్రీ పూర్తి కాగానే గుంటూరు ఎ.సి. కాలేజిలో స్పెషల్ ట్యూటర్‌గా పని చేశారు. ఆ కాలంలోనే *అడ్డదారి*, *రాజదండం* నాటకాలు రచించుటయేగాక, వాటికి తానే

దర్శకత్వం వహించి ప్రదర్శించారు. అదే సంవత్సరములో డి.వి. నరసరాజుగారు రచించిన *నాటకం* అనే రచనకు దర్శకత్వం వహించి ప్రదర్శించారు. ఆ నాటకంలోని ప్రధాన పాత్ర ప్రఖ్యాత సినీనటుడు శోభన్‌బాబు పోషించారు. తర్వాత నాగభూషణ శర్మగారు ఎం.ఎ. ఇంగ్లీషు చదివేందుకై హైద్రాబాదు ఉస్మానియా యూనివర్సిటీలో చేరారు. ఎం.ఎ. రోజుల్లోనే విషాదాంతం నాటకం ప్రదర్శనకై తయారుచేసి ఆంధ్రనాటక కళా పరిషత్ పోటీలకు తీసుకు వెళ్ళారు. ఆ నాటకం ఆంధ్రా యూనివర్సిటీలో ప్రదర్శింపబడింది. నాగభూషణ శర్మగారు ఎం.ఎ. పాసయ్యాక 1960లో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆంగ్లోపాధ్యాయునిగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. 1961లో వరంగల్ బదిలీ కావడం జరిగింది. అచ్చట పనిచేసిన తర్వాత మరలా 1967లో హైదరాబాదు ఉస్మానియా యూనివర్సిటీకి తిరిగి రావడం జరిగింది. వరంగల్‌లో ఉన్న కాలంలో కాకతీయ నాటకోత్సవాలు జరిగాయి. 1964-65లో జరిగిన నాటకోత్సవాలలో శర్మగారు పాల్గొని తను రచించి, దర్శకత్వం వహించిన "సంస్కర్తలు, జననీ జన్మభూమి నాటకాలు ప్రదర్శించారు." సంస్కర్తలు *ఆంధ్రపత్రిక* ఉగాది సంచికలో ప్రచురితమైంది.

1967లో ఉస్మానియా విశ్వవిద్యాలయం ద్వారా "ఆంధ్రాభ్యుదయోత్సవాలు జరగడం, ఆ ఉత్సవాల్లో ప్రత్యేకంగా నాటక విభాగాన్ని నాగభూషణ శర్మగారు, నారాయణ రెడ్డిగారు ఆధ్వర్యం వహించి విజయవంతంగా నిర్వహించారు! నాగభూషణ శర్మగారు 1972లో అభినయ విద్యాభ్యాసం కోసం అమెరికాలోని ఇల్లినాయిస్‌కు వెళ్ళారు. అక్కడ యూనివర్సిటీ ఆఫ్ వెస్టర్న్ ఇల్లినాయిస్‌లో చేరి చదువనారంభించారు. అక్కడ దర్శకత్వంలో భాగంగా, దర్శకత్వ విద్యార్థిగా 3 నాటకాలకు దర్శకత్వం వహించి ప్రదర్శించారు. ఆ నాటకాలను యూనివర్సిటీ కాంపస్‌లో వేయడమే కాకుండా Sacrifice అనే నాటక ప్రదర్శన చికాగోలో చేసేందుకు వెళ్ళడం, అచ్చట నాగభూషణ శర్మగారి సహాధ్యాయుడు ప్రొ. జి. రామిరెడ్డి గారు కలవడం వారిని నాగభూషణ శర్మగారు నాటక ప్రదర్శనలకు ఆహ్వానించడం జరిగింది. దాని పర్యవసానంగా ఉస్మానియా యూనివర్సిటీలో 1983లో Department of Theatre Arts నాగభూషణ శర్మగారి నేతృత్వంలో స్థాపితమైనది. నాగభూషణ శర్మగారు ఎం.ఎఫ్.ఏ. పూర్తి చేసి, అమెరికా నుండి తిరిగి వచ్చి 1974లో ఉస్మానియా యూనివర్సిటీ ఇంగ్లీష్ డిపార్టుమెంట్‌లో రీడర్‌గా చేరి అధ్యాపక జీవితం మొదలెట్టారు. నాటకం డిపార్టుమెంట్‌ను ప్రారంభించడానికి యెనిమిదేండ్లు పట్టింది. ఆ మధ్యకాలంలో శర్మగారు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి పి.హెచ్.డి. పట్టా పుచ్చుకొన్నారు. ఆ పట్టా కోసం ఆయన అమెరికన్ నాటకరంగం అనే విషయంపై పరిశోధన చేశారు. 1978 నుంచి 1982 వరకు యూనివర్సిటీ క్లబ్బులో ఇంగ్లీషు నాటకాల ప్రదర్శనలో నిమగ్నులయ్యారు. డి.సి.హెచ్. డ్రమటిక్ సర్కిల్, హైదరాబాదు, వారి ఆధ్వర్యంలో హయవదన, తుగ్లక్ (గిరీష్ కర్నాడ్ రచన), The Visit (ఫెడరిక్ డ్యూరెన్‌మా రచన), మృచ్ఛకటికం నాటకాలకు దర్శకత్వం వహించి ప్రదర్శించారు. పైన పేర్కొనినట్లుగా 8 యేళ్ళ తర్వాత ప్రొ. జి. రామిరెడ్డి గారు వైస్-చాన్సెలర్‌గా రావడంతో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో Theatre of Arts Department 1983లో స్థాపితమైంది. శర్మగారు ప్రొఫెసర్‌గా ఎంపికయ్యారు. వెంటనే మిగిలిన స్టాఫ్‌ను నియమించే విషయమై వైస్-చాన్సెలర్‌గారిని సంప్రదించి వారి సమ్మతితో అప్పుడే మద్రాసు Acting School Principalగా ఉద్యోగ విరమణ చేసిన శ్రీ రాజారాందాసు గారిని, డా. చాట్ల శ్రీరాములు గారిని ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి డెప్యుటేషనుపై థియేటర్ ఆర్ట్సు విభాగంలో అధ్యాపకులుగా నియమించారు. వీరే కాకుండా బయటి నుండి నాటక రంగంలో అనుభవజ్ఞులైన మరికొందరు నిపుణులను అధ్యాపక వర్గంలో సభ్యులుగా చేర్చుకొన్నారు. ఆ విధంగా ఆచార్య నాగభూషణ శర్మగారి నేతృత్వంలో థియేటర్ ఆర్ట్సు విభాగం విస్తరించి, వికసించింది! ఉస్మానియా విద్యాలయం థియేటర్ ఆర్ట్స్ విభాగంలో ఆచార్య శర్మగారు స్వయంగా రచించి,

దర్శకత్వం వహించిన, ఇతరుల రచనలకు దర్శకత్వం వహించిన, అనువాదం చేసిన నాటక ప్రదర్శనలు: రాజా ఈడిపస్, విశ్వశాంతి, పిసినిగొట్టు (మైజరు), ప్రజల మనిషి - (ఎనిమి ఆఫ్ ది పీపుల్, నిశ్శబ్దం కోర్టు నడుస్తుంది (శాంత్ తా కోర్ట్ ఛాహ్తా హై), దేవుడైవస్తాడంట (వెయిటింగ్ ఫర్ గోడో (Godot), దొరా! నీ సావు మూడింది (టైటిల్ మార్చి పై నాటకాన్ని), నరజాతి చరిత్ర పేరుతో, భగవదజ్జుకం మొదలగునవి వంద ప్రదర్శనలు.

చాట్ల శ్రీరాములు, రాజారాందాస్‌వంటి నిష్ణాతులను అధ్యాపకులుగా చేర్చుకొని ఆచార్య శర్మగారు నాటక కళా వికాసానికి ఎంతో పాటుబడ్డారు. పలు నాటకాలనే కాదు, ఆచార్యా ఆత్రేయ నాటకోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఆ సందర్భంలో ఆత్రేయగారి నాటకాలను ఎంతో చక్కగా ప్రదర్శించారు. అంతేకాదు, నాటకరంగ ప్రముఖులను తయారు చేయుటలో కృతకృత్యులయ్యారు. నాటకరంగ ప్రముఖులు డి.ఎస్.ఎస్. మూర్తి, తనికెళ్ళ భరణి, తల్లావజ్ఝల సుందరం, భిక్షు, భాస్కర్, హావల్కర్, జి.ఎస్. ప్రసాద రెడ్డి వంటి ప్రముఖులు ఉస్మానియా థియేటర్ ఆర్ట్స్ విభాగం నుండి పట్టాలు తీసుకున్నవారే! శర్మగారి శిష్య బృందంగా పరిగణన పొందినవారే!

1988లో సెంట్రల్ - యూనివర్సిటీలో సరోజినీ నాయుడు ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ ప్రారంభమైనప్పుడు ఆచార్య శర్మగారు తొలి డీన్‌గా నియమితులయ్యారు. ఆ స్కూలును కళల వికాసానికి అనువైనదిగా తీర్చి దిద్దుటలో వారి పాత్ర ప్రశంసనీయం!

1989-90 సంవత్సరాలలో ఆచార్య శర్మగారు తయారుచేసి, దర్శకత్వం వహించిన నాటకాలు, విద్యార్థుల ప్రొడక్షన్సుగా ఆయన నేతృత్వంలో తయారైన నాటకాలు చాలానే ఉన్నాయి. వాటిలో ముఖ్యమైనవి: కాయితంపులి (పోస్ట్ రచన), వెయిటింగ్ ఫర్ గోడో, దంతవేదాంతం, గ్లాన్‌మేనేజర్, పోర్ట్రయిట్, మేక్‌బెత్. సెంట్రల్- యూనివర్సిటీలో డీన్‌గా తన బాధ్యతలు పూర్తి చేసిన తర్వాత, శర్మగారు తిరిగి ఉస్మానియా విశ్వవిద్యాలయంలో థియేటర్ ఆర్ట్స్ విభాగం చేరుకొని తమ కార్యకలాపాలని చేపట్టారు. ఎన్నో రచనలు చేశారు. స్వయం దర్శకత్వంతో ఎన్నో నాటకాలను ప్రదర్శించారు. అలా కార్యక్రమాలలో నిమగ్నులై బాధ్యతలు నిరంతరంగా నిర్వహిస్తూనే, 1995 జూలై 31వ తేదిన పదవీ విరమణ చేశారు. పదవీ విరమణ ముందే 1992లోనే వృత్తి నాటక విధానం, "టిక్కెట్టు కొని నాటకం చూడాలి ప్రేక్షకులు" అని అంటూ, సమావేశాల ద్వారా తన అభిప్రాయాలను, ఆలోచనలనూ తెలియజేస్తూ, సమగ్రమైన యోచనతో హెచ్.జె. దొరగారు, డా.కె.వి. రమణాచారిగారు వంటి పెద్దల సమక్షంలో 1993 మార్చి 9వ తేదిన రసరంజని సంస్థను ప్రారంభించారు. 9, 10, 11 తేదిలలో *కన్యాశుల్కం* నాటక ప్రదర్శనలతో రసరంజని శుభారంభానికి శ్రీకారం చుట్టారు. అది మొదలు ఆ సంస్థ కార్యకలాపాలు నడిపించేవారు.

బాలభవన్ సంచాలకులైన బుడ్డిగ సుబ్బరాయన్ గారి ఆధ్వర్యంలో Puppet Theatre Work Shop నిర్వహించారు. అంతకు ముందే భాగవతుల రామకోటయ్యగారి వద్ద యక్షగాన ప్రదర్శనా విధానాల్లో శిక్షణపొంది ప్రేక్షక సమక్షంలో ప్రదర్శన ఇవ్వగలిగిన స్థాయికి చేరుకున్నారు! కళలోని మర్మాన్ని తెలుసుకుని అవగాహన చేసుకొనే శిక్షను పొందాలన్న ఆసక్తి శర్మగారిలో అపారం! అభినందనీయం! ఆ విషయంలో వయసు ఏమాత్రం అవరోధం కాలేదు. అది ఆయన అపార జిజ్ఞాసకు నిదర్శనం. అందుకే ఆయన కళాపూర్ణుడు కాగలిగారు! శర్మగారు మాధవపట్నం వెళ్ళి అక్కడ వనపర్తి బాలాజీ వద్ద తోలుబొమ్మలాటల ప్రదర్శనా రీతుల్లో శిక్షణ పొందారు. శర్మగారు అక్కడ ఉన్న వారికి ఇంగ్లీషు నేర్పి, వారి వద్ద నుండి తోలుబొమ్మలాట చక్కగా నేర్చుకున్నారు. అంతటితో ఊర్కొనలేదు. శర్మగారే స్వయంగా ప్రదర్శనలిస్తూ విదేశాలలో ప్రచారం చేశారు! బహుముఖీన విషయాత్మక ప్రతిభతో, సుహృద్భావన హృదయ స్పందనతో అందరిచేత కొనియాడబడిన వ్యక్తి ఆచార్య మొదలి నాగభూషణ శర్మగారు. ఆయన వ్యక్తిత్వం అంచనా వేయడం అంత సులభం కాదు. శర్మగారు ఆచార్యునిగా గొప్పవాడా? నాటక రచయితగా గొప్పవాడా? దర్శకునిగా గొప్పవాడా? పరిశోధకునిగా

గొప్పవాడా? లేక సృజనాత్మక సాహిత్య విమర్శకునిగా గొప్పవాడా? అని మూల్యాంకన చేయనారంభిస్తే, ఒక దానితో ఒకటి పోటీ పడుతాయి! ఆయనే ఒక నాటక విద్యాలయం! నాటకమే శర్మగారి ఓజస్సు, తేజస్సు, తపస్సు! పైన పేర్కొన్న రంగాలలో శర్మగారు చేసిన సేవ ఈ వ్యాసం ద్వారా క్లుప్తంగా ప్రస్తుతించడమైనది. ఈ నా ప్రయత్నం అద్దంలో కొండను చూపించుట మాత్రమే! దీనిని విజ్ఞులు హర్షిస్తారని ఆశిస్తాను.

**ఆచార్యునిగా శర్మగారు:**

నాగభూషణ శర్మగారు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆంగ్ల శాఖలో మొదట ఉపన్యాసకునిగాను, తర్వాత రీడరుగాను దాదాపు 16 సంవత్సరాలు పనిచేశారు. ఎం.ఎ. ఇంగ్లీషు విద్యార్థులకు నాటకాలను బోధించేవారు. "నాటకం పాఠంగా చెప్పడంలో Verbal contentకి ప్రాముఖ్యం. కాని నాటకంలో అంతర్లీనంగా ఎన్నో Nuances (సున్నితమైన అర్థబేధాలు) అవి నటనలోను, రంగస్థల కదలికలోను, మరెన్నిటివల్లనో నాటకాంతర్భాగం వ్యక్తం అవుతుంది". అవేవి విద్యార్థులకు చెప్పడంలేదని తను ఇబ్బంది పడేవారు. కొన్ని సందర్భాలలో ఆయన నటించి చూపిస్తే విద్యార్థులకు వింతగా ఉండేదట! ఆ విశేషాలన్ని తనే ఎక్కువ నేర్చుకోవాలనే అభిలాష ఆయనలో రేకెత్తింది. అదే శర్మగారు వెస్ట్రన్ ఇల్లినాయ్ యూనివర్సిటీలో M.F.A. చదువుకు దారితీసింది. అటు తర్వాత, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో స్థాపించబడిన రంగస్థల కళల శాఖలో తొలి ఆచార్యుడిగా, శాఖాధిపతిగా బాధ్యతలు చేపట్టారు. శర్మగారి ఆధ్వర్యంలో ఆ శాఖ సాధించిన విజయాలు అందరి మన్ననలందుకున్నాయి. ఇటీవలి కాలంలో ప్రఖ్యాతి గడించిన తెలుగు నాటకరంగ ప్రముఖులలో చాలామంది నాగభూషణ శర్మగారి శిష్యులే! అలాగే, హైదరాబాదు సెంట్రల్ యూనివర్సిటీ 1988లో సరోజినీ నాయుడు స్కూల్ ఆఫ్ పెర్ఫార్మింగ్ ఆర్ట్సును ప్రారంభించినప్పుడు తొలి డీన్‌గా నియమితులై దాని వికాసానికి కారకులయ్యారు శర్మగారు. అదేవిధంగా తెలుగు విశ్వవిద్యాలయం రంగస్థల కళల శాఖను ప్రారంభించినప్పుడు, అక్కడ సహితం ఆచార్యునిగా సహాయ, సహకారాలందజేశారు. తెలుగు విశ్వవిద్యాలయం మొదలుపెట్టిన కార్యక్రమాలన్నిటిలోను శర్మగారు ప్రముఖపాత్ర వహించారు. తెలుగు యూనివర్సిటీవారు సాధించిన విజయాలకు పరిశ్రమించిన నిపుణులలో నాగభూషణ శర్మగారు ద్వితీయులు. అద్భుతమైన నటన, దర్శకత్వ వైదుష్యాలకు తోడు పరిశోధనా, రచనా నైపుణ్యాలతో విద్యార్థులకు మార్గదర్శకునిగా ఆచార్య నాగభూషణ శర్మగారందజేసిన సేవలను ఆయా సంస్థలు కృతజ్ఞతా భావంతో సర్వదా స్మరిస్తాయి. చిన్నా, పెద్దా అందరూ శర్మగారిని ఆదరాభిమానాలతో మాస్టారు అని సంబోధించే వారు; ఆయన మార్గదర్శకత్వాన్ని అభిలషించేవారు!

**నాటక రచయితగా నాగభూషణ శర్మ:**

శర్మగారి నాటక రచనలను మూడు రకాలుగా పరిగణించ వచ్చు: స్వతంత్ర రచనలు, విదేశ రచనలకు అనువాదాలు, దేశీయ రచనలకు అనువాదాలు. పాఠశాల విద్యార్థిగా రంగప్రవేశం చేసిన శర్మగారి మనసులో అభినయానికి, సృజనాత్మక రచనకీ అంకురార్పణ చేసింది ఆయన తండ్రిగారైన శ్రీమాన్ సుబ్రహ్మణ్య శర్మగారు. నాగభూషణ శర్మగారు రెండుపదుల వయసులోనే, నాటక రచనకు శ్రీకారం చుట్టారు. నాటక రచన తొలి దశలో శర్మగారి అడుగుల అపసవ్యాన్ని చక్కదిద్దిన గురు పాదులు కొప్పరపు సుబ్బారావుగారు! కొప్పరపువారి తొలి పాఠాలే శర్మగారిని పరిణత నాటకకర్తగా తీర్చిదిద్దాయి. అందికే కాబోలు కృతజ్ఞతాపూర్వకంగా ఆయన తొలినాటి నాటక సంపుటిని కొప్పరపు సుబ్బారావుగారికి అంకితమిచ్చారు. శర్మగారు 1954-63 మధ్యకాలంలో నాగభూషణ్ పేరుతో ఎనిమిది నాటకాలు వ్రాశారు.

అవి: *అన్వేషణ, చిన్నలు పెద్దలు, వీలునామా, రాజదండం, కల-కాపురం, సంస్కర్తలు, అడ్డదారి, జననీ జన్మభూమి, అతిథిదేవోభవ.*

**శర్మగారి పేరుగాంచిన స్వతంత్ర నాటకాలు:**

*విషాదాంతం, జంట పక్షులు, రేపటి స్వర్గం,*

*మరణగీతం, పుడమితల్లీ నీకు జోహారు, సందిగ్ధ సమరం, మన్మధుడు మళ్ళీపుట్టాడు, ప్రజానాయకుడు ప్రకాశం, మదన కామరాజు కథ, పెళ్ళికి పదినిమిషాలు ముందు.*
**పాశ్చాత్య నాటకాలు:** *తెలుగు అనువాదాలు, అనుసృజనలు.*

*యాంటిగని* (సోఫోక్లిస్ గ్రీకు రచనకు అనువాదం), *మేక్‌బెత్* (షేక్స్పియర్ ఆంగ్ల నాటకానికి తెలుగు సేత), *ఈడిపస్* (సోఫోక్లిస్ గ్రీకు రచనకు అనువాదం), *పిసినిగొట్టు* (మోలియర్ రచన ది మైజరుకు తెలుగు సేత), *బొమ్మరిల్లు* (ఇబ్సన్ రచన ఎ డాల్స్ హౌస్), *ఇబ్సన్ దే మరో రచన ప్రజల మనిషి* (యాన్ ఎనిమీ ఆఫ్ ది పీపుల్), *దొరా నీ సావు మూడింది* (ఎంపరర్ జోన్స్ యూజిన్ ఓనిల్ రచన), *రేపటి స్వర్గం* (జీన్ రచన ది మడ్ వుమెన్ ఆఫ్‌చాలియట్), *దేవుడయ్య వస్తాడంట* శామ్యూల్ బెకెట్ రచన వెయిటింగ్ ఫర్-గోడోకు అనుసృజన), *శ్వేతవలయం* (ది చాషేషియన్ చాక్ సర్కిల్ బెర్టోల్ట్ బ్రెహ్టా రచనకు అనువాదం).

శర్మగారు తొలి దశలో రచించిన తొమ్మిది నాటకాలను నవ నాటిక సంపుటి పేరుతో రసరంజని సంస్థ ప్రచురించింది. దేశీయ నాటకాలలో సంస్కృతం నుండి *మృచ్ఛకటికం* (శూద్రకుని రచన), *ముద్రారాక్షసం* (విశాఖదత్తునిది), *ప్రతిమా నాటకం* (భాస రచన), *భగవదజ్జుకం* నాటకాలను తెనుగు చేశారు. అలాగే, ఠాగూరు రచనలు *బలిదానం, ఎర్రగన్నేరు* తెలుగు లోనికి అనువదించారు. హిందీ నుండి భీష్మ సహానీ రచన *కబీర్ ఖడా బజార్ మే, కబీరు పిలుస్తున్నాడు వినండి* అనే పేరుతో, ధర్మవీర్ భారతిగారి *అంధయుగం* (అంధాయుగ్), శంకర్‌శేష్ *పోష్టర్* తెలుగులోనికి అనువదించారు. కన్నడ భాష నుండి కర్నాడు రచన *హయవదన*, చంద్రశేఖరు కంబారు రచించిన *సాంబశివ ప్రహసనం*, మరాఠీ నుండి విజయ్ టెండూల్కర్ రచించిన *నిశ్శబ్దం కోర్టు నడుస్తుంది* (సైలెన్స్ ది కోర్ట్ ఈజ్ ఇన్ ...) తెనుగించారు. పైన పేర్కొనిన నాటకాలలో చాలా నాటకాలు హైదరాబాదు డ్రమాటిక్ సర్కిల్ ఆధ్వర్యంలో ప్రదర్శించారు. అన్నిటికీ శర్మగారే దర్శకత్వం వహించారు. శర్మగారు దాదాపు 70 వరకు నాటకాలు, నాటికలు మరియు రేడియో నాటికలు వ్రాశారు. అరవైకి (60) పైగా తెలుగు నాటకాలు, 20కి పైగా ఆంగ్ల నాటకాలు శర్మగారి దర్శకత్వంలో ప్రదర్శించబడ్డాయి.

**నాటక దర్శకునిగా ఆచార్య నాగభూషణ శర్మ:**

**రాజా ఈడిపస్:** గ్రీకు నాటక రచయితల్లో పేరుగాంచిన ప్రముఖుడు సోఫోక్లిస్. *రాజా ఈడిపస్* నాటకం గ్రీకు సాహిత్యంలోనే కాదు, పాశ్చాత్య నాటక రంగంలోనె ప్రప్రథమంగా నిలిచే నాటకం. ఆ నాటకాన్ని శర్మగారు అందంగా, అద్భుతంగా కవితా శైలిలో అనువదించారు. మానసిక సంఘర్షణతో పాటు, ఉత్సుకతను కలిగించే సన్నివేశాల సమాహార స్వరూపమైన ఈ నాటకాన్ని ప్రదర్శనానుకూలతతో అనువదించారు శర్మగారు. నాటక అనువాదంతోపాటు సుదీర్ఘమైన పీఠిక, గ్రీకు నాటక చరిత్రతో కూడిన అనుబంధం, *ఈడిపస్* నాటక విశేషాలను పొందుపరచారు. ఆచార్య శర్మగారు సంప్రదాయ పద్ధతికి భిన్నంగా నాటకాన్ని స్వీయ దర్శకత్వంతో ప్రదర్శించడానికి ప్రయత్నించారు. హైద్రాబాదు కోఠి ప్రభుత్వ మహిళా కళాశాలల ముందు భాగం బ్రిటీష్ సంస్కృతిని ప్రతిబింబించే విధంగా కట్టడలు ఉంటాయి. ముందు భాగంలో విశాలమైన మెట్లు, దాని పైభాగంలో విశాలమైన వేదిక, దాని రెండు వైపుల పెద్ద స్తంబాలు ఉన్నాయి. ఆ ప్రదేశాన్ని విశాలమైన వేదికగా చేసుకుని ఉస్మానియా విద్యాలయం థియెటర్ ఆర్ట్స్ మొదటి బ్యాచ్ విద్యార్థుల చేత ప్రదర్శింప చేశారు! ఈ నాటకానికి రాజారాందాస్, డా. చాట్ల శ్రీరాములు సహాయ దర్శకులుగా వ్యవహరించారట! 1983లో ప్రదర్శించిన ఈ నాటకంలో ఈడిపస్ పాత్ర విద్యాసాగర్, క్రియాన్ పాత్రను తనికెళ్ళ భరణి, జొకాష్ట పాత్రను ఉషా జయంతి, కోరస్ పాత్రలను కృష్ణమోహన్, కె. ప్రసాద్, ఆకెళ్ళ సత్యనారయణమూర్తి, వెంకటేశ్వరరావు, పార్థసారథి పోషించారని తెలియుచున్నది. రంగోద్దీపన కార్యక్రమం బెంగుళూరికి చెందిన రామమూర్తి నిర్వహించారు......

(మిగతాది వచ్చేనెల)

ప్రొ. రావినూతల సత్యనారాయణ
హైదరాబాద్. ఫోన్: 961 852 4702.

# పురాణాలు - చరిత్ర

– కాళిదాసు పురుషోత్తం

యుద్ధాల్లో వాడిన రథాలు హరప్పా నాగరికత తర్వాతే వాడుకలోకి వచ్చాయనే వాస్తవం మన పౌరాణిక చరిత్రకారులకు సమ్మతం కాదు. హరియాణా రాష్ట్రంలో రాకిగడి (Rakshigarhi) అనే ప్రదేశంలో పురాతత్వ శాస్త్రజ్ఞులు (Archaeologists) తవ్వకాలు జరిపినపుడు హరప్ప నాగరకతకు సంబంధించిన అవశేషాలు చాలా లభించాయి. ఆ ప్రదేశంలో లభించిన మానవ అవశేషాలను జన్యుశాస్త్రజ్ఞులు ఇటీవల పరీక్షలు జరిపి, వాటిలో తూర్పు ఐరోపా పచ్చిక మైదానాల నుంచి వలసలు వచ్చిన మానవుల DNA (జన్యుపదార్థం) ఉన్నట్లు నిరూపం కాలేదని తేల్చారు. ఈ ఫలితాల ఆధారంగా హరప్పా నాగరకత నూటికి నూరుపాళ్ళు భారతీయ నాగరికతే అని, అది ఏ విదేశీ ప్రభావాలతో రూపొందినది కాదని పౌరాణిక చరిత్రకారులు బలంగా వాదించారు. రాకిగడి నాగరికత - లేదా హరప్పా నాగరికత వేదకాలం నాటి నాగరికతే అని నిర్ద్వంద్వంగా వాదించి, వేదాల మీద ఏ విదేశీ ప్రభావాలూ లేవని తీర్మానించారు. వేదాలలో లభ్యమవుతున్న జ్యోతిశ్శాస్త్రం (Astronomical) వగైరా ఆధారాలననుసరించి, వేదాలు క్రీ.పూ. 7,000 సంవత్సరాలనాటివని, అనగా ఇప్పటికి 9,000 సంవత్సరాలనాటివని వాళ్ళు తీర్మానించారు. రామాయణంలో వర్ణించబడిన సంఘటనలు క్రీ.పూ. 5,000 సంవత్సరాల నాటివని (అనగా ఇప్పటిక 7,000 సంవత్సరాల క్రితం జరిగినట్లు) తీర్మానించారు. మహాభారతంలో వర్ణించబడిన కురుక్షేత్ర యుద్ధం క్రీ.పూ. 3,000 సంవత్సరాల క్రితం జరిగిందని (అనగా ఇప్పటికి 5,000 సంవత్సరాల క్రితం జరిగినట్లు) ఈ వర్గం చరిత్రకారులు సంపూర్ణంగా విశ్వసించారు.

వేదాలు సింధు, సరస్వతి నాగరికతలను రూపొందించినట్లు పౌరాణిక చరిత్రకారులు నిర్ద్వంద్వంగా ఆమోదించారు. సింధునాగరికత క్రీ.పూ. 2,500 సంవత్సరాల ప్రాంతంలో అభివృద్ధి చెంది (అనగా ఇప్పటికి 4,500 సంవత్సరాల క్రితం), క్రీ.పూ. 1900 ప్రాంతంలో (అనగా ఇప్పటికి 3,900 సంవత్సరాల క్రితం నశించినట్లు) పురాతత్వ శాస్త్రజ్ఞులు అభిప్రాయ పడుతున్నారు. పౌరాణిక చరిత్రకారుల వాదాన్ని, విశ్వాసాన్ని ఆమోదించడానికి ఒక చిక్కు సమస్య అడ్డొస్తుంది. సుమారు 5,000 సంవత్సరాల క్రితం మాత్రమే మానవులు యూరేషియా ప్రాంతంలో గుర్రాన్ని మచ్చిక చేసుకోగలిగినట్లు పురాతత్వ శాస్త్రజ్ఞులు అభిప్రాయపడుతున్నారు. యూరేషియాలోనే 4,000 సంవత్సరాల క్రితం ఆకులు కలిగిన చక్రాల రథాలు (Spoked Wheel) ఆవిష్కరించబడినట్లు పురాతత్వ శాస్త్రజ్ఞుల అభిప్రాయం.

హరప్పా నాగరకత క్షీణించిన చాలాకాలం గడిచిన తర్వాత, 3,300 సంవత్సరాల క్రితం హైక్లోస్‌లు (Hyclos) యుద్ధాల్లో రథాలను వాడు చేశారు; వీరు ఈజిప్టు మీద దండయాత్రలు చేసి ఆ ప్రాంతాలను జయించినట్లు పురాతత్వ శాస్త్రజ్ఞులు అభిప్రాయపడ్డారు. రథారూఢులైన హిటైటిస్ విలుకాండ్లు (Archers) ఈజిప్టియన్‌లను ఖదీష్ (ఇప్పటి సిరియా) ప్రాంతంలో ఎదుర్కొని యుద్ధంలో ఓడించిన దృశ్యాలు కుడ్య చిత్రాలుగా చిత్రీకరించబడ్డాయి. రథాలకు, ధనుర్ధారులకు సంబంధించినంతవరకు ఈ కుడ్యచిత్రాలే తొలి ఆనవాళ్ళు. ఈ సాక్ష్యాల ఆధారం చేసుకొని హరప్పా నాగరికత కనుమరుగైన చాలా కాలం తరవాత రథాలు ఆవిష్కరించబడినట్లు చరిత్రకారులు

భావిస్తున్నారు. పౌరాణిక చరిత్రకారుల ప్రకారం వేదాలు, రామాయణ, మహాభారతాలు హరప్పా నాగరికతకన్నా చాలా పూర్వం నాటివి. వేదాలు, రామాయణ మహాభారతాల్లో రథాల ప్రస్తావన ఎలా వచ్చింది? వేదాలు అశ్వాలను ఆరాధించాయి. గుర్రాలు పూన్చిన రథాలు అధిరోహించి ఇంద్రుడు విహరించినట్లు వేదాలు వర్ణించాయి. రాముడు అయోధ్యా నగరం నుంచి అశ్వాలు పూన్చిన రథంపై వెడలినట్లు రామాయణంలో ఉంది. మహాభారతంలో కృష్ణుడు రథసారథి. రథాలు, గుర్రాల విషయం ఆనాటివారికి తెలియకపోతే ఇదంతా సాధ్యమేనా?

భారతదేశంలో 9,000 సంవత్సరాల క్రితమే అశ్వాలు పూన్చిన రథాలు వాడుకలో ఉండేవన్న సత్యాన్ని తిరస్కరించటంలో ఏదో అంతర్జాతీయ కుట్ర దాగి ఉందని, ఈ కుట్రలో భారతీయులు బలైపోయారని, ఈ కుట్ర 200 సంవత్సరాలుగా సాగుతోందని, ఇందులో వందల కొలది చరిత్రకారులు, పురాతత్వ శాస్త్రజ్ఞులు, భాషాశాస్త్రవేత్తలు, శాస్త్రజ్ఞులు భాగస్వాములయ్యారని పౌరాణిక చరిత్రకారులు గట్టిగా నమ్ముతున్నారు, గగ్గోలు పెడుతున్నారు. తమ వాదాన్ని ఆమోదించనివారినందరినీ దేశద్రోహులుగా ముద్రవేస్తూ, ప్రత్యర్థుల వాదం వినిపించనివ్వకుండా ఆజ్ఞలు జారీ చేస్తున్నారు.

రాముడికన్నా ముందే చాలామంది రాజులున్నట్లు పురాణాలు చెప్తున్నాయి. రాముడి పూర్వీకుడైన ఇక్ష్వాకుడు మనువు కుమారుడు. జలప్రళయం తర్వాత, మనువు ఒక నాగరికతను వర్ధిల్లజేశాడు. పురాణాల్లో ప్రస్తావించబడిన జలప్రళయం సుమారు 12,000 సంవత్సరాల నాటి చివరి హిమయుగం (last Ice Age) ప్రస్తావన కావచ్చు. మనుస్మృతి, భారతీయ ఖగోళ శాస్త్ర విజ్ఞానం మన దేశ చరిత్ర ప్రాచీనతను అనేక వేల సంవత్సరాలు వెనక్కి తీసుకొనిపోతాయి. అయితే ఈ అంశాలను ధృవీకరించే చారిత్రిక ఆధారాలు లేవు. ఈ అంశాలన్నీ జనుల జ్ఞాపకాల్లో నిక్షిప్తమై, బహుళ ప్రచారం పొందిన సత్యాలు. ఈ విషయాలను 'సత్యాలను' అభిమానించి, అంగీకరించే రాజకీయవేత్తలున్నారు. వీరు పౌరాణిక చరిత్రకారుల వాదాన్ని ఆమోదించని, ఇందుకు విరుద్ధంగా వాదించే చరిత్రకారుల, శాస్త్రజ్ఞుల, పత్రికా రచయితల వృత్తిపరమైన జీవితాన్ని ఒక్క కలంపోటుతో ధ్వంసం చేయగల సమర్థులు.

భారతదేశంలో వ్యవసాయం క్రీ.పూ. 7,000 సంవత్సరాల క్రితం మొదలైంది. పౌరాణిక చరిత్రకారుల ప్రకారం రాముడి కలం కూడా ఇదే. అయితే, గంగానదీ పరీవాహక ప్రాంతాల్లో జరిగిన తవ్వకాల్లో లభించిన కుండలు, తదితర అవశేషాలు క్రీ.పూ. వేయి సంవత్సరాల కాలం నాటివని శాస్త్రజ్ఞులు తేల్చారు. పౌరాణిక చరిత్రకారులు తమ వాదాన్ని బలపరచే ఆధారాలున్నాయంటారు. పురాతత్వ శాస్త్రజ్ఞులకు మాత్రం కొత్త ఆధారాలేమీ లభించలేదు. ఈ శాస్త్రజ్ఞులకు అటువంటి రుజువులను, సాక్ష్యాలను వెలికితీయడం ఇష్టం లేదా? అటువంటి ఆధారాలను వాళ్ళు దాచిపెడుతున్నారా?

అమెరికాలో స్థిరపడి, బాగా సంపాదించిన భారతజాతి సంతతివాళ్ళు ఇప్పుడు మన దేశ చరిత్రను స్వదేశ భ్రాంతి (Nostalgia)తో అభిమానిస్తూ మన గత చరిత్రను రాగరంజితంగా చిత్రించే 'శ్వేతజాతి హిప్పీ బ్రాహ్మణుల'ను (White Hippie Brahmins) చక్కగా పోషిస్తున్నారు. సమస్త మానవ జాతి మూలాలు భారతదేశంలోనే ఉన్నాయని, చివరి హిమయుగం తర్వాత, సాంస్కృతిక విజ్ఞానం వేదాల ద్వారా ప్రపంచమంతటా విస్తరించిందనీ, ప్రచార కార్యక్రమాన్ని ఈ హిప్పీ బ్రాహ్మణులు లాభసాటి వ్యాపారంగా మార్చుకొన్నారు. అమెరికాలో స్థిరపడిన భారతజాతి సంతతి ప్రజలే వీరికి రాజపోషకులు.

**హిందూ పురాణాల్లో చరిత్ర - జైన చరిత్ర:**

పురాణాల్లో గ్రంథస్థమైన చరిత్ర వాస్తవమే కావచ్చుగానీ, ఇది జైన మత పురాణాలతో విభేదిస్తోంది. నేమినాథుడు శ్రీకృష్ణుని సమకాలికుడని జైనులంటారు. నేమినాథుడు జైనుల చరిత్ర ప్రకారం కనీసం 84,000 సంవత్సరాల నాటి వ్యక్తి. నేమినాథుడు 22వ తీర్థంకరుడు. ముని సువ్రతనాథుడు క్రీ.పూ. 1,184,980 నాటివాడని

జైనపురాణాలను అధ్యయనం చేసి తెలుసుకోవచ్చు. రుషభ, నేమినాథుల పేర్లు యజుర్వేదంలో ప్రస్తావించబడ్డాయి. అంటే వేదాలు ఈ ప్రాచీన రుషుల స్మృతులను గుర్తుంచుకొన్నవన్న మాట. రుషభ నాభుని చిహ్నం వృషభం హరప్పాలో లభ్యమయిన ముద్రల్లో (Seals) గుర్తించబడింది. రుషభ నాభుని కుమారుడు భరతుడి పేరు మీదనే ఈ దేశాన్ని భరతవర్షమని వ్యవహరించారు. ఈ భరతుడి కుమార్తెలే బ్రాహ్మిలిపిని, దశాంశ పద్ధతిని ప్రవేశపెట్టారు. క్రీ.పూ. 300 ప్రాంతంలో బ్రాహ్మిలిపి, క్రీ.పూ. 200 ప్రాంతంలో దశాంశ విధానం వాడుకలోకి వచ్చినట్లు చరిత్రకారులు అభిప్రాయ పడుతున్నారు. మనువు రుషభనాభుడికి పూర్వుడో, తర్వాతివాడో స్పష్టంగా తెలియదు. ఈ విషయంలో పౌరాణిక చరిత్రకారులకు, జైన చరిత్రకారులకు ఏకాభిప్రాయం కుదరలేదు. వీళ్ళు ఒకరి వాదాన్ని మరొకరు ఆమోదించారు. కొందరు రుషభనాభుడే శివుడని లేదా శివుడే రుషభనాభుడని వాదిస్తారు. శివుడు వివాహం చేసుకొని ప్రాపంచిక జీవితంలో అడుగు పెట్టినట్లు హిందూ పురాణాలు పేర్కొంటున్నాయి. రుషభనాభుడు వివాహం, ప్రాపంచిక సుఖాలు నిరాకరించినట్లు జైనపురాణాలు, వేదాలను గురించి కొన్ని ప్రశ్నలు.

ఇటీవల జరిగిన జన్యుశాస్త్ర అధ్యయనాలవల్ల హరప్పా ప్రజల DNAలో యూరేషియా నుంచి, లేదా తూర్పు యూరపు ప్రాంతాల నుంచి వలస వచ్చిన Steppee Pasturalists DNA లేదని తేలిపోయింది. దీని అర్థం హరప్పా ప్రజలు పూర్తిగా ఈ దేశస్థులే, ఇక్కడి స్థానికులే అని తేలింది. అయితే వేదాల మాటేమిటి? యూరేషియా, తూర్పు యూరపు పచ్చికబయళ్ల నుంచి Steppee Pasturalists ఈ దేశానికి వలస వచ్చిన తర్వాతే, సుమారు క్రీ.పూ. 1,500 సంవత్సరాల క్రితం (అంటే ఇప్పటికి 3,500 సంవత్సరాల క్రితం) వేదాలు కూర్చబడి ఉంటాయా? ఆకులు గలిగిన చక్రాలతో రథాల ఆవిష్కరణ జరిగిన కాలాన్ని, ఆ వాదాన్ని, ఆ వాదాన్ని బలపరిచే భాషాశాస్త్ర పరిశోధనా పత్రాలను, జన్యుశాస్త్ర పరిశోధనలను - మొత్తం సాక్ష్యాధారాలను పాశ్చాత్య దేశాలు భారతదేశానికి వ్యతిరేకంగా చేసిన పెద్ద కుట్రగా, షడ్యంత్రంగా పౌరాణిక చరిత్రకారులు కొట్టిపారేస్తున్నారు. పాశ్చాత్య విద్వాంసులు లభ్య సమాచారాన్ని (Data) తాము ముందుగానే ఏర్పరచుకొన్న ప్రతిపాదనలకు అనుకూలంగా అన్వయించారని పౌరాణిక చరిత్రకారులు ఆరోపిస్తున్నారు. రుగ్వేదంలో హిమాలయ ప్రస్తావన తప్ప, దక్షిణ భారతదేశానికి సంబంధించిన స్మృతులేవీ నిక్షిప్తం కాలేదు. ఇది దేన్ని సూచిస్తుంది? వేదాలు యావద్భారత దేశానికి సంబంధించిన పవిత్ర గ్రంథాలా? లేక ఉత్తర భారతానికి పరిమితమైనవా? తొలి ధర్మశాస్త్ర గ్రంథాలు గంగా మైదాన ప్రాంతాలను ఆర్యావర్తమని పేర్కొన్నాయి. పురాణ గాథలననుసరించి, తమిళ గాథలననుసరించి వైదిక రుషి అగస్త్యుడు దక్షిణాపథానికి వలస వెళ్ళాడు. కావేరినది దక్షిణ గంగ లేదా దక్షిణ దేశ గంగగా పేరుపడ్డది. వేదాల జన్మస్థానం యావద్భారత దేశం కాక, ఉత్తర భారతమే అని స్పష్టమవుతోంది కదా? వీటన్నిటి మీదా తీర్పరులెవరు? ఎవరు నిర్ణయిస్తారు? పౌరాణిక - చరిత్రకారులా? లేక శాస్త్రవేత్తలా?



*(హిందూ - సెప్టెంబర్ - 1919 నాడు దేవదత్ పట్నాయక్ వ్యాసం 'What Peranic Historians Wont Accept?' ప్రచురించింది.)*

డా. కాళిదాసు పురుషోత్తం
నెల్లూరు. ఫోన్: 900 064 2079.

# వ్యంగ్య చిత్రకారులు

– *బాలి*

**విదేశీ ఇల్ల్‌స్ట్రేటర్ - ఎరిక్ ఎర్న్ షా:**

ఇంగ్లీషు పత్రికల్లో ముఖ్యంగా విదేశీ వారపత్రికలు తిరగేసేవారికి లండన్ నుంచి వెలువడే *ఉమెన్స్ వీక్లీ, ఉమెన్ & హోమ్* పత్రికలు, ప్రముఖ వ్యంగ్య చిత్రకళ పత్రిక అయిన *పంచ్* పత్రికలు పరిచయమయ్యే ఉంటాయి.

ఇందులో *ఉమెన్స్ వీక్లీ* తీసుకుందాం-

ఇది లండన్‌లో పాపులర్ పత్రిక అని విన్నాను. ఇండియాలో 1920 వరకు అసలు ఆఫ్‌సెట్ ప్రింటింగ్ అన్నది విరివిగా పరిచయం కాకముందే, ఇంగ్లాండ్లో విస్తృతం అయినట్టు ఉంది. పాత *ఉమెన్స్ వీక్లీ* ను తిరగేస్తుంటే ఇంత అందమైన ప్రింటింగ్, పేజ్‌మేకప్‌లతో మన పత్రికలు ఎప్పుడు వస్తాయా అని అనిపించేది. ఇది ఒక ఎత్తయితే పుస్తకం లోపల ఇచ్చిన కంటెంట్ మరొక ఎత్తు. పాత సాహిత్య పరిచయాలు గొప్పవే గాని వాటి వీరబాదుడు భరించలేనిది. "*మొల్ల రామాయణ* కవితా విశిష్టత, నన్నయ్య రచనా చపుత్కృతి ఇక్కడి దినపత్రికల్లోగాని, వారపత్రికల్లోగాని ఈ రకపు బాదుడు ఎక్కువగా ఉండేది. ప్రస్తుత సమాజానికి ఇవి కావాల్సింది అన్నట్టు". పిల్లల పెంపకం, చదువు, ఆరోగ్యం, ఆహార పద్ధతులు, ఫ్యాషన్ దుస్తుల తయారీ, ఇంటిని చక్కదిద్దుకోవడంలో ఎదురవుతున్న సమస్యలు, పరిష్కారాలు, మీ ఇంటి ముందు మీకున్న ఆ చిన్న జాగాలో మొక్కల పెంపకం, ఇంకా వీటితోపాటు మానసిక వికాసమైన కథలు, సీరియల్స్, వాటికి తగ్గ బొమ్మలు, కార్టూన్లు - దీన్ని పూర్తిగా గమనించి, ఆ ప్రభావంలో అప్పటిలో *ఆంధ్రప్రభ* వారపత్రిక పాఠకుల - ఆలోచనలు ఇటు తిప్పిందని విన్నాను.

అయితే ఆఫ్సెట్ ప్రింటింగ్ రాకపోవడంలో హ్యాండ్ కంపోజింగ్, బొమ్మలు, ఫోటోలు, బ్లాక్ మేకింగ్ స్థాయిలోనే ఉండేవి. ఈ *ఆంధ్రప్రభ* కూడా.

*ఉమెన్స్ వీక్లీ* లో ఒక కథ, ఓ సీరియల్ రెగ్యులర్‌గా వచ్చేవి. కథలకు బొమ్మలు 'ఎరిక్ ఎర్న్ షా' అనేవాడు వేస్తే, సీరియల్ నవలలకు 'జాక్ మెక్కార్తీ' అనే ఆయన గీసేవాడు. ఒక్కోసారి అటు-ఇటు మారేవారు కూడా. అయితే వీరి బొమ్మల్లో మంచి కోణాలు, ఎక్స్ప్రెషన్స్ కనిపిస్తాయి. కానీ ఎవరి శైలి వారిదే. ప్రస్తుతం ఎరిక్ ఎర్న్ షా గురించి తెలుసుకుందాం-

1916వ సంవత్సరంలో ఇంగ్లాండ్‌లో ఈ చిత్రకారుని జననం. ఆ ప్రాంతాన్ని లేంక్ షైర్ అంటారు. పైన రెండున్నర గదులు, కింద రెండు గదులున్న ఓల్డ్ హోం పేటలో ఉన్న ఇల్లు అది. తండ్రి దగ్గరున్న కాటన్ మిల్లులో చిరుద్యోగి. తల్లి సామాన్య గృహిణి మాత్రమే. "అప్పటిలో నా వయస్సు ఐదు ఏళ్ళు ఉండవచ్చు. మా ఆర్థిక పరిస్థితి తెలియదు. మా అమ్మ మా ఇంటికి దగ్గరలోనే ఉన్న ఆదివారం స్కూల్‌కి తీసుకుని వెళ్ళేది. ఆ స్కూలు ఆదివారం మాత్రమే తెరుస్తారు. నాలాంటి పిల్లలు కొంతమంది ఆరోజు ఆ స్కూల్‌కి వచ్చేవారు. అయితే నాకు ఈ వారాంతపు చదువుకన్నా మా ఇంటి వెనక ఉన్న చెట్లు, వాటి ఆకులు, వాటి పైన వాలిన పురుగులు, కొమ్మలపై వాలిన పిట్టల బొమ్మలు, స్కెచ్‌లుగా వేసుకునేవాడిని. అవి నాకెంతో సంతోషం ఇచ్చేవి. అయితే ఈ నా బొమ్మలు బాగా ఉన్నాయో లేదో తెలియదు. బాగానే వేసి ఉండవచ్చు. ఈ లోపున నాకు 13 ఏళ్ళు వచ్చాయి. కొంతమంది మిత్రులు ప్రోత్సహించడంతో మా స్కూల్‌లో జరుగుతున్న

ఎగ్జిబిషన్‌లో నా స్కెచ్‌లు ఉంచాను. దానికి ఓల్డ్ హేమ్ ఆర్ట్ స్కూల్‌లో పనిచేస్తున్న ప్రిన్సిపాల్‌గారు వచ్చారు. ఆయన నా స్కెచ్‌లు, వాటి స్టయిల్ చూసి, "నీవు ఇంకా మంచి ఆర్ట్ స్కూల్‌లో చేరితే మంచిది.." అని నన్ను ప్రోత్సహించి, సంవత్సరానికి 200 పౌండ్ల స్కాలర్‌షిప్ మీద లండన్ న్యూ క్రాస్ రోడ్‌లో ఉన్న గోల్డ్‌స్మిత్ ఆర్ట్ స్కూల్‌లో చేర్పించారు. అదొక పెద్ద మలుపు. ఇక నేను ఆగలేదు. ఆ ఆర్ట్ స్కూల్‌లో ఎన్నో విభాగాలు ఉన్నాయి. అన్నింటికీ మూలాధారం అబ్జర్వేషన్ & పెరెస్పెక్టింగ్. ఎంత పెద్ద పెయింటింగ్‌కయినా ఇవి ముఖ్యమని అనుభవం మీద తెలుసుకున్నాను. రియలిజమ్ వేపే మొగ్గాను. ఆ క్లాసులకే అటెండ్ అయ్యేవాడిని. రియలిజమ్ సరిగ్గా సాధిస్తే మనం ఏ ఇజాన్నయినా ఇట్టే పట్టవచ్చు, పండించవచ్చు. ఇదే నా లక్ష్యమయి ఆ ఒరవడిలో కాన్వాస్‌లో చాలా పెద్ద పెద్ద పెయింటింగ్‌లు వేశాను. అలా వేసిన వాటిలో మా కుటుంబ సభ్యులవే ఎక్కువ ఉన్నాయి. ఇది ఇలా సాగుతుండగానే ఒక మిత్రుని సలహా మేరకు ఇలస్ట్రేషన్స్‌వైపు రావలసి వచ్చింది. ఇది సున్నితమైన వర్క్. పేపర్‌కే పరిమితమవుతుంది. రాసే బ్రష్‌లూ, కలాలూ అంతే! ముందు రచయితల రచనలు చదవాలి, అందులోని సెంట్రల్ పాయింట్‌లను స్వీకరిస్తూ అటు రచయితను ఇటు పాఠకులను తృప్తి పరచాలి. ఇక ఈ విభాగంలో అడుగు పెట్టాను. మొదట్లో ఇబ్బంది పడ్డాను అన్నది నిజం.

అయితే నేను ఇలస్ట్రేటర్‌గా మారడానికి మరో కారణం. నేను గోల్డ్‌స్మిత్ స్కూల్లో కోర్సు పూర్తి చేసి, సర్టిఫికెట్స్ తీసుకుని బయటపడ్డానే కానీ ఉద్యోగం దొరకాలి కదా! నా పోర్ట్ పోలియోలను తీసుకునివెళ్లి ఆర్ట్ ఏజెంట్ చేతిలో పెట్టాను. అతడు వాటిని తీసుకెళ్ళి, అప్పట్లో చాలా పాపులరైన పత్రికలు, *జాన్‌బుల్, ఎవ్రిబడీస్ వీక్లీ* ల ఎడిటర్‌ల ముందు పెట్టాడు. వారు తిప్పికొట్టారు. ఇక ఈ ఏజెంట్‌కూ కోపం వచ్చి, నామీద అంత ఎత్తుకు ఎగిరి "నీవు ఎప్పటికీ గొప్ప ఇలస్ట్రేటర్ కాలేవు" అని నా ముఖాన్నే నా పోర్టుపోలియో, బొమ్మలు పడేశాడు.

అప్పుడు నా మనసు ఎంతో కుంగిపోయింది. దాన్ని ఛాలెంజ్‌గా తీసుకున్నాను. పట్టుదల పెరిగింది. నా ప్రయత్నం నేను చేయలేనా అనుకున్నాను. అతి ప్రయత్నం మీద 'క్లిమెన్ట్ డేన్ స్టూడియో'లో చేరాను. అక్కడ వేయవలసి వచ్చింది నాకిష్టమైన ఇలస్ట్రేషన్ వర్కే కాక అడ్వర్టైజింగ్ సీక్వెన్సస్ వేయాలి. ఆ తర్వాత ఓల్డ్ హోమ్ ఆర్ట్ స్కూల్‌లో పబ్లిసిటీ వింగ్‌లో జాబులో చేరవలసి వచ్చింది. ఇక్కడ కొత్త అనుభవం. మోడల్స్‌ను మనకు కావలసిన యాంగిల్స్‌లో కూర్చోబెట్టి, స్కెచ్‌లు తీసుకోవాలి. ఇక్కడే తరువాతి రోజుల్లో నా భార్య అయిన వయిన్ పరిచయమయింది. తొలిచూపులోనే ఒకరికొకరం ఇష్టపడ్డాం. ఆమె అందం, ఓపిక, సహకారం నేను ఇష్టపడితే - నేను తక్కువ మాట్లాడడం, నా పని నేను చేసుకుపోవడంతో ఆమె నన్ను ఇష్ట పడిందట. మా కాపురం స్థిరమైన తరవాత బయటపడిన విషయాలివి. ఏదైతేనేం ఒకరినొకరు ఇష్టపడ్డాం.

అప్పట్లో ఆమె ఫొటోగ్రాఫర్ అసిస్టెంట్‌గా పని చేసేది. సరే పెళ్లి వయసు వచ్చాక స్త్రీ పురుషుల మధ్య ఆకర్షణ ఉంటుంది కదా! నా ఆర్ట్‌వర్క్‌ను, నన్ను గౌరవిస్తుంది, ఆదరిస్తుంది. అదే విషయాన్ని వయిన్‌ని అడిగితే ఆమె ముసిముసి నవ్వులు నవ్వుతూ ఇలా చెబుతుంది-

"అవును - ఎరిక్ మంచివాడు. అతనికే వ్యసనాలు లేవు. ఏదన్నా వ్యసనం ఉందనుకుంటే ఆ రంగులు, ఆ బ్రష్‌లు, ఆ కాగితాల మధ్య కూర్చోవడమే. వాటి మధ్య కూర్చున్నాడు అంటే ప్రపంచాన్ని మర్చిపోతాడు. అందులో నన్ను కూడా.." అని అంటూ మళ్ళీ ఇలా అంటుంది-

"బొమ్మలు వేసి-వేసి విసుగు పుడితే - అదిగో - ఆ మూలనున్న పియానో హాయిగా వాయిస్తాడు. సమయం సందర్భంబట్టి మాకున్న ఆ చిన్న గార్డెన్‌లో గార్డెనింగ్ చేస్తాడు. అయితే ఇక్కడ వాతావరణం అరగంటలో మారుతుంది. అందువల్ల తను స్టూడియోలోనే ఉండే అవకాశం ఎక్కువ. వేస్తున్న బొమ్మలు సకాలంలో పూర్తి చేయాలి కదా!.. కొన్ని బొమ్మలు రేపే పత్రికలో రావాల్సి ఉంటుంది. 'బార్బరా కార్ట్‌లాండ్' నవలలకు ఎరిక్ కవర్

డిజైన్లు తయారు చేస్తారు. అందువల్ల తెల్లవారుఝామునే కూర్చుని, వర్క్ చేసుకుంటున్న రోజులు ఉన్నాయి..'' అంటుంది ఆమె.

వీరిద్దరి మధ్య డేటింగ్ జరుగుతుండగానే ఇంగ్లాండ్‌లో రెండవ ప్రపంచ యుద్ధపు ఛాయలు కారుమేఘాల్లా కమ్ముకొచ్చాయి. ప్రతి మనిషిలోనూ టెన్షన్. ఉద్యోగం దొరుకుతుందో లేదో - ఉన్న ఉద్యోగం ఊడతుందనే పుకార్లు - భయం. సరిగ్గా అదే జరిగింది. ఎరిక్ ఉద్యోగం ఊడింది. ఆ వెంటనే మరో అవకాశం వచ్చింది. అయితే అది ఇలస్ట్రేషన్స్ స్టయిల్ కాదు. 'ఫిఫ్త్ రాయల్ బెర్క్‌షైర్ రెజిమెంట్'లో - అందులో ఏమి చేయాలంటే - రంగుల డబ్బాలు, పెద్ద బ్రాడ్ బ్రష్‌లూ తీసుకుని, సైనికులు ప్రయాణించే లారీలకు, అధికారులు సూచించిన - చాలా గోప్యమైన బిట్స్ గియ్యాలి. లేక చిన్న చిన్న స్టిక్కర్లువంటి మ్యాపులు వేయాలి. ఆ రంగులూ, ఆ మ్యాపులను ఆయా రెజిమెంట్ అధికారులకే తెలుస్తాయి. ఈ దెబ్బతో మృదువైనది, మానసిక ఉల్లాసపరిచేది అయిన నా స్టైల్ ఆఫ్ ఆర్ట్ అటకెక్కింది. అయినా ఒకసారి విరామ సమయంలో చేతిలోని డబ్బా రంగులతో ఫ్రీ స్కెచ్ వేస్తున్నాను. పెద్ద కార్డుబోర్డు అట్టమీద. అది రెజిమెంటల్ సి.ఒ. దృష్టిలోకి వెళ్ళింది. అతడు నిమిషాల్లో మా స్టాల్‌లోకి వచ్చి "వాట్ ఆర్ యు డూయింగ్" అని గట్టిగా అరిచి మరో పది నిమిషాల్లో నాకు టెర్మినల్‌లో ఆర్డర్స్ రాసి నా చేతిలో పెట్టాడు. నాకూ సంతోషం వేసింది. గొడ్డుచాకిరీ నుండి విముక్తి దొరికినందుకు. అయితే ఆ ఫ్రీ స్కెచ్ ఫలితం ఇంకోలా ఉంది. ఆ స్కెచ్ మా సోల్జియర్స్ మ్యాగజైన్ దృష్టిలో పడింది. దాన్ని వారు ప్రముఖంగా ప్రశంసిస్తూ అందులో ప్రచురించారు. అటువంటి స్కెచ్‌లు మరికొన్ని కావాలని జర్మన్ నుంచి పిలుపు రాగానే అటు వెళ్లాను. అయితే అవన్నీ ప్రముఖమైనవి, సౌందర్యమైనవి అయిన సబ్జెక్టుతో కూడుకున్నవి కావు. యుద్ధ వాతావరణం, దానికి సంబంధించిన క్రైమ్‌లతో కూడుకున్న సంఘటనలను ఇలస్ట్రేషన్‌గా గీయవలసినవే.

యుద్ధం అయిపోయింది. నేనూ వెనక్కి వచ్చాను. ఇంగ్లాండ్ కొంచెం ప్రశాంతంగానే ఉంది. వయిన్ నా కోసం ఎదురు చూస్తోంది. వయిన్ నా పెళ్లి 1938లో జరిగింది. ఆ తర్వాత రోజుల్లో నా ఆలోచనలకు తగ్గట్టే మంచి పత్రికల్లో నా జాబ్ మొదలయ్యింది. ఈ *ఉమెన్ వీక్లీ* పత్రికలో ఒక రొమాంటిక్ ఫిక్షన్ కథకు ఇలస్ట్రేషన్స్‌తో నా జాబ్ మొదలైంది. మోడల్‌గా వయిన్ ఫోజులు ఇచ్చింది. ఆ సంగతి ఎప్పటికీ మరిచిపోదు. "నన్ను ఎన్ని యాంగిల్స్‌లో షూట్ చేశారా''ని అంటుంది నవ్వుతూ.

అప్పట్లో నలుపు - తెలుపు ఆఫ్‌సెట్ మాత్రమే ఉండేది. 1967 కల్లా ఈ *ఉమాన్స్ వీక్లీ* పూర్తి రంగులలో వెలువడటం మొదలు పెట్టింది. ఆ పేజీలు, ఆ రంగులు ఇంకా అందంగా రావడం మొదలుపెట్టాయి. సర్కులేషన్ కూడా పెరిగింది.

మీరు చాలా పత్రికల్లో పనిచేశారు కాబట్టి - ఆయా పత్రికల సంపాదకులతో మీకున్న పరిచయాలు ఎలా ఉండేవి, మిమ్మల్ని ఎలా చూసేవారు అనే ప్రశ్నకు జవాబు ఇలా చెప్పాడు-

"నాకు గౌరవాన్ని బాగానే ఇచ్చేవారు. నా టైమ్‌ని బాగా గుర్తించేవారు. నెలాఖరులో జరిగే కాన్ఫరెన్స్‌లో ఎడిటర్‌తో కూర్చోవడం తప్ప ఆయనతో నాకు ఏమాత్రం సంబంధం లేదు. కొత్త సీరియల్‌కి బొమ్మలు ఎలా వేయాలి, పేజీ మేకప్ ఎలా ఇవ్వదలచుకున్నారు - ఇవన్నీ చర్చించేది అసోసియేట్ ఆర్ట్ ఎడిటర్‌తో మాత్రమే. తీసుకోబోతున్న నవల ముందే చర్చలో ఉంటుంది. ఎన్ని వారాలు ఆ నవల నడుస్తుందో ఆలోచించుకొని బొమ్మలు వేసే ముందు (ఇచ్చే ఇలస్ట్రేషన్లకు మోడల్స్ వస్తారు. అన్ని వయసుల వారూ ఉంటారు. వారికి ఇవ్వవలసిన ప్రతిఫలం ఆ పత్రికే చూసుకుంటుంది). ఒకసారి కెమెరా ముందు వారిని కూర్చుండబెట్టి మాకు అవసరం అనుకున్న యాంగిల్స్‌లోనూ, టోటల్‌గా ఫోటోలు తీస్తాము. దాన్ని ఇలస్ట్రేషన్‌గా మారుస్తూ, కొంచెం టచెస్ చేస్తూ, రచయిత చెప్పిన (రాసిన) సంఘటనను వెనుక డ్రా చేస్తాను. అంతే ఊహలోనే పూర్తి చేస్తాను. ఇది ప్రింట్‌కి వెళ్ళిపోతుంది.

మీరు ఇలస్ట్రేషన్స్ గీయడానికి ముందు రియలిజంలో పెద్దపెద్ద కాన్వాసుల మీద పెయింటింగ్‌లు వేశారు కదా! ఆ రంగంలో మీకు ఇష్టమైన దేశ విదేశ చిత్రకారులు ఎవరైనా ఉన్నారా అన్న ప్రశ్నకు-


''అమెరికన్ ఇలస్ట్రేటర్స్‌లో 'జోయ్ డెమెర్స్' మరియు 'కోబీవిట్ మోర్' స్టైల్ అంటే నాకు ఇష్టం. పెయింటర్స్‌లో రెంబ్రాండ్, హోకుసాయి, మోనెట్, బొన్నార్ట్‌లు ఇష్టం. అయితే ఫ్రెంచ్ ఇంప్రెసిస్ట్‌ల్లో నేను చివరగా చెప్పిన బోన్నార్ట్ ఒకడు. అతని వర్క్స్‌గల పుస్తకం నా టేబుల్ మీద ఎప్పుడూ ఉంటుంది. అది తిరగేసినప్పుడల్లా కొత్త కొత్త ఆలోచనలు ఇస్తూనే ఉంటుంది'' అన్నాడు ఎరిక్ నవ్వుతూ.

ఎరిక్ ఎర్న్ షాకు ఇద్దరు పిల్లలు. అమ్మాయి పేరు 'స్యు' - అబ్బాయి పేరు రాబిన్. అమ్మాయి ప్లే సెంటర్ స్కూల్‌లో సూపర్‌వైజర్‌గా సౌత్ లండన్‌లో పని చేస్తోంది. కొడుకు రాబిన్ కూడా చిత్రకారుడే. పెద్దపెద్ద పెయింటింగ్‌లతోపాటు ఇంటీరియర్ డెకరేషన్ కోర్సు చేయటం వల్ల ఆ వృత్తిలో స్థిరపడ్డాడు.

ప్రస్తుతం ఎరిక్ నివాసం వెస్ట్ రోడ్‌లోని 'బ్లాక్ హీత్ హిల్' అనే గృహసముదాయంలో. ఇంటి చుట్టూ ఓ చిన్నపాటి గార్డెన్ ఉన్నది. ఆ ఇంటిలోనే మెయిన్ హాల్ పక్కనే ఉన్న గది అతని స్టూడియో. 1985 వరకు *ఉమెన్స్ వీక్లీ* లో తన బొమ్మలతో ఉర్రూతలూగించిన ఇలస్ట్రేటర్‌లలో ఎరిక్ ఒకడు. ఆయన బొమ్మలు నేటికీ ఇప్పటి చిత్రకారులకు మార్గదర్శకాలు.

*

**ఎడిగర్ వాల్టర్:**




రష్యా దేశస్థుడు. 1929వ సంవత్సరం సెప్టెంబర్ 21న టార్లిన్ అనే ఊర్లో జన్మించాడు. ఇతని తల్లిదండ్రులకు కలిగిన ఎనిమిది మంది సంతానంలో నాలుగోవాడు. 1995 కల్లా మిడిల్ స్కూల్ చదువు పూర్తయింది. సెకండరీ స్కూల్ ఎడ్యుకేషన్‌లో గ్రాడ్యుయేషన్ చేద్దామనుకున్నాడు కానీ కుదరలేదు.



ఇతనిలో అంతర్గతంగా కార్టూన్ కళల పట్ల ఆసక్తి ఉంది. రాత్రింబవళ్ళు చేసిన కృషి వలన 1950వ సంవత్సరానికి రేఖల మీద మంచి పట్టు, అనాటమీలో పర్స్పెక్టివ్ అని పేరు తెచ్చుకోవడం వల్ల ఫ్రీలాన్స్ ఆర్టిస్టుగా మార్కెట్లో చలామణీ అయ్యాడు. అతనిలో సంప్రదాయ మిళితమైన బైబిల్ కథలను తీసుకొని, దానికి వ్యంగ్యం జోడించి బొమ్మలు వేయడంతో రష్యాలో ఆ రోజుల్లో గుర్తింపు తెచ్చుకున్నాడు. ఇతని విశాల సున్నితమైన రేఖలు, క్యారెక్టర్‌లోని హావభావాలు చూసి సర్క్యులేషన్ పెంచుకోవాలని పిల్లల పత్రికలు *ది క్రోవ్, దినకసిక్రవిడ్, ది సిమ్‌సిక్, కుంకస్మూర్* పత్రికా యజమానులు ఇతని చుట్టూ మూగారు. ఇతడు ఈ అవకాశాన్ని హాయిగా వినియోగించుకోవడంవల్ల కొద్ది సంవత్సరాల్లోనే 250 పుస్తకాలు అతని బొమ్మలతో నిండిపోయాయి. అయితే అందులో కొన్ని పెద్దవారి పుస్తకాలూ ఉన్నాయి. ఆ దశలోనే ఇతడు క్యారికేచరూ సాధన చేశాడు. అప్పట్లో వచ్చిన జర్నల్స్, మ్యాగజైన్స్ వాటిని ప్రచురించాయి. ఇక అతడు ఏదైనా మంచి సర్కులేషన్‌గల పత్రికకలో పని చేయాలనుకున్నాడు. అలా చేరిన మొదటి పత్రిక హియా వేప్స్ (ఎ గుడ్ కిడ్), ఆల్‌పవాల్ చేరింది 'తహాకె' (Astar) పోయినీర్, పిక్కర్, ఇది పూర్తిగా హాస్యము, వ్యంగ్యమూ కలబోసినది. ఇవి సోవియట్ టైమ్స్‌కి అనుబంధ పత్రిక.

ఎడ్గర్ వాల్టర్ తన చివరి పదిహేను సంవత్సరాలూ 'అర్వస్తే' అనే రూరల్ మునిసిపాలిటీ వారికి చెందిన 'వొరుమా కౌంటీ'లో 'పూర్‌సేమ్' అనే ప్రాంతంలో నివసించాడు. ఇతడు 73 సంవత్సరాలు జీవించి, 2006 మార్చి 4వ తేదీన మరణించాడు. అయితే వారి

కుటుంబ ఆచారాల ప్రకారం అతని పార్థివ శరీరాన్ని మే 17, 2006న 'టావిన్స్' అనే ప్రాంతంలో ఉన్న 'మెట్స్ కాలమిస్తు'లో ఖననం చేశారు.

**గెరార్డ్ హఫ్‌నంగ్:**


ఇతడు బ్రిటిష్ జాతీయుడు. 1925వ సంవత్సరంలో జన్మించాడు. తండ్రి చిన్నపాటి వ్యాపారస్తుడు. తనకు తీరిక వేళ వయోలిన్ వాయించుకుంటూ, ఇంటి వెనక చెట్ల క్రింద గడిపేవాడు. హఫ్‌నంగ్ అప్పటిలో తండ్రిని గమనించేవాడేగానీ, అందులో ఆసక్తి కనపరచలేదు. చదువు కోసం దగ్గర్లో ఉన్న హైగేల్ స్కూల్‌లో చేరాడు. అక్కడేదో అతనికి అసంతృప్తి కనబడింది. అది వదలి, హారో స్కూల్ ఆఫ్ ఆర్ట్స్‌లో చేరాడు. ఈ చదువు తనకు సంతృప్తినిస్తున్నట్లు ఫీల్ అయ్యాడు. ఇందులో సర్టిఫికెట్ కోర్స్ చేశాక స్కూల్ మాస్టర్‌గా స్టాన్‌ఫోర్డ్ స్కూల్లోనే కొన్నాళ్ళు పనిచేసి, తిరిగి తను లోగడ చదువుకొన్న హారో స్కూల్లోనే మాస్టర్‌గా చేరాడు.



హఫ్‌నంగ్

ఇక్కడే డైలీ ప్రాక్టీస్ విద్యార్థులతో చేయటం వలన తనకిష్టమైన కార్టూన్ కళల మీద చక్కటి అవగాహన కలిగింది. రేఖల మీద స్థిరత్వం, సబ్జెక్టు మీద మంచి అవగాహన, హాస్యం పండించడంలో పట్టు వచ్చాయి. ఈ సాధనను స్కూల్‌కే పరిమితం చేయకుండా, బ్రిటిష్ పత్రికలకు, కొన్ని అమెరికన్ పత్రికలకు, ఇంకా అప్పట్లో పాపులర్ అయిన ఆస్ట్రేలియన్ పత్రికలకు కార్టూన్లు గీస్తూ, కార్టూనిస్టుగా రూపం దాల్చాడు.





ఈ కార్టూన్లన్నీ అప్పటి రాజకీయ రంగం మీదగాని, సాంఘిక వ్యవస్థ మీదగానీ గీశాడా అంటే అదేం లేదు! అంతా మ్యూజిక్ మీద.

విశ్రాంతి వేళ తండ్రి వయోలిన్ వాయిస్తూ రిలాక్స్ పొందుతూ ఉంటే, మరో రూపంలో మరో వాయిద్యం ఇతనికి పట్టుబడింది. అదే 'బాన్ టుబా'. లండన్ ఆర్కెస్ట్రాలో చేరాడు. అందులో అవకాశాలు విపరీతంగా వస్తూ ఉంటే తానే 'హాఫ్‌నంగ్ మ్యూజిక్ ఫెస్టివల్' అనే సంస్థను మొదలుపెట్టాడు. దానికి మరో కారణం ఏమంటే ఈ మ్యూజిక్ ఇస్తూ లండన్ పరిసర ప్రాంతాల్లో గడపవలసి వచ్చినప్పుడు పాతకాలపు వాయిద్యాలు ఇతనికి ఎదురు పడ్డాయి. వాటన్నింటినీ చిన్న చిన్న మార్పులతోనే ఎలా వాయించాలో కొంచెం సాధన చేసి, తిరిగి వాటిని సమాజానికి పరిచయం చేయటం వలన లండన్ వాసులకు ఇతనికి పట్ల గౌరవం పెరిగింది.

హఫ్‌నంగ్ ఇక్కడితో ఆగిపోకుండా తాను గీస్తున్న కార్టూన్లలో ఈ వాయిద్య సమ్మేళనాన్ని బ్యాగ్రౌండ్ సబ్జెక్ట్‌గా తీసుకుని, కొంత వెటకారాన్ని, హాస్యాన్ని చొప్పిస్తూ వందలాది కార్టూన్లు గీసి, వాటిని సంపుటాలుగా ఆ కార్టూన్ బుక్స్‌ని విడుదల చేస్తూ ఉంటే ఆ బుక్స్ బెస్ట్ సెల్లర్స్‌గానే త్వరలో మంచి గుర్తింపు తెచ్చుకున్నాయి. ఆ కార్టూన్లతో ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేశాడు. దీంతో పేరున్న బ్రిటిష్ కార్టూనిస్టుగా అతని మీద ముద్ర పడింది. ప్రపంచ ప్రసిద్ధి చెందిన బ్రిటిష్ పెంగ్విన్ సంస్థ ఈయన పుస్తకాలను 1953 నుంచి 1959 వరకు ప్రతి సంవత్సరం ఓ పుస్తకం వేస్తూనే ఉండేది. వివాహం చేసుకొని ఇద్దరు పిల్లలకు తండ్రి అయ్యాడు. తన 34 వేట అంటే 1959లో స్వర్గస్తుడయ్యాడు.

బాలి
హైదరాబాద్. ఫోన్: 984 996 3082.

# అమర సంజీవిని... మైత్రి

– వై. హెచ్.కె. మోహన్‌రావు

ప్రియ మిత్రమా! నీవు క్షేమమని విశ్వసిస్తాను.

పరాయి గడ్డపై పాదం మోపిన నుండీ మాతృ భూమితో నా అనుబంధం మరింత చిక్కనౌతోంది. ఊరిని వదిలి వెళ్లిన పిదప తల్లి ఎడబాటుతో తల్లడిల్లిన పసిబిడ్డనయ్యాను. జన్మనిచ్చిన నా తల్లి, పోతూ ప్రత్యామ్నాయంగా మాతృభూమిని ప్రసాదించిందని తెలుసుకున్నాను. ఎంతటి మమకారాన్ని పంచింది నా ఊరు. ఎంత మధురమైనది ఆ వాతావరణం. తరిగి పోని అనుబంధాల నిధి నా పల్లె జీవనం. నా ఊరిలోని ప్రజ ఎప్పుడూ పేర్లు పెట్టి పిలుచుకున్న దాఖలాలే లేవు. బంధుత్వాల వరుసలు మినహా మరో విధంగా పిలుపులు వుండనే వుండవు. నా ఊరు ఒక వసుదైక కుటుంబమని ఊరిని దాటి వెళ్లిన తరువాత అర్ధమైంది. ఊరిలో ఉన్నంత కాలం కుటుంబంలో ఉన్న అనుభూతే ఉండేది.

ఏ ఇంటిలో శుభకార్యమైనా అందరి కళ్ళల్లో ఆనందం తొణికిసలాడేది. ప్రతి ఒక్కరి మోములో సరదా కనిపించేది. శుభకార్యం జరుగుతున్న గృహానికి అనేక కుటుంబాల వారు పాలు, పెరుగు, నెయ్యి, కూరగాయలు ఉచితంగా అందించి సహకరించేవారు. ఊరంతా కదిలి వచ్చి ఎక్కడో గ్రామానికి చివర విసిరి వేసినట్లుగా వుండే బావి నుండి నీళ్ళు తోడి, కావిళ్లతో మోసుకొచ్చి ఆ ఇంట్లో నింపడం గ్రామస్థుల మధ్యగల ఆప్యాయతలకు ఆలంబన. గోడలకు వెల్ల వేయడం, ముంగిట పందిరి వేయడం, గాడు పొయ్యి తీయడం నుండి అన్ని తంతులలో గ్రామంలోని ఇరుగు పొరుగు వారందరూ భాగస్వాములయ్యేవారు. కలిసి కట్టుగా శుభకార్యాన్ని ముగించేవారు. అదే అశుభమైతే గ్రామమంతా దుఃఖం ఆలుముకునేది. ఎలాంటి చుట్టరికం లేకపోయినా ఎందరో మహిళామ తల్లులు నోట్లో గుడ్డలు కుక్కుకొని విలపించటం నా కనుల ఎదుట ఇంకా కదలాడుతూనే వుంది. నేత్రాలు నదులై పొంగటం ఎన్నో పర్యాయాలు చూశాను. ప్రతి కుటుంబం ఆ అశుభం తమ లోగిలిదేనన్న విచారంలో మునిగేది. దుఃఖం నెలకొన్న ఆ వీధిలోని వారు ఆరోజంతా పొయ్యిలోని పిల్లినే లేపరు. ఊరిలోకి కొత్తజీవి అడుగు పెడుతుంటేనే చూసిన ప్రతివారూ పలుకరించి ప్రేమగా మాట్లాడటం, ఎవ్వరింటికయ్యా అంటూ తెలుసుకోవటంవంటి తీరుతెన్నులన్నీ కూడా పల్లె మానవ సంబంధాల కలనేతకు ఆయువుపట్టు. ఎంత మధురమైనదీ! నా ఊరి జీవితం. అమ్మ ఒడికీ, నా ఊరి లాలనకు బేధమే లేదు. మాతృభూమికి దూరమై ఆత్మీయతా శూన్యతను అనభవిస్తున్నాను.

ప్రేమానురాగాలకు మాతృక అయిన మా ఊరికి ఉగాదే పునాది. నా ఊరి స్మృతులను నెమర వేసుకుంటుంటే నా పరిసరాలన్నింటా వసంతమే విడిది చేస్తుంది. అంతటి గాఢమైన అనురాగాల వల్లరి నా పల్లె. సోమరిని ఎల్లప్పుడూ తనకు విరోధిగానే ఎంచుతుంది. నా మూల్యాంకనంలో దానికి పడమర దిక్కే తెలియదు. ఎప్పుడు రెప్పలు వాల్చుతుందో దానికే ఎరుక వుండదు. జాగృతే దానికి నాలుగు దిక్కులని నమ్ముతాను. ఏమిటో! చూరు మీదికి ఎక్కిన పుంజు స్వరానికి చెప్పలేని బలం. ఆ గళ సాంద్రత అంతా ఇంతా కాదు. అల్లంత దూరానున్న దిగుడు బావిని తెచ్చి పెరటిలో పెట్టే వరకూ, ఏ రోజూ తానో హెచ్చరికై చెవిచుడుతూనే వుంటుంది. బ్రహ్మముహుర్తానికి ఎంతో ముందుగానే అది పల్లెను మేల్కొలుపుతుంది. ఉత్తిష్ట ఉత్తిష్ట అనే పదాలు బహుశా దాని బాషలోనివే కావచ్చు. చూడబోతే! గొంతెత్తే ఆ కూత సరళి సంస్కృతం నుండే జనించినట్లుగా వుంటుంది. ఎంత జాగరూకత దానికి! పల్లెను ఎక్కడ నిద్రమత్తు ఆవహిస్తుందోనని దానికి ఒకటే బెంగ. తన కళ్ళల్లో వత్తులు వేసుకుంటుంది. అంతే కాదు. వేగుచుక్క నిక్కరపొడుచుకొని తీక్షణంగా చూస్తూనే వుంటుంది. రైతుకు నాగలి భుజకీర్తిగా మారే వరకూ రెప్పవేయనే వేయదు. కాడెత్తగానే ఎలపట దాపట ఎద్దులను

అదిలిస్తుంది. అరకబయలుదేరటం దాని కంట పడితేనే వేగుచుక్క ఆరాత్రికి శెలవు ప్రకటించేది. ఒక్కోరోజు పొలంలో ప్రవేశించే వరకూ వెంటపడుతూనే ఉంటుంది. పల్లె మొత్తం సందడి సందడిగా, ఉరుకులు, పరుగులు పెడుతున్న విషయం గమనించి సంతృప్తి చెందితేనే వేగుచుక్క సూర్యుడికి తంతి పంపేది. చీకటి తెర తొలగించుకోవచ్చంటూ ఒక సంజ్ఞను చేస్తుంది. నా మాతృభూమిలో మనుషులకే కాదు పశుపక్ష్యాదులకూ ఎంతటి వాత్సల్యం. ఎంత బాధ్యతగా ప్రవర్తిసాయి. అవి కూడా పరోపకార ప్రకరణాలే సుమా.!

చంకనెక్కిన బుర్రకాయ భూమిని ముద్దాడిందో లేదో! అరక అదే పనిగా నేలను కౌగిలించుకుంటుంది. అదేమి బంధమో! కర్రు కంట పడితే చాలు చిందులేస్తుంది. నా పల్లె మట్టికి దాపరికమే తెలియదు. విత్తనం విడిది చేస్తే మొలక తానై ఆకాశం వైపు ఆశగా తలెత్తుతుంది. ఎందుకో ఏమో! మేఘంతో మా పల్లె నేలకు అణాది దోస్తీ. కలికి చినుకుతో మొలకకు చిరకాలం నేస్తం ఉంది. ఆది నుండీ వాటి కలయిక స్నేహానికే శాశ్వత నిర్వచనం. నాకు బాగా గుర్తుంది, ఒక్కో పర్యాయం రోజుల తరబడి వర్షాలు కురిసి చెరువు, వాననీటితో పొంగి, అలుగు పారే దృశ్యం, గేట్లు ఎత్తినప్పటి సాగునీటి ప్రాజెక్టులా గోచరించేది. అలుగుదాటే నీటి ప్రవాహం చూసి పిల్లలంతా ఆనందంతో కేరింతల్లో పులకించటం నా జ్ఞాపకాల్లోనే ఉంది. వర్షంలో తడవటం, కాగితపు పడవలను వదలి ఆనందించే క్షణాలను అనుభవించాల్సిందే తప్ప వర్ణించటం అలవి కానిది. మోకాళ్ళలోతు బురదలో పాదం కూరుకొని కదలక పోయినా రైతుల ప్రాణాలన్నీ పొలంలోనే మారాకు తొడగటం ఒక వాస్తవ చరిత. నిలువెల్లా తడిసి ముద్దైన మట్టికప్పు పట్టుతప్పి బోరున కంట తడిపెట్టినా, ఇంటిపై ప్రేమ మరింతగా చిగురిస్తూనే



ఉంటుంది. పుటుకు పెట్టిన, పుఠం పెట్టినా తడుపులేని పొడి మూలలు వెతికి వెతికి ముడుచుకున్న ఇంటిపై మమత వికసిస్తూనే వుంటుంది. గ్రామంలోని వీధులన్నీ వాననీరు, బురదతో నిండి నడవాలంటే పిక్కల వరకూ తడుస్తున్నా ఊరిపై అనురాగం వెల్లివిరుస్తూనే ఉంటుంది. పొద్దు పొడిస్తే ఊరు ఊరంతా చేలల్లో ఒంగిన నడుమై పరవశిస్తుంది. నల్లరేగడి నాగేటి చాలుపై కూర్చొని బువ్వ తింటుంటే ఎరుపెక్కిన కారం ముద్ద కూడా చెక్కెర పొంగలిని మరిపిస్తుంది. దుత్తలో గిరగిరా తిరిగే చల్లబువ్వ చలువల హిమశిఖరాన్ని తనలో ఇముడ్చుకొని దోసిళ్ళకు చేరి జఠరాగ్నిపై ఒక యుద్ధమే చేస్తుంది. రామనవమి చలువ పందిరిలో ఊరు ఊరంతా హరికథగా మైమరుపులో తేలుతుంది. భారతీయ ఇతిహాసంలో నా పల్లె ఒక పర్వమై పోతుంది.

ప్రగతికి రెండు కళ్ళూ మా ఊరే. ఆమని దానికి మూడో నేత్రం. మా ఊరు పల్లెటూరు. దేశానికి అదే తల్లివేరు. నా మాతృభూమి హరితవనం. పాడి పంటలకు అదే పైడి రథం. ఉన్నఊరు కన్నతల్లితో సమానం అన్నారు. ప్రేమానుబంధాలు, మమతానురాగాల పరిమళాలను ఎల్లవేళలా వెదజల్లే ఊరిని తన దేహాన నిలుపుకున్న దేశాన్ని వీడిన తరువాతే అన్నింటినీ కోల్పోయానని తెలియవచ్చింది. మాతృభూమికి దూరమైన పిదపే కన్నతల్లి లేని లోటు ప్రస్ఫుటమైంది. అందుకే జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపీ గరీయసీ అనే నానుడి స్థిరపడింది. తిరిగి నా మాతృభూమిని స్పృశిస్తే తప్ప తల్లిప్రేమను ఆస్వాదించలేను. జయహో! జయహో! జయ జయ జయహో! జన్మభూమి. శుభమస్తు! విజయోస్తు! పావనీ.

సకలకళా సరసిజ నయనా అవనీ! నమో! నమో! నమోస్తుతే! నా మాతృభూమి! ఉంటాను. సెలవు మిత్రమా!

వై.హెచ్.కె. మోహన్‌రావు
గుంటూరు.
ఫోన్: 898 529 6123.



# శ్రీశైల చెంచులు

– పూషదపు సుబ్బారావు

*నమో హరికేశాయోపవీతినే పుష్టానాం పతయే నమః (నమకము)*
(ఆకుపచ్చని వృక్షాలు, సస్యములు శిరోజాలుగా, ఉపవీతముగా, ఉత్తరీయములుగా ధరించి అరణ్యములకు అధిపతియైన రుద్రునకు నమస్కారము.)

యజుర్వేదమునందలి రుద్రాధ్యాయము అనే రుద్రసూక్తము కైలాసగిరి పై శయనించి ఉన్న శివుని పలుమార్లు స్తోత్రము చేస్తున్నది. ఈ భూమి మీద పర్వతమే భగవంతుని తొలి నివాసము. శివుడే ఆదిగిరిజనుడు. జంతు చర్మాలు ధరించి, పుట్టెల దండలతో, జడలు కట్టిన తలతో, ధనుర్బాణాలతో ఉండేవాడిగా, శివుని నిషాదునిగా, వేటకుక్కలతో తిరిగేవాడిగా వేదాలు వర్ణించాయి. సింధు నాగరికతలో పశుపతిగా కొలవబడినది శివుడే.

నది నంటి నాగరికతలు పురుడు పోసుకున్నాయి. తియ్యటి నీటి ధారల ఉద్గమస్థానాలైన పర్వతాలు సతతహరితంగా ఉంటూ సంవత్సరం పొడవునా జీవులకు ఆహారాన్ని రక్షణను ఇచ్చాయి. ఆదిమానవుల ఉనికికి ఆటపట్టయ్యాయి. వేల సంవత్సరాల క్రితం మన పూర్వీకులు గీసిన వర్ణచిత్రాలను కొండలు తమలో నేటికీ దాచిపెట్టుకుంటున్నాయి. ఆహారాన్వేషణలో కొన్ని మానవ గణాలు మైదానాలకు దిగి వచ్చాయి. కొందరు పశుపోషణ, వ్యవసాయం నేర్చి నాగరికతవైపు నడక సాగించారు. మరికొందరు ప్రథమ స్థావరాలను వదిలిపెట్టలేక ఉన్నారు. ప్రకృతితో మానవునికి ఉన్న బలమైన సంబంధం అలాంటిది. నేటి వనవాసులలో అధిక భాగం అక్కడి మూలవాసులు. మిగిలినవారు మైదానాల నుండి వచ్చి చేరినవారు. భారతీయ సాహిత్యం - గిరిజనులు - ప్రపంచ ప్రఖ్యాత తత్వవేత్తల చేత విశేషంగా కీర్తించబడున్న మన ఉపనిషత్తులన్నీ అరణ్యాలలో నివసించిన ఋషులు మనోఫలకాలపై దర్శించి వచించినవే. భారత ఉపఖండపు ప్రజల సంస్కృతి, నాగరికతలను శాశ్వతంగా శాసించే ప్రసిద్ధ ఇతిహాసమైన రామాయణాన్ని గిరిపుత్రుడైన వాల్మీకి మహర్షి వ్రాశాడు. గిరి, గిరిజన వర్ణన లేకుండా ఏ భారతీయ కావ్యం సంపూర్ణమవ్వదు. ఆయుర్వేదం, ధనుర్వేదం, ఖనిజశాస్త్రం, కావ్య సౌందర్యం, అశ్వగజాధిపత్యం అడవుల నుండే భారతీయులు పొందారు. ప్రపంచంలో రెండో అతి పెద్ద గిరిజన జనాభా గల భారత దేశంలో తొలి రాజ్య వ్యవస్థ చిగురించిన గణరాజ్యాలన్నీ గిరిజన తెగలవే. భిల్ల, శబర, వుళింద, నిషాదవంటి గిరిజన తెగలను ప్రాచీన భారతీయ సాహిత్యం తరచూ ప్రస్తావించింది. ధూర్జటి శ్రీకాళహస్తీశ్వర మహాత్మ్యంలో తిన్నని వృత్తాంతం గిరిజనం జీవితాలను చక్కగా వర్ణించాయి. గిరిజనులను ప్రధానంగా 1) పర్వతారణ్యవాసులు 2) మైదాన, నీటివనరుల సమీపంలో ఉండేవారు 3) అందరితో కలిసి పట్టణాలు, నగరాలలో ఉండేవారిగా విభజించవచ్చు. దేశం మొత్తం మీద పెద్ద గిరిజన సమూహాలైన 'గోండులు', 'సంతాలులు' మొదలు అత్యల్ప సంఖ్యాకులైన 'జార్వా'ల వరకు 573 కు పైనే తెగలు మనుగడ సాగిస్తున్నాయి. అలాగే 93,846 గిరిజన గ్రామాలున్నాయి. దేశంలో అనాదిగా ఆదిమ జాతులు, తెగలు ఉనికిలో ఉన్నా క్రీ.శ. 1874లో బ్రిటీష్ ప్రభుత్వం షెడ్యూల్డు జిల్లాల చట్టం తెచ్చింది. 1919, 1935 భారత

ప్రభుత్వ చట్టాలు దీనిని కొనసాగించాయి. 1894లో ఆధునిక భారతదేశంలో బ్రిటీష్ ప్రభుత్వం నూతన అటవీ విధానాన్ని ప్రకటిస్తూ గిరిజనుల భూమిపై ప్రభుత్వ అజమాయిషీకి నాంది పలికింది. దీనికి కొన్ని మార్పులు చేస్తూ 1952లో స్వతంత్ర్య భారత దేశం కొత్త అటవీ విధానాన్ని రూపొందించింది. 1931లో మన దేశంలో తొలిగా ఆదిమ తెగల జనాభా లెక్కించబడింది. 1935 భారత ప్రభుత్వ చట్టంలో బ్యాక్‌వర్డ్ ట్రైబ్స్ అన్న పదం వాడబడింది. 1950 జనవరి 26 నుండి షెడ్యూల్డు తెగలు అని కొన్ని వర్గాలను అధికారికంగా గుర్తించడం జరిగింది. దక్షిణ భారత గిరిజన తెగలలో ఆంధ్రప్రదేశ్‌లోని తెగలు ప్రధానమైనవి. అందులో 33 తెగలు ముఖ్యమైనవి. ప్రస్తుత నవ్యాంధ్రప్రదేశ్‌లో 25 గిరిజన తెగలు, కులాలు ఉనికిలో ఉన్నాయి. వీరిని 1) చత్తీస్‌ఘడ్, ఒడిస్సాల మీదుగా తూర్పు కనుమలలో పశ్చిమ గోదావరి జిల్లా వరకూ ఉన్నవారు 2) కృష్ణానదికి ఉభయ పార్శ్వాల ఉన్న నల్లమలలో నివశించేవారు 3) శేషాచల అరణ్యాలు, పులికాట్ (ప్రళయ కావేరి) సరస్సులోని వారు. 4) కోస్తా తీరం వెంబడి, నీటి వనరుల దగ్గర ఉన్నవారు. 5) అన్ని వర్గాలతో కలిసి సాధారణ జనావాసాలలో ఉండేవారు.

**నవ్యాంధ్రప్రదేశ్‌లో ప్రధాన గిరిజనతెగలు:** 1. భగత 2. చెంచు 3. కొండరెడ్డి 4. కొండ కాపు, 5. సవర 6. జాతాపు 7. లంబాడి 8. ఎరుకల 9. యానాది 10. కోయ 11. బోయ 12. గదబ 13. ఖోండు 14. ఖోటియా 15.కులియా 16. మన్నెదొర. ఉభయ తెలుగు రాష్ట్రాలలోనూ వ్యాపించిన నల్లమల అడవులలో ప్రాచీనకాలం నుండే చెంచులు నివసిస్తున్నారు. వీరికంటూ ప్రత్యేక వేషధారణ ఆహారపు అలవాట్లు, కట్టుబాట్లు ఉండటం వలన మిగిలిన గిరిపుత్రులతో వీరు భిన్నంగా మనగలిగారు. పూర్వాచారవంతులైన చెంచులు నేటికీ పెద్ద సంఖ్యలోనే ఉన్నా వారి సంప్రదాయ ఆహార్యం పండుగలకు తప్ప మనం చూడగలిగే పరిస్థితి నేడు లేదు. అటు అహోబిలం నుండి ఇటు శ్రీశైలం వరకు నేటికీ తమ ఉనికి చాటుకుంటున్న ఈ విలక్షణ తెగ గురించి తెలుగులో తొలి సాక్ష్యాలు వెల్లడి చేసినది వీరశైవోద్యమ సాహిత్యాక్షరశాలకు అధినాథుడు పాల్కురికి సోమనాథుడు. సంస్కృతీకరణమనే మబ్బుల మాటున దాగిఉన్న ఎన్నో కాంతి రేఖలు ఆయన క్రాంతదర్శత్వం వల్లనే మన మీద ప్రసరించగలిగాయి. చెంచులు నల్లమల అరణ్యమంతా మంచి పట్టున్న తెగ కావడంతో ఆ ప్రాంతంపై ఆధిపత్యం పొందిన ప్రతి రాజవంశం వారు వీరిని లొంగదీసుకొని అదుపులో ఉంచారు. అహోబిల నారసింహుడు చెంచులక్ష్మిని వివాహమాడి వారికి అల్లుడయ్యాడు. ఇక శ్రీశైల మల్లికార్జునుడు చెంచువాడిగానే భావించబడుతున్నాడు. శ్రీపర్వతలింగం ఉన్నచోటు ఆదిమానవుల కాలం నుండి వారికి నివాస స్థలంగానూ, ఆరాధనా స్థలంగానూ ఉందని పురాతత్త్వ శాస్త్రవేత్తల గట్టి నమ్మకం. కృష్ణవేణి నదిలోనేగాక, శ్రీశైల ఆలయ ఆవరణలో (15 ఎకరాలు) నేటికీ 5, 6 అడుగుల లోతులోనే ''బుగ్గ''లలో సంవత్సరమంతా నీరు ఊరుతుండడాన్ని మనం గమనించవచ్చు. ఆలయ అభివృద్ధిలో చాలా వాటిని మూసివేశారు. అభిషేకోదకం కోసం మల్లికాగుండంలాంటివి మరలా ఇటీవల పునరుద్ధరించారు. పుష్కలంగా ఆహారం నీరు ఉన్న తావులలో చెంచులు స్థిరనివాసులై వేలేండ్లుగా జీవించారు. వీరి ఆవాసాలను 'పెంట' లంటారు. త్రిమూర్తులలో ఇద్దరు చెంచులతో ప్రత్యక్ష సంబంధాన్ని పొందడం ఎన్నో చారిత్రక పరిణామాలకు, సామాజిక అవసరాలకు ప్రత్యక్ష నిదర్శనంగా మనం భావించాలి.

**మల్లికార్జున పండితారాధ్య చరిత్ర - చెంచులు:** అరవై ముగ్గురు నాయనారుల వృత్తాంతములను, భక్తి అంతః సూత్రముగా గుది గుచ్చి, దేశకాలమాన పరిస్థితులను తేటతెల్లం చేస్తూ తెలుగున తొలి విజ్ఞాన సర్వస్వముగా ప్రసిద్ధమైన ఈ గ్రంథం సోమన అద్వితీయ ప్రతిభకు నిదర్శనంగా నిలిచింది. దీనిలోని ద్వితీయ సంపుటిలో మల్లికార్జున పండితారాధ్యుడు శ్రీపర్వత లింగాన్ని దర్శించిన వేళ అక్కడకు వచ్చిన నానాజాతి భక్త సందోహాన్ని సోమన యథోచితంగా వర్ణించాడు. అందులో

చెంచులను ధర్మాత్ములని ఉదహరించడాన్ని మనం గుర్తుపెట్టుకోవాలి.

**చెంచు ధర్మాత్ముల నడకలు:** ఎల్లదేశాల యాత్రికులు తమ ఇంటికి వచ్చిన అతిధుల వలే చెంచులు భావించి వారికి తమకు తోచిన రీతిన సాయమందించేవారని ఇందులో వివరించబడి ఉంది. ఆనాటి చెంచులు వ్రతములు పూని పరమేశ్వరుని దర్శనానికి వచ్చే వారు కొందరైతే, కఠిన ఉపవాసదీక్షాపరులైన వారు కొందరున్నారు. వారు గొడుగులు, కాళ్ళకు చెప్పులు ధరించి, ఒంటికి గట్టి గుడ్డలు, కంబళ్ళు చుట్టుకున్నారు. విభూతి, రుద్రాక్షలు ధరించి ఉండే చెంచులు యాత్రికులకు నూనెబుడ్లు, శివసూత్రములు, నీరుకావి వస్త్రములు, విసెనకర్రలు, గంధపు చెక్కలు, సానలు, గంధపు చిప్పలు, వెదురు పలికలు, పీటలు మొదలగు అనేక ఉపకరణాలను ''పెఱికి'' కావళ్ళు కట్టి తెచ్చి మార్గాల కిరువైపులా నిలిచిఉండేవారు. ఎవరికి కావలసిన ఆహార పదార్థాలు, వస్తు సామాగ్రిని వారికి సమకూర్చేవారు. స్త్రీలకు మరుగులు నిర్మించేవారు. చలిపందిరులు, సత్రశాలలు, విడుదులు ఏర్పాటుచేసేవారు. నీటి గుండములు, చెలమల వద్దకు దారి చూపేవారు. జంగమారాధనను మరువక చేసేవారు అని సోమనాథుడు వారి నడకలు (యాత్ర తీరుతెన్నులు) గురించి హృద్యంగా వర్ణించాడు. సంవత్సరమంతా శ్రీ శైలేశుణ్ణి దర్శించుకోవడానికి ఒకప్పుడు ప్రకృతి అనూకలించలేదు. అక్కడ ఎల్లవేళలా కనిపెట్టుకొని ఉన్నది జంగములు, చెంచులే. కాకతీయ, రెడ్డి సామ్రాజ్యాలు వర్ధిల్లిన రోజుల్లోనూ శ్రీశైలం ఒక సామంత రాజ్యంగా భాసిల్లింది. అంతకు ముందు పలనాటి బ్రహ్మనాయుడు కోడిపోరులో ఓడి, నల్లమల ప్రవేశించిన తరువాత తన ''సామంతరాగోల''ను శ్రీశైలరాజ్య పాలకుని వద్దే కుదువ పెట్టి తెచ్చిన ధనంతో మేడపి లో పరివారానికి విడుదులు నిర్మించాడు. పలనాటి యుద్ధంలో చెంచు సైన్యం పాల్గొన్నది. శ్రీకృష్ణదేవరాయల కాలం నాటికి విజయనగర సామ్రాజ్య ''గడి'' (సరిహద్దు) దేశములలో శ్రీశైలం ఒకటి. రెడ్డి మన్నీ దొరలు మక్కువతో పాతాళగంగ నుండి శ్రీశైలానికి, ఎగువ అహోబిలానికి నిర్మించిన సోపాన పంక్తుల గురించి కవిసార్వభౌములు, ప్రబంధ పరమేశ్వరులు సువర్ణాక్షర పంక్తులు లిఖించారు. కానీ ఆ బండలెత్తడంలో కరిగిపోయినవి చెంచూ కండలేనన్నది మనం విస్మరించరాదు. కాకతీయల ఆడపడుచు మల్లన్నకు క్రొత్త దేవళం నిలబెట్టినప్పుడు, పంచమఠాలు భక్తజనానికి నీడనిచ్చినప్పుడు, ప్రౌఢ దేవరాయలు ప్రాకారం పెట్టించినపుడు, శ్రీకృష్ణదేవరాయలు తన కీర్తిని గోపురంగా కట్టించినప్పుడు ఎంత మంది చెంచులు ఒరిగిపోయారో మల్లన్నకే తెలియాలి. కైలాస ద్వారం నుండి శివలోకము చేరినవారు, వీరశిరోమంటపంలో విచ్చుకత్తుల మధ్య తలలను బలితర్పణమిచ్చినవారు ఎంత మందో సాక్షి గణపతి వ్రాసుకునే ఉంటాడు. భక్తిపూర్వకంగా చెంచులు సమర్పించిన రక్తం భ్రమరాంబ రుధిరగుండంలో తడి ఆరకుండా కాపాడి ఉంటుంది. ఇలా త్రికరణములూ చెన్న మల్లికార్జున సేవలో అర్పించిన చెంచులకు దక్కిన గౌరవమెంతో విజ్ఞులే నిర్ణయించాలి.

**అటు నుండి ఇటు నరుక్కురావడం:** ఆంగ్లశకం 1790 ప్రాంతంలో అమరావతి జమిందారుగా బలవంతుడైన వాసిరెడ్డి వేంకటాద్రినాయుడు ప్రభుత్వం చేశాడు. ఆయన కాలంలో ''పాపానాయక్'' నేతృత్వంలో శ్రీశైలం, వినుకొండ ప్రాంతాల చెంచులు ఊళ్ళ మీదపడి దోచుకోవడంతో జమిందారు వారిలో ముఖ్యులను పట్టుకొని, వరుసలుగా నిలబెట్టి, తలలు నరికించాడని చరిత్రలో చాలా సాక్ష్యాలున్నాయి. ఇక్కడ బలి అయ్యింది అమాయక చెంచులేగానీ వారిని నడిపించిన వారు కాదని నేడు చాలా మంది పెద్దలంగీకరిస్తున్నారు. ముందు వరుసలో నిలబడ్డవారు మరో ప్రక్క నుండి నరకమని ప్రార్థిస్తే నాయుడు అటు నుండి నరకమన్నాడట. ఎలాగైతే నింద చెంచుల మీద పోయింది. ఆ తరువాతి రోజుల్లో ఆంధ్రదేశంపైబడి నానా అరాచకాలు సృష్టించిన పిండారీలకు ఇలాంటి శిక్షలు వేసిన మొనగాడు లేడు. కాంచి కామకోటి పీఠం పరమాచార్య, నడిచే దైవంగా

ప్రసిద్ధులైన చంద్రశేఖరేంద్ర సరస్వతి మహాస్వామి శ్రీశైల మహాక్షేత్రాన్ని దర్శించే నాటికి కూడా ఆయన బృందానికి దారి చూపి, రక్షణగా నిలిచిన వారు చెంచులే. ఆర్తితో ఆదిశంకరుని శివానందలహరిని శ్రీశైల పర్వతంపై గానం చేసిన చంద్రశేఖరేంద్ర సరస్వతీ మహాస్వామి, ఆ భాగ్యం తనకు కల్పించిన చెంచు బృందాలకు క్రొత్తబట్టలు పెట్టి తృప్తి చెందారు.

**చెంచులకు దక్కినవి, మిగిలినవి:** నేటికీ శ్రీశైలంలో మహాశివరాత్రి పర్వదినాన చెంచు గుఱవయ్యలు తలపై నెమలీకలు, ఒంటిపై పులితోలు ధరించి పిల్లన గ్రోవులూదుతూ కొలువు చేస్తునే ఉన్నారు. (ఐ.టి.డి.ఎ. వారు చెంచు పెంటల అభివృద్ధి గురించి ఇక్కడ చర్చించడం లేదు). చెంచులు దేవాలయంలో చిన్నా, చితకా ఉద్యోగాలు దక్కించుకున్నారు. తమకు తెలిసిన మందులు, మాకులు అమ్ముకుంటున్నారు. ఎందరో వీధిబిచ్చగాళ్ళుగా కంచుపళ్ళాలు మ్రోగించుకుంటూ, నెమలి ఈకలు అమ్ముకుంటూ ఊరూరా తిరుగుతున్నారు. (నేడు ఆ కంచు పళ్ళాలను అమ్ముకున్నారు). శ్రీశైలం దేవాలయంలో మాత్రం ఉపాలయాల్లో పరివార దేవతలకు అలంకరణ చేసే భాగ్యం, రథోత్సవంనాడు తేరులాగే అదృష్టాన్ని మిగుల్చుకున్నారు.

పూషడపు సుబ్బారావు
అవనిగడ్డ. ఫోన్: 810 626 2243.

## అక్షరం చిలికిన వేళ

... సమీక్ష

అక్షరాన్ని చిలికి చిలికి చిలికి రచనలు కవులు మాత్రమే కాదు, విమర్శకులు కూడా చేస్తారనడానికి కోడూరు పుల్లారెడ్డిగారి 'అక్షరం చిలికిన వేళ' జ్వలంత ఉదాహరణం. ఇంగ్లీషు, హిందీ, తెలుగు కావ్య నాటకాలు, జీవితంలోని ఎగుడు దిగుళ్ళు, కష్టాలు, కడగండ్లు, పాశ్చాత్య చిత్రకారుల జీవిత సంఘర్షణ, చిత్రలేఖనా వైశిష్ట్యం,తన జన్మదాతల, బిడ్డల సుఖసంతోషాలు-వెరసి మానవ జీవితంలోని పడుగుపేకల్ని యదార్థంగా, కళాత్మకంగా చిత్రించిన 21 వ్యాసాల సంకలనం- ఈ అపురూపమైన రచన. ఇన్ని వ్యాసాల్లో గట్టి గింజలెన్ని, పుచ్చుగింజలెన్ని అంటే అన్నీ గట్టి గింజలే. మహాకవి గడియారం వేంకటశేష శాస్త్రిగారు 'శివభారతము'లో చెప్పినట్లు శివాజీ ''పొత్తమునగాక ప్రకృతి పుటలు విప్పి'' జ్ఞానార్జన చేసినట్లు, కోడూరు పుల్లారెడ్డి తాను చేపట్టిన విషయాన్ని కూలంకషంగా తరచి చూసి, దానికి విశాలమైన సాహిత్య, సాంఘిక, సాంస్కృతిక నేపథ్యాన్ని సంతరించి పెట్టడం మహత్తరమైన సంగతి.

'విలియం షేక్స్పియర్' వ్యాసంలో మహాకవి జీవితంలోని ఆటుపోట్లు, సమకాలీన సంఘంలోని రాజకీయ, ధార్మిక, సాంఘిక సంఘర్షణలు ఆ మహనీయుని నాటకాల్లో ప్రతిఫలించిన వైనాన్ని కోడూరు పుల్లారెడ్డి 'కొండ అద్దమందు కొంచమై ఉండదా' అన్నట్లు గుదిగుచ్చారు. అంతేకాదు, షేక్స్పియరు జీవితానికీ, సమకాలీన సమాజానికీ, ఆయన రచనలతో ఏర్పడిన సంబంధాన్ని చక్కగా వివరించారు. మతసామరస్యానికి మంత్రం కబీరు, సూరదాసు గోలోకం, మీరాకృష్ణులు, సంత్ కబీర్ మార్మికవాదం- ఈ నాలుగు వ్యాసాల్లోనూ రెడ్డిగారి విపుల గ్రంథపరిశీలన, కవుల ప్రధానాశయ నిర్వహణా సామర్థ్యం, కావ్య వైశిష్ట్య వివరణలు ప్రబుద్ధ పాఠకులకు సంభ్రమాశ్చర్యాల్ని కలిగిస్తాయి. ఇక 'జయశంకర ప్రసాద్ 'అస్రూ' వ్యాసమైతే మహాకవి ప్రసాద్ ఆధునిక హిందీ కవిత్వంలో తొక్కిన కొత్తపుంతల్ని విశదీకరించి కోడూరు పుల్లారెడ్డి, ప్రసాద్ 'అస్రూ' కావ్యంలోని పద్యాలకూ, షేక్స్పియరు కీట్సు, షెల్లీ, హెచ్.డబ్ల్యూ. లాంగ్‌ఫెలో మొదలైన ఇంగ్లీషు కవుల కవితలకూ సామ్యం చూపిస్తూ, అది జయశంకర్ ప్రసాద్ కవిత్వం ప్రభావం కాదనీ, మహాకవుల భావలహరిలో సామ్యం సాధారణమే అని చెప్పడం (పేజీ.134) గొప్ప విశేషం. 'మా అమ్మ ఓబుళమ్మ' 'మా నాన్న చెన్నారెడ్డి' - ఈ రెండు వ్యాసాలు రచయితపై ఆయన తల్లిదండ్రులు చూపిన ప్రభావాన్ని చాలా అర్థ్రంగా చిత్రిస్తాయి. కోడూరు పుల్లారెడ్డిగారు చిత్రకళా రహస్యాల్ని తెలుసుకొని మరీ వ్యాసాలు రాస్తారు. వెర్మీర్ చిత్రించిన 'పాలమ్మి' (Milk Maid) చిత్రంలోని విశిష్టతను ప్రకటించిన వైనం ఆయన సూక్ష్మదృష్టిని వెల్లడిస్తుంది. కోడూరు పుల్లారెడ్డిగారి వ్యాసాలు వారి విపులమైన, లోతైన అధ్యయనాన్ని, శైలిని పట్టిస్తాయి.

***అక్షరం చిలికిన వేళ*** - కోడూరు పుల్లారెడ్డి, *పేజీలు: 313, వెల: ₹ 299/- ప్రతులకు: ఫోన్: 955 081 8495.*

ఘట్టమరాజు అశ్వత్థ నారాయణ - బెంగుళూరు. ఫోన్: 996 408 2076.



# గాజులోయమ్మ గాజులు...

– శిరంశెట్టి కాంతారావు

కొన్ని ధర్మాల్లో స్త్రీలు బొట్టుపెట్టుకుంటారు. కొన్ని ధర్మాల్లో పెట్టుకోరు. కొన్ని ధర్మాల్లో స్త్రీలు తాళి కట్టుకుంటారు. కొన్ని ధర్మాల్లో కట్టుకోరు. అట్లాగే చాలా విషయాల్లో ధర్మాలను బట్టి ఆచార వ్యవహారాలు మారిపోతుంటాయి. కానీ దాదాపుగా అన్ని ధర్మాల్లోని స్త్రీలు ఏదో ఒక రూపంలో గాజులు మాత్రం తప్పకుండా ధరిస్తారు. స్త్రీలతో అంతగా పెనవేసుకుపోయిన గాజుల మీద నాకు తెలిసి ఇప్పటి వరకు తెలుగు సాహిత్యంలో ఒక కథగాని, నవలగానీ వచ్చినట్టులేదు.

కాబట్టి "ఆ విషయంలో నేనే ఎందుకు ఓ ప్రయత్నం చెయ్యగూడదు?" అన్న ఆలోచన చేశాను. అనుకున్నదే ఆలస్యం హైదరాబాద్ వెళ్ళి చార్మినార్ ప్రాంతంలో ఉన్న గాజుల కార్ఖానాలను పరిశీలించి, అక్కడి కార్మికులతో మాట్లాడి వాళ్ళ అనుభవాలను, అక్కడి కార్మికుల స్థితిగతులను రికార్డ్ చేసుకొచ్చి, నవల వ్రాయాలనుకున్నాను. అయితే, నేనక్కడికి నేరుగా వెళితే కార్ఖానాల వాళ్ళు నన్ను లోపలికి రానిస్తారా? ఒకవేళ రానిచ్చినా వాళ్ళ విషయాలన్నీ నాకు వివరిస్తారా? అదంత సులభం కాదనిపించింది. మరి వాళ్ళ దగ్గరికి వెళ్ళేదెలా? అన్న ఆలోచన మొదలయ్యింది. దాదాపు ఒక నెలరోజుల పాటు రకరకాల మార్గాల్లో ప్రయత్నించాను. ఆ ప్రయత్నాల్లో భాగంగా హైదరాబాద్ జీడిమెట్లలో ఉండే మా సమీప బంధువు పెద్ది రాఘవేందరావుగారికి ఫోన్ చేసి విషయాన్ని వివరించి "మీకు తెలిసినవారెవరైనా ఉన్నారా?" అంటూ అడిగాను.

తను "నేను తప్పకుండా విచారించి నాలుగైదు రోజుల్లో సమాచారం ఇవ్వగలను" అంటూ బదులిచ్చారు.

నిజంగానే నాలుగైదు రోజుల తరువాత నాకు ఫోన్ చేసిన రాఘవేందరావు గారు "మా బావగారి దగ్గరి బంధువులకే చార్మినార్ దగ్గరున్న లాడ్ బజార్లో దాదాపు డెబ్బై, ఎనభై ఏండ్ల నుండి నడుస్తున్న గాజుల దుకాణం ఉందట. కాబట్టి మీరెప్పుడొస్తే అప్పుడు వాళ్ళకు పరిచయం చేస్తాను. మీకు కావల్సి సమాచారమేదో వాళ్ళ ద్వారా తెలుసుకోవచ్చు" అంటూ ఓ ఆశావహమైన సమాచారాన్ని అందించారు.

నేను హైదరాబాద్ వెళ్ళి రాఘవేందరావు గారికి ఫోన్ చేశాను. వారు వెంటనే లాడ్ బజార్లో ఉన్న లక్కీ బ్యాంగిల్ స్టోర్స్ యజమాని శ్రీ సదానంద్‌గారి ఫోన్ నెంబరిచ్చి "వారితో మాట్లాడండీ!" అన్నారు.

సదానంద్ గారికి ఫోన్ చేశాను.

రమ్మన్నారు.

పరిచయాలు అయిన తరువాత వాళ్ళ గుమాస్తాను పిలిచి "ఈ సార్‌ని, మీ ఇంటికి తీసుకెళ్ళి, మీ ఇంట్లోవాళ్ళు గాజుల మీద రాళ్ళను ఎలా డిజైన్ చేస్తూ అంటిస్తారో చూపించి తీసుకురాపో" అంటూ నన్నతనికి అప్పగించారు.

సన్న సన్నగా పాము మెలికల మాదిరిగా ఉన్న గల్లీల గుండా నడిచి వాళ్ళ ఇంటికి చేరుకున్నాము. నాకా బజార్లు చూస్తుంటే వయసైపోయిన వృద్ధుల శరీరాల మీద తేలే నరాల సముదాయమే గుర్తుకొచ్చింది. వాళ్ళది డాంబర్ రేకుల కప్పుతో ఉన్న చిన్న ఇల్లు. ఇంటి నిండా తుకతుకలాడుతూ చిన్నచిన్న పిల్లలు. ఇద్దరు ఆడవాళ్ళు బొగ్గుల కుంపటి ముందు కూర్చుని ఉన్నారు. కుంపటి మీద ఓ చిన్న స్టీల్ ప్లేటుంది. ఆ ప్లేట్లో రకరకాల సైజుల్లో ఆకృతుల్లో చిన్న చిన్న రంగురాళ్ళున్నాయి. కుంపటి మీద

వేడెక్కి ఉన్న రంగు రాళ్ళను చిమ్మటలతో పట్టుకొని కార్ఖానాల నుండి వచ్చిన ముడిగాజుల మీద వాటి సైజునుబట్టి రకరకాల డిజైన్లలో అంటిస్తున్నారు. ఆ రంగురాళ్ళు వేడిగా ఉండడంతో గాజుల మీద పెట్టీ పెట్టడంతోనే అవి లక్కలోకి దిగి గట్టిగా అతుక్కుపోతున్నాయి. ఆరు గాజులను కలిపి ఒక సెట్ అంటారట. ఒక స్త్రీ రోజుకు ఒక సెట్ మీద రంగురాళ్ళను పొదుగుతుంది. ఒక సెట్ రంగురాళ్ళను పొదిగితే ఎక్కువలో ఎక్కువ రెండు వందల రూపాయాలొస్తాయి.

వరంగల్లు, కరీంనగర్ జిల్లాల్లోని మహిళలు ఇంటింటికీ ఏ విధంగా బీడీలు చుట్టుకుంటూ జీవనోపాధి సంపాదించుకుంటారో అదేవిధంగా హైదరాబాద్ చార్మినార్ ప్రాంతలో వేలాదిమంది స్త్రీలు ముఖ్యంగా ముస్లీమ్ స్త్రీలు లక్కగాజుల మీద రంగురాళ్ళు పొదుగుతూ జీవనోపాధి సంపాదించుకుంటున్నారు.

నేను వెళ్ళిన ఆ ఇంట్లో కుంపటి ముందు కూర్చున్న *మహిళలిద్దరూ అక్కా-చెల్లెల్లు. తాహెరా, ఫరీదా. అక్క తాహెరా ఆ కుటుంబాన్ని ఎల్లదీయడం కోసం పెండ్లి కూడా చేసుకోలేదు. చెల్లెలుకి పెండ్లి చేసింది. మరిది రెడీమేడ్ టైలరింగ్ షాప్‌లో పీస్ వర్క్ చేస్తుంటాడు. వచ్చిన పైసల్ని వచ్చినట్టే తాగేసి బస్తీమీదబడి తిరుగుతుంటాడు. పైగా వాళ్ళకు ముగ్గురు చిన్న పిల్లలు. ఒక అన్న, ముగ్గురు కొడుకులు కలిగిన తరువాత తాగీ-తాగీ చనిపోయాడు. అతను చనిపోగానే భార్య ఆ ముగ్గురు పిల్లల్నీ ఆడబిడ్డ మీద వదిపెట్టి మరో పెండ్లి చేసుకొని వెళ్ళిపోయింది. దాంతో ఆ ముగ్గురు మేనల్లుళ్లనూ తాహేరానే చదివిస్తుంది. ఇక మిగిలున్న ఒక్క అన్నకు బుద్ధిమాంద్యం. దాంతో అతను పెండ్లీ పేరంటం లేకుండా మిగిలిపోయాడు. అతనే నన్ను సదానంద్‌గారి షాపు నుండి వాళ్ళ ఇంటికి తీసుకొచ్చాడు. అతను షాపులో పనికి వెళ్ళిన్నాడు వెళతాడు లేనినాడు లేదు. అంత పెద్ద కుటుంబ భారాన్ని మోస్తున్న తాహేరా ఏనాడు తన వ్యక్తిగత సుఖాలను గురించిగాని, పెండ్లీ, పిల్లలు, ఇల్లు, సంసారం గురించి ఆలోచించలేదు.*

ఆ ఇరుకు గల్లీల్లో ఇటువంటి తాహేరాలు ఎన్ని వందల మంది చార్‌మీనార్ సాక్షిగా జీవచ్ఛవాల్లా బ్రతుకులీడుస్తున్నారో తల్చుకుంటే గుండెలు బరువెక్కిపోయాయి. వాళ్ళతో అలా చాలా విషయాలు మాట్లాడిన తరువాత వాళ్ళనో ఫొటో తీసుకుంటానంటే మాత్రం ఒప్పుకోలేదు. చివరికి వాళ్ళకు ధన్యవాదాలు తెలియజేసుకొని అక్కడి నుండి తిరిగి సదానంద్‌గారి షాప్ దగ్గరికెళ్ళాను. వెంటనే అతను గుమస్తా దిక్కు చూస్తూ ''సార్‌ని రంజన్‌భాయ్ కార్ఖానాకాడికి తీసుకుపోయి వదిలిపెట్టిరా పో'' అన్నాడు.

“సరే!” అంటూ తల ఊపిన అతను “రా సారూ!” అన్నట్టు నాకేసి తలూపుతూ ముందుకు కదిలాడు.

అతని వెనుకనే నేనూ బయలుదేరాను.

రంజన్ భాయ్ కార్ఖానా అక్కడికి దగ్గర్లోనే ఉంది.

చెక్కమెట్ల మీదుగా మూడో అంతస్తు ఎక్కితేగాని కార్ఖాన రాలేదు.

''మూడో అంతస్తు మీద కార్ఖానా ఏంట్రా నాయినా!?'' అనుకున్న నాకు అక్కడికి వెళ్ళిన తరువాతగాని అసలు కార్ఖానా ఎలా ఉంటుందో అర్థంకాలేదు. ఆ చిన్న గదిలో ఒకటిన్నర బై మూడు దీర్ఘచతురస్రాకారంలో, తొమ్మిదంగుళాల ఎత్తుగల భట్టీ ఉంది. భట్టీకి రెండు చివర్లలో రెండు ఇనుప ప్లేట్లు పొందించి ఉంచారు. ఆ రెంటి మధ్యనున్న ఖాళీ స్థలంలో కణకణమని కన్పిస్తున్న నిప్పుకణికలు వేడిని చిమ్ముతున్నాయి. అంచేత భట్టీకి రెండు పక్కలా ఉన్న ఇనుప ప్లేట్లు కూడా కొద్దిగా వేడెక్కి ఉన్నాయి. ఆ వేడి ప్లేట్ల మీద శుద్ధి చేసిన లక్క, రొజన్, మార్బుల్ పౌడర్, టిటానియమ్ పౌడర్‌లాంటి కొన్ని పదార్థాలను కావాల్సిన మోతాదుల్లో వేసి వేడి చేస్తున్నారు. నెమ్మదిగా వేడెక్కినవాటినన్నీటినీ కలిసి అడుగున్నర పొడవున, పిడికెడు లావున ఉండే లక్క రోల్స్‌ను తయారు చేస్తున్నారు. ఆ లక్క రోల్స్ చివర రకరకాల రంగులను అద్ది వాటిని పల్చటి పొరగా తయారు చేస్తున్నారు. ఆ పొరను కావాల్సిన మేరకు కత్తిరించి తీసుకున్న తరువాత దాన్ని అడుగున్నర పొడవు, మూడంగుళాల వెడల్పు ఉన్న నలుచదరపు నల్లమద్ది రన్నర్ ముక్క మీద

పావు ఇంచు లోతుతో చెక్కివున్న గాడిలో పరిచారు. తరువాత కొన్ని అల్యూమినియం రింగుల్ని ఎంచుకుని వాటిని ఆ లక్క పొరలో దింపేసి చుట్టేస్తారు. వాటిని ముడిగాజులంటారు.

ఆ ముడిగాజుల్ని భట్టి మీద వేడెక్కి ఉన్న ఇనుప ప్లేట్ల మీద కొంతసేపుంచి కర్రతాపీలతో చిన్నగా తట్టసాగారు. అట్లా తట్టడంవల్ల అల్యూమినియం రింగులు భవిష్యత్తులో లక్కలో నుండి బయటకు జారిరాకుండా చుట్టు అంచులాగా ఏర్పడింది. ఇక అంతటితో ముడిగాజుల తయారీ పూర్తైనట్టే.

ఇక ఆ ముడిగాజులను ఒక్కో కార్ఖానావాళ్ళు తమకు అనుబంధంగా పనిచేసే గృహిణుల ఇళ్లకు పంపిస్తారట. వాళ్ళక్కడ గాజుల సైజునుబట్టి రంగు రాళ్ళను అనేక ఆకృతుల్లో అంటించి అందమైన రవ్వల గాజుల్ని తయారు చేస్తారు. అలా తయారు చేసిన ఒక్కో సెట్‌కి నూటా యాభై నుండి, రెండువందల రూపాయల వరకు మజూరీ ముడుతుంది.

"మన హైదరాబాద్‌లో ఈ లక్క గాజులు మాత్రమే తయారవుతాయంటున్నారుగదా? మరి ఇంతలక్క ఎక్కన్నుండొస్తుంది? అసలు లక్కను ఎలా తయరు చేస్తారు?" నాలో కొత్తగా పుట్టుకొచ్చిన సందేహాన్ని రంజన్‌భాయ్ ముందు పెట్టాను.

"లక్క చెట్ల నుంచి వస్తదని తెలుసుగానీ ఎట్లొస్తదో ఏందో మాత్రం మాకు తెల్వదు" అన్నాడు రంజన్ భాయ్.

ఇప్పటిదాకా నాకు ఏవైనా సీల్లు వేయడానికి, లేదా ఆడవాళ్ళ మంగళసూత్రాలు వంగిపోకుండా వాటి వెనుక తాపడం చేయడానికి లక్కను ఉపయోగిస్తారని తెలుసు. కానీ దాంతో ఇలా గాజులు, గోళ్ళ రంగులువంటి అనేక ఇతర వస్తువుల్లో కూడా వినియోగిస్తారని మొదటిసారి తెలిసొచ్చింది. ఇదంతా విన్న తరువాత లక్కను గురించిన సమాచారాన్ని కూలంకషంగా తెలుసుకోవాలన్న కోరిక అప్పటికప్పుడు నా మనసులో పుట్టుకొచ్చి వర్షాకాలపు మేఘంలా మెదడంతా ఆక్రమించింది.

"దేశంలో ఎక్కువ శాతం మంది స్త్రీలు వేసుకునే మట్టిగాజులు మన హైదరాబాద్‌లో ఎందుకు తయారు చేయడంలేదు?" నా మనసులో పుట్టుకొచ్చిన మరో సందేహాన్ని రంజన్‌భాయ్ ముందుంచాను.

"జనమంతా అనుకుంటున్నట్టు నిజానికవి మట్టిగాజులు కావు. అవి గాజు గాజులు. ఆడవాళ్ళా గాజులు తొడుక్కునేటప్పుడు వూకెనే చిట్లిపోతుంటాయి. అందుకే వాటిని మట్టిగాజులంటారు. ఎందుకనో మొదట్నుంచి మనకాడ వాటిని తయారు చెయ్యట్లేదు. వాటిని తయారు చేసే కార్ఖానాలెక్కువగ యుపి, రాజస్థాన్లలో ఉంటాయి" అంటూ మట్టిగాజుల గురించిన మరికొంత సమాచారాన్ని తెలియజేశాడు రంజన్‌భాయ్.

"లక్కతోపాటు మట్టిగాజుల తయారీని గురించి కూడా ఆయా ప్రాంతాలకెళ్ళి తెలుసుకోవాలి" అన్న ఆలోచన నాకు కలిగింది.

యాదృశ్చికంగా "గాజుల మీద నవల రాయాలి" అనుకున్న తరువాత "హైదరాబాద్ వెళ్ళొస్తే సరిపోతుందిలే" అకున్న నాకు ఆ విషయంలో ఇతర రాష్ట్రాలకు కూడా వెళ్ళాల్సొస్తుందన్న ఎరుక కలగడంతో ఒకపక్క సంతోషం, మరోపక్క "అంత దూరం ఒంటరిగా ఎలా వెళ్ళిరాలి?" అన్న విచారం మనసులో గిజిగాని గూడు మాదిరిగా అల్లుకుపోసాగింది. దాదాపు మూడు గంటలపాటు రంజన్‌భాయ్ కార్ఖానాలో కూర్చుని లక్క గాజుల తయారీ, మార్కెట్ పద్ధతుల్ని గురించి తెలుసుకున్నాను. చివరికి, కార్ఖానాలో రంజన్‌భాయ్‌తో పాటు ఉన్న అతని అసిస్టెంట్ సత్తార్‌కి, ఆయన దోస్త్ మగ్దూద్ మొహియుద్దీన్‌కి "మరొకసారి వస్తాను" అంటూ చెప్పి శలవు తీసుకున్నాను. సదానంద్ గారు మా కోసం గంటకోసారి 'చాయ్' పంపించి దన దాతృత్వాన్ని చాటుకున్నాడు. కార్ఖానా నుండి తిరిగి సదానంద్‌గారి షాప్‌కెళ్ళి కొంతసేపు కూర్చున్న తరువాత "మళ్ళోసారొస్తా" అంటూ శలవు తీసుకున్నా.

**లక్క చెట్లను వెతుక్కుంటూ..**

హైదరాబాద్ నుండి ఇంటికొచ్చిన దగ్గర్నుండి లక్క విషయంలోను, మట్టిగాజుల విషయంలోనూ ఏదో ఒకటి చెయ్యాలన్న ఆరాటం నాలో రోజు రోజుకూ పెరిగిపోసాగింది.

"లక్క చెట్ల నుండి వస్తుంది. కాబట్టి అడవులు ఎక్కువగా ఉండే ప్రాంతానికి వెళితే దాన్ని గురించిన విషయాలు తెలిసే అవకాశాలు మెండుగా ఉంటాయి. కాబట్టి ఏ ఛత్తీస్‌ఘడ్‌కో లేదా ఒడిస్సాకో వెళ్ళి రావాల్సిందే" అన్న నిర్ణయానికొచ్చాను.

అనుకున్నదే ఆలస్యం ఒడిస్సాలోని రాయగడవాసి, నాకు సాహితీ మిత్రుడూ అయిన శ్రీ ఆనందరావు పట్నాయక్‌గారికి ఫోన్ చేసి, విషయం వివరించాను.

నా అభ్యర్ధనను పరిగణలోకి తీసుకున్న ఆయన "నిజానికి దాని విషయంలో నాకేమాత్రం అవగాహనలేదు. కానీ, ఇక్కడి మన తెలుగు మిత్రులతో విచారించి ఓ వారం రోజుల్లో మీకు ఏదో ఒక సమాచారాన్ని తెలియజేస్తాను" అంటూ భరోసా ఇచ్చారు.

అన్నట్టే వారం రోజుల తరువాత రాయగడ నుండి ఫోన్ చేసిన ఆనందరావు పట్నాయక్‌గారు "ఇక్కడ జయపురంలో నా కవి మిత్రుడు, తెలుగువాడూ అయిన శ్రీ సింహాద్రి శ్రీనివాసరావుగారు ఉన్నారు. మీరు గనుక ఆయన దగ్గరికి వెళితే వాళ్ళ ఊరికి దగ్గర్లోనే ఉన్న నవరంగ్‌పూర్ అనే జిల్లా హెడ్‌క్వార్టర్‌లో లక్క తాలూకు వివరాలు తెలుస్తాయట. కాబట్టి మీరు వెంటనే జయపురం వెళ్ళి ఆయన్ని కలిస్తే తను మీకు అన్ని రకాలుగా సహాయం చేస్తాడు" అంటూ సింహాద్రి శ్రీనివాసరావు గారి ఫోన్ నెంబరిచ్చారు.

నేను వెంటనే శ్రీనివాసరావుగారికి ఫోన్ చేశాను.

"మీరెప్పుడొచ్చినా నేను, నా మిత్రుడు మాదాబత్తుల శ్రీనివాస్ ఇద్దరం రెడీగా ఉంటాం" అంటూ ఆ ఊరు ఎలారావాలో కూడా తెలియజేశారు.

శ్రీనివాస్‌గారు ఫోన్ చేసిన మూడోనాడు ఉదయం నాలుగ్గంటలకల్లా తయారై రోడ్డు మీదికి వెళ్ళగానే నాకు తెలిసినవాళ్ళ కారొకటి చింతూరు దాకా ఖాళీగా వెళుతూ నన్ను చూసి ఆగింది. వెంటనే దాన్లో ఎక్కి భద్రాచలంలో దిగాను.

అప్పటికే భద్రాచలం టు జయపురం వెళ్ళే ఒరిస్సా స్టేట్ సర్వీస్ బస్సు కాంప్లెక్స్‌లో తయారుగా ఉంది.

వెంటనే ఎక్కి కూర్చున్నాను. బస్సులో తొంభైశాతం మంది ఒరియా వాళ్ళే ఉన్నారు. చెప్పినట్టుగానే బస్సు ఖచ్చితంగా ఐదుగంటలకు బయలుదేరింది.

చూస్తుండగానే బస్సు తెలంగాణ సరిహద్దులను దాటి ఆంధ్రప్రదేశ్‌లోని చింతూరు, డొంకరాయి, ఎగువ సీలేరు చేరుకుంది. అక్కడ టిఫిన్ చేశాము. టిఫిన్ తరువాత ఓ గంట ప్రయాణం చేసి ఒరిస్సా రాష్ట్రంలోకి ప్రవేశించాము.

చిత్రకొండదాటి బలిమెల రిజర్వాయర్ చేరేటప్పటికి మధ్యాహ్నం ఒంటిగంట దాటిపోతుంది. బలిమెల రిజర్వాయర్ చూడగానే అక్కడ జరిగిన ఒకనాటి విషాద ఘటన తాలూకు వార్తా కథనాలన్నీ నా మనసు పొరలను చీల్చుకొని కండ్ల ముందు సినిమా రీళ్ళ మాదిరిగా గిర్రున తిరిగిపోయాయి. బస్సులో నుండే ఆ రిజర్వాయర్ పరిసరాలను పరికిస్తూ... ఫొటోలు తీసుకుంటూ ముందుకు సాగిపోయాను. రెండు-రెండున్నర ప్రాంతంలో బలిమెల బస్‌స్టాండ్‌లో భోజనాల కోసం బస్సు ఆపారు. బస్టాండ్ ఎదురుగా ఉన్న హోటల్లో భోజనానికి కూర్చున్నాను. మొదటిసారి ఒడియా భోజనం రుచి చూశాను. కంచం మధ్యలో ఇంత అన్నం పడేసి, దాని నెత్తిన అంత పులుసు గుమ్మరించి, దాని చుట్టూ కొంచం ఆకు కూర, కొంచం ఆలుగడ్డ కూర, ఇంకేదో నేను గుర్తుపట్టలేని కలగూర వేసి తెచ్చి ముందుపెట్టారు.

'కాలే కడుపుకు గంజే పానకం' అన్నట్టు గబగబా నాలుగు ముద్దలు మింగాను. కానీ, తరువాత నా వల్లకాక "పెరుగు వెయ్యండీ!" సప్లయర్ దిక్కు చూస్తూ అన్నాను.

"మాదగ్గర పెరుగు ఉండదు" అన్నాడు.

"పెరుగుండదా?!"

"పక్కనే ఉన్న షాపులో అమ్ముతారు - కొనుక్కొచ్చుకోవాలి" అంటూ పక్కషాపు వంక చెయ్యి చూపించాడు.

"మీరు తీసుకురండి! నేను తరువాత డబ్బులిస్తాగాని" అన్నాను.

వెంటనే వెళ్ళి ఓ వెడల్పాటి సత్తుగిన్నెలో అడుగెనెక్కడో ఇంతంత పిల్లికడుగుడులాంటి పెరుగు తెచ్చి నా ముందు పెట్టాడు.

"బతుకు జీవుడా!" అనుకుంటూ దాంతోనే రెండు ముద్దలు తిన్నాను.

"మంచినీళ్ళన్నా కడుపు నిండా తాగుదాంలే" అనుకుని ఆ గ్లాసులు, ఆ నీళ్ళు చూస్తే దాగబుద్ధి కాలేదు.

దాంతో "నాకో వాటర్ బాటిలివ్వండీ!" అన్నాను.

"ఈ ఆంధ్రావాళ్లంతా ఇంతే ఉన్నది తినరు, లేనిది కావాలంటారు" విసుగ్గా అంటూ మళ్ళీ పక్కషాపుకెళ్ళి ఓ వాటర్ బాటిల్ తెచ్చిపెట్టాడు. కడుపు నిండా నీళ్లు తాగి లేచి చేతులు కడుక్కున్నాను. మొత్తం కలిపి ఎనభైరూపాయలు తీసుకున్నాడు.

"అన్నం ఎలా పెట్టినా, ఎంత పెట్టినా డబ్బులు మాత్రం న్యాయంగానే తీసుకున్నాడులే" అనుకుని తిరిగి బస్సు దగ్గరికి చేరుకున్నాను. అప్పుడు సాయంత్రం మూడు, మూడున్నర గంటలు కావస్తుంది. భద్రాచలం దాటగానే మొదలైన అడవి పోను-పోను ఇంకా-ఇంకా చిక్కబడడమే తప్ప పల్చబడిందిలేదు. పొద్దుటి నుండి కన్నుల నిండా అడవిని, గిరిజన గ్రామాలను, గిరిజనులను చూసుకుంటూ పన్నెండు గంటల ప్రయాణం తరువాత సాయంత్రం ఐదున్నర గంటలకు జయపురం బస్టాండ్‌లో దిగాను.

దిగగానే శ్రీనివాస్‌గారికి ఫోన్ చేశాను.

బస్టాండ్ ఎప్పటిదో రాజుల కాలంనాటిదిలా ఉంది. చుట్టూ పెద్ద-పెద్ద చెట్లున్నాయి. వాటి మీదికి అప్పుడప్పుడే చేరుతున్న రకరకాల పక్షులు కర్ణ కఠోరంగా అరుస్తున్నాయి. అంతలోనే గాలి దుమ్ము మొదలయ్యి బస్టాండ్‌ను చెత్తా-చెదారంతో ముంచెత్తింది.

"వర్షం కూడా పడుతుందేమో" అనుకున్నాను.

కానీ, గాలి ఉన్నచోట మబ్బులు మాయమైతాయన్న విషయం మరోసారి ఋజువయ్యింది. గాలి తగ్గిపోగానే నేను చెప్పిన గుర్తుల ప్రకారం శ్రీనివాస్ గారు నేరుగా నా దగ్గరికే వచ్చి బైక్ ఆపారు. పరస్పర పరిచయాలైన తరువాత నేరుగా తన ఇంటికే తీసుకెళ్ళారు. ఒరిస్సాలో ప్రతి ఇంటికి బయటి తలుపులు సహజంగా వెడల్పుగా ఉంటాయి. వాటికీ ఇనుప గ్రిల్స్ ఉంటాయి. ఇంటి ముందు బైక్ దిగిన నన్ను నేరుగా మేడ మీదికి తీసుకుపోయారు.

"మావాళ్ళంతా విశాఖపట్టణం వెళ్ళారండీ! తెల్లవారుజాముకల్లా వస్తారు" ఇంట్లో మనుషుల అలికిడే లేదేంటనుకుంటున్న నా మనసులోని భావాన్ని అర్థం చేసుకున్నట్టుగా చెప్పాడు శ్రీనివాస్‌గారు. స్థిమితంగా కూర్చున్న తరువాత నేనెందుకొచ్చానో కూలంకషంగా వివరించాను. అంతా విన్న తరువాత "ఔనండీ! మీ గురించి, మీ ఈ ప్రయాణం యొక్క ఉద్దేశం గురించి పట్నాయక్ గారు నాకంతా చెప్పారు. మీరు మా ఇంటికి రావడం నాకు చాలా సంతోషంగా ఉంది" అంటూ శ్రీనివాస్ గారు నన్ను కొంచం ఇబ్బందికి గురి చేసినా ఆ తరువాత అనేక విషయాలు మాట్లాడుతూనే కింది పోర్షన్లో ఉన్న వాళ్ళ తమ్ముడి కూతురు రాగిణికి ఫోన్ చేసి కాఫీ తెప్పించారు. మేము కాఫీతాగుతుండగానే జిల్లా పరిశ్రమల శాఖలో పనిచేస్తున్న ఆయన మిత్రుడు మాదాబత్తుల శ్రీనివాస్‌గారు వచ్చారు. పరస్పర పరిచయాలు అయిన తరువాత నా పర్యటన ఉద్దేశమేంటో వివరించి "మీ ఇద్దరి పేర్లు ఒక్కటే కదా? ఒకర్ని పిలిస్తే ఒకరు పలుకుతారేమో?" అన్నాను నవ్వుతూ

"మీకటువంటి ఇబ్బంది లేకుండా హాయిగా మా ఇండ్ల పేరుతో పిలవండి చాలు" ఇద్దరూ ఒకేసారి అన్నారు.

"అంతేనంటారా!"అన్నాను.

"మంచిది రేపు పొద్దున్నే పదింటికి నవరంగ్‌పూర్ వెళదాం అక్కడ లక్క బొమ్మలు చేసి అమ్మే ఓ కుటుంబముంది. వెళ్ళి కలుద్దాం" అన్నాడు మాదాబత్తుల.

"సరే! మంచిది"అన్నాను.

మరికొంతసేపు మాట్లాడుకున్న తరువాత "రేపు కలుద్దాం" అంటూ మాదాబత్తుల వెళ్ళిపోయారు.

నేను స్నానం చేసొచ్చేసరికి, కింది నుండి వేడి వేడి పుల్కాలు వచ్చి తయారుగా ఉన్నాయి.

తిన్న తరువాత "వేరే బస్తీలో మా మామగారి

ఇల్లుంది. అద్దెకుండే వాళ్ళు ఈ మధ్యే ఖాళీ చేసి వెళ్ళారు. మా దగ్గర అసలే దొంగల భయం ఎక్కు. ఇంట్లో మనుషులు లేరని తెలిస్తే దొంగలు జొరబడతారు. అందుకే మనం అక్కడికెళ్ళి పడుకుందాం పదండీ!'' అన్నాడు సింహాద్రి. రాత్రి పదిగంటలకు మెల్లగా వాళ్ళ మామగారి ఇంటికెళ్ళాము. మళ్ళీ కాస్సేపు మాట్లాడుకున్న తరువాత తను వాళ్ళ బెడ్‌రూమ్‌లో పడుకున్నాడు. నేను గెస్ట్‌రూమ్‌లో పడుకున్నాను. రాత్రి రెండు గంటలకు రావాల్సిన వాళ్ళ మామగారు వాళ్ళు కాస్తా.. మూడున్నర కొచ్చి కింద నుండి అరిచీ-అరిచీ మేము లేవకపోవడంతో సింహాద్రిగారి శ్రీమతి సుజాతగారు గేట్ దూకి పైకొచ్చి తలుపు తట్టడంతో నేను లేచి వెళ్ళి ఆయన్ని లేపాను.

**నవ్యమైన నవరంగ్‌పూర్ ప్రయాణం:**

పొద్దున్నే లేచి తిరిగి సింహాద్రిగారి ఇంటికెళ్ళి అక్కడే తయారై టిఫన్ చేసి జయపురం రాజా విక్రమదేవ్‌వర్మ కాంస్య విగ్రహాన్ని, శిథిలమైన వారి నివాస గృహాన్ని, యుద్ధ సమయాల్లో శత్రు రాజుల కోటలను ధ్వంశం చేసే ఫిరంగినే దేవతగా నిల్పుకుని కట్టిన ఫిరంగిమాత దేవాలయాన్ని చూసుకొని నవరంగ్‌పూర్ వెళ్ళడానికి పదిగంటలకల్లా బస్టాండ్‌కి చేరుకున్నాము. మాదాబత్తుల గారు అప్పటికే అక్కడికొచ్చి మా కోసం ఎదురు చూస్తున్నాడు. మరో పావుగంటలో బస్సెక్కాము. జయపురం నుండి నవరంగ్‌పూర్ నలభైఐదు కి.మీ. దానికి గంటన్నర పట్టింది. నవరంగ్‌పూర్ నిజంగా అందమైన, పురాతన వాసనలు పూర్తిగా వదిలిపోని సాంప్రదాయమైన పట్టణం. ఎవరిని కలవాలని మేం ఆ ఊరెళ్ళామో, వాళ్ళ షాప్ బస్సు దిగ్గానే మెయిన్‌రోడ్డు పక్కనే ఉంది. షాప్‌లో దివ్యాంగుడైన ఓ యువకుడున్నాడు.

అతను మాదాబత్తులను చూడగానే గుర్తుపట్టారు.

శ్రీనివాస్‌ళ్ళిద్దరూ నాగురించి తనకి వివరించారు.

అతను వెంటనే వాళ్ళు తయారుచేసి షాప్‌లో అమ్మకానికి పెట్టిన రకరకాల లక్క బొమ్మలను చూపిస్తూనే.. మేం వచ్చిన విషయాన్ని వాళ్ళ ఇంటికి ఫోన్ చేసి చెప్పాడు. మేం మాట్లాడుతుండగానే ఇంటిదగ్గర్నుండి వాళ్ళ అక్క ఒకావిడ వచ్చింది. మాదాబత్తుల గారితో ఒరియాలో కొంతసేపు మాట్లాడిన ఆవిడ మమ్మల్ని ఇరుకు వీధుల గుండా వాళ్ళింటికి తీసుకెళ్ళింది. వాళ్ళు మొత్తం ఏడుగురు అక్కా చెల్లెల్లట. వాళ్ళంతా ఎనభై ఏండ్ల నుండి ముప్పై ఏండ్ల మధ్యలో ఉన్నారు. విషాదమేమిటంటే వాళ్ళెవ్వరికీ పెళ్ళిళ్ళు కాలేదని తెలిసింది. అప్పుడే వెళ్ళిన నేను "మీరంతా ఏ కారణం చేత పెళ్ళిళ్ళు చేసుకోలేదు?'' అంటూ వ్యక్తిగత విషయాలను ప్రస్థావించలేకపోయాను.

నేను హైదరాబాద్‌లో చూసిన లక్కను, వాటిల్లో కలిపే రంగులను, ముడి లక్కను, లక్కతో వాళ్ళు తయారు చేసిన రకరకాల బొమ్మలను చూపించారు. అవ్వన్నీ చూసిన తరువాత "అసలు లక్కను ఎలా తీస్తారు? ఏ చెట్ల నుండి తీస్తారు? ఎక్కడ తీస్తారు?''లాంటి నా మౌలిక ప్రశ్నలను హైదరాబాద్‌లో రంజన్‌భాయ్‌ని అడిగినట్టే అడిగాను.

వాళ్ళు కూడా సరిగా సమాధానం చెప్పలేకపోయారు. కానీ, "ఇక్కడి నుండి దాదాపు నూటా అరవై కి.మీ. వెళితే 'చందాహండీ' అనే ఊళ్లో లక్క తీస్తారు. అక్కడికి వెళితే మీరనుకున్న సమాచారం మొత్తం దొరుకుతుంది'' అంటూ కొన్ని వివరాలు తెలియజేశారు. ఆ అక్కా చెల్లెల్లందరికీ ధన్యవాదాలు తెలియజేసి కొన్ని బొమ్మలు కొనుక్కొని అక్కడి నుండి బయటపడ్డాము.

"శ్రమపడి ఇంత దూరము వచ్చినందుకు నేను అనుకున్న స్థాయిలో లక్కకు సంబంధించిన సమాచారం అభించలేదు'' అన్న అసంతృప్తి మనసులో గింగిరాలు తిరుగ సాగింది. ఆ పక్కనే ఉన్న గ్రామదేవత ఘరణిమాత ఆలయంలో భోజనం చేసి బస్సెక్కాము. మూడు గంటలకు తిరిగి జయపురం చేరాము. మాదాబత్తులగారికి ఏదో అర్జంట్‌పని ఉందని చెప్పి వెంటనే ఇంటికెళ్ళిపోయారు. నేను, సింహాద్రిగారూ ఆయన బైక్ మీదే అక్కడికి ఇరవైఐదు కి.మీ. దూరంలో ఉన్న కోరాపుట్ జగన్నాథ దేవాలయాన్ని చూసిరావడానికని బయలుదేరి వెళ్ళాము.

కోరాపుట్‌వెళ్ళే రోడ్డు మొత్తం ఘాట్ రోడ్డే.. చాలా అందంగా ఉంది. ఆ ఘాట్‌రోడ్డు అందాలను ఆస్వాదిస్తూ నాలుగ్గంటలకల్లా కోరాపుట్ చేరుకొన్నాము. ఊళ్లో

అడుగు పెడుతూనే సింహాద్రిగారి బంధువు ఒకాయన మాకు ఎదురై తన షాప్ దగ్గరికి తీసుకుపోయి 'టీ' తెప్పించి మర్యాద చేశాడు. మేం మాట్లాడుతుండగా మమ్మల్ని చూసి మరికొందరు స్థానికులు పోగయ్యారు. నలుగురు చేరిన దగ్గర జరగవలసిన మాటలన్నీ జరిగాయి. అట్లా వాళ్ళ దగ్గర కొంతసేపు గడిపిన తరువాత సెలువు తీసుకుని బయటపడ్డాము. మా ద్విచక్రవాహనం నేరుగా వెళ్ళి జగన్నాథుడి ఆలయం ముందు ఆగింది. అదొక అద్భుతమైన ఆలయం. తోబుట్టువులతో కొలువుతీరిన జగన్నాథ్‌ణ్ణి దర్శించుకున్న తరువాత ఆలయ ప్రాంగణంలో తీర్చిదిద్దిన అనేక ప్రముఖ దేవాలయాల ప్రతిరూపాలను కూడా సందర్శించి ఫొటోలు తీసుకున్నాము. మెల్లగా కిందికి దిగాము. అక్కడ ఎవరో కుర్రవాడికి ఉపనయన కార్యక్రమం ఎంతో వేడుకగా జరుగుతుంది. మేము కూడా కొంతసేపు ఆ వేడుకను అస్వాదించి కొన్ని ఫొటోలు తీసుకుని తిరిగి బైక్ ఎక్కాము. ఆరుగంటలకల్లా జయపురం శ్రీనివాస్‌గారి ఇంటికి చేరుకున్నాము. స్నానాలు చేసిన తరువాత రాత్రి భోజనానికి వాళ్ళ మామగారి ఇంటికి వెళ్ళాము. వాళ్ళ మామగారి పేరు సాంబశివరావుగారు. వారి శ్రీమతి పేరు గిరిజ. వారికి ముగ్గురు అమ్మాయిలు. ఒక అబ్బాయి. అబ్బాయి అనారోగ్యంతో చనిపోయాడు. తను ఉత్కల్ గ్రామీణ బ్యాంక్‌లో మేనేజర్‌గా చేసి, పది సంవత్సారాల కిందట పదవీ విరమణ పొందారట. ఈ మధ్యే బైపాస్ సర్జరీ జరిగిందట. అదేపని మీద నెలకో, రెండునెల్లకో ఒకసారి విశాఖపట్టణం కె.జి.హెచ్.కి వెళ్ళొస్తుంటారట. మనిషి చాలా సౌమ్యుడు. ఆచీ తూచీ మాట్లాడుతాడు. వారి శ్రీమతి గిరిజ గారు నిజంగా గిరిజాదేవి మాదిరిగానే ఉంటారు. ఆవిడ నాతో మాట్లాడింది ఒకటి, రెండు మాటలే అయినా ఎంతో సహృదయంతో మర్యాద ఉట్టిపడే స్వరంతో నెమ్మదిగా మాట్లాడారు. వారితో మాట్లాడుతుంటే నాకు చాలా సంతోషం అన్పించింది. ఇంతకు పూర్వమే ఆ కుటుంబమంతటితోనూ పరిచయం ఉన్నట్టుగా అన్పించింది తప్ప కొత్త వ్యక్తుల మాదిరిగా అన్పించలేదు. సింహాద్రిగారు వారి పెద్దల్లుడు. అమ్మాయి పేరు సుజాత. తను కూడా తల్లిదండ్రుల మాదిరిగానే చాలా సౌమ్యురాలు. ఇంటికొచ్చిన వారిని కొత్త పాత తేడా లేకుండా ఆదరించే ఇల్లాలు. తను ప్రైవేట్ స్కూల్లో టీచర్‌గా పనిచేస్తుంది. మిగతా ఇద్దరమ్మాయిలు వేరే ఊళ్ళల్లో ఉండడంతో సింహాద్రిగారి దంపతులే వాళ్ళ మంచి సెబ్బరలు చూసుకుంటుంటారు. రాత్రి భోజనం అయిపోయిన తరువాత నేను సింహాద్రిగారు పడుకోడానికి తిరిగి వాళ్ళ పాత ఇంటికి వెళ్ళము.

పడుకునే ముందు "తెల్లవారి పొద్దున్నే రాయగడ శ్రీ ఆనందరావు పట్నాయక్‌గారి దగ్గరికి వెళ్ళిరావాలి" అనుకున్నాను.

**రాయగడ ఒడియా నేలమీద తెలుగు జాతి సాహితీ గండరగండ:**

ఉదయం ఆరుగంటలకల్లా నన్ను తన బైక్ మీద బస్టాండ్‌కి తీసుకెళ్ళిన సింహాద్రిగారు రాయగడ బస్సు ఎక్కించారు. జయపురం నుండి రాయగడకు నూటా అరవై కి.మీ.లు. అడవి కొంత పల్చగా ఉంటుంది. ఘాట్లు తగులుతుంటాయి. దారి పొడవునా లెక్కకు మించిన చిన్న-చిన్న గిరిజన గ్రామాలు కన్పిస్తుంటాయి. బస్సు తొమ్మిది గంటల ప్రాంతంలో ఓమాదిరి పెద్ద గ్రామమైన కత్తిరి గుమ్మలో 'టి' టిఫిన్ కోసం ఆగింది. అందరితో పాటు నేనూ టిఫిన్ కోసం దిగాను. కానీ, ఆ హోటల్, దాని పరిసరాలు చూసేసరికి నాకు అక్కడేమీ తినాలి అనిపించలేదు. దాంతో ఆ పక్కనే ఉన్న ఓ షాపులో వాటర్ బాటిల్ కొనుక్కుని తిరిగి బస్సెక్కాను. మొత్తం మీద బస్సు రాయగడ చేరేసరికి మధ్యాహ్నా పన్నెండు గంటలు కావస్తుంది. బస్సు దిగిన వెంటనే ఆనందరావు గారికి ఫోన్ చేశాను.

"నేనొస్తున్నాను అక్కడే ఉండండీ!" అన్నారాయన.

అన్నట్టే పావుగంటలో తన మిత్రుడు శ్రీ డి.ఇ.యన్. రావుగారిని కూడా వెంటబెట్టుకొని వచ్చేశారు.

వస్తూనే డి.ఇ.యన్. రావుగారు "కాంతారావుగారూ! ప్రయాణం బాగా జరిగిందా?" అంటూ ఆత్మీయంగా పలుకరించారు.

"బాగున్నాను సార్!" కొంచం మొహమాటంగా బదులిచ్చాను.

"నేను మీ బ్యాగ్ తీసుకెళ్ళి ఆనందరావుగారి ఇంట్లో పెట్టివెళతానుగాని. మీరిద్దరూ ఇటు నుండి ఇటే మజ్జి గౌరమ్మ గుడి, రైలు వంతెనా చూసుకొని ఎండ ముదరక ముందే ఇంటికొచ్చేయ్యండి!" ఎంతో చొరవగా నా చేతిలోని బ్యాగ్ తీసుకున్నారు. ఆయన ఒడిస్సా రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖలో స్టెనోగా పనిచేసి పదవీ విరమణ పొందారట. ఎంతో కలుపుగోలు మనిషి. ఆధ్యాత్మిక భావాలు అధికంగా ఉన్నవాడు. కవులు, రచయితలు అంటే వల్లమాలిన అభిమానం ఉన్నవాడు. తను అటు వెళ్ళిపోగానే నేను ఇటు ఆనందరావుగారి టూ వీలర్ మీద కూర్చున్నాను. ముందుగా మజ్జి గౌరమ్మతల్లి ఆలయానికి వెళ్ళి పావుగంటలోనే అమ్మవారిని దర్శించుకున్నాము. అమ్మవారిని గురించి స్థానికంగా ఒక కథ ప్రచారంలో ఉంది. గుడికి ఎదురుగా కొంత దూరంలో ఉన్న జంఝావతి నదిమీద బ్రిటీష్‌వారి హయామ్‌లో రైలు వంతెన కట్టడానికి కాంట్రాక్టర్ పని మొదలుపెట్టి పిల్లర్లు కడుతుంటే అవి కట్టినవి కట్టినట్టే తెల్లారిపాటికి కూలిపోసాగాయట. ఎన్నోసార్లు కట్టీ-కట్టీ అలిసిపోయిన కాంట్రాక్టర్ ఓ రోజు రాత్రి పడుకునేటప్పుడు "ఎందుకిలా జరుగుతుంది? ఇలాగైతే నాకు చెప్పలేనంత నష్టమొస్తుంది. కట్టలేకపోతే గవర్నమెంట్ వాళ్ళు నన్ను బ్లాక్ లిస్ట్‌లో పెట్టేస్తారు. మరిప్పుడెలా? ఏంచేయాలి?" అనుకుంటూ దిగులుతో కలత నిద్రలోకి జారిపోయాడట. అతనికి అమ్మవారు కలలోకొచ్చి "ఒరే! బాలకా! నేను మజ్జి గౌరమ్మతల్లినిరా! అనాదిగా ఈ గ్రామ దేవతను. కాల భ్రమణంలో జరిగిన కొన్ని కారణాల వల్ల నేను విస్మృతికి లోనయ్యాను. తిరిగి ఇప్పుడు ప్రాచుర్యంలోకి రావాల్సి ఉంది. ఊరికి ఉత్తరాన సూదికొండ మీద ఉన్నాను. నువ్వు కడుతున్న వంతెనకు సమీపంలో ఉత్తరాభి ముఖంగా గుడి కట్టి, నన్ను మేళతాళాలతో తీసుకొచ్చి అక్కడ ప్రతిష్టించావంటే ముందు ముందు నీకు అంతా శుభమే జరుగుతుంది. నీ కారణంగా నన్ను సేవించే అవకాశం ఇక్కడి ప్రజలందరికీ లభించబోతుంది. నన్ను శరణుజొచ్చిన వారినందరినీ నేను ఎల్లవేళలా కంటికి రెప్పలా కాచుకుంటాను" అంటూ శెలవిచ్చిందట. నిద్రలో నుండి తుళ్ళిపడి లేచిన ఆ కాంట్రాక్టర్ ఆ మరునాడే అమ్మవారు చెప్పిన జాడల ప్రకారం సూదికొండ మీదికెళ్ళి చూస్తే అమ్మ కనిపించిందట. దాంతో అతను అమ్మవారు చెప్పినట్టే గుడి కట్టించి మేళతాళాలతో అమ్మను తీసుకొచ్చి ప్రతిష్టించాడట. అమ్మ చెప్పినట్టే ఆ తరువాత బ్రిడ్జీ పని నిర్విఘ్నంగా జరిగిపోయిందట. అంతే కాదు అప్పటి నుండి అమ్మవారి పేరు ఆ చుట్టుపక్కల ఎంతో ప్రాశస్థ్యంలోకి వచ్చింది. అటువంటి చారిత్రక ప్రాధాన్యతగల గుడిని సందర్శించానన్న సంతోషంతో అక్కణ్ణుండి నేరుగా పాత వంతెన దగ్గరికి వెళ్ళాము. ఆనాడు బ్రిటీష్ వాళ్ళు కట్టించిన బ్రిడ్జికి వందేండ్లు దాటిపోవడంతో దాని జీవిత కాలం ముగిసిపోయింది. అందుకే భారత ప్రభుత్వం వారు దానికి దిగువన మరొక వంతెనకు శంకుస్థాపన చేశారు. పనులు కూడా వేగంగా జరుగుతున్నాయి. అక్కడి నుండి మెల్లగా ఆనందరావుగారి ఇంటికి చేరుకున్నాము. అప్పటికే వారి శ్రీమతి ఇందిర గారు మా కోసం భోజనం తయారుచేసి ఎదురు చూస్తున్నారు. మేం వెళ్ళి కాళ్ళు కడుక్కుని అలా కూర్చున్నామో లేదో డి.ఇ.యన్. రావుగారు వచ్చారు.

వారు అనేక విషయాల మీద అనర్గళంగా తన అభిప్రాయాలను తెలియజేసి ఆఖరిన "ఇప్పటికే చాలా పొద్దుపోయింది. మీరిక భోజనం చేయండి! నేనూ బయలుదేరుతాను" అంటూ మా నుండి శలవు తీసుకున్నారు.

ఇందిరగారు చక్కటి భోజనం వడ్డించారు. ముఖ్యంగా ఒడియావారికి అత్యంత ఇష్టమైన పొట్లీ కూరను కొసరి - కొసరి మరీ వడ్డించారు. వారి ఆత్మీయతతోనే సగం కడుపు నిండిన నేను వారి పొట్లీ కూరతో కడుపు నిండా తిన్నాను. భోజనం అయ్యేటప్పటికి రెండుగంటలయ్యింది. భోజనం తరువాత మరికొంతసేపు సాహిత్య విషయాలు మాట్లాడుకుంటూ కూర్చున్న మేము తరువాత కొంతసేపు విశ్రాంతి

తీసుకున్నాము. తిరిగి జయపురం వెళ్ళడానికి రాత్రి పదకొండుగంటల వరకు బస్సులుగానీ రైల్లుగానీ లేవని తెలిసింది. ఆ సమాచారం వినడంతోనే నా మనసులో ''ఎలాగైనా సరే రేపు 'చందాహండి' వెళ్ళాల్సిందే అనుకున్నది కాస్తా తప్పిపోతుందా ఏమిటి?'' అన్న ఆలోచన ఇంక నన్ను అక్కడ నిలువనియ్యలేదు.

''ముందు బస్టాండ్ దాకా వెళితే అక్కడి నుండి ఏదోక ప్రైవేట్ వెహికిలైనా పట్టుకొని ఏదో విధంగా రాత్రి ఎనిమిదింటికల్లా సింహాద్రిగారి ఇంటికి చేరుకుంటే తప్ప కారు మాట్లాడుకుని రేపు పొద్దున్నే 'చందాహండి' వెళ్ళడానికి కుదరదు'' అనుకున్నాను. అదే విషయాన్ని ఆనందరావుగారి దంపతులతో చెప్పాను.

''ప్రైవేట్ వేహికిల్సను నమ్ముకుని వెళితే ఎలా?'' అంటూ దంపతులిరువురూ అసంపూర్ణంగానే తమ సమ్మతిని తెలియజేశారు.

''అనుకున్న తరువాత ఆలస్యం చెయ్యడం ఎందుకు?'' అన్న ఆనందరావుగారు వెంటనే తన బైక్ మీద నన్ను బస్టాండ్ దగ్గరికి తీసుకెళ్ళారు. అంతకు ముందే అక్కడ నాలాగే జయపురం వెళ్ళేందుకు ఓ బ్యాంక్ మేనేజర్ వచ్చి ఉన్నాడు. అతనితో పరిచయం అయిన వెంటనే ''ఇక మీరు ఇంటికెళ్ళండి సార్! వీరితో కలిసి నేను వెళ్ళిపోతానుగాని'' అన్నాను. అయినా సరే ఆనందరావుగారు మరికొంతసేపు అక్కడే ఉండి చివరికి ''జాగ్రత్తగా వెళ్ళండి! మరి'' అంటూ వెళ్ళిపోయారు. బ్యాంక్ మేనేజర్ నేను ఇద్దరం కలిసి కొంచెం ముందుకు వెళ్ళేసరికి అక్కడో ఖాళీ కారు ఆగి ఉంది. వెంటనే దగ్గరికెళ్ళి ఆ పక్కనే ఉన్న డ్రైవర్‌తో ''జయపురం వెళుతుందా?'' అంటూ అడిగాము.

''వెళదాం ఎక్కండీ!'' మా కోసమే ఎదురు చూస్తున్నట్టుగా అన్నాడతను.

''కాగలకార్యం గంధర్వులే తీర్చారంటే ఇదేనేమో!?'' అనుకుంటూ సంతోషంగా కారెక్కి కూర్చున్నాము.

ఇంతలో ఓ పెండ్లి కవరేజ్‌కి వెళ్ళొస్తున్న ముగ్గురు ఫొటోగ్రాఫర్ల బృందం ''మేం కూడా వస్తాం'' అంటూ ఎక్కేశారు. దాంతో ఇక కారు వెంటనే బయలుదేరింది. మధ్యలో లక్ష్మీపూర్‌లో 'టీ' తాగి ఆరుగంటలకల్లా జయపురం బస్టాండ్‌లో దిగాము. ఆ డ్రైవర్ మనిషికి నూటాయాభై రూపాయలు తీసుకున్నాడు. డ్రైవర్‌కి డబ్బులిచ్చి పంపిన వెంటనే నేను అపక్కనే ఉన్న ఎ.టి.యమ్.లో రేపటి అవసరం కోసమని ఐదువేలు డ్రా చేసి పెట్టుకున్నాను. అంతలోనే సింహాద్రిగారు బైక్ తీసుకొని నా కోసం వచ్చారు. బస్టాండ్‌లో ఉన్న బుక్‌స్టాల్లో జయపురం రాజా విక్రమ్‌దేవ్‌గారి జీవితం మీద స్థానిక పాత్రికేయుడు శ్రీపరేష్ రథ్ రచించిన ఇంగ్లీష్ పుస్తకం ఒకటి కొన్నాను. రేపు ఉదయం ఆరుగంటలకల్లా 'చందాహండి' బయలుదేరి వెళ్ళడం కోసం కారు బుక్ చేసుకొని ఇంటికి చేరుకున్నాము. మాదాబత్తుల గారు కూడా రేపు ఆరుగంటలకు బస్టాండ్‌లో కలుస్తానని ఫోన్ చేశారు. ఈపూట భోజనం కింద నుండి సింహాద్రిగారి తమ్ముడి కూతురైన రాగిణి తెచ్చిపెట్టింది. తిన్న వెంటనే ''చీకటితోనే లేవాలి కదా?'' అనుకుంటూ మంచాలను ఆశ్రయించాము.

**లక్క మూలాలను తెలిపే చందాహండిని వెతుక్కుంటూ..**

పొద్దున్నే ఆరుగంటలకల్లా కారొచ్చి జయపురం గ్రామదేవత ఆలయం ముందు ఆగింది. కారుతోపాటే మాదాబత్తులగారు కూడా వచ్చేశారు. ముగ్గురం కలిసి కారెక్కాము. కారు చందాహండి రోడ్డుపట్టుకొని పరుగు అందుకుంది. నవరంగ్‌పూర్ దాటి తొమ్మిదిగంటల కల్లా ఉమ్మర్‌కోట్ చేరుకుని అక్కడున్న తెలుగువారి హోటల్లో టిఫిన్ చేశాము. ఆ హోటల్ యజమాని విజయరాజు, సుజాతగార్లది కూడా జయపురమేనట. మేమొచ్చామని తెలిసి ఇంటిదగ్గరున్న విజయరాజుగారు గబగబా వచ్చారు. అతనితో కొద్దిసేపు మాట్లాడిన శ్రీనివాస్‌లిద్దరూ ''తిరిగొచ్చేటప్పుడు కాసేపుండి వెళతాంలే'' అంటూ వచ్చి కారెక్కారు. జహెగామ్ మీదుగా పదకొండు గంటలకల్లా కారు చందాహండీ చేరుకుంది. అక్కడికి వెళ్ళగానే మాదాబత్తులగారు బ్లాక్ డెవలప్‌మెంట్ ఆఫీస్‌లో కంప్యూటర్ ప్రోగ్రామర్‌గా పనిచేస్తున్న దొండసేనగారికి ఫోన్ చేశారు. ఈలోపుగా మా కారు పక్కనే ఉన్న స్వర్ణకారుల దుకాణంలోకి వెళ్ళి కూర్చున్న సింహాద్రిగారు

అక్కడున్న వాళ్ళతో లక్కకు సంబంధించిన విషయాల మీద కొంత సమాచారం సంపాదించాడు. తమకు తెలసినంతమేరకు వాళ్ళు సమాధానాలు చెబుతుండగానే దొండసేనగారు రావడంతో వాళ్ళకు ధన్యవాదాలు తెలియజేసిన సింహాద్రిగారొచ్చి కారెక్కరు. దొండసేనగారిని కూడా ఎక్కించుకున్న మేము అక్కడికి పది పన్నెండు కి.మీ. దూరంలో ఉన్న పట్కోలియా అనే గిరిజన గ్రామానికి వెళ్ళాము. అక్కడ ఐ.టి.డి.ఎ. ఆఫీస్ ఉంది. దొండసేనగారితో సహా మేమంతా వెళ్ళి ఆఫీస్‌లో కూర్చున్నాము. మేమెవరమో? ఎందుకొచ్చామో? మాదాబత్తుల గారు అక్కడున్న గిరిజనులకు వివరించడంతో "మేం మా సర్పంచిని పిల్చుకొస్తం" అంటూ వాళ్ళలో ఒకరిద్దరు గబగబా ఊళ్ళోకి పరుగు తీశారు. మేము మాట్లాడుతుంగానే గ్రామసర్పంచ్ వచ్చాడు. అప్పటిదాకా మేము "సర్పంచ్ అంటే ఎంత పెద్దమనిషో? మన సమస్యను అర్థంచేసుకుంటాడో లేదో?" అన్న సందేహంలో కొట్టుమిట్టాడసాగాము. కానీ, సర్పంచ్‌ను చూసిన తరువాత "హమ్మయ్య!" అనుకుంటూ గాలిపీల్చుకున్నాము.

అతను ఇరవై - ఇరవై ఐదు సంవత్సరాల యువకుడు. నల్లగా, బొద్దుగా కొంచం దొబ్బముక్కుతో, కాషాయరంగు లాల్చీ, తెల్ల పైజామా వేసుకుని, నుదుట పెద్ద కుంకుమబొట్టుపెట్టుకొని ఉన్నాడు. అతని ముఖకవళికలను చూస్తే కొద్దో-గొప్పో చదువుకున్నవాడి మాదిరిగానే ఉన్నాడు. ఆ యువ సర్పంచ్ పేరు 'హరపూజారి'ట. అతని వెనుకనే నీడలా అంటిపెట్టుకొని మరో యువకుడు కూడా వచ్చాడు. అతని పేరు 'పవిత్ర'ట. అతను పంచాయితీ వార్డ్ మెంబరట. పట్కోలియా గ్రామం చుట్టుపక్కల మొత్తం ఇరవై ఒక్క చిన్న-చిన్న గిరిజన గ్రామాలున్నాయట. వాటన్నిటిలోకి పట్కోలియానే పెద్దగ్రామం. హరపూజార తాత తండ్రులు కూడా ఆ గ్రామ సర్పంచ్‌లుగా చేసినవారేనట.

సర్పంచ్ తండ్రి ఆ చుట్టుపక్కల పేరెన్నికగలవాడట. అతను చాలా దైవభక్తి సంపన్నుడట. అతను పీఠం వేసి కూర్చుని మంత్రంవేసి పిలిస్తే చెట్టు మీదున్న తేనెటీగలన్నీ, తేనె పట్టును వదిలిపెట్టి అతని దగ్గరికొచ్చేవట. తిరిగి వెళ్ళిపొమ్మంటే వెళ్ళి పొయ్యి తెట్టె మీద కూర్చునేవట. పరస్పర పరిచయాలయ్యాయి.

మాదాబత్తులగారు "అన్నీ అనుకూలిస్తే వచ్చే పార్లమెంట్ ఎన్నికలు అయిపోయిన వెంటనే మా డిపార్ట్‌మెంట్ తరపు నుండి మీకందరికీ ఒక ట్రైనింగ్ ప్రోగ్రామ్ ఏర్పాటు చేస్తాను" అంటూ సర్పంచ్‌గారికి మాటిచ్చాడు. శ్రీనివాసులిద్దరూ నన్ను సర్పంచ్‌కి పరిచయం చేసి నేనెందుకొచ్చానో వివరించారు. ఆయన వెంటనే ఆ ఐ.టి.డి.ఎ. ఆఫీస్ పక్కనే ఉన్న ఓ పచ్చటి పెద్దచెట్టు దగ్గరికి తీసుకెళ్ళాడు. చూడడానికది మనదగ్గరుండే కానుగ చెట్లమాదిరిగి ఉంది. కానీ కాదు. "ఇదే లక్కచెట్టు. దీన్ని మేం కుసుమ్ చెట్టు అంటాము" అంటూ చెట్టును గురించిన వివరాలు తెలియజేశాడు. అతని మాటలను వింటూనే మనసులో "అబ్బా! మొత్తానికి నేను అనుకున్న చెట్టును చూడాగలిగాను" అనుకుంటూ నాలో నేను ఎంతో సంతోష పడిపోయాను. కొద్దిసేపు లక్కను తయారుచేసే విధానం మీద మాట్లాడిన తరువాత "మరిన్ని చెట్లకాడికి పోదాం పాండ్రి!"అన్నాడు. సర్పంచ్ హరపూజార.

తిరిగి కారెక్కిన మేమంతా అక్కడికి రెండు కి.మీ. దూరంలో ఉన్న ఓ వాగు దరికి చేరుకున్నాము. అక్కడ కారు దిగి వాగును దాటుకొని పెద్ద వనంలోకి ప్రవేశించాము. అక్కడ ఎటు చూసినా మహావృక్షాల్లా పెరిగిపోయి పచ్చగా, గుబురుగా కన్నుల పండువుగా కన్పిస్తున్నాయి. రెండు నెలలుగా నేను "చూడాలి చూడాలి" అంటూ కలలుగన్న లక్కచెట్లు ఒక్కసారిగా వందలకొద్ది కన్నుల ముందు కన్పిస్తుంటే ఇదీ అని నిర్వచించలేని ఓ ఉద్వేగానికి లోనయ్యాను. అక్కడ ఆ చెట్లను 'కుసుమ్ పేడ్' అంటారు. ఆ చెట్లు మన తెలుగునాట ఉన్నాయో? లేవో నాకు తెలియదు. ఒకవేళ ఉంటే వాటినేమని పిలుస్తారో అంతకన్నా తెలియదు. లక్కను ఏడాదికి రెండు (మే, జూన్ మరియు డిసెంబర్, జనవరి) పర్యాయాలు తీస్తారు. ఆ పంచాయితీలో సాలుకి అరవై నుండి ఎనభై టన్నుల లక్క ఉత్పత్తి అవుతుందట.

అట్లా ఉత్పత్తి అయ్యే లక్కలో తొంభై ఆరు శాతం లక్క ఆ కుసుమ్ వృక్షాల నుండే వస్తే మూడు శాతం రేగు చెట్ల నుండి, రెండు శాతం మోదుగు చెట్ల నుండి వస్తుందట. "అసలా లక్కనెట్లా తీస్తారో చెబుతారా!?" సర్పంచ్‌ను అడిగాను.

నా మాటలకతను నవ్వుకుంటూ "ప్రతి ఐదుచెట్లకొక చెట్టు నుంచి మిగిలిన నాలుగు చెట్లను పైన తల కొమ్మల నుండి కింది జారుడు కొమ్మల వరకు చిప్పగిడ్డల్లతో చెలిగేస్తం. అట్ల చెలిగిన కొమ్మలు రెండు నెలల్ల రెండు మూడడుగుల పొడవున లేత కొమ్మలను ఇడుస్తై. అప్పటిదాక కొమ్మలు చెలగకుండా ఉన్న చెట్టు మీదున్న పురుగు మొత్తం ఈ లేత కొమ్మల మీద వాలి వాటలోని రసాన్ని తాగుకుంటూ బత్కుతై. ఆ కొమ్మల మీద అవి పెట్టిన పెంటనే లక్కైతది" అంటూ తనకు తెలిసిన పరిభాషలో తను విషయాన్ని మాకు అర్థమయ్యేలా వివరించాడు.

"ఆ పురుగుల్ని చూపించరా?" అడిగాను.

వెంటనే అతను మేం ఏ చెట్టు కిందనైతే నిల్చుని మాట్లాడుతున్నామో ఆ చెట్టు కొమ్మలను పట్టుకొని వంచాడు. ఆ కొమ్మలకు మూడు నుండి నాలుగంగుళాల పొడవున నల్లగా గూడులా ఉన్న చూపిస్తూ "ఇదే లాక్క" అన్నాడు. దాని మీదున్న పురుగులు సాధారణంగా మన ఇండ్లల్లో పెరిగే చిక్కుడు తీగల మీద పారే పేనుబంక మాదిరిగా ఉన్నాయి. వాటి విసర్జకమే లక్క అవుతుందని తెలియజేశాడు.

"ఎక్కడ అడవిలోని కుసుమ్ చెట్లు? ఎక్కడి మనిషి? ఆ చెట్ల మీద వాలే పురుగుల విసర్జకాన్ని ఇన్ని రకాలుగా వాడడాన్ని కనుగొన్న మానవుని అన్వేషణా దృక్పథానికి ఆ క్షణంలో మనసులోనే కృతజ్ఞతలు అర్పించుకున్నాను. ఎందరెందరి శ్రమతోనో కనుగొనబడిన ఆవిష్కరణ ఫలాలను కనుగొన్నవారికన్నా ఇతరులే వాటి ఫలాలను అధికంగా వినియోగించుకుంటున్న పరిస్థితిన చూస్తుంటే ఏమిటీ వైపరిత్యం అన్పించక మానదు" అనుకుంటూ ఆలోచనల్లో మునిగిపోయిన నన్ను భుజం తట్టిన సింహాద్రిగారు తిరిగి వాస్తవంలోకి తీసుకొచ్చారు. వెంటనే సర్పంచ్ దిక్కు చూస్తూ "మీకెంత భూముంది?" అంటూ అడిగాను.

"రెండొందలెకరాలు" బదులిచ్చాడతను.

"హా!" ఒక్కసారిగా నోరెళ్ళబెడుతూ అన్నాను.

"మా నాయినలు ఐదుగురు. అందరికీ తలా రెండొందలెకరాలున్నై" నిండు కుండ తొణకదన్నట్టు నిదానంగా చెప్పుకొచ్చాడు సర్పంచ్ హరపూజారి.

"ఇప్పుడే ఇంతింత మహావృక్షాలతో ఉన్న అడవి మీ తాతల కాలంలో ఇంకెంత కీకారణ్యంగా ఉందో? మరి ఆ వెయ్యెకరాల అడవి మీ ఒక్క కుటుంబమే పోడుకొట్టిందా!?" మరింతగా ఆశ్చర్యపడుతూ అడిగాను.

"లేదు లేదు. ఎనకట కలహండీ రాజులు పోడు కొట్టిచ్చిన వెయ్యెకరాల భూమిని మా ముత్తాతకిచ్చి అందులో తమలపాకులు పండించి వాటిని కోటకు పంపాల్నని హుకుమ్ జారీ చేసింద్రంట. మా తాత తరం వచ్చేటప్పటికే ఆ రాజ్యాలు పోయినై. ఆ ఆకు తోటలూ పోయినై. మా నాయినల తరంల తలా రెండొందల ఎకరాలు పంచుకున్నారు. మాకు ఒక్కొక్కరికి నాలుగైదొందల కుసుమ్ వృక్షాలున్నాయి" అంటూ వాళ్ళ కుటుంబ చరిత్రను చెప్పుకొచ్చాడు సర్పంచ్ హరపూజార.

చెట్ల నుండి వచ్చిన లక్కను శుద్ధి చెయ్యడానికి కావాల్సిన చిన్న-చిన్న యంత్రాలను, షెడ్లను కూడా ఐ.టి.డి.ఎ. వారు ఏర్పాటు చేశారట. అక్కడే చెట్ల నుండి తీసిన ముడి లక్కను శుద్ధి చేస్తారట. ఆ విధంగా నేను ఏ లక్ష్యంతోనైతే అంత దూరం వచ్చానో ఆ లక్ష్యం నేను అనుకున్నదానికన్నా గొప్పగా సమకూరిందన్న సంతోషంతో నేను తబ్బిబ్బైపోయాను. ఆ సంతోషంలో శ్రీనివాస్‌లిద్దరికీ మరీ మరీ ధన్యవాదాలు తెలియజేసుకున్నాను.

మేము వచ్చిన పని అయిపోవడంతో "ఇక వెనుదిరుగుతాం" అంటూ సర్పంచ్ హరపుజారతో అన్నాము. దానికతను "లేదు-లేదు మా ఊళ్ళో రామనామ సంకీర్తనం రెండు రోజులు నుండి జరుగుతుంది. మీరక్కడికొచ్చి దేవుణ్ణి దర్శించుకొని, ప్రసాదం తీసుకొని, అన్నం తిన్న తరువాతనే పొవ్వాల" అంటూ హుకుమ్ జారీ చేశాడు. దాంతో మేమూ

మాతోపాటు దొండసేనగారు మెల్లగా వెళ్ళి కార్లో కూర్చున్నాము. ఊరిలో నుండి మైక్‌లో ఏక నామం విన్పిస్తూనే ఉంది. పదినిమిషాల్లో కారు వెళ్ళి కార్యక్రమం జరిగేచోటుకు దగ్గర్లోనే ఆగింది. కారు దిగిన నా కండ్లు ఆశ్చర్యంతో పెద్దవయ్యాయి. ఊరి మధ్యలో ఆర్ష ఋషి సాంప్రదాయ పద్ధతిలో వృత్తాకారంలో అడుగు ఎత్తున గుండ్రటి వేసి నున్నగా అలికి ముగ్గులు వేసిన అరుగు. దానిపైన కొండగడ్డితో కప్పిన పందిరి. పచ్చటి ఆకులు, రంగు కాగితాలతో అలంకరించిన ప్రాగణం చూడడానికి ఎంతో మనోహరంగా వర్ణశోభితంగా ఉంది. మేమక్కడికి వెళ్ళగానే మమ్ముల్ని సగౌరవంగా గద్దె దగ్గరికి తీసుకెళ్ళి దైవదర్శనం చేయించారు. గద్దెకు బయట చుట్టూ అదనపు పందిళ్ళు వేసి చాపలు పరిచారు. వాటి మీద ఒకవైపు పురుషులు, మరొకవైపు స్త్రీలు కూర్చున్నారు. గద్దె మీద ఐదుగురు ఐదుగురు చొప్పున రెండు ముఠాలుగా ఏర్పడిన నవ యువకులు కాళ్ళకు గజ్జలు కట్టుకుని తాళాలు వేసుకుంటూ, డోళ్ళు కొట్టుకుంటూ రామనామ సంకీర్తనకు అనుగుణంగా నాట్యం చేస్తున్నారు.

ఆ భజన కార్యక్రమాన్ని చూస్తూ కొంతసేపు గడిపిన తరువాత సర్పంచ్ తాలూకు మనుషులొచ్చి మమ్ముల్ని ఆ పక్కనే ఉన్న వేరే ఇంటికి తీసుకెళ్ళారు. ఆ ఇంటికెదురుగా ఉన్న పందిరి కింద మమ్ములను కూర్చోబెట్టి మిఠాయిలు అందించారు. అవి తిన్న తరువాత కూల్ డ్రింక్స్ తాగించారు. కొంతసేపు అక్కడ కూర్చున్న తరువాత ఆ పక్కనే ఉన్న భోజనాల దగ్గరికి తీసుకెళ్ళారు. అచ్చమైన కూరగాయలతో చక్కని భోజనాన్ని వడ్డించారు. కానీ, నేనా వంటకాలను ఆస్వాదించలేకపోయాను. నాగరీకపు ముసుగేసుకొని ఉంటున్న, తింటున్న నాకు ఆ పదార్థాల రుచిని ఆస్వాదించే గుణం అబ్బలేదేమో అనుకుని నాకు నేనే సిగ్గుపడ్డాను. భోజనాలు చేసేటప్పుడు నా పక్కనే కూర్చుని ఉన్న సర్పంచ్‌తో "నిజానికి ఆదివాసీలకు ఇటువంటి బ్రాహ్మణీయ పద్ధతులతో దేవుళ్ళను కొలవడం ఉండదు కదా!? కానీ, మీరేమిటిక్కడ మా మైదాన ప్రాంతాలవారికన్నా కూడా హట్టహాసంగా ఏకనామం నిర్వహిస్తున్నారు?!" అంటూ నా మనసులోని సందేహాన్ని బయటపెట్టాను.

"అయ్యన్ని మాకు తెలవదు. మాపెద్దోల్లు ఇట్లనే చేశారు. వాటినే మేము ఆచరిస్తున్నాము" అంటూ చాలా సులభంగా సమాధానం ఇచ్చాడు.

"విషయాన్ని వివరించడం ఇష్టంలేక అలా చెప్పి ఉంటాడులే'' అనుకున్న నేను కూడా మరిక మాట్లాడలేదు. మరికొంతసేపు దేవుని పందిరి కింద గడిపిన తరువాత అందరి దగ్గర శలవు తీసుకొని కారెక్కాము. దారిలో సంత ఎదురయ్యింది. కొంతసేపు సంతను చూశాము. దొండసేనగారిని తన ఆఫీస్ దగ్గర దింపిన మేము తిరిగి జయపురం దిక్కుగా కదిలాము. సాయంత్రం ఆరు గంటలకల్లా జయపురం చేరుకున్నాము. బస్టాండ్‌లో దిగి రేపటి నా తిరుగు ప్రయాణానికి టికెక్కట్టు రిజర్వేషన్ కోసం వెళ్ళాము.

మాదాబత్తులగారు "రేపు పొద్దున్నే నాలుగ్గంటలకల్లా బస్టాండ్‌కొస్తాను'' అంటూ ఇంటికెళ్ళిపోయారు. మేము సింహాద్రిగారి మామగారి ఇంటికి వెళ్ళాము. కొంతసేపు ఆయనగారితో లోకాభిరామాయణం జరిపిన తరువాత భోజనం చేసి శలవు తీసుకున్నాను.

**అడవిదారిని తిరుగు పయనం:**

మూడు గంటలకే లేచి తయారైన నేను సింహాద్రిగారితో కలిసి నాలుగుంబావుకల్లా బస్టాండ్‌కు చేరుకున్నాను. చెప్పినట్టే మాదాబత్తులగారు నాలుగ్గంటలకే అక్కడికొచ్చి మాకోసం ఎదురు చూస్తున్నారు. వేం నా ప్రయాణం తాలూకు అనుభవాలను పునశ్చరణ చేసుకుంటుండగానే బస్సొచ్చి సరిగ్గా మాముందే ఆగింది. నాలుగు రోజుల్లోనే సన్నిహిత మిత్రులైపోయిన శ్రీనివాసులిద్దరూ వీడ్కోలు చెబుతుంటే బరువెక్కిన హృదయంతో నేనూ యాంత్రికంగా చేతులు కలిపాను. నిర్ధయగా మమ్ముల్ని విడదీస్తూ క్రమంగా బస్సు వేగాన్ని పుంజుకుంది. తొమ్మిది గంటలకు బలిమెలలో టిఫిన్, మధ్యాహ్నం రెండు గంటలకు డొంకరాయిలో భోజనం చేశాను. నాలుగున్నరకల్లా భద్రాచలం, ఐదుగంటలకల్లా పాల్వంచ ఇల్లు చేరాను.

ఐదు రోజుల నా ఒరిస్సా యాత్ర ఆత్మ సంతృప్తితో ఫలవంతంగా ముగిసింది.

**మట్టి గాజుల (గాజు గాజుల) జన్మస్థానం ఫిరోజాబాద్‌కు :**

ఒడిస్సా నుండి వచ్చిన తరువాత నవలా రచనకు ఆయువు పట్టులాంటి మట్టిగాజులు (వాస్తవానికి అవి మనం అనుకుంటున్నట్టు మట్టిగాజులు కాదు గాజు గాజులు) గురించి తెలుసుకోవాలన్న ఆరాటం నాలో అంతకంతకూ అధికమవ్వసాగింది. మొత్తం మీద ఉత్తరప్రదేశ్‌లోని ఫిరోజాబాద్‌లో మట్టిగాజుల పరిశ్రమలు ఎక్కువగా ఉంటాయని తెలిసింది.

"అక్కడికి వెళ్ళేదెలా? వెళ్ళినా కార్ఖానాలను తిప్పి చూపించేదెరు?'' అన్న ప్రశ్నలు ఉత్పన్నమయ్యాయి. ఎటు చూసినా చివరికి ఒకే దారి కనిపించింది. అది ఢిల్లీలో ఉంటున్న దాసరి అమరేంద్రగారి పరిచయం. ఫోన్‌లో విషయమంతా వివరించాను. తను వెంటనే స్పందిస్తూ "ఆ ప్రాంతాన్ని గురించి వినడమే తప్ప నేనూ ఇంతవరకు చూడలేదు. త్వరలోనే వివరాలు తెలుసుకుని నీకు ఫోన్ చేస్తా'' అంటూ భరోసా ఇచ్చారు.

అనుకున్నంత త్వరగా తన నుండి సమాచారం రాకపోవడంతో ''ఆలస్యమవుతుందేమోలే'' అన్న ఉద్దేశంతో మా దంపతులిరువురం పదిరోజుల దక్షిణ భారతదేశ యాత్రకు టిక్కెట్లు బుక్ చేసుకున్నాము. రకరకాల కారణలతో ఆ యాత్ర వాయిదాల మీద వాయిదాలు పడసాగింది. ఇంతలో అమరేంద్రగారు ఫోన్ చేసి "ఏప్రియల్ చివరి వారంలో ఫిరోజాబాద్ వెళదాం. నువ్వు టిక్కెట్లు బుక్ చేసుకుని నాకు ఫోన్ చేస్తే ఇక్కణ్ణుండి నేను కూడా ఆయా తేదీల్లో టిక్కెట్లు బుక్ చేసుకుంటాను'' అన్నారు.

నేను వెంటనే టూరిస్ట్ బస్సు కాంట్రాక్టర్‌కి ఫోన్ చేసి విషయాన్ని వివరించాను. యాత్రకు వెళ్ళొచ్చే తేదీలను అతను పక్కాగా తెలియజేయడంతో నా ఫిరోజాబాద్ ప్రయాణానికి అడ్డంకి రాకుండా చూసుకుని రైల్ టిక్కెట్లు బుక్ చేసి వివరాలను అమరేంద్రగారికి తెలియజేశాను. అయితే,అనుకోని అవాంతరాలవల్ల యాత్రలో మరో మూడు రోజులు అదనంగా ఉండవలసి వచ్చింది. దాంతో నేను ఫిరోజాబాద్ వెళ్ళడానికి సాధ్యం కాని పరిస్థితి ఏర్పడింది. నేను వెంటనే అమరేంద్రగారికి ఫోన్‌చేసి విషయం తెలియజేశాను.

"సరే కుదరనప్పుడేం చేస్తాం. తరువాత వెళదాంలే'' అంటూ తనూ టిక్కెట్లు క్యాన్సిల్ చేయించుకున్నారు. యాత్రల నుండి తిరిగొచ్చిన తరువాత మళ్ళీ అమరేంద్రగారికి ఫోన్ చేశాను. దానికాయన "హైదరాబాద్ నుండి అమ్మ (నంబూరి పరిపూర్ణమ్మ)గారు నాదగ్గరికి (ఢిల్లీ) వచ్చింది. కాబట్టి ఆరు నెల్లపాటు నాకు ఎటూ కదలడానికి కుదరదు'' అంటూ బదులిచ్చారు.

దాంతో నాపరిస్థితి మళ్ళీ మొదటికొచ్చింది.

''ఎవర్ని పట్టుకుంటే ఫిరోజాబాద్ వెళ్ళి ఆ మట్టిగాజుల కార్ఖానాలను చూసిరాగలను?'' అన్న దుగ్ధ మళ్ళీ నన్ను వెంటాడసాగింది. అటువంటి సందర్భంలో అనుకోకుండా ఒకరోజు సి.ఐ.టి.యు. తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కా.యమ్. సాయిబాబాగారు కొత్తగూడెం వచ్చారని తెలియడంతో వెళ్ళి కలిశాను.

నేను చెప్పిందంతా ఆలకించిన తను ''నేను వచ్చేవారం ఢిల్లీ వెళ్ళేదుంది అక్కడ నాకు యు.పి. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కా. ప్రేమ్‌నాథ్ రాయ్ కలుస్తాడు అతనితో మాట్లాడి ఏర్పాటు చేస్తాను'' అంటూ మాటిచ్చారు. రెండు నెలల తరువాత-

అన్నమాట ప్రకారం సాయిబాబగారూ ఢిల్లీ వెళ్ళినప్పుడు కా. ప్రేమ్‌నాథ్‌రాయ్‌గారితో మాట్లాడి ఫిరోజాబాద్‌లో ఉండే యూనియన్ బాధ్యులైన కా. నావలసింగ్, కా. బూరీసింగ్‌గార్ల ఫోన్ నెంబర్లు తీసుకుని నాకు పంపించి వాళ్ళతో మాట్లాడమన్నారు.

వెంటనే స్పందించిన వాళ్ళు "మీరెప్పుడొచ్చిన సరే"నంటూ బదులిచ్చారు. దాంతోనేను వెంటనే ఆగ్రాకి రైల్ టిక్కెట్లు బుక్ చేశాను. 29-07-19 ఉదయం 8.40 గం.లకు ఖాజీపేటలో తెలంగాణ ఎక్స్‌ప్రెస్ ఎక్కి 30-07-19 ఉదయం 05.30 గం. ఆగ్రాలో దిగాను. అక్కడి నుండి 50 కి.మీ. దూరంలో ఉన్న ఫిరోజాబాద్‌కు

బస్సు పట్టుకున్నాను. ఫిరోజాబాద్‌లోని సిటు ఆఫీస్‌కి చేరేసరికి 10.30 గం. అయ్యింది. అక్కడ నాకోసం ఎదురు చూస్తున్న మిత్రులు కా. నావల్ సింగ్ కా. బూరీసింగ్‌గార్లకు నన్ను నేను పరిచయం చేసుకున్నాను.

కా. బూరీసింగ్‌గారు వెంటనే నన్ను తన బైక్ మీద కూర్చోబెట్టుకుని మెస్సర్స్ సంగీతా (పేరు మార్చడమైంది) గ్లాస్ వర్క్స్ అనే గాజు గాజుల కార్ఖానాకు తీసుకెళ్ళారు. కార్ఖానా మేనేజర్ హాజీ సల్మాన్. సాదరంగా మమ్మల్ని స్వాగతించారు. ఆ కార్ఖానాలో ఈ మేనేజర్ ఒక్కడే నెల జీతం తీసుకునే ఉద్యోగి. మిగిలినవారంతా ఎన్నో ఏండ్లుగా పని చేస్తున్నా దినసరి కూలీలే. కార్ఖానాలో అలాంటివాళ్ళు దాదాపు అరవైమంది ఉన్నారు. వారంతా ఉదయం 06.30 గం.పనిలోకొస్తే సాయంత్రం 04.30 గం.వరకు ఏకబిగీన పదిగంటలపాటు పని చేస్తూనే ఉంటారు. మధ్యలో భోజనానికి కూడా దిగరు. ఎవరికి ఆకలైప్పుడు వాళ్ళు గబుక్కున వెళ్ళి నిలబడే నాలుగు ముద్దలు తిని మళ్ళీ వెంటనే పనిలోకి దిగుతారు.

సాయంత్రం పని దిగి వెళ్ళేటప్పు ఏ రోజు కూలీ డబ్బులు ఆ రోజు ఇచ్చేస్తారు. అదీ వాళ్ళు చేసే పనినిబట్టి మూడువందల నుండి నాలుగొందలయాభై వరకు ఇస్తారు. దానివల్ల కంపెనీవాళ్ళకు వీక్లీ ఆఫ్‌లిచ్చే అవసరంలేదు. ఫి.యఫ్. ఊసే ఉండదు. మెడికల్ సదుపాయం అంతకంటే ఉండదు. అక్కడి కార్ఖానాల్లో యూనియన్లు ఉండవు. ఒకవేళ పేరుకు ఉన్నా అందులో ఎవ్వరూ సభ్యత్వం తీసుకోగూడదు. రాజ్యాంగపరంగా దక్కాల్సిన ఏ ఒక్క సదుపాయంగూడా అక్కడి కార్మికులకు అందదు. ఒక్కమాటలో చెప్పలాంటే అలా ఇవ్వమని అడిగేవారే ఉండరు. ఎవరన్నా ధైర్యం చేసి అడిగితే తెల్లవారి వారికి పని ఉండదు.

కార్ఖానా మొత్తం ఓ పేద్ద రేకులషెడ్డులో ఏర్పాటు చేయబడింది. షెడ్డులో ఓ మూలకు గుండ్రటి లేదా పాట్ (ఫర్నేస్) భట్టి ఉంటుంది. దాని చుట్టూ పదిపన్నెండు చోట్ల నలుచదరపు రంధ్రాలుంటాయి. వాటిల్లో అదే ఆకారంతో సిరామిక్‌తో చాలా మందంగా తయారు చేసిన తొట్లను అమర్చుతారు. వాటిల్లో రాజస్థాన్, గుజరాత్‌ల నుండి తీసుకొచ్చిన ఒక విధమైన రాతి ఇసుకతో పాటు తెలుపు, ఎరుపు స్వాగా, సిలికా, కె.డి. యమ్. సెలీనియమ్, కలిమీషోడా సెలీనియమ్ వంటి కొన్ని రకాల పదార్థాలతో తయారు చేసిన ఏడు ఏడున్నర క్వింటాళ్ళ మిశ్రమాన్ని ఆ తొట్లల్లో వేసి మూతపెడతారు. ఇక భట్టీ (ఫర్నేస్) పైనుండి ఎలక్ట్రోడ్స్ ద్వారా వెయ్యి నుండి పన్నెండు వందల డిగ్రీల ఉష్ణోగ్రతను పంపిస్తారు. ఆ వేడికి తొట్లల్లోని మిశ్రమం కరిగిపోతుంది. దాన్ని కొన్ని ప్రత్యేకమైన ఇనుప చువ్వల చివరలకు కొద్ది మోతాదుల్లో తీసుకుని, మూడు నాలుగు స్థాయిల్లో చివర కోసుగా వచ్చేట్టు తయారు చేస్తారు. అలా తయారు చేసేటప్పుడు ఏ రంగు కావాలనుకుంటే ఆ రంగును కలుపుతారు. తరువాత దాన్ని తీసుకుపోయి మరో చిన్నభట్టిలో మోటారుతో ముందు వెనుకలకు కదులుతున్న ఓ రాడ్‌కి ఇనుప చువ్వకు కొనతేల్చి ఉంచిన గాజు ముద్దను తలిగిస్తారు. ఆ గాజు కొస కదులుతున్న రాడ్‌కు తాడు మాదిరిగా చుట్టుకుంటూ ముందుకు వస్తుంటుంది. రెండోవైపున ఉండే వ్యక్తులు ఓ మీటర్ సుమార్ గాజు చుట్ట బైటికి రాగానే దాన్ని కట్‌చేసి, వేరే రాడ్‌లోకి తీసుకుని పోయి పక్కన అద్దపెడతారు. అద్దపెట్టిన గాజుల బార్లు చల్లబడిన తరువాత దాన్ని మరోచోటుకి చేరుస్తారు. అక్కడ ఉండే వ్యక్తి ఒకడు ఆ గాజుల చుట్టను ఓ చెక్క అంచుకు ఆనించి, కట్టర్‌తో గట్టిగా గీస్తాడు. అంతే అప్పటిదాకా అంటుకుని ఉన్న గాజులన్నీ విడివిడిగా అయిపోతాయి. అట్లా విడివడిన ఒక్కో గాజును మిషన్‌కన్నా వేగంగా చేతిలోకి తీసుకుంటూనే వాటి నాణ్యతను చేతి వేళ్ళ స్పర్శతోనే గమనిస్తూ కేటగిరివారిగా నాలుగు రాశులు వేస్తాడు. ఆ తరువాత వాటిని దండలు గట్టి జాయింట్లను అతికించేటందుకు వేరువేరు చోట్లకు పంపిస్తారు. అక్కడ వాళ్ళు వాటిని దాదాపు ఏడు విధాలుగా అతికించి మళ్ళీ దండలుగట్టి కట్టింగ్ సెంటర్స్‌కి పంపిస్తారు. అక్కడ మిషన్ల మీద వాటి మీద కావాలనుకున్నంత లోతుకు కట్‌చేస్తారు. తదుపరి ఆ కటింగ్ లోతుల్లో రకరకాల రంగుల్ని అద్దుతారు. ఆ విధంగా పూలగాజుల్ని

తయారుచేసి తిరిగి వాటిని గోదాములకు పంపిస్తారు. అక్కడ వాటిని ప్యాక్‌చేసి ఆర్డర్ల మీద దేశం నాలుగు మూలలకు పంపిస్తారు. ఇది స్థూలంగా మట్టి (గాజు) గాజులు తయారుచేసే విధానం.

ఫిరోజాబాద్ మొత్తం మీద దాదాపు నూట ఇరవైదాకా గాజులు లేదా గాజు వస్తువుల్ని తయారు చేసే కర్మాగారాలున్నాయి. వాటిల్లో దాదాపు మూడున్నర లక్షల మంది కార్మికులు పని చేస్తుంటారు. వారంతా అధిక వేడి, అధిక దుమ్ము, అధిక పనిగంటల వంటి దయనీయమైన పరిస్థితుల్లో పనిచేస్తున్నారు.

సాంప్రదాయానికి ప్రతిరూపంగా నిలిచే గాజుల వెనుక ఎంత మానవశ్రమ దాగి ఉందో? ఎంత ఆర్థిక దోపిడి కొనసాగుతుందో? తెలుసుకుంటే మానవత్వమున్న మనుషుల గుండెలు బాధతో జ్వలించిపోక తప్పదు.

దాదాపు మూడుగంటల పాటు కార్ఖానాలో గడిపిన నేను ఆఖరికి కా. బూరాసింగ్‌గారితో బయటబడి నేరుగా భోజన హోటల్‌కి వెళ్ళి దాల్‌రోటీ తిన్నాను.

అక్కడి నుండి మెస్సర్స్ ప్రార్థనా గ్లాస్ వర్క్స్ కంపెనీకి వెళ్ళాము. అది దాదాపు రెండు రెండువందల యాభైమంది కార్మికులు పనిచేస్తున్న ఓపెద్ద కర్మాగారము. దేశం మొత్తం మీద నుండి పగిలిపోయిన గాజుసీసా ముక్కలన్నీ అక్కడికే వచ్చి చేరి పెద్ద పెద్ద రాశుల నుండి ఇనుప ట్రాలీలకు ఎత్తి కన్వేయర్ బెల్టుల ద్వారా భట్టి (ఫర్నెస్)లోకి పంపించి వేడి చేస్తున్నారు. ద్రవరూప గాజు పదార్థన్ని గుండ్రటి ఇనుప పైపుల ద్వారా కావాల్సినంత మోతాదులో తీసుకుంటారు. అలా తీసుకున్న గాజు ఆ ముద్దలోకి ఇనుప పైపు పై భాగంగుండా కార్మికులు తమ ఊపిరితిత్తులు పగిలిపోయేలా గట్టిగా ఊదుతారు. దాంతో పైపు చివరనున్న గాజు ముద్ద కాస్తా బెలూన్ మాదిరిగా ఉబ్బుతుంది. అట్లా ఉబ్బిన దాన్ని కావాలనుకున్న మూసలోపెట్టి లాక్ చేస్తే అనుకున్న గాజు వస్తువు తయారైపోతుంది. అలా అక్కడ అతి చిన్న ఇంజక్షన్ బాటిల్స్ నుండి మొదలుపెట్టి అతిపెద్ద షాండ్లియర్స్ దాకా తయారవుతాయి.

గాజుల పరిశ్రమల్లో పనిచేసేవారికన్నా ఇక్కడ పనిచేసేవారికి ఊపిరితిత్తుల మీద విపరీతమైన ఒత్తిడి పడుతుంది. ఐదుగంటలకల్లా ఆ కంపెనీ నుండి బయటపడ్డ మేము నేరుగా సిటు ఆఫీస్‌కి వెళ్ళాము. అక్కడున్న మిత్రులతో కొంతసేపు మాటా-ముచ్చట అయిన తరువాత వారి వద్ద శలవు తీసుకున్నాను.

కా. బూరాసింగ్‌గారు నన్ను తీసుకెళ్ళి అక్కడికి దగ్గర్లో ఉన్న ఓ పెద్ద జైనదేవాలయం ముందు దించి వెళ్ళాను. కొంతసేపు ఆ దేవాలయాన్ని తిరిగి చూసిన నేను బయటకొచ్చి ఆగ్రా బస్సెక్కాను. ఆగ్రాలో బిజ్లీ ఘర్‌లో దిగి, అక్కడికి దగ్గర్లోనే ఉన్న సుప్రభాత్ హోటల్లో రూమ్ తీసుకున్నాను. పొద్దుటి నుండి స్నానం కూడా చేయకపోవడంతో వెంటనే స్నానం చేసి అక్కడే ఉన్న రెస్టారెంట్‌లో భోజనం చేసి పడుకున్నాను.

యథాప్రకారం నాలుగ్గంటలకే లేచిన నేను వెంటనే తయారై ఆటో పట్టుకుని ఐదుగంటలకల్లా బస్టాండ్ చేరుకున్నాను. అప్పటికే అక్కడ ఫతేపూర్ సిక్రీ వెళ్ళే బస్సు తయారగా ఉంది. ఆరున్నరకల్లా సిక్రీ చేరుకున్నాను. అప్పటికే అక్కడ చాలామంది సందర్శకులొచ్చి ఉన్నారు. గైడ్‌ను తీసుకుని గంటన్నరపాటు తిరిగి చూశాను. ఎన్నో ఏండ్లుగా చూడాలనుకుంటున్న సిక్రీని చూశానన్న సంతోషంతో తిరిగి ఆగ్రా బస్సెక్కాను. తొమ్మిదిన్నరకల్లా ఆగ్రా చేరుకున్నాను. ఆగ్రాలో దిగిన వెంటనే టిఫిన్ చేసి ఫోర్ట్ చూడడానికెళ్ళాను. పోర్ట్ చూసిన తరువాత భోజనం చేసి తాజ్‌మహల్ చూడ్డానికెళ్ళాను. ఐదుగంటలకల్లా తాజ్ దగ్గర్నుండి బయటపడి హోటల్‌రూమ్‌కి చేరుకున్నాను. సరిగ్గా ఏడుగంటలకు రూమ్ ఖాళీ చేసి అర్ధగంటలో కాంట్ స్టేషన్ చేరుకున్నాను. ఎనిమిది గంటలకు రైలొచ్చింది.

గాజుల మీద నవల వ్రాయాలన్న నా ప్రయత్నం ఓ కొలిక్కి వచ్చిందన్న సంతృప్తితో బెర్త్ మీద వాలిపోయాను.

శిరంశెట్టి కాంతారావు
పాల్వంచ. ఫోన్: 984 989 0322.

# తెలుగు-కన్నడ కథలలో బహుజనవాదం

– బి. నాగశేషు

సింహాలు తమ చరిత్రను రాసుకొనేదాకా వేటగాడు తన విజయాలను వినిపిస్తూనే ఉంటాడు. అనేది ఆఫ్రికన్ సామెత.

ఉత్పత్తిలో పాల్గొని ఉత్పత్తి చేసే శూద్రులను బరువులు మోసే గాడిదలుగా, మానవ జాతి విస్తరణార్థం బాధ్యతను వహించిన స్త్రీలను సంతానం కనే పశువులుగా చిత్రీకరించడం భారతదేశం సంస్కృతికి ఉండే రెండు గొప్ప చెడుగుణాలు, అని వివేకానంద అన్నారు.

మట్టిని మొలకెత్తించే కర్షకుడిని మొదలుకొని దేవుడి ప్రతిమదాకా శూద్రుడి చేతిలోనే పురుడు పోసుకోవాలి. కానీ నిర్లక్షింపబడేది మాత్రం శూద్రుడే. విద్య, కళ, కులవృత్తి ఈ మూడింటినీ వర్గీకరించి ముందుగా మొదటిది దూరం చేసి కళలను కాకుండా చేసి కులవృత్తుల్ని అంటకట్టి కులాలను జమకట్టి హిందూమత విచ్ఛిన్నానికి దారులు వేశారు మనువాద మాయగాళ్ళు.

బ్రాహ్మణిజం దూరం చేసిన విద్యను, కళలను బౌద్ధం దగ్గర చేసింది, క్రిస్టియన్ మతం ఆదరించింది అందుకే ప్రజలు అటువైపు మొగ్గు చూపారు. అసలు హిందూ మతం అనేది నిర్మింపబడింది శూద్రుల ఉత్పత్తి కులాల మీదే.

శూద్ర కులాలంటే ఎవరు, శూద్రులుగానే పుట్టారా? శూద్రులు అని ఎవరు నామకరణం చేశారు. వాళ్ళ అర్హతలేమిటి అని ప్రశ్నిస్తే సమాధానం దొరకదు. అంతా వేదాల్లోనే ఉందట సమానత్వం చాటనివి వేదాలే అయితే వాటిని ఎందుకు ప్రామాణికంగా తీసుకోవాలి. చేతివృత్తులు ఆర్య సమాజంలోని (విశ్)లోని సభ్యులు చేసేవారని అధర్వణవేదం చెపుతుంది. కమ్మరులు (కర్మార) వడ్రంగులు (తాక్షన్) చర్మకారులు (చర్మన్లు) నేతగాళ్ళు తదితర వృత్తులన్నీ రుగ్వేదంలో గౌరవనీయమైనవిగానే భావించబడ్డాయి. కంచుయుగం నుండి కనకపు యుగం దాకా ఉత్పత్తిదారులు శూద్రులే. ఉత్పత్తి కులాలు ఉత్పత్తి చేయకపోయుంటే ఆర్యులెందుకు మన దేశానికి వచ్చేవారు. సమాజంలో అనేక విషబీజాలను నాటి వాటి ఊడలు శూద్రుల నమ్మకాల్లోనికి పెనవేసుకొని పోయేల చేశారు. ఏది సత్యం ఏది ప్రామాణికం అనేది తెలియజేయటానికి ఆనాటి సమాజంలోనే కొంతమంది కళాకారులు, సంఘసంస్కర్తలు బాధ్యతల్ని తీసుకొన్నారు. ఆధునిక భారతదేశానికి ఒక సామాజిక స్వప్నం అనేది ముందుంచారు. కులం వ్యక్తిని సమాజాన్ని శాసిస్తున్నప్పుడు కులానికి సంబంధించిన సాహిత్యం రాకపోతే కులాల గురించి వాటి దయనీయ స్థితిగతులు ఎలా తెలుస్తాయి. వాటి అవసరం ఎలా తెలుస్తుంది. అలా పుట్టుకొచ్చిందే ఉత్పత్తి కులాల సాహిత్యం. ఆధునిక కాలంలో ఒక్కో ఉత్పత్తి కులం ఒక్కో వాదాన్ని తీసుకురాలేక పోయింది. తీవ్రంగా అవమానించబడ్డ దళితులు దళిత వాదాన్ని ఉధృతంగా ముందుకు తీసుకెళ్ళారు. దళిత, ముస్లిం, మైనారిటీ కులాలే కాకుండా శోషిత వర్గానికి చెందిన సాహిత్యాన్ని బహుజన సాహిత్యంగా చెప్పుకోవడం జరిగింది.

1925లో మొట్టమొదటి కథ 'పల్లంరాజు' అనే కథను శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి రచించారు. ఈ కథ అస్పృశ్య నిర్మూలనకు సంబంధించిన కథ. రాజు అసమానతలు చూపకపోయినా ప్రజల్లో ఉండే కులాల అసమానతలవల్ల రాజాజ్ఞ వృథా అవుతుంది. అస్పృశ్యతను రాజ్యంలో ఎవరు చూపినా శిక్షకు అర్హులు అని రాజు దండోరా వేయిస్తారు. అయినా ప్రయోజనం శూన్యం, ప్రజల మూఢ కులపిచ్చిని తెలిపే కథ. వృత్తి కళాకారుల కులం నేపథ్యంగా వచ్చిన తొలి కథగా చింతా దీక్షితులు రాసిన 'దాసరిపాట'ను చెప్పుకోవచ్చు. ఈ కథ తెలంగాణ తెలగ దాసరి కులవృత్తిని గూర్చి తెలుపుతుంది. వారి వృత్తిని కాపాడుకునే సందర్భంలో కొడుకు అనారోగ్యాన్ని కూడా గుర్తించలేక కన్న కొడుకునే చంపుకొన్న వ్యథ ఈ కథలో కనిపిస్తుంది. కరుణ కుమార రాసిన 'టార్చిలైటు' 1938నాటి కథ.

దళిత బహుజనుల్ని స్పృశించిన కథ. బడిలో జరిగిన ఆటల పోటీల్లో బహుమతులు ఏ కులం వాళ్ళకివ్వాలి అనే విషయంలో గొడవలు జరిగి ఆఖరుకి అయ్యవారు ఉద్యోగం పోతుంది.

ప్రాచీన కాలంలో మనిషి మొదటి కులవృత్తిగా చర్మకారుడి వృత్తిని చెప్పవచ్చు. మనిషి పాదాలను కందిపోకుండా మలినాలు శరీరానికి అంటకుండా కాపాడే వృత్తిదారుడు చెప్పులు కుట్టేవాడు. వీరి జీవితాల్లోని వాస్తవిక స్థితిగతులు ఏ విధంగా ఉన్నాయో తెలిపే కథలు చాలా వచ్చాయి.

ఇలాంటి తువ్వాయి వస్తే, హరిజనోద్ధరణ గురించి వచ్చిన కథ చెంబుకో గంగ. దళిత చరిత్ర పరిణామాన్ని రికార్డు చేసిన మరో గొప్ప కథ. నీటి సమస్య అనాది నుండి వస్తున్నది. నీటి సమస్య దళితుల జీవితాల్లో ఉద్యమంగా నిలిచిన సమస్య మలుపు, ఊరిబాయి. ఊరబావి, ఆఖరుతడి, మృత్యుజలం, జలం జనం కథల్లో కనపడతాయి. అంతేగాకుండా లేత మొలకలు నిప్పురవ్వలు, పాలు, సన్మానం, జాతంటేయంది, సవర్ణదీర్ఘసంధి మొదలైన కథలు. శతాబ్దాల దళితుల ఘర్షణ తెలుస్తుంది. తెలుగు కథకు ఉద్యమ స్థాయి ఊరబావి కథా సంపుటి. అస్పృశ్యత దళితుల్ని ఏ విధంగా చిన్నాభిన్నం చేసిందో చూపే కథ. తిరగబడేలా ఉసిగొల్పే కథలు. దళితేతరులు రాసిన కథల్లోకంటే దళితులు రాసిన కథల్లో దళితుల పూర్తి జీవితాలు కనిపిస్తాయి. చర్మకారుడి తర్వాత కుమ్మరి వృత్తి. ఇది అత్యంత ప్రాచీనమైనది. మెసపటోమియా నాగరికత కాలానికే కుండ ఉన్నట్లు ఆధారాలున్నాయి. మన దేశానికి లిపిని అంకెలను పరిచయం చేసింది కుమ్మరులే. జాతశ్రీ రాసిన చలివేంద్రం కుమ్మరి వృత్తి లోటుపాట్లను, వ్యయ ప్రయాసలను చిత్రించిన కథ. పెద్దింటి అశోక్ కుమార్ 'కాగుబొత్త' పల్లె, పట్టణంలోని జీవితాలు ఏ విధంగా ఉన్నాయి మానవ సంబంధాలు డబ్బు ముందర నిలువవని, కులవృత్తినే నమ్ముకున్నోళ్ళు జీవితంలో ఓడిపోతూ వస్తున్న తీరును తెలుపుతుంది ఈ కథ.కాలవ మల్లయ్య 'ఈ భూమి నాది', ఐతా చంద్రయ్య, 'కొడుకు రాకపాయె' పల్లా మోహన్ 'పాటర్స్ సర్కిల్', టి. సంపత్ 'చిప్ప', ఇనాక్ 'పగ' ముఖ్యమైనవి. గొల్ల, కురుమల చైతన్య కథలు, 'మట్టి బంగారం', కె. వరలక్ష్మి రాసిన ఒక మంచి కథ గొల్ల కులానికి చెందిన యువకుడు వ్యాపారంలో ఆటుపోట్లు అంచనా వెయ్యడంలో విఫలమై, అవసరంలేని దుబారా ఖర్చులకు పోయి జీవితంలో పతన దశకు చేరుకున్న చిత్రం ప్రతిబింబింపజేసే కథ.

పెద్దింటి అశోక్ కుమార్ 'ఇగురం' తరాలుగా వస్తున్న 'ఎట్టి గొర్రెల విధానం నుండి 'ఇత్తనం పోతు'ను కాపాడుకొనే క్రమంలో చివరికి దాన్ని అడవిలో విడిచిన బాధను వర్ణించే కథ. కాలువ మల్లయ్య 'అడవికాచిన వెన్నెల'లో కొత్తగా పెళ్ళయిన యువకుడు భార్యకు దూరంగా మంద దగ్గర రాత్రిళ్ళు పడుకోవాల్సి ఉండటంతో భార్యకు దూరంగా ఉండే మదనాన్ని చిత్రించిన కథ. ఐతా చంద్రయ్య, ''మంచు ముద్ర', బండి నారాయణ స్వామి 'అవశేషం' జూకంటి జగన్నాథం ఒయినం, వి.ఆర్. రాసాని కథలు గొల్ల కురుమల జీవితాల్ని స్థూలంగా పరిచయం చేశాయి కానీ కురుబల వృత్తి గురించి అంతగా కథలు రాలేదని చెప్పచ్చు.

గౌడ కులంలో సామాజిక చైతన్యం అందిపుచ్చుకొన్న వృత్తి కులాల్లో గీత వృత్తి దారులు ముందున్నారు. సర్వాయి పాపన్న నుండి గౌతు లచ్చన్న దాకా ఎందరో తెలుగు రాష్ట్రాల్లోని గీత కార్మికుల్లో చైతన్యం నింపే కథలు రాశారు. తెలంగాణ ప్రాంత కథకుడిగా బి.సి. కథలు, పేరుతో బి.సి.ల్లో మార్పుకు నాంది పలికిన జి. రాములు రాసిన 'పెరటిచెట్టు' ఎంతో ప్రాముఖ్యతను సంపాదించుకున్నది.

వడ్రంగి జీవితాలకు సంబంధించిన కథల్లో సుంకోజి దేవేంద్ర చారి రచన 'అన్నంగుడ్డ' కులం మూలాల్ని స్పృశించిన కథ. ఆధునికత సాధించిన ప్రగతికి చేతి వృత్తిదారుల జీవితాలు ఏ విధంగా కకావికలం అయ్యాయో తెలిపే కథ. కుట్ర, జాతశ్రీ రచన. చేతివృత్తి దొరక్క ఇబ్బందులు పడే జీవిత కథ. చేనేత వృత్తిని తెలిపే కథలు వృత్తిదారులు కథల్లో విరివిగా చేనేత

వృత్తిదారులు గూర్చిన కథలే అగ్రభాగం వహించాయి. మంగళగిరికి చెందిన అందెనారాయణస్వామి చేనేత వృత్తిదారుల విషాదమయ జీవితాల్ని 'శిల్పి' కథలో నిబిడీకృతం చేశారు. మిల్లులు వచ్చాక నూలు తక్కువ ధరకు దొరక్క మగ్గంనేయక పూట గడవక భార్య భిక్షమెత్తే స్థితికి చేనేత దారుని దారుణ జీవితం దిగజారుతుంది.

'ప్రశాంతం' బి.ఎస్. రాములు రాసిన కథ ఎల్లయ్య బట్టలమిల్లులో పనిచేసిన స్వచ్ఛంద పదవీ విరమణ తీసుకొని వచ్చిన సొమ్ముతో బిడ్డ పెళ్ళి చేస్తాడు. మళ్ళీ తన వృత్తిలోకి దిగి ఫ్యాషన్ బట్టలతో పోటీ పడలేక పూట గడవటం కష్టమై కనీసం తన స్థితిని పరులకు చెప్పుకోలేని అసమర్థ ఎల్లయ్య జీవన వ్యథ. క్షౌరవృత్తిని తెలిపే కథల్లో ఆచార్య ఇనాక్ 'తలలేనోడు' అనే కథ తెలుగు సాహిత్యంలో ఎప్పటికీ చర్చించుకొనే కథ. రాయలసీమలోని భూస్వామ్య అజమాయిషీని బహిర్గతం చేసిన కథ. కోటి పొలాన్ని మునసబు ఏ విధంగా కాజేశాడో వివరించే కథ. అడపం తుమ్మల రామకృష్ణ రాసిన కథ. మొగిలప్ప అనే మంగలిపై నరసయ్య అనే రైతు కక్షకట్టి, మొగిలప్పకు పని ఇవ్వకుండా వేరే గ్రామంలోని క్షురకుల్ని పిలిపించి వారిచేత చేయిస్తుంటాడు. ఇది సహించలేని మొగిలప్ప సంకలో ఉండే 'అడపం' (పనిముట్లు) కాలువలోకి పారేస్తాడు. ఐతా చంద్రయ్య కథ 'గుండెచప్పుళ్ళు' కులవృత్తి దొరక్క తన సొంత బిడ్డల్ని అమ్మేసే వ్యసనకారుడి వృత్తాంతాన్ని తెలిపే కథ. తుమ్మలవారి 'రాలిన చింత' మంగలి రామన్న, మాల మునెప్పలు చింతచెట్ల కోసం దెబ్బలాడుకోవడం మూడవ వ్యక్తి కరణం వీరిద్దరి చేత మాయమాటలు చెప్పి ఊడిగం చేయించుకోవడం, చివరికి ఇద్దరి నోట్లో మన్నే మిగులుతుంది.

రజక వృత్తుల వారి కథలు, ఇనాక్ గారి "పిండీకృతశాటి' ఆయగాళ్ళు యజమానికి సేవ చేస్తే చాలు జీవితం ధన్యమైపోతుందని భావించుకొని సదా మీ సేవలో అనేలా ఆయగాళ్ళు జీవితాంతం అలాగే గడుపుతుంటారు. అలాంటి ఒక రజకుడి కథే పిండీకృత శాటి కథ. 'ఈ మంటలు చల్లారవు', ఏ.వి. రెడ్డి శాస్త్రి రాసిన కథ. కళింగాంధ్రలోని రజక వృత్తిదారుల్ని తెలిపే కథ. గంగులు అనే రజకుడికి భార్య ఇద్దరు కొడుకులు, ఒక కూతురు. గంగులకు జ్వరం వచ్చిందని అతని కూతురు యజమాని ఇంటికి బట్టలివ్వడానికి వెళ్తే యజమాని కొడుకులు బలవంతంగా లొంగదీసుకొంటారు. అవమానపరుస్తారు. తట్టుకోలేని ఆ తల్లి ఆత్మహత్య చేసుకొంటుంది. గంగులు ఊరు వదిలి వేరేచోట స్థిరపడతాడు. అక్కడ కూడా అదే పరిస్థితి. బట్టలు ఆలస్యంగా తెచ్చాడనీ గంగులు కొడుకైన చిన్నవాణ్ణి యజమాని పెద్దనాయుడు తంతాడు. దెబ్బతగిలి అక్కడికక్కడే మరణిస్తాడు. మూడో కొడుకు చెరువులోపడి చనిపోతాడు. నమ్ముకొన్న తన వృత్తి

సంతాన్నంతా పొట్టన పెట్టుకొందని భోరున విలపిస్తాడు. రజక వృత్తి ఎంత హీనంగా ఉందో తెలిపే కథ. అంతేగాకుండా 'కర్రావు', 'సాకిరేవు', 'వరాల మూట', 'దొరసాని చీర', 'వెలి', 'తుడేలయ్య మనసు', 'నేను బతకలేను చిన్నమ్మా', 'పలాయనం', 'బతుకురేవు', 'కాలినగూడు', 'సురసాగరమథనం'లాంటి కథలు రజక వృత్తి జీవితాల్ని పిండి చూపించాయి.

పారిశుద్ధ జీవితానికి చెందిన కథలు. అనిసెట్టి సుబ్బారావు కథ. పాకీది మనుషుల మలం ఎత్తిపోసే మనుషుల కులవృత్తి కథ. 'నల్లటి వెలి', దేవదానం రాజు రచన. ఎరుకుల కులవృత్తి పందుల పెంపకం, మెదడు వ్యాప్తికి కారణమని వాటిని కాల్చి చంపమని ప్రభుత్వం ఆజ్ఞ జారీచేస్తుంది. అందుకు ఎరుకులవాళ్ళు పందుల్ని ఇంటిదగ్గరే పెట్టుకోవడంతో ఊరంతా దుర్గంధం కొడుతుంటుంది. పెద్దమనుషులే ఎరుకలవాళ్ళ దగ్గరికెళ్ళి క్షమాపణలు కోరి పందుల్ని ఊరిలోకి వదిలించుకొంటారు.

మనిషి అశుద్ధాన్ని మరో మనిషి శుభ్రం చేయడమనే హేయమైన వృత్తిని తెలిపే కథ. ఇనాక్ 'పశ్చాద్భూమి'. జాతశ్రీ అనివార్యం' ఇలా కంపు జీవితాలను కథా వస్తువుగా తీసుకొని రాశారంటే తెలుగు కథకుల సంస్కరణా దృక్పథం తెలుసుకోవచ్చు. అంతేగాకుండా మత్స్యకారుల జీవితాల్ని తెలి పేకథలు అతడు మనిషి "ముసలవ్వ మనసు', 'అగ్నితుఫాన్', ప్రాణదాత'లాంటి

కథల ద్వారా చేపల వృత్తిదారుల జీవితాలు నీటి బుడగలాగే నీళ్ళలోనే కలిసిపోతాయనే విషయాల్ని తెలియజేశారు కథకులు. కళాకారుల జీవితాల్లోని చీకటి కోణాల్ని రంగరించిన కథలు. (వీరజాటి', 'విధ్వంసం', 'వారసత్వం' మొదలైన కథలు కళాకారుల బతుకులు గాల్లో దీపాల్లాగా మారిపోతయాయని ఆవేదన తెలిపే కథలు. ఈ విధంగా బహుజనుల కథలు తెలుగులో అన్ని వృత్తుల గురించి ప్రస్తావించడం జరిగింది. ప్రభుత్వం సత్వరం చేయాల్సిన కర్తవ్యాన్ని కూడా కొందరు కథకులు తెలియపరిచారు.

ఈ దేశంలో మునులు, ఆశ్రమాలు, తపస్విలు, దేవాలయాలు ఎన్ని ఉన్నా శోషిత వర్గానికి ఏథమైన ప్రతిఫలం అందించింది లేదు. బసవణ్ణ, మహాత్మ జ్యోతిబాపూలే, అంబేద్కర్, నారాయణగురు, సాహు మహరాజ్, పెరియార్ రామస్వామి నాయ్కర్, నాల్వడి కృష్ణరాజ ఒడయర్, మొదలైనవారు శూద్ర వర్గానికి చేసిన మేలును పరిశీలిస్తే మనిషికి మనిషే సహాయపడాలి తప్పిస్తే అతీంద్రయ శక్తులేవి మనిషిని బాగుపరచలేవు,

కన్నడ సాహిత్యంలో బహుజన సాహిత్యానికి చెందిన సాహిత్యం ఆలస్యంగా వెలుగు చూసినా, వాదం అని పిలవకపోయినా బహుజన వాదంలో ఏ హక్కుల కోసం పోరాటం చేస్తున్నారో అవి ముందుగా సమకూర్చినవారు కన్నడ ప్రాంతం వారే అని చెప్పవచ్చు.

అప్పటి సమాజంలో మతమౌఢ్య యజ్ఞయాగాలు ప్రాణబలి జాతి వ్యవస్థలాంటి క్రూరమైన బతుకుల్ని చూసిన బసవణ్ణ వీటన్నింటినీ చూసి విరక్తి చెంది, లింగాయత్ ధర్మాన్ని స్థాపించి శరణులందరినీ ఒకటి చేసి కూడల సంగమంలో అనుభవ మంటపాన్ని స్థాపించి శూద్రుల ప్రయోజనానికి కారణం అయ్యారు.

బ్రాహ్మణ కులం కంటే మానవ కులం గొప్పదని చాటి చెప్పారు. బుద్ధుడు కోరుకొన్న సమానత్వాన్ని ఈయన చేసి చూపించారు. బ్రాహ్మణ మధువరసుర కూతుర్ని ప్రేమించిన మాదిగ హరళయ్య కొడుక్కిచ్చి వివాహం జరిపించారు, ఇందుకుగాను బసవణ్ణ జైలు శిక్ష అనుభవించారు. అందువల్ల బసవణ్ణ కంటే గొప్ప బహుజన వాది ఇంకెవరూ లేరని చెప్పవచ్చు. నాల్వడి కృష్ణరాజ ఒడెయర్ మైసూరు రాజ్యంలో 24వ మహారాజుగా మైసూరు ప్రాంతాన్ని 40 ఏళ్లు పాలించారు. 1922 నాటికే 32 లంబాడి పాఠశాలలను స్థాపించి బహుజనుల విద్యకు బాసటగా నిలిచారు. జేను కురుబల కోసం అయిదు పాఠశాలలను ప్రారంభించారు. 800 పాఠశాలలను అస్పృశ్యుల కోసం స్థాపించారు. 1921లో బ్రాహ్మణ, ఆంగ్లో ఇండియన్స్‌కు తప్ప మిగతా శూద్రలందరికీ మైసూరు సంస్థానంలోని పరిపాలనలో 75 శాతం రిజర్వేషన్స్ కల్పించారు. బారతదేశంలో చాలామంది రాజులు పాలించారు కాని వెనుకబడిన వర్గాలకి ఏ రాజు చేసింది ఏమీ లేదు. శివాజి తరువాత బృహత్ భారత దేశంలో శూద్రుల కోసం పరితపించిన వ్యక్తి నాల్వడి కృష్ణరాజ ఒడెయర్ మాత్రమే.

ఇంతకంటే ముందు సర్వజ్ఞ కవి, నడిచేది ఒకటే భూమి, తాగేది ఒకటే జలం, కాల్చే అగ్ని ఒకటే అయినపుడు, ఈ కులగోత్రాల అంతరం ఎక్కడి నుండి వచ్చింది అంటూ ప్రశ్నించారు. అంతేకాకుండా కువెంపు కవి శూద్ర తపస్వి నాటకంలో శూద్రుల ఇబ్బందులను తెలియపరిచారు. బహుజన కథలు రాసే క్రమంలో వెనుకబడి ఉండవచ్చు కాని, శూద్రుల ఉన్నతిని ఆశించే క్రమంలో మాత్రం కన్నడిగులు తెలుగు పాలితుల కంటే ముందు వరుసలో ఉన్నారని చెప్పవచ్చు.

కన్నడ కథల్లో బహుజన వాదాన్ని పరిశీలిస్తే కన్నడ కథకులు అద్భుతమైన కథలు రాశారు. సమాజాన్ని ఎలా చెడు నుంచి కాపాడుకోవాలో తెలియజేశారు. కానీ తెలుగులో దళితవాదం, స్త్రీవాదం, విప్లవవాదంలాంటి భిన్న వాదాలు వినిపించినట్లు కన్నడ సాహిత్యంలో అంతగా రాలేదని తెలుస్తోంది. దళితవాదం, స్త్రీవాదానికి కథలు వచ్చినా మన తెలుగు కథల్లో కనిపించేంత ఆవేశం వ్యక్తపరచలేదు. వాడే పదజాలం అంత ప్రభావవంతంగా లేదని చెప్పవచ్చు. దళిత, మైనారిటీ కులవృత్తుల సాహిత్యాన్ని బహుజన సాహిత్యంగా తెలుగులో పిలవడం కద్దు. కన్నడంలో 'బండాయ సాహిత్యం' అనే పేరుతో ఈ వాదాలన్నీ కలిపి పిలుస్తున్నారు. బండాయ అంటే

మనం విప్లవం అనేలాగా ఉంటుంది అర్థం. బహుజనులు రాసిన కథలున్నాయి కానీ బహుజన వాదానికి చెందిన కథలు చాలామటుకు రాలేదని చెప్పవచ్చు. అంటే ప్రత్యేకించి ఒక్కొక్క కులానికి చెందిన కథలు తెలుగు కథల్లా తొంగిచూసినట్లు కన్నడ కథా సాహిత్యంలో కనిపించవు.

మనకు పొరుగున ఉండే రాష్ట్రం కన్నడ రాష్ట్రం. మనకు వాళ్ళకు రక్త సంబంధం, వివాహ సంబంధాలు చాలా వరకు ఉన్నాయి. మన భాషకు కన్నడ భాషకు లిపిలోనూ, మాట్లాడటంలోనూ పెద్దగా తేడాలు లేవు. ఈ రెండు భాషల నడుమ తులనాత్మక పరిశోధన చాలావరకూ జరగాల్సిన అవసరం ఉంది. కన్నడంలోని ప్రసిద్ధ కవులు, రచయితల రచనల గురించి తెలుగు కవులకు అతి కొద్దిమందికే తెలుసు. అట్లే మన గురించి కూడా వాళ్ళకు తెలిసింది తక్కువ. అందువల్ల ఆదాన ప్రదానాలు భాషలో జరగాలి. ఈ దిశగా ప్రయత్నం కొంతమేర జరిగింది, జరగాల్సిన అవసరం చాలా ఉంది. మన దేశంలో అతిపెద్ద సమస్య కులం. అది లేకుండా ఏదీ లేదు. ఏదీ జరగదు. ఈ కుల సమస్యను నిర్మూలించడానికి దేశవ్యాప్తంగా నిరసనలు, సంస్కరణలు జరుగుతున్నాయి. మరి కర్ణాటక రాష్ట్రంలో దళిత, మైనారిటీ బహుజనుల గురించి ఏ విధమైన కథాసాహిత్యం వచ్చింది అన్నది ఈ వ్యాసం సూచిస్తుంది. కన్నడంలో మొదటి దశలో వచ్చిన కథలలో దళిత జీవితంలోని ఆవేదనలు, పీడనలు, హింస చిత్రించబడ్డాయి. ప్రతిఘటన, ప్రశ్న, ఎదురించటం ఉన్నాయి. దళుతులూ మనుషులే. వాళ్ళకూ పండుగలూ పబ్బాలు ఉన్నాయి. వాటిని వారి యోగ్యతానుసారం జరుపుకోవాలనుకొంటారు. అందుకోసం అగ్రకులస్థుల దగ్గర అప్పుచేస్తుంటారు. 'పండుగల బలి' కథలో సళ్ల అలా సాంస్కృతిక ఉత్సాహంతో భూస్వామి దగ్గర అప్పు తీసుకొని తీర్చలేక ఇబ్బంది పడుతుంటాడు. సాంప్రదాయాలు దళితుల్ని మరింత పేదరికంలో ఎలా నెట్టేస్తున్నాయో తెలుస్తుంది. 'కరువు' అనే కథ బరుగూరు రామచంద్రప్పగారిది. రంగప్ప అనే భూస్వామి తన చేలోకి పనికొచ్చే ఆడవాళ్ళందరినీ తన మాటల ఎరతో లోబరుచుకొంటుంటాడు. గిట్టనివాళ్ళకు పని ఇవ్వడు. రాముడి భార్య చన్నీ రంగప్ప మాటల్ని సహించలేక రంగప్ప పొలంలో కాలు పెట్టనని ప్రతిజ్ఞ చేస్తుంది. భర్త రాముడికి రోగం ముదిరి చేతగాక పడుకొని ఉంటాడు. రోజు రోజుకూ తినడానికి కష్టంగా ఉంటుంది. చివరికి చన్నీనే రంగప్ప దగ్గరికి పోయి నేను నీ పక్లోకి వస్తా అని సెప్పి అతని సేతుల్ని పట్టుకొని తనవైపు లాక్కొంటుంది. ఒళ్ళంతా తడిమి చూస్తే ఎముకులే తగుల్తాయి. థూ అని ఆమెను బయటికి తోసేస్తాడు. తనే కూటి కోసం మీద పడినా కనికరించడు రంగప్ప. చాలా భయంకరంగా ఉంటుంది ఈ వాస్తవాలను నెమరేసుకోవాలంటే. ఈ ధనిక జగత్తులో డబ్బుకు అన్నీ దాసోహమయ్యాయి. మానవ సంబంధాలకు విలువ లేకుండా పోయింది. ఈ నిజాలన్నీ 'రక్తసంబంధం' కథ ఆవిష్కరిస్తుంది. అలాగే 'మా తాతకొక కల ఉండేది. కథలో అతి పెద్ద దళిత కుటుంబంలోని తాత తనవాళ్ళందరూ అంబేద్కర్‌లాగా గొప్పవాళ్ళు కావాలని కోరుకొంటాడు. కానీ తన కొడుకులందరూ అందుకు భిన్నంగా అవుతారు, వ్యవస్థ అలా చేస్తుంది.

మూగడి బాధ కథ ఆర్ద్రమైనది. యజమాని ఎద్దు చనిపోతే పేద దళితులకు పండుగే. గౌడకు తన ఎద్దు చనిపోయిందనే బాధకన్నా దానివల్ల వచ్చే ఆదాయం పోయిందనే బాధ ఎక్కువ కనిపిస్తుంది. అదే ఇంట్లో ఉండే దళిత జీతగాడు మూగడు మాత్రం ఎద్దు చనిపోయిన దానికి బాధపడుతుంటాడు. 'చిల్లర నాణెం-నీళ్ళ కథ' ఒకరకంగా ఊరబావి కథను పోలి ఉంటుంది. ఊర్లో దళితులకు నీళ్ళు తాగడానికి చాలా కష్టంగా ఉండేది. సైద అనేవాడు ఎవరూ చూడకముందే తెల్లారికే నీళ్ళు తోడుకొని పోయేవాడు. ఒకసారి బిందె బావిలోకి పడిపోయేసరికి దాన్ని బయటికి తీసుకొనేలోపు ఒక ముసల్ది లేచి చూసింది. పంచాయితీ పెట్టి, మంగలి యంకన్నను పిలిపించి గుండుతీసి ఒక చిల్లు నాణేన్ని జరిమానాగా వేశారు. సాంస్కృతిక వివక్ష మీద జయరామ్ అనే దళిత యువకుడు దళితుల్లో చైతన్యం నింపే

నాయకుడుగా ఎదుగుతాడు. ఊర్లో పెద్ద జాతర జరుగుతుంటుంది. అన్ని పనులకు మాదిగలను ఉపయోగించుకొని తేరు లాగేటప్పుడు, భోజనాల సమయంలో దూరం పెడతారు. అందరూ తిని మిగిలిపోయిన తరువాత అర్ధరాత్రి పండ్రెండు గంటలపుడు మైకులో అనౌన్సు చేస్తారు. మాదిగలంతా వచ్చి తినిపోవాలి. లేదంటే జరిమానా వేస్తామని గట్టిగా మైకులో చెప్పేసరికి ఆకలితో అల్లాడే దళితులు తినడానికి ముందుకెళుతుంటారు. జయరామ్ అడ్డుకొని చీకటి బతుకుల్లో నమ్మకాల వెలుగు పూయించాడు.

దళితుల శ్రమ కావాలి. వాళ్ళ స్పర్శ మాత్రం ఏదో పాము కాటుకు భయపడినట్లు వాళ్ళను దగ్గరకు రానివ్వరు. అలాంటి దుశ్చర్యను తెలిపే కథ 'అస్పృశ్య గులాబి' ప్రేమ చుట్టూ ఆవరించిన అస్పృశ్యతను కూడా ఈ కథలో తెలుసుకోవచ్చు.

పీడితుల కులాల్లోనే పీడకులు పుట్టుకొచ్చి స్వజాతి పీడనకు పూనుకొనే వాస్తవాన్ని 'ఓ యర్రన్న కథ' చెప్పింది. విద్య ద్వారానే దళితులు సామాజిక మార్పును పొందగలరనే పచ్చి నిజాన్ని 'ఓ పలక ముక్క కథ' ఆవిష్కరించింది. రెండు గ్లాసుల పద్ధతి మీద తిరుగుబాటు జెండా ఎగరేసిన కేశవుని కథ 'గొడ్డు కాఫీ'. లక్ష్మణరావుగారి 'అదృష్టం' నవరత్న రామారావుగారి రచన. ఈ కథలో శూద్రుల ప్రస్తావన ఉంది. నవరాత్రి పూజ గురించి చర్చించుకొంటుండగా లక్ష్మణ్‌రావు అనే బ్రాహ్మణుడు భయపడటం. బలివ్వడంలాంటి విన్న పూజారి అర్ధరాత్రి బలి అంటే నన్నెక్కడ ఏమిచేస్తారో అని పరిగెత్తిపోవడం కథ సారాంశం.

రామణగారి 'గర్జనె' సంకలనంలోని మొదటి కథ. 'జీతం' జీతం అనే పద్ధతిలోని బహిష్కరణం యంత్రంలో పడి ఒకే ఇంటిలోని అన్నదమ్ములిద్దరూ అశువులు బాసే కథ. అలాగే శోషణను ఎదుర్కొనేవాళ్ళు ఎదురు తిరిగే కథ 'అభిమానం'. కుం వీరభద్రప్ప, 'కర్రోడు త్రిశూలం పట్టిన కథ'. కర్రోడు అనే దళితుడు అన్నం తిని చాలా రోజులయ్యుంటుంది. కళ్ళు తిరుగుతుంటాయి. భార్య సుంకులి కూడా ఉపవాసంతో గడుపుతుంటుంది. కర్రోడు రెడ్ల సందు, కోమట్ల సందు బ్రాహ్మణుల సందు లింగాయుతుల సందు దాటుకొంటూ పోతూ చివరి గుడి దగ్గర భోజనానికి వెళితే భోజనాలు అయిపోయాయంటారు. ఆకలికి తట్టుకోలేక గుళ్ళో దూరుతాడు. పూజారి అరుపులకు జనం అంతా వస్తారు. కర్రోడు త్రిశూలంతో అందరినీ బెదిరించి కడుపునిండా ప్రసాదం తింటాడు. దళిత స్త్రీలను బ్రాహ్మణులు కడుపు చేస్తే అవమానాన్ని తట్టుకోలేక తిప్పి అనే దళిత మహిళ బావిలోకి దూకి సచ్చిపోతుంది. కర్రోడి భార్య సుంకిలిని దొర గర్భవతిని చేస్తాడు. పుట్టిన బిడ్డల్ని గొంతు నులిమి చంపేస్తుంటాడు కర్రోడు దొరకు పుట్టారని తెలిసి. చాలా కాన్పుల తరువాత సుంకిలితో పిల్లల్ని కంటాడు. అప్పటికి సుంకిలి శరీరం శుష్కించి పోయింటుంది. దొర ముట్టుకోడు మోజు తీరింటుంది దొరకు అప్పుడు కర్రోడు పిల్లల్ని కంటాడు.

బెసగర హళ్ళి రామణ రచన 'కకరుడి ఉగాది' పండుగ కోసం డబ్బులడిగేదానికని బ్రాహ్మణ ఇళ్ళ దగ్గరికెళ్ళి ఇరవై ఐదు రూపాయలు అడుగుతాడు. అన్ని పనులు చేయించుకొని మళ్ళీ రాపో ఆలోచిద్దాం అంటారు. అంతలోనే బ్రాహ్మణ స్త్రీలు కొట్లాడుకొంటూ యశోద అనే బ్రాహ్మణ మహిళ బావిలోకి దూకుతుంది కాపాడమని కకరుడితో వేడుకొంటారు. అతను బావిలోకి దూకగానే కకరుడి గొంతును చుట్టేసుకొంటుంది. గాబరాపడి. ఇద్దరూ నీళ్ళలో మునిగి చస్తారు. దళితుడి ప్రాణాలంటే లెక్కలేదు. అగ్రవర్ణాలవారికి కులం వారి ప్రాణాలమీదకొచ్చినప్పుడు గుర్తుకు రాదు.

శ్రీకృష్ణ ఆలనహళ్ళి రాసినకథ. 'ఆగంతకుడు' పల్లెల్లో కులాలను మరచిపోయి వరుసలో కలిపే సాంప్రదాయం కనిపిస్తుంటుంది. కిట్టి అనే దళిత యువకుడు మామా అని పిలిచే చెన్నమల్లప్ప చనిపోతే తట్టుకోలేకపోతాడు. భయాన్ని పోగొట్టడానికి వారి తాతయ్య కిట్టిని కొలిమి పనిచేసే ఆచారి ఇంటి దగ్గరికి తీసుకెళతాడు. అక్కడ ఆచారి కొలిమి తిత్తి, పనితనం, మాటలతీరు రైతాంగం గురించి చర్చ వస్తుంది అంటే కులాలగురించి చెప్పారు తప్పితే ఆ కులవృత్తుల జీవితాల్లోని చీకటి బతుకుల్ని రాయలేకపోయారు.

'కొండచాటున వెలిగిన మోహపు దీపం' ఒకరకంగా కుల సమస్యను నిర్మూలించాలనే ఆలోచనతో రాసిన కథ. వర్ణాంతర వివాహాలు తప్పనిసరిగా జరగాలని సూచించే కథ. సిద్ధమాదప్ప అనే దొర దగ్గర కరియ అనే దళితుడి కొడుకైన బసవ పనిచేస్తుంటాడు. యజమాని కూతురు దేవేరమ్మ బసవడిపై మనసు పడుతుంది. ఇద్దరూ పెళ్ళి చేసుకొంటారు. పంచాయితీ పెట్టిస్తారు. దేవేరమ్మ బసవణ్ణి తప్ప వేరెవర్నీ పెళ్ళి చేసుకోనంటుంది. ఇక ఊరి చివరన ఒక పూరిపాకలో జీవిస్తుంటారు. వారికి ఒక మగబిడ్డ పుట్టాక గౌరికి దొర ఇంటికి పిల్లాడి ద్వారా దారి ఏర్పడుతుంది. ఆ బిడ్డ అగ్రకుల నిమ్నకులాల మధ్య వారథిలా అవుతాడు. కులాంతర వివాహంచేసుకొన్నందుకు దేవేరమ్మకు గవర్నమెంట్ ఉద్యోగమిచ్చి ప్రోత్సహిస్తుంది.

'మార్పు' అనే కథ నిజంగా మార్పు దిశగా పయనింపజేస్తుంది. పాటిల్ అనే యజమాని కొడుకు ఒక గౌతమ బుద్ధుడిలా ఆలోచించి మనకుండే సౌకర్యాలు మన ఇంట్లో పనిచేసే జీతగాళ్ళకెందుకు లేవు అని మథనపడి చాలా

'వినాయకుడి స్వగతం' కథలో ఊర్లో అందరూ వినాయకుణ్ణి పెట్టుకొని పూజలు చేస్తుంటారు. వినాయక చవితి పండుగకు కానీ దళితులు వినాయకుణ్ణి పెట్టుకోకూడదు అని హుకుం జారీ చేస్తారు. వినకుండా చామయ్య అనే దళితుడి వినాయకుణ్ణి కూర్చోపెడతారు. మెరవణిగా మా వీధుల్లోకి రాకూడదంటారు. కానీ తీసుకొస్తారు. కొలకలూరి ఇనాక్ విఘ్న వినాయకుడి కథలో కొన్ని సంఘటనలు పోలివుంటాయి ఈ కథలో. ఇలా దళితుల్ని గురించి వచ్చిన కథలు మిగతా శూద్రకులం గురించి తక్కువ కథలే వచ్చాయి. ఎక్కడా ప్రతిఘటనా తీరు కనిపించదు కన్నడ కథల్లో, బహుజనులు అనే పదం కూడా కన్నడ సాహిత్యంలో వాడుకలోనే లేదు. పూర్ణచంద్ర తేజస్వి గారు బండాయ సాహిత్య అవసరాన్ని నొక్కి చెప్పారు. దళిత బండాయ సాహిత్యం కన్నడ కథకులు ప్రభావవంతంగా ఉపయోగించారు. దేవనూరు మహాదేవ, బొళువారు మహమద్ కున్ వీరి దారిలో పయనించి బెసగరహళ్ళి రామజ్జ. కుం. వీరభద్రప్ప, చన్నణ్ణ పాలీకార, బరుగూరు రామచంద్రప్ప, అరవింద మాలగత్తి కటాపిడి అబ్బుల్ రషీద్, కొ.త. చక్కన్న, కాళేగౌడ నాగవార వంటి మొదలైన కథకులు. దళితుల సంఘర్షణా సమరాన్ని విశదపరిచారు. అంతేకాకుండా అనసూయకాంబ్లి, బి.టి. జాహ్నవి. బి.యు.సుమజయదేవ్ గాయక్ వాడలాంటి దళిత మహిళా రచయిత్రులు తమ కథల ద్వారా సామాజిక మార్పుకు ఎంతగానో దోహదపడ్డారు. తెలుగు కథాప్రపంచానికి కన్నడ కథా ప్రపంచానికి చాలా వ్యత్యాసం కనిపిస్తుంది. తెలుగు కథల్లో కనిపించేంత ఉద్యమస్థాయి మాత్రం కన్నడ కథల్లో అంతగా కనిపించదు. కన్నడ కథకులు కూడా గొప్ప గొప్ప మానవీయ విలువల్ని కలిగిన కథలు రాశారు. అయితే తెలుగులో విడివిడిగా వచ్చిన వాదాలు కన్నడంలోకి వచ్చే సరికి అన్ని విభాగాలుగా కనిపించవు. ''బహుజన' అనే పదం చాలా విస్తృతమైంది. దాని గురించి కన్నడ కథాసాహిత్యంలో చర్చ జరగాల్సిన అవసరం ఎంతైనా ఉంది. తెలుగులో కూడా ఇంకా పూర్తిస్థాయిలో బహుజనవాద సాహిత్యం తీసుకురావాల్సిన అగత్యం ఎంతైనా ఉంది. ఏది ఏమైనా సోదర భాషలైన కన్నడ-తెలుగు భాషలు దక్షిణాది భాషల్లో ఒక మిత్రత్వం కలిగిన భాషలు. మిగతా రెండు భాషల్ని పోల్చి చూస్తే రెండు భాషల్లోని వైవిధ్యాలను వెలికితీయాల్సిన సమయం ఆసన్నమైంది. రెండు భాషల్లోనూ తులనాత్మక అధ్యయనం ఇంకా లోతుగా బలంగా జరగాలి. అప్పుడే రెండు ప్రాంతాల భాషా పాఠకులకు విందు ఆరగించినట్లవుతుంది.

ఆ దిశగా పరిశోధనలు, విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వాలు సాహిత్య సంస్థలు అనువాదకులు కృషి చేస్తారని చేయాలని ఆశిద్దాం.

బి. నాగశేషు
మైసూర్. ఫోన్: 998 550 9053, 905 234 0055.

వేదిక

# చింతామణి హితబోధ

ఇంగ్లీషు పత్రిక జర్నలిజంలో ఎందరో ఆంధ్రులు అగ్రగాములుగా నిలిచారు. యమ్. చలపతిరావు, కె. ఈశ్వర్ దత్తు, కోటంరాజు రామారావు, కోటంరాజు పున్నయ్య, ఖాసా సుబ్బారావు, ఎ.ఎస్. రామన్ ఇంక జర్నలిజానికేకాక ఇటు ఆంధ్రులకీ ఘనకీర్తి తెచ్చారు.



చిర్రావూరు యజ్ఞేశ్వర చింతామణి

అటువంటి ప్రముఖులలో చిర్రావూరు యజ్ఞేశ్వర చింతామణి ఒకరు. అలహాబాద్ నుంచి వెలువడిన *లీడర్* పత్రికకు మూడు దశాబ్దాలుగా సంపాదకులుగా ఉండి చింతామణి ఇంగ్లీష్ జర్నలిజానికే 'లీడర్'గా ప్రశంసలందుకున్నారు.

చింతామణి *లీడర్*కి సంపాదకులుగా ఉన్నప్పుడు సంపాదక విభాగంలో ఉద్యోగానికి ఒక యువకుడు వచ్చాడు. తన అర్హతల వివరాలు చింతామణికి అందజేశాడు. ఇంగ్లీషు జర్నలిజంలో తనకి అభిరుచి ఉందని తెలియజేశాడు.

"నీకు అన్ని అర్హతలు బాగున్నాయి. ఒక టాపిక్ ఇస్తాను - దాని మీద వ్యాసం రాసి రేపు తీసుకురా - అది చదివి నా నిర్ణయం తెలియజేస్తాను" అన్నారు చింతామణి. చింతామణి కోరినట్లే ఆ వ్యాసం వ్రాసి చదువుకుని తనే మురిసిపోయి, చింతామణి ఆ వ్యాసం చదివి శభాష్ అని అపాయింట్‌మెంట్ ఆర్డర్ చేతిలో పెడతారని ఆ యువకుడు మర్నాడు *లీడర్* కార్యాలయానికి వెళ్లాడు. చింతామణికి ఆ వ్యాసం ఇచ్చాడు.

చింతామణి చదివి "చాలా బాగుంది. అయితే ఇది వ్రాసిన నీకు, చదివిన నాకు తప్ప పాఠకులకు అర్థమవ్వదు. ఇంగ్లీషు మీద నీకు గొప్ప పట్టు ఉంది. నీ ఇంగ్లీషు భాషా పాండిత్యం వెల్లడించడానికి ఇది వ్రాసినట్లు ఉంది. కానీ వ్రాసే తీరు ఇది కాదు. భాష సులభతరంగా దినపత్రిక పాఠకుడిని దృష్టిలో పెట్టుకుని ఉండాలి" అని చెప్పారు.

చింతామణి 'హితబోధ' విన్న ఆ యువకుడు ఆ తర్వాత ఏమయ్యాడో కానీ ఓ పత్రికా జర్నలిజంలో ప్రవేశించాలనుకునేవారికి ఆ హితబోధ శిరోధార్యమయింది.

* * *

చింతామణి గారి కుడిచేతిలో పెన్, ఎడమ చేతిలో ఎప్పుడూ సిగరెట్ ఉండేవి. ఆయన చైన్ స్మోకింగ్ చింతామణి గారి ఆరోగ్యం మీద చెడు ప్రభావం చూపించింది. సన్నిహితులు ఆయనను సిగరెట్‌కి విడాకులివ్వమన్నారు. అయితే అంతగా ప్రేమించిన దానిని విడిచి పెట్టడం సాధ్యమా?

కానీ తన జీవితంలో కానీ, ఎవరి జీవితంలో కానీ స్మోకింగ్ ఎలా ప్రవేశిస్తుందో ఎలా పరిణతి చెందుతుందో చింతామణి వివరించారు. తను స్వీయానుభవంతో స్మోకింగ్‌లోని మూడు దశలని చింతామణి ఇలా చెప్పారు-

మొదటి దశ: పొగత్రాగడం కాలక్షేపంగా ప్రారంభమవుతుంది.

రెండవ దశ: అది క్రమ క్రమంగా అలవాటుగా మారుతుంది.

మూడవ దశ: అది ఘోర విపత్తుకి స్వాగతం పలుకుతుంది.

ఈ 'సత్యం' తెలిసినా ప్రతివారు అంటించే ప్రతి సిగరెట్ అదే ఆఖరి సిగరెట్ అని ఆ సిగరెట్ సాక్షిగా ప్రమాణం చేస్తూనే ఉంటారు!

**తాజీ ప్రసాద్, చెన్నై. ఫోన్: 917 674 6536.**

## వేదిక

**ఆ**గస్టు - 2019, **మిసిమి**లో పంజాల నరసయ్య గారు *భగవద్గీత* గురించి కొన్ని సందేహాలు వెలిబుచ్చారు. నా పరిజ్ఞానం మేరకు వివరించడానికి ప్రయత్నిస్తాను. యుద్ధానికి ముందే కౌరవ పక్షంలో కురువృద్ధులు, బాంధవులు, స్నేహితులు ఉన్నారనే విషయం అర్జునునకు తెలుసుకదా అన్నారు. నిజమే. సమరానికి ముందు కౌరవులు జరిపిన అన్యాయాలకు ప్రతీకారేచ్ఛతో పాండవులు ఉన్నారు. ఘోరమైన ప్రతిజ్ఞలు కూడా చేశారు. అరణ్య, అజ్ఞాతవాసాలలో అనుభవించిన కష్టాలు కౌరవులపై తీవ్ర వ్యతిరేకతను కలిగించాయి. కానీ యుద్ధ ప్రారంభంలో తమను బాల్యంలో పెంచి పెద్ద చేసిన తాత భీష్మాచార్యులు, విద్యాబుద్ధులు నేర్పిన కృప, ద్రోణులు మున్నగువారు ప్రత్యక్షంగా కనబడగానే అర్జునుని మనస్సు సంక్షోభానికి గురై అస్త్ర సన్యాసం చేశాడు. వారిని చూడనంతసేపు తనలో ఉన్న ప్రతీకారవాంఛ చూడగానే కరిగిపోయింది.

ఇక రెండవ అంశం కృష్ణార్జునుల మధ్య జరిగిన ప్రశ్నోత్తర కార్యక్రమాన్ని వేరొకరు ఉండి వినడంగాని, రికార్డు చేయడంగాని సాధ్యం కాదు కదా! అన్నారు. భారతం సమగ్రంగా చదివితే, ఈ అనుమానం వచ్చేది కాదు. కురుక్షేత్ర సంగ్రామానికి ముందు వేదవ్యాస మహర్షి సంజయుని పిలిచి, యుద్ధరంగంలో ఎప్పుడు, ఎక్కడ, ఏమి జరుగుతుందో తెలిసే దివ్యజ్ఞానాన్ని (దృష్టి) నీకు ప్రసాదిస్తున్నాను, నువ్వు చూసిన సంఘటనలను ధృతరాష్ట్రునికి తెలియజేయమన్నాడు. అందుచేత సంజయుడు పద్దెనిమిది రోజుల కురుక్షేత్ర సంగ్రామాన్ని ప్రత్యక్షంగా చూసి ధృతరాష్ట్రునకు తెలియజేశాడు. మన మాటలలో చెప్పాలంటే లైవ్ టెలికాస్ట్ చేశాడన్నమాట.

*మూడవ అంశం:* ఏడు వందల శ్లోకాల గీతోపదేశం పూర్తయే వరకు సేనలు ఊరకనే ఉన్నారా అని ప్రశ్నించారు. ఇరువైపుల సేనలు రణరంగములో నిలబడిన వెంటనే యుద్ధం ప్రారంభం కాలేదు. ధర్మరాజు సోదరులతో కలసి భీష్మ ద్రోణాదుల వద్దకు వెళ్ళి వారి ఆశీర్వాదాలు తీసుకొన్నారు. ఇరుపక్షాల సైనికులలో ఎవరైనను, తమకు నచ్చిన పక్షములో చేరవచ్చుననగా యుయుత్సుడు పాండవ పక్షములోనికి మారాడు. ఇటువంటి సంఘటనలు జరిగిన తరువాత గీతోపదేశం కూడా జరిగింది. ఇక్కడ మనం గమనించవలసిన ప్రధానాంశం ఏమిటంటే శ్రీకృష్ణుడు సూత్రప్రాయంగా బోధించిన అంశాలను, వేదవ్యాసుడు విస్తారంగా ఛందోబద్ధంగా రూపొందించారని వ్యాఖ్యాతల అభిప్రాయము.

కృష్ణార్జునులు రణరంగ మధ్యలో నిలబడి ఏడువందల శ్లోకాలు పాడుతుంటే 18 అక్షౌహిణుల సైన్యం మంగళహారతి వింటూ నిలబడ్డారా? అనే సందేహం అనేకమంది మేధావులకు కలిగింది. వాస్తవానికి కృష్ణార్జునులు 'శ్లోకాలలో' మాట్లాడుకోరు. వచనంలోనే సంభాషిస్తారు. కృష్ణుడు క్లుప్తంగా ఇచ్చిన గీతా సందేశాన్ని అనంతర కాలపు మానవ సమాజానికి అవగాహన అయ్యే రీతిలో 'వ్యాసమహర్షి' వందల శ్లోకాలుగా విస్తరించారని గ్రహించాలి. భావితరాల మేథకు వివరంగా అర్థం కావడానికి వ్యాసమహర్షి ఇంత సుదీర్ఘంగా పెంచి వ్రాశారని పెద్దల అభిప్రాయము.

*ప్రత్యేక సూచన:* ఇటువంటి సందేహాలు గతంలో కూడా చాలామంది వెలిబుచ్చినవే. గీత నుంచి మనం ఏం నేర్చుకోవాలన్నది ప్రధానం. 'గీత' మానవ జీవితానికి ఎంతవరకు ఉపయోగపడుతుందనే అంశాలకు ప్రాధాన్యమివ్వాలని ఆశిస్తున్నాను. వ్యక్తిత్వ వికాసానికి ఎంతగానో తోడ్పడే గ్రంథంగా గీతను అధ్యయనం చేయడం ఉపయుక్తం కాగలదని గ్రహించగలరు.

స్వరాజ్యం నా జన్మహక్కు' అన్న బాలగంగాధర్ తిలక్ గారికి, అహింసా పరమోధర్మః అని విశ్వసించిన గాంధీజీకి *భగవద్గీత* 'మార్గదర్శి' అని మనందరకు తెలుసు. భారతీయులకేగాక యావత్ప్రపంచానికి ఆదర్శప్రాయమైన 'గీత'ను భక్తి గ్రంథముగాగాక - వ్యక్తిత్వ వికాస గ్రంథముగా పఠిస్తారని ఆశిస్తాను.

పురాణపండ రాఘవరావు
బొమ్మూరు. తూ.గో. జిల్లా. ఫోన్: 768 090 8948.

## వేదిక

జూన్ - 2019, *మిసిమి* లో పొదిలి నాగరాజుగారి పరిశోధనా వ్యాసం *శ్రీ రంగరాజు చరిత్ర : తెలుగులో తొలి నవల* - చదివాను. అన్ని కోణాల నుండి వ్యాస రచయిత పొదిలి నాగరాజు నరహరి గోపాల కృష్ణమచెట్టి గారి నవల *శ్రీ రంగరాజు చరిత్ర* ను పరిశీలించారు. చక్కని తర్కంతో అదే తెలుగులో వెలువడిన తొలి తెలగు నవలని నిష్కర్షగా నిరూపించారు.

తమ వ్యాసంలో నా పేరును పేర్కొంటూ "ఎ.బి. సాయిప్రసాద్ 1979లో 'అభ్యుదయ' సంచికలో *శ్రీ రంగరాజు చరిత్ర* ను తెలుగులోనే కాదు భారతదేశంలోనే తొలి నవలగా చెప్పాలన్నారు" అని నేను నా సిద్ధాంత వ్యాసం Early Novels in Hindi and Telugu - A Comparative Study కోసం ముమ్మరంగా సామగ్రీను సేకరిస్తున్న రోజులు. అప్పటి 'అభ్యుదయ' సంచాలకులైన కీర్తిశేషులు శెట్టి ఈశ్వరరావు, మహీధర రామమోహనరావు, మల్లికల ప్రోత్సాహం వల్లనే నేను ఆ వ్యాసం రాశాను. తమ మోనోగ్రాఫ్ - వీరేశలింగం (సాహిత్య అకాడెమీ, ఢిల్లీ - 1968)లో భారతీయ భాషలలో తొలి నవలగా ప్రచురింపబడిన 'దుర్గేశ నందిని' రచనా కాలాన్ని 1875గా ఇచ్చారు. ఇది అచ్చు తప్పు. ఈ నవల 1865లో ప్రచురింపబడింది. అప్పుడు నాకు మరాఠీలో వెలువడిన నవల 'యమునా పర్యటన్'ను గురించి తెలియదు. మంగళూరు వాస్తవ్యుడైన పాదరీ బాబా పద్మన్ జీ ఈ నవలను 1857లో ప్రచురించారు.

ప్రచురణ తారీఖుదృష్ట్యా ఇదే భారతీయ భాషలలో వెలువడిన తొలి భారతీయ నవల. బంకిమ్ చంద్ర ఛటర్జీ నవల దుర్గేశ నందిని 1865లో వెలువడింది. ఈ తరువాతి సంవత్సరంలో - 1866 గుజరాతీ భాసలో నందేశంకర్ 'కరన్‌ఘెలో' నవలను ప్రచురించారు. మరాఠీ, బెంగాలీ, గుజరాతీ తరువాత తెలుగు నవల శ్రీ రంగరాజు చరిత్ర వెలువడింది. తెలుగు నవల తరువాతనే తమిళం (1879) కన్నడం (1899) మలయాళంలో వరుసగా ప్రతాప మొదలియార్ చరితమ్, ఇందిరాబాయి, ఇందులేఖ వెలుగు చూశాయి. ఆచార్య కొలుకలూరి ఇనాక్ గారు తమ 'తెలుగులో తొలి నవల రంగరాజు చరిత్ర (2010)లో 1872లో వచ్చిన శ్రీ రంగరాజు చరిత్రను, 1878లో వచ్చిన రాజశేఖర చరిత్రను పరిశీలించి ఆ రెండింటి మధ్య తులనాత్మక అధ్యయనం చేసి శ్రీ రంగరాజు చరిత్రనే తొలి నవలగా నిర్ధారించారని శ్రీ పొదిలి నాగరాజు రాశారు. ఆచార్య కొలకలూరి ఇనాక్ గారి పుస్తకం నేను చదవలేదు. అందులో వారు రాజశేఖర చరిత్ర ఆలివర్ గోల్డ్‌స్మిత్ నవల వికార్ ఆఫ్ గోల్డ్ ఫీల్డు నుండి ప్రేరణను పొందింది అన్న విషయం పేర్కొన్నారో లేదో తెలియదు. తప్పక పేర్కొనే ఉంటారు. మరి ఎందుకో శ్రీ పొదిలి నాగరాజుగారు ఈ విషయాన్ని విస్మరించారు. *మిసిమి* జూలై సంచికలో దాసరి సుబ్రహ్మణ్యేశ్వరరావు తమ వ్యాసం 'కందుకూరి వీరేశలింగం'లో 'తెలుగులో మొట్టమొదటి నవలయైన రాజశేఖర చరిత్ర గోల్డ్‌స్మిత్ ఆంగ్లంలో రచించిన 'వికార్ ఆఫ్ వేక్ ఫీల్డ్' అనే నవల ఆధారంగా రచింపబడినది అని స్పష్టంగా పేర్కొన్నారు. కందుకూరి వీరేశలింగం వీరాభిమాని డా. అక్కిరాజు రమాపతిరావు తమ సిద్ధాంత వ్యాసం 'వీరేశలింగం పంతులు సమగ్ర పరిశీలన (1972, జూన్ నెల 1872 జూన్ నెల 14 వ తారీఖున శ్రీ రంగరాజు చరిత్ర వెలువడింది). వికార్ ఆఫ్ వేక్ ఫీల్డ్ నవలలోని పాత్రలకు ధీటైన రాజశేఖర చరిత్ర నవలలోని పాత్రల పేర్లను ఇచ్చారు.

| | వికార్ ఆఫ్ వేకో ఫీల్డ్ | రాజశేఖర చరిత్ర |
|---|---|---|
| 1. | డా. ప్రిమ్ రోజ్ | రాజశేఖరుడు |
| 2. | బర్చెల్ | రామరాజు |
| 3. | విల్లియం థారన్ హిల్ | కృష్ణగజపతి |
| 4. | జార్జి | సుబ్రహ్మణ్యము |
| 5. | ఎడ్ థారన్ హిల్ | శోభనాద్రి రాజు |
| 6. | జంకిన్ సన్ | మంచిరాజు పాపయ్య |
| 7. | ఒలివియా | రుక్మిణి |
| 8. | సోఫియా | సీత |
| 9. | దేబరా | మాణిక్యాలు |

(376వ పేజీలో ఇవ్వబడిన ఫుట్‌నోట్) 'రాజశేఖర చరిత్ర' ఒక అనుకరణ నవల అని రాస్తూనే దాన్నే తొలి తెలుగు నవలగా డా. అక్కిరాజు రమాపతిరావు భావిస్తున్నారు.

నరహరి గోపాలకృష్ణమ చెట్టిగారు ఆనాటి మూఢనమ్మకాలను, కులతత్వాలను విపులంగా వర్ణించారు. సరిగ్గా అలాంటివాటినే అలాగే వీరేశలింగం గారు కూడా వర్ణించారు. శ్రీ రంగరాజు చరిత్రలోని నాయకుడు రంగరాజు దప్పికతో నాలుక పిడుచకట్టుకొని పోతున్నా నిమ్న కులజులు, కాపులు ఇవ్వబోయిన నీరు స్వీకరించడు. వారు కూడా క్షత్రియుడు కులభ్రష్టుడు కాకూడదు. ఆ పాపం మాకు అంటుకోకూడదు అని భావిస్తారు. రాజశేఖర చరిత్రలోని రామరాజు (క్షత్రియుడు) తనకంటే తక్కువ కులంవారు ఇస్తున్న నీరును తీసుకోడు. ఇదొక ఉదాహరణ మాత్రమే.

నరహరి గోపాల కృష్ణమ చెట్టి తన రచనకు 'నవీన ప్రబంధం' అని నామకరణం చేస్తే వీరేశలింగం పంతులు తన రచనకు 'వచన ప్రబంధం' అని పేరు పెడతారు. అప్పట్లో ఇంగ్లీషు నావెల్ (Novel)ను 'నవల'గా గుర్తించేవారు కాదు. 'రాజశేఖర చరిత్ర'ను గొప్ప రచనగా పరిగణించని విమర్శకులు కాశీభట్ల బ్రహ్మయ్య శాస్త్రి 'నవల' అన్న మాటను వాడారు. ఆ తరువాతే అందరూ ఆ పదమును వాడడం మొదలు పెట్టారు.

*హిందూ*, 1878లో రాజశేఖర చరిత్రను సమీక్షిస్తూ 'Veeresa Lingam Pantulu's Raja Sekhara Charitram based on the Vicar of Wakefield by Oliver Gold Smith - రాసింది. శ్రీరంగరాజు చరిత్ర వెలువడిన సంవత్సరం తరువాత ఫోర్ట్ సెయింట్ జార్జ్ గెజెట్‌లో (Fort Saint George, Gazette)లో ఆనాటి ప్రభుత్వం ఇలా ప్రచురించింది- This is apparantly the first attempteves made in this part of India art novel writing in Telugu Prose (Vol-I-P 23rd Supplement June 15, 1873) పురుషార్థ ప్రదాయిని పత్రిక శ్రీ రంగరాజు చరిత్రను పాఠశాలల్లో పాఠ్యగ్రంథంగా నిర్ణీతం (Prescribe) చేయమని ప్రభుత్వాన్ని కోరింది. జియాగ్రఫీ ఆఫ్ కర్నూలు Vol. I & Vol IIను ప్రచురించినందుకు (1871-1872) ఆనాటి ఆంగ్ల ప్రభుత్వం నరహరి గోపాల కృష్ణమ చెట్టిని సత్కరించింది. ఇంత జరిగినా గోపాల కృష్ణమ చెట్టికి రావలసిన పేరుప్రఖ్యాతులు రాలేదు. పేరు చివర శాస్త్రి, శర్మ, పంతులు లేకపోవడం ఒక కారణం కావచ్చునేమో! వీరేశలింగం పంతులు మంచి లౌకికుడు. తన పలుకుబడిని ఉపయోగించుకుని, పాలకులతో తనకున్న సన్నిహిత సంబంధాలు కారణంగా తన నవలను ఆనాటి Education Enquiry Officer అయిన లార్డ్ మెక్ డొనాల్డ్ (MacDonald)కు అంకితం ఇచ్చాడు. దాన్ని అతడు పొగిడాడు. అంతేకాదు అతడి ప్రోత్సాహంవల్లే Fortunes Wheelగా రాజశేఖర ఆంగ్లానువాదం వెలువడింది. ఈ నవల కన్నడంలోకి కూడా అనువదించబడింది. మద్రాసు పచ్చియప్ప కళాశాలలోని గ్రంథాలయంలో ఉన్న కన్నడ ప్రతిని నేను చదివాను.

నరహరి గోపాల కృష్ణమ చెట్టి తన రచనను లార్డ్ మేయో (Lord Mayo)కు అంకితం ఇచ్చాడు. అప్పటికే అండమాన్‌లో లార్డ్ మేయో (Lord Mayo) హత్య గావింపబడ్డాడు.

శ్రీ పొదిలి నాగరాజు 'శ్రీరంగరాజు చరిత్ర'కు 'సోనాబాయి చరిత్ర' అన్న మరో పేరు కూడా ఉందన్న విషయాన్ని పేర్కొనలేదు. పుస్తకం అట్ట మీద ఈ పేరుంది. ఈ పుస్తకం చెన్నైలోని 'పురుషవాకం'లో అచ్చయింది. ఇందులో 'కర్నూలు' స్పెల్లింగ్ కన్నడిగులు రాసే విధంగా 'కనూ౯లు' ఉంది.

అన్నట్లు 'శ్రీ రంగరాజు చరిత్ర' ప్రతిని ఆచార్య కొలకలూరి ఇనాక్ గారి వద్ద నుండి నా ఆప్తమిత్రులు, మద్రాసు విశ్వవిద్యాలయపు తెలుగు శాఖ విశ్రాంత ఆచార్యులు డాక్టర్ యస్. అక్కిరెడ్డి సంపాదించారు. ఆ ప్రతినే నేను నా సిద్ధాంత వ్యాసం కోసం వాడుకున్నాను.

డా. ఎ.బి. సాయిప్రసాద్
బెంగళూరు. ఫోన్: 998 056 7541.

# చదవండి...

- ఋషిఋ




**(1) నాగ్నజితీ పరిణయము:** రచయిత్రి వేమూరి (దాసు) శారదాంబ తన 16వ ఏట చెప్పిన ప్రబంధం *నాగ్నజీతి పరిణయం* అంటే ఆశ్చర్యమే! వారి కుటుంబంలో కవులుండటమే కాదనలేమేమో. ఆమెకు ఏడేళ్లకే వివాహం అయింది. మరొక ఐదేళ్లకు కాపురానికి వెళ్ళింది. 14వ ఏట పద్యకావ్యం రాయటం మొదలుపెట్టింది. ఆమెకు ఆ సమయంలోనే ఆడపిల్ల దుర్గాంబ జన్మించింది. మగబిడ్డ పార్థసారథి. శారదాంబ మగబిడ్డ ప్రసవంలో మరణించింది. చూడండి 1881 కాలంలో పరిస్థితులు ఇవి – ఇలాంటి విపత్కర సమయంలో ఇంతటి సాంద్రమైన ప్రబంధాన్ని రచించి శారదాంబ సత్యానికి శారదాంబే!

*పేజీలు: 120, వెల: ₹ 150/-*





**(2) మాధవశతకము:** ఇది కూడా వేమూరి శారదాంబ రచనే. ఆమెకు మాధవుడే అన్నీ. పార్థసారథే కృతిభర్త. ఆమె కృష్ణ భక్తి ఆమె 'బాల్య' మరణాన్ని ఆపలేకపోయిందా – లేక త్వరగా ఆ కృష్ణుడు తనలో ఐక్యం చేసుకున్నాడా? ఏమైనా మంచి కవయిత్రి తెలుగు భాష పిన్నవయసులో కోల్పోయింది కదా?

*పేజీలు: 64, వెల: ₹ 100/– పై రెండు పుస్తకాలకు: డా. దాసు అచ్యుతరావు, ఫ్లాట్ నెం. 201, శ్రీ సాయిరామ్ ఆదిత్యా రెసిడెన్సీ, ఇంజనీర్స్ కాలనీ, ఎల్లారెడ్డిగూడ, హైదరాబాద్–73. ఫోన్: 040–23734864, 949 002 3947.*




**వ'సుధా(స)మ'యం కాలమ్ రచనలు:** సుధామ గారు రాసిన కాలమ్ రచనల సంపుటి ఇది. కాలమ్ అంటే రన్నింగ్ కామెంటరీలాంటిది. పడిపోతున్న విలువలు – పెరిగిపోతున్న పెట్రో ధరలు – కూరగాయలు – భాష మీద మమకారం – కోటికొక్క సాహిత్య పేజీలు – ఇలా ఒకటేమిటి – అల్లంరాజు వేదికలు రావు – అనే సుధామ గారు – ముట్టని విషయం లేదు – వారి రచనాశైలి మనల్ని చదివిస్తుంది.

*పేజీలు: 145, వెల: ₹ 150/- ప్రతులకు: శ్రీమతి ఎ. ఉషారాణి, స్నేహిత స్రవంతి, జి – 12, సాదత్ టవర్స్, పద్మావతి అపార్ట్‌మెంట్స్, సలీంనగర్ కాలని, మలక్‌పేట, హైదరాబాద్–36. ఫోన్: 984 929 7958, 984 827 6929.*




**పి.వి. చెప్పిన ముచ్చట్లు (పి.వి. నరసింహారావు ప్రసంగాలు):** ఇవన్నీ పి.వి. నరసింహారావు గారి ప్రసంగాలు – వివిధ సమయాల్లో – సభల్లో పి.వి. చేసిన ప్రసంగాల ముచ్చట్లు ఇవి. ఎన్నో భాషలు తెలిసిన పి.వి. ఎన్నో గ్రంథాలు చదివారు – ఈ ప్రసంగాల్లో వారి విస్తృత గ్రంథ పఠనం ప్రస్ఫుటంగా వెల్లడవుతుంది. 'అందరిలోనూ ఒంటరివాడు – ఒంటరి అయినా అందరివాడు' ఇది పి.వి.కి బాగా సరిపోతుంది.

*పేజీలు: 83, వెల: ₹ 100/– ప్రతులకు: కల్వకోట వెంకట సంతోష్ బాబు, సౌమ్య సాయి నిలయం, ఇం.నెం. 3–1–269, మేడ పైన, సి.వి.ఆర్.ఎన్. రోడ్, సాయి కమల భవనం ప్రక్కన, క్రిస్టియన్ కాలని, కరీంనగర్–505 001. ఫోన్: 984 908 5727.*




**శాఖమూరు రామగోపాల్ గారి నాలుగు పుస్తకాలు: (1) డా: నా.డి.'సోజగారి కథలు (కన్నడ మూలం - డా. రాజశేఖర నీర్‌మాన్వి), (2) ప్రొఫెసర్ కర్వాలో (కన్నడ మూలం - పూర్ణచంద్ర తేజస్వి), (3) జుగారిక్రాస్ (సాలెగూడు) (కన్నడ మూలం : పూర్ణచంద్ర తేజస్వి, (4) ప్రొఫెసర్ గారి విశిష్ట యాత్రా కథనాలు (కన్నడ మూలం : ప్రొ. రహమత్**

**తరీకెరె):** ఈ నాలుగు పుస్తకాలు శాఖమూరు రామగోపాల్ కన్నడం నుంచి అనువాదం చేశారు. పూర్ణ చంద్ర తేజస్వి ఎంతో పేరు ప్రఖ్యాతలున్న ప్రజా రచయిత, జర్నలిస్టు. ప్రొఫెసర్ కార్వాలో నవల ఇది తేజస్వి ఆత్మకథలాంటిదే. వీరి తండ్రి జ్ఞానపీఠ పురస్కారం పొందినవారు. తన పరివారమంతా ఎంతో ఉన్నత స్థానాల్లో ఉన్నా తేజస్వి గ్రామీణ జీవితాన్నే ఎంచుకొని వ్యవసాయ వ్యాపకంతో జీవనాన్ని, రచనా వ్యాసంగంతో జీవితాన్ని సార్థకం చేసుకున్నారు. ఆయన రచనల్లో గ్రామీణ జీవితం, గ్రామీణులు – వారి అమాయకత్వం – ప్రభుత్వ ఉద్యోగుల నిర్వాకం – హాస్యం అంతర్లీనంగా – విషాదం మరింత లోతుగా పాఠకులకు అనుభూతికి వస్తుంది. డి.సోజాగారి కథలు వీరి మధ్యేమార్గంగా జీవించిన అనుభవమే ఈ కథలు. కన్నడ భాషా ప్రొఫెసర్‌గా – కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీతగా ఖ్యాతి గడించిన ప్రొ. రహమత్ తరీకెరె గారి యాత్రా కథనాలు ఇవి. అనువాదకులు శాఖమూరు రామగోపాల్ ఎంతో శ్రమకు సమయానికి లోనయి వ్రాసిన ఈ యాత్రానువాదాలు తెలుగు పాఠకులకు ఒక కానుక! వీరి తెలుగు రచన కూడా కన్నడ పరిమళంతో ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుంది. కొన్ని పదాలు మనకు వాడుకలో లేక వెంటనే అర్థం కావు కూడా. మరికొన్ని ఓహో! ఇది ఇలా కూడా రాయవచ్చన్నమాట అని అనుకుంటాం – మనం ఎక్కువగా వాడుకలో ఉన్న 'తలనొప్పి'ని వీరు 'నెత్తి నొప్పి' అంటారు. ఇందులో ఒక సొబగు ఉంది. మన పలుకుబడికి ఒక కొత్త పదం చేరినట్లు – 'పరిసరతజ్ఞుడు' (ఇకాలజిస్ట్), 'క్షిప్ర మార్గం' ఇలాంటి ప్రయోగాలు చాలానే ఉన్నాయి. శాఖమూరు రాజగోపాల్ అనువాద కృషి ఎంతైనా ప్రశంసనీయం.

*పేజీలు: (1) 294, (2) 301, (3) 300, (4) 282, వెల: (1) ₹ 300/-, (2) ₹ 350/-, (3) ₹ 300/-, (4) ₹ 290/-, ప్రతులకు: శాఖమూరు రామగోపాల్, ఫోన్: 905 256 3666.*










**త్రిపథ:** వాల్మీకి రామాయణం, వ్యాసభారతం, కవిత్రయ ఆంధ్రమహాభారతం, పోతన భాగవతం నుంచి తల్లావజ్ఝల శివాజీ గారు సేకరించిన విశేషాలు – రస గుళికలు నీతిచంద్రికలు – జ్ఞాన దీపికలు – తేలికగా చదువుకోవడానికి – చెరుకు కాడలోని తీయటి రసాన్ని కాస్త నిమ్మకాయ పిండి గ్లాసులో పోసి ఇచ్చినట్లు ఈ 'త్రిపథ' మీకు మూడు గ్రంథాలలోని ఎన్నో విశేషాలను మనం చదివినా – మధ్యరూపంలోనైనా – ఇన్ని విశేషాలను గుర్తింపలేకపోవచ్చు – శివాజీ గారి కృషి బహుధా ప్రశంసనీయం – ఈ 'రికార్డు' మన రిఫరెన్స్ కోసం తప్పనిసరిగా అందుబాటులో ఉంచుకోదగినది.

*పేజీలు: 322, ₹ 200/-, ప్రతులకు: ఫోన్: 995 917 8453.*




**సత్యశోధన:** నావంటి కుంటివాడు, ఖలుడు, కాముకుడు మరొకడెవ్వడుంటాడు? ఎవ్వరు ఈ తనువునిచ్చాడో – అతనినే మరిచాను. నేను అంతటి కృతఘ్నుణ్ణి – అని సూరదాసు బాధను – ఉటంకిస్తూ, మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధీ, తన ఉనికికి ఎవ్వరు ప్రభువని భావిస్తుందో ఎవ్వరి ఉప్పు తిని బ్రతుకుతున్నదో ఆయనకు ఇంకా దూరంగా ఉన్నానని బాధ ప్రతి క్షణం వేధిస్తూనే ఉన్నదని, చెప్పుకుంటూ తన 'ఆత్మకథ' లోతుపాతులను తెలియజేస్తూపోయారు. దీనిలో మంచిచెడులు బేరీజు వేసుకోవలసింది పాఠకులే. ఎంతో పాఠకాదారణ పొందిన 'సత్యశోధన' అనే గాంధీ ఆత్మకథ అనేక భాషల్లోకి అనువదింపబడి ప్రచారం పొందినది. స్థూలంగా ఇది గాంధీ జీవితం – అదే ఆయన సత్యశోధన

*పేజీలు: 392, ₹ 180/-, ప్రతులకు: నవచేతన పబ్లిషింగ్ హౌస్, గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), జి.ఎస్.ఐ. పోస్ట్, హైదరాబాద్-66. ఫోన్: 040-29884453 / 54.*



# మిసిమి

మాసపత్రిక

**మీరు చందాదారులుగా చేరండి** **బహుమతిగా పంపండి**

మీ ఊరు, మీరు చదివిన బడి, మీరు పట్టభద్రులయిన కళాశాల – ఇవన్నీ మీకు అపురూపమైనవేకదా! మీకు ప్రియమైనవారు, స్నేహితులు – మీకు ఎంతో ముఖ్యంకదా! వీరందరికీ మీరు **మిసిమి** ని బహుమానంగా నెలనెలా పంపవచ్చు. మీకు – మీ స్నేహితులకు కలిపి రెండు సంవత్సరాల చందా కట్టి మీరూ మా నుంచి బహుమతి పొందవచ్చు. మీ ఊరి గ్రంథాలయానికి లేదా మీరు చెప్పిన స్నేహితుల కోసం చందా **మిసిమి** పేర ₹ 720/- (రెండు సంవత్సరాలకు) పంపి, చిరునామా వివరాలు మాకు ఫోన్ ద్వారా, ఇ-మెయిల్ ద్వారాగానీ, వాట్సాప్ (నెం : 99 49 51 65 67)ద్వారాగానీ తెలియజేయండి. మీరు ఇచ్చిన చిరునామాకు నెలనెలా **మిసిమి** పత్రికను పంపిస్తాం. ప్రతినెలా మీరు వారిని మంచి సారస్వతంతో పలకరించినట్లే......



**Our A/c Details for Online Transfer**

Bank : **STATE BANK OF INDIA**

Account : **MISIMI**

A/c. No. : **10261569316**

Branch : **Saifabad, Hyderabad, INDIA**

IFS Code : **SBIN0007315**

*ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్‌కు రూ. 20/- బ్యాంకు ఛార్జీలు కలపండి.*

*ఈ ప్రక్క మెయిల్‌కు తెలియజేయండి. e-mail: misimi90monthly@gmail.com*






2 సం.రాలకు (₹ 720/-)

**నోబెల్ వ్యాసాలు,**

**మిసిమి పార్థసారథి వ్యాసాలు**

(పై రెండు పుస్తకాలలో ఏదైనా ఒకటి)



3 సం.లకు (₹ 1080/-)

**చిత్రకళ, చార్లీ చాప్లిన్**

(పై రెండు పుస్తకాలలో ఏదైనా ఒకటి)



4 సం.లకు (₹ 1440/-)

**బైరన్, పూర్వస్మార్త సాహిత్యం**

(పై రెండు పుస్తకాలలో ఏదైనా ఒకటి)

పుస్తకాలు ఉచితం



సంవత్సర చందాదారులకు (₹ 360/-)

**తెలుగు వర్ణమాల : విశిష్టతలు,**

**భాష – భాషాభివృద్ధి,**

**My Journey in the art world**

పుస్తకాలలో ఏదో ఒక పుస్తకం ఉచితం

**మిసిమి** మాసపత్రిక

Kala Jyothi Process Pvt. Ltd., 1-1-60/5, R.T.C. 'X' Roads, Hyderabad - 500 020. Ph. **040-27645536.**

MISIMI / మిసిమి
RNI Regd.No.45042/90 Telugu Monthly, Hyderabad - 500 020
Postal Regd.No.H/SD/191/2018-20
Date of Posting: On 29th & 30th of every month.
Date of Publication: 25.1.2020



నాట్యానందం



నయనానందం